ఈనాడు

విజయవాడ 22-8-2017 మంగళవారం సిటీ సంపుటి 44 . సంచిక 13
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 5-00 పేజీలు 16+20
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Anantapur, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam,Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

అడుగంటిన చరిత్ర

- సాగు సరే.. తాగునీటికైనా వస్తాయా?
- శ్రీశైలం చరిత్రలోనే ఖరీఫ్‌లో అతితక్కువ నీరొచ్చిన రెండో ఏడాది ఇదే..
- జూన్ నుంచి ఇప్పటివరకు వచ్చింది 4.57 టీఎంసీలే!
- ఆలమట్టిలోకి భారీ వరద వస్తేనే శ్రీశైలానికి నీరు
- ఆందోళనలో రెండు రాష్ట్రాల అధికారులు

ఈనాడు – హైదరాబాద్

శ్రీశైలం జలాశయం చరిత్రలోనే ఖరీఫ్‌లో అతి తక్కువ నీటి లభ్యత ఉన్న సంవత్సరాల్లో ఒకటిగా 2017-18 నిలిచే పరిస్థితి కనిపిస్తోంది. ఈ ప్రాజెక్టులో నీటిని పూర్తిగా నిల్వ చేయడం మొదలుపెట్టిన తర్వాత.. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన తొలి మూణ్నెల్లలో అతి తక్కువ నీటిలభ్యత ఉన్న రెండో సంవత్సరం ఇదే కానుంది. ఈ పరిస్థితి సాగు, తాగునీటిపై తీవ్ర ప్రభావం చూపనుంది. ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటివరకు శ్రీశైలంలోకి కేవలం 4.57 టీఎంసీలు మాత్రమే వచ్చాయి. 2015-16లో మొదటి మూణ్నెల్లలో నీరే రాలేదు. శ్రీశైలం చరిత్రలో 100 టీఎంసీల కంటే తక్కువ వచ్చిన సంవత్సరాలు మూడు ఉండగా, ఈ ఏడాది (మిగతా 2లో)



పోరాడి సాధిద్దాం

- తాగునీటి పరంగానైనా దామాషా పద్ధతి కోసం న్యాయ పోరాటం
- సుప్రీంలో ఎస్‌ఎల్‌పీ లేదా పిల్
- త్వరలో ప్రధానికీ ముఖ్యమంత్రి లేఖ
- కోయినాలో విద్యుదుత్పత్తి చేయకుండా నీళ్లు దిగువకు వదలండి
- బదులుగా ఆ విద్యుత్తు మేమే కొని మీకిస్తాం
- మహారాష్ట్ర సీఎంకు త్వరలో చంద్రబాబు లేఖ

ఈనాడు – అమరావతి


ఆలమట్టి జలాశయం నుంచి ఇప్పటికే దాదాపు 160 టీఎంసీలను కర్ణాటక పరిధిలోనే వాడుకున్నారు. మహారాష్ట్రలోనూ ఇదే పరిస్థితి. జలాశయాల్లో క్యారీ ఓవర్ నీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకున్నారు. మహారాష్ట్ర, కర్ణాటకలు ఇప్పటికే దాదాపు 278 టీఎంసీల జలాలు వినియోగించుకున్నట్లు లెక్క తేల్చారు. ఈ నేపథ్యంలో దిగువ రాష్ట్రాల తాగునీటి అవసరాలకైనా నీటిని వదలాల్సిన ఆవశ్యకతపై న్యాయపోరాటం చేసే విషయంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కసరత్తు జరుపుతోంది. ఎగువ రాష్ట్రాల్లో సాగుకు, విద్యుదుత్పత్తికి నదీజలాలను వినియోగించుకుంటూ ఉంటే (మిగతా 2లో)

ఆనందించేదెవరో?

- ప్రచారం ముగిసింది.. ఓటరు తీర్పు మిగిలింది
- గ్రామీణం, పట్టణంపై ఎవరి లెక్కలు వారివే
- రెండు సామాజికవర్గాలే కీలకంగా భావిస్తున్న నేతలు

నంద్యాల నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి

అధికార, ప్రతిపక్ష పార్టీల పరస్పర విమర్శలు, రోడ్డుషోలు, ఇంటింటి ప్రచారాలు, తెరలపై ప్రదర్శనలతో నంద్యాలవాసులను ఉక్కిరిబిక్కిరి చేసిన ఎన్నికల ప్రచారానికి సోమవారం తెరపడింది. పక్షం రోజులకు పైగా అధికార పార్టీ తరపున మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రధాన నాయకులు ఇక్కడే ఉండి ప్రచారం చేశారు. నోటిఫికేషన్‌కు ముందు రెండుసార్లు, ఎన్నికల ప్రచారంలో భాగంగా రెండు రోజులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇక్కడ పర్యటించారు. వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి 13రోజులపాటు ఇక్కడే ఉంటూ ఆ పార్టీ అభ్యర్థితో సమానంగా ప్రచారం చేశారు. సోమవారం సాయంత్రం ఐదు గంటల వరకు జగన్ ప్రచారం సాగుతూనే ఉంది. పాత పట్టణంలోని గాంధీచౌక్‌లో ప్రసంగించిన అనంతరం ఆయన నంద్యాలను విడిచివెళ్లారు.



నంద్యాలలో

పోలింగ్ సమయం: 23న ఉదయం 7నుంచి సాయంత్రం 6 వరకు

ఈవీఎంలో ఓటు వేశాక ఏడు సెకన్ల పాటు వీవీప్యాడ్‌పై పార్టీ గుర్తు కనిపిస్తుంది. ఓటరుకు ఏమైనా సందేహాలుంటే.. వెంటనే రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేయాలి.



- మొత్తం ఓటర్లు: **2.19**లక్షల మంది.
- ఓటు రశీదులు పంపిణీ: **2.03** లక్షల మందికి
- మిగతా **16**వేల మందిలో...
- చనిపోయినవారు: **3,626** మంది
- బదిలీ అయినవారు: **4,865** మంది
- ఆచూకీ లేనివారు: **4,269** మంది
- డూప్లికేట్ అయినవారు: **2,943** మంది
- ప్రత్యేక స్క్వాడ్‌లు: **82**
- లైవ్‌వెబ్‌కాస్ట్: **255** పోలింగ్ కేంద్రాల్లో
- అక్రమాలు, నగదు, మద్యం పంపిణీ తదితర ఘటనలపై కేసులు: **368**
- సీజ్‌చేసిన నగదు: రూ.**1.16** కోట్లు

ఓటరు తీర్పు ఎటు?

నందుల కోట నంద్యాలలోని ఓటరు తీర్పునకు మరొక రోజు మాత్రమే మిగిలింది. హోరాహోరీగా సాగిన ఈ ఎన్నికల్లో జెండా ఎవరు ఎగరవేస్తారన్నదే ఇపుడు ఉత్కంఠగా మారింది. ఇన్ని రోజులు గ్రామాలు, వార్డుల బాధ్యతలు చూసిన తెదేపా, వైకాపా నేతలు ఎవరికివారు గెలుపు ధీమాతో పట్టణం నుంచి నిష్క్రమించారు. నియోజకవర్గంలో నంద్యాల పట్టణం, గ్రామీణం, గోస్పాడు మండలాలున్నాయి. మొత్తం 2,18,858 మంది ఓటర్లు ఉండగా.. ఒక్క పట్టణంలోనే 1,42,628 మంది ఉన్నారు. గ్రామీణంలో 47,386 మంది, గోస్పాడు మండలంలో 28,844 మంది ఓటర్లు ఉన్నారు. నంద్యాల (మిగతా 2లో)



సోమవారం రాజ్‌భవన్‌లో ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుకు సన్మాన పత్రాన్ని బహూకరిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో కేంద్ర కార్మికశాఖ సహాయమంత్రి (స్వతంత్ర హోదా) బండారు దత్తాత్రేయ, గవర్నర్ నరసింహన్

రాజ్యాంగ పదవిలో ఉన్నా తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి కృషి

2లో

- తెలంగాణ ప్రభుత్వ సన్మానసభలో ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు
- పదవికి వన్నె తెస్తారు: కేసీఆర్
- ఉపరాష్ట్రపతిగా రాణిస్తారు: గవర్నర్


'రాష్ట్రం విడిపోయింది ఎవరిపైనో కోపంతో కాదు. ఎవరి ప్రాంతాల్లో వారే పాలించుకొని అభివృద్ధి చెందాలన్న కాంక్షతోనే. కలిసి కలహించుకోవడం కన్నా విడిపోయి సహకరించుకోవడం మిన్న. రాష్ట్రాలు విడిపోయినా ప్రపంచం దృష్టిలో తెలుగువారంతా ఒక్కటే. ఇద్దరు సీఎంలు కలిసి ఉభయ రాష్ట్రాల అభివృద్ధికి కృషి చేయాలి. కొన్ని అభిప్రాయ భేదాలున్నా మాట్లాడుకొని సామరస్యంగా పరిష్కరించుకోవాలి. ఆకలి, అవినీతి, అక్రమాలకు తావులేని దేశాన్ని నిర్మించుకోవాలి. స్వరాజ్యాన్ని సురాజ్యంగా మార్చుకోవాలి. రామరాజ్యం కోసం అందరూ సమష్టిగా కృషిచేయాలి. ప్రజలతో మమేకమై ఎదిగిన నాకు ఉపరాష్ట్రపతి ప్రొటోకాల్ కొత్తగా ఉంది. రాజ్యాంగబద్ధమైన విధులకు క్రమంగా అలవాటు పడుతున్నా.' - ఉపరాష్ట్రపతి



బిహార్‌ను కుదిపేస్తున్న రూ.900 కోట్ల కుంభకోణం

- ప్రభుత్వ ఖాతాల నుంచి సేవా సంస్థకు అక్రమంగా మళ్లింపు
- సహకరించిన సహకార ఉద్యోగులు, బ్యాంకు సిబ్బంది
- అయిదేళ్లుగా సాగుతున్న వ్యవహారం
- 11 కేసుల నమోదు
- 18 మంది అరెస్టు

14లో



సోమవారం చెన్నైలో పన్నీర్ సెల్వంతో ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయించిన అనంతరం కలిసి ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ పన్నీర్, పళనిస్వామిలతో కరచాలనం చేయిస్తున్న గవర్నరు సీహెచ్ విద్యాసాగర్‌రావు

పన్నీరు పోసిన పళని

- విలీనమైన అన్నాడీఎంకే చీలిక వర్గాలు
- డిమాండ్లపై కుదిరిన ఏకాభిప్రాయం
- చేతులు కలిపిన పళనిస్వామి, పన్నీర్
- ఉపముఖ్యమంత్రిగా సెల్వం

5లో

దేశవ్యాప్తంగా ఆసక్తి రేపిన అన్నాడీఎంకేలోని రెండు చీలిక వర్గాల విలీనం ఎట్టకేలకు పూర్తయింది. దీంతో ఆరు నెలలకు పైగా కొనసాగిన ఉత్కంఠకు తెరపడింది. పన్నీర్‌సెల్వం(ఓపీఎస్) రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. పార్టీ మార్గదర్శక కమిటీ కన్వీనర్‌గా నియమితులయ్యారు. పళనిస్వామి మంత్రివర్గంలోని కీలకమైన ఆర్థిక, గృహనిర్మాణశాఖల మంత్రిగానూ బాధ్యతలు తీసుకున్నారు. ఆయన వర్గంలోని మాఫోయ్ పాండియరాజన్ మంత్రిగా ప్రమాణం చేశారు.

భద్రతకు సవాలు.. కొలువులకు అవకాశాలు!

- సైబర్ నిపుణుల ఉద్యోగాలకు తరుణమిది..
- రాబోయే అయిదేళ్లలో 18 లక్షల మందికి కొరత
- రెండేళ్లలోనే 20 శాతం పెరిగిన డిమాండ్
- తాజా అధ్యయనంలో వెల్లడి

2లో

ఇదీ సంగతి!



బయటికంటే బయటకేం కాదు సార్. అలా అప్పుడప్పుడు సినిమాలకూ, షికార్లకూ, షాపింగుకూ, ఫ్రెండ్ ఇచ్చే పార్టీలకూ వెళ్లి వచ్చే వారంతే!... ఇంకెక్కడికీ వెళ్లలేదు.

రూ.58,319 కోట్లకు సవరణ

- పోలవరంపై కొత్త అంచనాలు
- నేడు కేంద్రానికి సమర్పణ
- ప్రాజెక్టు అథారిటీకి, కేంద్ర జలసంఘానికి కూడా

ఈనాడు – అమరావతి

పోలవరం నిర్మాణానికి రూ.58,319.06 కోట్లు ఖర్చవుతుందని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా అంచనా వేసింది. పోలవరాన్ని కేంద్రం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించింది. 2014 ఏప్రిల్ ఒకటో తేదీ నాటికి ఈ ప్రాజెక్టుకు ఎంత ఖర్చవుతుందో లెక్కించి ఆ మేరకు అంచనాలు సమర్పించాలని నిర్ణయించింది. ప్రాజెక్టు అథారిటీ తొలి సమావేశంలోనూ సవరించిన అంచనాలు సమర్పించాలని నిర్దేశించింది. ఈ మేరకు రాష్ట్ర జలవనరులశాఖ అధికారులు లెక్కలు రూపొందించారు. పూర్తి వివరాలతో మంగళవారం దిల్లీలో కేంద్ర జలసంఘానికి, కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖకు ఈ నివేదికను సమర్పించనున్నారు. జలవనరుల శాఖ బృందం ఇందుకోసం ఇప్పటికే దిల్లీకి చేరింది.



సవరించిన అంచనాలు ఇలా....

పని	అంచనా మొత్తం (రూ.కోట్లలో)
పోలవరం ప్రధాన పని	42,905.78
ఎడమ కాలువ	6362.29
కుడి కాలువ	4845.33
విద్యుత్కేంద్రం	4205.66
మొత్తం	58,319.06
ఇందులో ...	
భూసేకరణ పునరావాసం కోసం:	33,358.40
కుడి కాలువ భూసేకరణ:	1189.19
ఎడమ కాలువ భూసేకరణ:	1401.46

గతంలో 2010-11లో సవరించిన అంచనాల ప్రకారం పోలవరం అంచనా వ్యయం రూ.16010.45 కోట్లు. ఇప్పుడు అది 2013-14 నాటి లెక్కలకే రూ.58 వేల కోట్లకు చేరింది. ఇందులో కేంద్ర ప్రభుత్వం విద్యుత్కేంద్రం మినహా 2014 ఏప్రిల్1 నాటికి మిగిలి ఉన్న పనికి మాత్రమే జాతీయ ప్రాజెక్టు కింద నిధులు అందిస్తానని పేర్కొంది. ఇందుకోసం నాబార్డుతో ఒప్పందం కూడా కుదుర్చుకుంది. ప్రస్తుత ధరలను కూడా లెక్కలోకి తీసుకుంటే పోలవరం ప్రాజెక్టు వ్యయం ఇంకా అధికమవుతుంది. ఇందులో కేంద్రం ఎంత భరిస్తుందనేది పక్కన పెడితే మరికొన్ని పనులకు తాజా ధరలు వర్తింపజేసే ఆలోచన అధికారులకు ఉంది. ఈ కోణంలో పోలవరం అంచనాలు మరింత పెరిగే అవకాశం ఉంది.

24న అథారిటీ సమావేశంలోనూ చర్చ

పోలవరం ప్రాజెక్టు అథారిటీ పూర్తి స్థాయి సమావేశం ఈ నెల 24న పోలవరంలో జరగనుంది. ఆ రోజు సవరించిన అంచనాలపైనా చర్చించే అవకాశం ఉంది. ఆ సమావేశంలో ప్రాథమిక చర్చ అనంతరం ఈ అంచనాల తనిఖీ నిమిత్తం ప్రాజెక్టు అథారిటీతో (మిగతా 2లో)



ఉద్యమ స్ఫూర్తితో నవభారతం

- భాజపా పాలిత రాష్ట్రాల సీఎంలకు మోదీ పిలుపు
- 2019 లోక్‌సభ ఎన్నికలపై అమిత్‌షాతో కలిసి సమీక్ష
- కేంద్ర పథకాల అమలుతీరుపై ఆరా
- ఇకపై మూడు నెలలకోసారి భేటీ

13లో

తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి కృషి

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణ అన్నా, హైదరాబాద్ అన్నా తనకు ఎంతో ఇష్టమని, ఈ రాష్ట్రంలో తాను పర్యటించని తాలూకా, మండలం, ఊరు లేనే లేదని తెలంగాణతో తనకు విడదీయరాని అనుబంధం ఉందని ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు అన్నారు. తాను పుట్టింది నెల్లూరు, చదివింది విశాఖలో అయినా రాజకీయంగా పెరిగింది.. ఎదిగింది.. ఒదిగింది హైదరాబాద్‌లోనే అని తెలిపారు. అందుకే ఇక్కడి నుంచే ఉపరాష్ట్రపతిగా తన అధికారిక పర్యటనను ప్రారంభిస్తున్నానన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకొని, అభివృద్ధిలో పోటీపడాలన్నారు. రాజ్యాంగపదవిలో ఉన్నా తాను రెండు రాష్ట్రాల అభ్యున్నతికి సహకరిస్తానని చెప్పారు. భోజనప్రియుడినైన తనకు కేసీఆర్ ప్రసంగంతో కడుపు నిండిపోయిందని ఆయన చమత్కరించారు. సోమవారం తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో రాజ్‌భవన్‌లో జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 'తెలంగాణ నేల సంస్కృతి, సంప్రదాయాలకు నిలయం. సాహిత్యానికి నెలవు. హైదరాబాద్ మినీభారత్. హైదరాబాద్ అంటే ఉత్తరాది వాళ్లకు దక్షిణాది... దక్షిణాది వాళ్లకు ఉత్తరాది. ఇక్కడి బిర్యానీ, హలీం ప్రపంచ ప్రఖ్యాతిగాంచాయి. తెలంగాణకు పోరాటాల చరిత్ర ఉంది. సమ్మక్కసారలమ్మ, కుమురం భీం, చాకలి ఐలమ్మ లాంటి యోధులకు ఇది నిలయం. నిజాం ప్రభువు, రజాకార్లను ఎదిరించారు. 1978లో తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచి ఇక్కడికి వచ్చాను. 40 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాను. హైదరాబాద్‌ను కేంద్రంగా చేసుకొని రాజకీయాల్లో ఎదిగాను. తెలంగాణకు హైదరాబాద్ నగరమే బ్రాండ్.

తెలుగును కాపాడాలి

తెలంగాణ భాషలో గ్లామరే కాదు. గ్రామర్ కూడా ఉంది. నేను ఇంగ్లిష్‌కు వ్యతిరేకం కాదు. తెలుగు భాషకు కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. అంటువ్యాధిలా మారిన ఇంగ్లిష్‌ను వదిలించే బాధ్యతను రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు తీసుకోవాలి. కన్నతల్లిని, మాతృభాషను, మాతృదేశాన్ని పట్టించుకోని వాడు మనిషే కాదు. ఇద్దరు సీఎంలు తెలుగుకు ప్రాధాన్యమివ్వాలి. సి.నారాయణరెడ్డి మహాకవి. తెలుగు సంప్రదాయం, కట్టుబొట్టు, భాష, యాస, గోస గురించి గొప్పగా పద్యంలో చెప్పారు. కేసీఆర్ ప్రసంగంలో సాహిత్య మాధుర్యం అద్భుతం' అని వెంకయ్యానాయుడు కొనియాడారు.



సోమవారం బేగంపేట విమానాశ్రయంలో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు

కార్యకర్త స్థాయి నుంచి ఉప రాష్ట్రపతిగా ఎదిగారు: సీఎం కేసీఆర్

సామాన్య కార్యకర్త నుంచి ఉపరాష్ట్రపతి స్థాయికి ఎదిగిన వెంకయ్యానాయుడు తెలుగు వ్యక్తి కావడం తెలుగువారందరికీ గర్వకారణమని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. 'ఆయన అద్భుతమైన వక్త. మాటలతో అబ్బుర పరుస్తారు. చాలా మంది చాలా పదవులు అనుభవిస్తారు గానీ వెంకయ్యలా పదవులకు వన్నె తెచ్చేవారు అరుదుగా ఉంటారు. ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన వెంకయ్యకు సన్మానం చేసే మొట్టమొదటి అవకాశం తెలంగాణకు రావడం సంతోషంగా ఉంది. అత్యున్నత శిఖరాన్ని అధిరోహించిన ఆయన వల్ల తెలుగువారికి, భాషకు గౌరవం దక్కింది. అందుకు మనమందరం గర్వించాలి. కార్యకర్త స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ ఉప రాష్ట్రపతి కావడం సామాన్య విషయం కాదు. జాతీయ పార్టీ అధ్యక్షునిగా కూడా పనిచేశారు. దీని వెనక ఎంతో కృషి ఉంది. నేటి తరం రాజకీయ నేతలకు ఆయన ఆదర్శం. మొదట్లో దిల్లీకి వెళ్లే తెలుగువారిని మద్రాసీలు అని పిలిచేవారు. ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత తెలుగు వారికి, తెలుగు భాషకు గౌరవం దక్కింది. ఇప్పుడు తెలుగువ్యక్తి ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టారు. జాతీయ స్థాయికి ఎదిగినా మూలాలు మరిచిపోని వ్యక్తి ఆయన. వెంకయ్య ఉపన్యాసాన్ని పండించడంలో దిట్ట. వ్యంగ్యం, హాస్యం, రౌద్రం అన్నీ కలిస్తేనే పరిపూర్ణత ఉంటుంది. ఇవన్నీ వెంకయ్య ఉపన్యాసంలో కనిపిస్తాయి. తెలుగే కాదు.. ఇంగ్లిష్, హిందీ అనర్గళంగా మాట్లాడతారు. 1980లో తొలిసారిగా సిద్దిపేటలో ఆయన ప్రసంగాన్ని విని నేను మైమరిచిపోయాను. ఉపరాష్ట్రపతి హోదాలో ఆయన వచ్చినా... ఆ హోదాలో గాకుండా మామూలు వ్యక్తిలాగానే ఆప్యాయంగా పలకరించారు. అది ఆయన మంచితనానికి నిదర్శనం' అని కేసీఆర్ మాట్లాడారు.

వెంకయ్య సేవలు దేశానికి
గవర్నర్ నరసింహన్

'ఈ రోజు తెలుగువారందరికీ శుభదినం. తెలుగు వారైన వెంకయ్య ఉపరాష్ట్రపతి కావడం అందరికీ ఆనందదాయకం. ఉషాపతినే కానీ ఉప రాష్ట్రపతిని కాను అని ఆయన గతంలో అనేవారు. ఇప్పుడు ఆయనే ఉపరాష్ట్రపతి అయ్యారు. ఆయన సేవలు దేశానికి అవసరం. ఉప రాష్ట్రపతిగాను రాణిస్తారు. వెంకయ్యతో నాకు గొప్ప అనుబంధం ఉంది' అని గవర్నర్ తన జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు.

అనుక్షణం సమాజాభివృద్ధి: కేంద్రమంత్రి దత్తాత్రేయ

'వెంకయ్యానాయుడు అనుక్షణం సమాజాభివృద్ధికి పాటుపడిన వ్యక్తి. తెలుగు ప్రజలకు ఆత్మీయులు. పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా 2020 నాటికి దేశంలోని ప్రజలందరికీ సొంత ఇళ్లు కావాలని ఆకాంక్షించారు. సమాచార శాఖ మంత్రిగా ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు తెలియజేశారు. అసాధారణ ప్రతిభ గల రాజకీయ నేత. ఉపరాష్ట్రపతి పదవిలో ఉన్నా సామాన్యులకు అందుబాటులో ఉంటే గొప్ప వ్యక్తి' అని దత్తాత్రేయ మాట్లాడారు.

ఆరోగ్య పరీక్షలు

ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుకు హైదరాబాద్‌లోని ఏషియన్ గాస్ట్రో ఎంటరాలజీ ఇనిస్టిట్యూట్‌లో ప్రముఖ గాస్ట్రోఎంటరాలజీ నిపుణులు డాక్టర్ నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వైద్య బృందం సోమవారం ఆరోగ్య పరీక్షలు చేసింది. దాదాపు గంటపాటు ఆయన ఆసుపత్రిలోనే గడిపారు. సాధారణ ఆరోగ్య పరీక్షల్లో భాగమేనని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

ఘనంగా సన్మానం

రాజ్‌భవన్‌లో వెంకయ్యకు ఘన సన్మానం జరిగింది. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య సంప్రదాయబద్ధంగా సీఎం కేసీఆర్ ఆయనను సన్మానించారు. ఆయనకు ఆశీర్వచనాలు అందించారు. ఆయాచితం నటేశ్వరశర్మ, మాడ్గుల నాగఫణి శర్మలు ఆయనను కీర్తిస్తూ పద్యపఠనం చేశారు. అనంతరం సీఎం కేసీఆర్ వెంకయ్యకు అత్తరు రాసి, తిలకం దిద్ది, పన్నీరు చల్లుతూ దుశ్శాలువాతో సన్మానించారు. సన్మాన పత్ర చిత్రపటాన్ని బహూకరించారు. గవర్నర్ నరసింహన్, కేంద్రమంత్రి దత్తాత్రేయ ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రులు కడియం శ్రీహరి, మహమూద్ అలీ, శాసనసభాపతి మధుసూదనాచారి, మండలి ఛైర్మన్ స్వామిగౌడ్, తెరాస పార్లమెంటరీ నేత కేశవరావు, లోక్‌సభ నేత జితేందర్ రెడ్డి, సీఎస్ ఎస్పీ సింగ్ వేదికను అలంకరించగా.. తెరాస, మజ్లిస్ పార్టీల ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల ఛైర్మన్లు, తమిళనాడు మాజీ గవర్నర్ రోశయ్య, కేంద్రమాజీ మంత్రి కృష్ణంరాజు, కాంగ్రెస్ ఎంపీ సుబ్బరామిరెడ్డి హాజరయ్యారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, శాసనసభాపక్ష నేత కిషన్‌రెడ్డి సహా భాజపా సభ్యులంతా పాల్గొన్నారు. సన్మానం అనంతరం వెంకయ్య సీఎంతో పాటు వేదిక దిగి అందరి వద్దకు వెళ్లి కరచాలనం చేసి పేరుపేరున పలకరించారు. అంతకు ముందు ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయం చేరుకున్న వెంకయ్యకు గవర్నర్ నరసింహన్, సీఎం కేసీఆర్, కేంద్ర మంత్రి దత్తాత్రేయ తదితర నేతలు ఘన స్వాగతం పలికారు.

కాంగ్రెస్, తెదేపా రాష్ట్ర నేతలు దూరం

తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో సోమవారం రాజ్‌భవన్‌లో జరిగిన ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు సన్మాన కార్యక్రమానికి కాంగ్రెస్, తెదేపా తెలంగాణ నేతలు గైర్హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రెండు పార్టీల ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఆహ్వానపత్రాలు పంపినా ఆ పార్టీల నుంచి ఎవరూ హాజరుకాలేదు.

ఆనందించేదెవరో?

(మొదటి పేజీ తరువాయి)

పట్టణమే కీలకమైనందున తెదేపా, వైకాపాలు తమ దృష్టిని ఎక్కువగా ఇక్కడే కేంద్రీకరించాయి. వైకాపా అధినేత జగన్ పది రోజులపాటు నంద్యాలలో ప్రాంతాలవారీగా ప్రచారం నిర్వహించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు వారికి కేటాయించిన వార్డుల్లో ఇంటింటి ప్రచారం చేశారు. తెదేపా తరపున మంత్రులు కాలవ శ్రీనివాసులు, అమరనాథ్ రెడ్డి, ఆదినారాయణరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిలు ఎన్నికల బాధ్యతలను పర్యవేక్షించారు. మొదట్లో గోస్పాడు, నంద్యాల గ్రామీణంపై పట్టు సాధించేందుకు తెదేపా హోరాహోరీ ప్రచారం చేసింది. పట్టణ ఓటర్లను ఆకర్షించేందుకు వైకాపా అధినేత అభ్యర్థిని వెంటబెట్టుకుని మరీ ప్రచారం చేశారు. తెదేపా అభివృద్ధినే అస్త్రంగా చేసుకోగా, జగన్ ప్రభుత్వ హామీల అమలు తీరు, వ్యతిరేకతనే ప్రధాన అంశాలుగా చేసుకున్నారు.

- నియోజకవర్గంలో అధిక శాతం ఓటర్లుగా ఉన్న వర్గాలను లక్ష్యంగా చేసుకుని వైకాపా, తెదేపాలు ముమ్మర ప్రచారం చేశాయి. ఒకవైపు రోడ్డు షోలు, కూడలిల్లో బహిరంగ సభలు నిర్వహిస్తూనే ఆయా వర్గాల ప్రముఖులతో ప్రత్యేక మంతనాలు సాగించాయి. నియోజకవర్గంలో అధికంగా ఉన్న ముస్లింలు, కాపు, బలిజ ఓట్లే కీలకంగా భావించిన నేతలు తదనుగుణంగా పావులు కదిపారు. వార్డు స్థాయి నేత నుంచి పట్టణ స్థాయి వరకు అందరినీ కలుపుకొని ప్రచారం చేశారు. రాజకీయ పార్టీలు నంద్యాలపై హామీల వర్షం కురిపించాయి. అధికార పార్టీ దాదాపు రూ.1556 కోట్లతో నంద్యాలలో అభివృద్ధి పనులు చేస్తోంది. ఇంకా అవసరమైతే మరిన్ని నిధులు ఇస్తామని తెదేపా నేతలు హామీనివ్వగా, వారికి పోటీగా విపక్ష నేత జగన్ తాను అధికారంలోకి వస్తే ఏకంగా నంద్యాలను జిల్లా కేంద్రం చేస్తానని, రోడ్ల వెడల్పుల్లో దుకాణాలు కోల్పోయిన వారికి అధిక పరిహారం ఇస్తానని ప్రకటించారు. హామీలకు తోడు ఆర్థిక ప్రలోభాలు భారీగానే సాగుతున్నాయి. అధికార, ప్రతిపక్షాల హామీలు, పరస్పర విమర్శలు ఎంతవరకు ప్రభావం చూపుతాయో తేలాల్సి ఉంది. 1983 నుంచి ఇప్పటి వరకు ఎనిమిది పర్యాయాలు నంద్యాల శాసనసభ నియోజకవర్గానికి ఎన్నికలు జరిగితే ఇందులో నాలుగుసార్లు తెదేపానే గెలిచింది.

బోసిపోయిన పట్టణం..

ఉపఎన్నికల ప్రచారం ముగియడంతో పట్టణం ఒక్కసారిగా బోసిపోయింది. 20రోజులుగా రద్దీగా కనిపించిన ప్రాంతాలు పూర్వస్థితికి చేరుకున్నాయి. రాజకీయ నేతలు నియోజకవర్గంలో ఉండకూడదనే ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆదేశాలతో నేతలందరూ పక్కనున్న ఊళ్లకు పయనమయ్యారు. కార్ల సందడి తగ్గింది. పోలీసుల ముందస్తు భద్రతలో భాగంగా నంద్యాల నియోజకవర్గంలో దాదాపు 900మంది పోలీసు సిబ్బంది సేవలను వినియోగించనున్నారు.

గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

ఈనాడు, అమరావతి: గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు బ్యాంకర్ల గ్రామీణ ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత ఉపాధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ఏసేపు ఓ ప్రకటనలో తెలిపారు. మొబైల్ సర్వీసింగ్, ఎంఎస్ ఆఫీస్, అడ్వాన్స్‌డ్ కంప్యూటర్ నెట్‌వర్కింగ్, ఎలక్ట్రీషియన్, వ్యవసాయ పంపుసెట్ మరమ్మతులపై 45 రోజుల పాటు శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ సమయంలో వసతి, భోజనం ఉచితంగా అందిస్తామన్నారు. 19 నుంచి 30 ఏళ్ల లోపున్న వారు www.bired.org వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అతిథి ఉపన్యాసకుల పారితోషికం పెంపు.. ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో బోధించే అతిథి ఉపన్యాసకులు(గెస్ట్ లెక్చరర్లు)కు గంటకు చెల్లించే పారితోషికాన్ని రాష్ట్రప్రభుత్వం పెంచింది. గతంలో గంటకు రూ.100 చొప్పున చెల్లించేదాన్ని.. రూ.200కు పెంచుతూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్‌దాస్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వైద్యులు పనిచేసే చోటే ఉండాలి: దినేష్‌కుమార్

విధులు నిర్వహించే చోటే వైద్యులు నివసించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ అధికారులనుఆదేశించారు. సోమవారం వైద్య ఆరోగ్యశాఖమంత్రి కామినేని శ్రీనివాస్‌తో కలిసి ఆ శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాతావరణ మార్పులతో వచ్చే వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డెంగీ, క్షయ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు.

పోరాడి సాధిద్దాం

(మొదటి పేజీ తరువాయి)

దిగువన తెలుగు రాష్ట్రాల్లో గుక్కెడు తాగునీళ్లు లేక విలవిల్లాడుతున్న పరిస్థితిపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్ జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ ఈ అంశంపై న్యాయపోరాటానికి సిద్ధమవుతున్నట్లు వెల్లడించారు. దిల్లీలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున న్యాయ వ్యవహారాలు చూసే సీనియర్ న్యాయవాది గంగూలీ తదితరులతో సంప్రదించి దామాషా పద్ధతిలో కృష్ణా జలాల పంపకం చేపట్టాలంటూ న్యాయస్థానం గడప తొక్కనున్నారు. సుప్రీంలో స్పెషల్ లీవు పిటిషన్ దాఖలు చేయాలా, ప్రజాప్రయోజన వ్యాజ్యం వేయడం మంచిదా అనేది చర్చించి త్వరలోనే ముందుకు వెళ్లనున్నారు.

ప్రధానికీ త్వరలో లేఖ...

ఆంధ్రప్రదేశ్‌లో తాగునీటికి దారుణ పరిస్థితులు ఉన్నాయని, ఎగువ రాష్ట్రాలతో మాట్లాడి దిగువకు నీరు వదిలేలా చర్యలు తీసుకోవాలని ప్రధాని నరేంద్రమోదీకి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు త్వరలో లేఖ రాయనున్నారు. మహారాష్ట్రలోని కోయినా డ్యాంలో విద్యుదుత్పత్తి చేసి ఆ నీటిని వృథాగా సముద్రంలో కలిపేస్తున్నారని, దాన్ని తమకు కిందకు వదలాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రికి కూడా సీఎం లేఖ రాయబోతున్నారు. కోయినా డ్యాంలో 67.5 టీఎంసీలు, టాటా హైడల్ ప్రాజెక్టులో 48.2 టీఎంసీలు, మరికొంత నీటి ఆవిరి నష్టాలు కలిపి మొత్తం 119టీఎంసీలు మహారాష్ట్ర విద్యుదుత్పత్తి కోసం వినియోగిస్తూ ఆ నీటిని సముద్రంలో కలిపేస్తోంది. ఆ నీరు దిగువ రాష్ట్రాలకు చేరడం లేదు. ఇపుడదే విషయంపై ఏపీ సీఎం లేఖ రాయబోతున్నారు. విద్యుదుత్పత్తికి నీటిని వినియోగించకుండా దాన్ని తమకు దిగువకు వదలాలని, ఆ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యుత్తును కొని మహారాష్ట్రకు సెంట్రల్ పూల్ నుంచి ఇప్పిస్తుందని ప్రతిపాదించేందుకు నిర్ణయించారు. ఈ విషయంలో తమకు సహకరించాలని చంద్రబాబు మహారాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాయబోతున్నారు. ఇదే అంశంపై ప్రధానికి కూడా రాసి ఆ మేరకు మహారాష్ట్రతో మాట్లాడి సహకరించాలని కోరనున్నారు. మరో మూడు నాలుగు రోజుల్లో ఈ లేఖలు పంపనున్నారు.

23 నుంచి భారీ వర్ష సూచన

ఈనాడు, విశాఖపట్నం: మయన్మార్ తీరంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. మధ్యప్రదేశ్ పరిసర ప్రాంతాల్లో ఉన్న అల్పపీడనం దిశను ఉత్తరాదికి మళ్లే అవకాశముందని వాతావరణశాఖ అంచనా. దీంతో ఉపరితల ఆవర్తనం పడమటి దిశగా కదిలి రాష్ట్రంవైపు వచ్చే అవకాశాలున్నాయని ఆ శాఖ వెల్లడిస్తోంది. దీని ప్రభావంతో ఈనెల 23 నుంచి 3 రోజుల పాటు కోస్తాంధ్రలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని విశాఖ వాతావరణ కేంద్రం పేర్కొంది. ప్రస్తుతం రాష్ట్రం మీదుగా ద్రోణి కొనసాగుతోందని తెలిపింది.

భద్రతకు సవాలు.. కొలువులకు అవకాశాలు..!

ఈనాడు, హైదరాబాద్: అంతర్జాతీయస్థాయిలో సైబర్ దాడుల ఉద్ధృతి, మరోవైపు వాటిని నిరోధించే సైబర్ నిపుణుల కొరతా పెరుగుతూనే ఉన్నాయి. కంపెనీలు సైబర్ భద్రతకు భారీగా ఖర్చు చేయాల్సి వస్తోంది. మరోకోణంలో చూస్తే ప్రపంచవ్యాప్తంగా నిపుణుల అవసరం భారీగా పెరుగుతోంది. ఈ రంగంలో సమీప భవిష్యత్తులో గణనీయంగా ఉద్యోగాల కల్పనకు అవకాశాలు పెరిగాయి. సైబర్ భద్రతారంగంలో నైపుణ్యాలున్న వారికి గిరాకీ రెండేళ్లలోనే 20 శాతం అధికమైంది. ప్రస్తుతం నిపుణులు దొరకడం కష్టంగా మారిందని గ్లోబల్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ వర్క్‌ఫోర్స్ అధ్యయనం-2017 వెల్లడిస్తోంది.

ఆధునిక సాంకేతిక వినియోగం పెరిగేకొద్దీ దాన్ని దుర్వినియోగం చేయడమూ అధికమవుతోంది. సైబర్ దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. ఎప్పుడు ఎవరి ఖాతా నుంచి డబ్బు మాయమవుతుందో.. ఎవరి కంప్యూటర్, వెబ్‌సైట్ హ్యాక్ అవుతుందో తెలియని పరిస్థితి. నిక్షిప్తం చేసుకున్న సమాచారం భద్రంగా ఉండాలంటే ముందస్తు రక్షణ చర్యలు తీసుకోవడం ముఖ్యం. అందుకు సైబర్ నిపుణులు అవసరం. అదే ఇప్పుడు పెద్ద సమస్యగా మారింది. మరో అయిదేళ్లలో (2022 నాటికి) ప్రపంచవ్యాప్తంగా 18 లక్షల మంది సైబర్ నిపుణుల కొరత ఉంటుందని గ్లోబల్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ వర్క్‌ఫోర్స్ అధ్యయనం వెల్లడించింది. 2015లో నిర్వహించిన అధ్యయనంతో పోలిస్తే తాజా అధ్యయనంలో నిపుణుల కొరత 20 శాతం అధికంగా ఉన్నట్లు తేల్చి చెప్పింది. మొత్తం 170 దేశాలకు చెందిన దాదాపు 19 వేల మంది నుంచి సేకరించిన సమాచారం ప్రకారం ఈ నివేదికను రూపొందించారు. 2025 నాటికి దేశంలో 10 లక్షల మంది సైబర్ నిపుణుల అవసరం ఉంటుందని నాస్కామ్ అధ్యయనం అంచనా వేసింది. మరో అధ్యయనంలో 2019 నాటికి ప్రపంచవ్యాప్తంగా 60 లక్షల మంది నిపుణులకు డిమాండ్ ఉంటుందని తేలింది.

మహిళలు 11 శాతమే

సైబర్ భద్రత రంగంలో పనిచేసే నిపుణుల్లో మహిళలు కేవలం 11 శాతమే ఉన్నారు. 2013 నుంచి ఇదే పరిస్థితి ఉంది. ఉత్తర అమెరికాలో అత్యధికంగా 14 శాతం మహిళా నిపుణులు ఉన్నారు. ఆసియా పసిఫిక్‌లో 10 శాతం పనిచేస్తున్నారు. పురుషుల కంటే మహిళలకు 3 శాతం వేతనాలు తక్కువగా ఉన్నాయి.

దేశంలో 52 విద్యాసంస్థల్లో కోర్సులు.. ప్రస్తుతం దేశంలో 52 విద్యా సంస్థలు సైబర్ సెక్యూరిటీ కోర్సులను అందిస్తున్నాయని కేంద్ర మానవ వనరుల శాఖ వెల్లడించింది. ఇప్పటికే ఐఐటీ గువాహటి, మద్రాస్, బొంబాయి, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ).. బెంగళూరులో ఇన్‌ఫర్మేషన్ సెక్యూరిటీ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్స్ (ఐఎస్ఆర్‌డీసీ) నెలకొల్పాయని కూడా పేర్కొంది.

జేఎన్‌టీయూలో ఈ ఏడాది నుంచే.. రాష్ట్రంలో ఎంటెక్‌లో సైబర్ సెక్యూరిటీ కోర్సులున్నాయి. ఓయూలో కొన్నేళ్ల క్రితమే ప్రారంభంకాగా జేఎన్‌టీయూహెచ్ ఈ విద్యాసంవత్సరం నుంచే హైదరాబాద్ ప్రాంగణంలో ప్రారంభించింది. ఇటీవల పీజీఈసెట్ కౌన్సెలింగ్‌లో విద్యార్థులు ఈ కోర్సులపై ఆసక్తి చూపుతున్నారు.

రూ.58,319 కోట్లకు సవరణ

(మొదటి పేజీ తరువాయి)

చర్చించనున్నారని సమాచారం. ఇందుకోసం పోలవరంలో విభాగాలవారీగా బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాన పనులు, ఎడమ, కుడి కాలువల పనుల వారీగాను, భూసేకరణ-పునరావాసపరంగానూ అథారిటీతో చర్చించి ఈ అంచనాలను కొలిక్కి తెస్తారు.

ఇంతకుముందు పోలవరం ప్రాజెక్టు అథారిటీకి రూ.48వేల కోట్ల సవరించిన అంచనాలతో ఒక ప్రతిపాదన సమర్పించారు. ఆ విషయంపై అథారిటీలో వివిధ సందర్భాల్లో అధికారులు చర్చించారు. వారి అనుమానాలను నివృత్తి చేయడానికి, క్షేత్ర స్థాయి పరిస్థితులకు మధ్య లంకె కుదరలేదు. అథారిటీ తనిఖీ తర్వాత ఒక అంగీకారానికి వచ్చి ఆ సవరించిన అంచనాలు కేంద్రానికి పంపితే సులభంగా ఆమోదం పొందవచ్చని భావించారు. ఈ ప్రక్రియలో రెండు వైపుల నుంచి ఇబ్బందులు తలెత్తుతూ వచ్చాయి. ప్రధాన పనులకు సంబంధించి కొన్ని మార్పులతో అంచనాలు సమర్పించాలని అథారిటీ వెనక్కు పంపిన సందర్భాలున్నాయి. ఇప్పుడు అవన్నీ కొలిక్కి తీసుకువచ్చి కేంద్రానికి సమర్పించనున్నారు.



దాదాపు 99 ఏళ్ల తరువాత సోమవారం ఏర్పడిన సంపూర్ణ సూర్యగ్రహణాన్ని కోట్లాది మంది అమెరికన్లు ఆసక్తిగా, ఆశ్చర్యంగా వీక్షించారు. అమెరికా చరిత్రలోనే అత్యధికంగా దాదాపు 20 కోట్ల మంది వీక్షించినట్లు అంచనా. ఒరెగాన్‌లోని సలెంలో గల థియేటర్‌లో ఒరెగాన్ మ్యూజియం ఆఫ్ సైన్స్, ఇండస్ట్రీవారు ప్రత్యేక వ్యాఖ్యానంతో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వేలాదిమంది హాజరయ్యారు. ఒరెగాన్ నుంచి దక్షిణ కరోలినా వరకు 14 రాష్ట్రాల మీదుగా 96 కిమీ నుంచి 113 కిమీ మేర చీకటి ఆవరించింది. ఆయా ప్రాంతాల్లో రెండు నుంచి మూడు నిముషాలపాటు పట్టపగలే దట్టమైన చీకటి అలముకుంది.

నేడు కృష్ణా బోర్డు భేటీ

ఈనాడు, అమరావతి: కృష్ణా నది యాజమాన్యబోర్డు ఆరో సర్వసభ్య సమావేశం మంగళవారం విజయవాడలో జరగనుంది. గేట్ వే హోటల్‌లో జరగనున్న ఈ సమావేశానికి బోర్డు ఛైర్మన్, సభ్య కార్యదర్శి సమీర్ ఛటర్జీ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్య కార్యదర్శులు ఎస్.కె.జోషి, శశిభూషణ్‌కుమార్, ఇంజినీర్ ఇన్ చీఫ్‌లు ఎం.వెంకటేశ్వరరావు, మురళీధర్‌లు హాజరుకానున్నారు. ఆగస్టు నెల చివరి కొచ్చినా తెలుగు రాష్ట్రాలకు ఎగువ నుంచి నీరు చేరని పరిస్థితుల్లో, తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో జరుగుతున్న ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో కనీస నీటిమట్టాలను దాటి నీరు వాడేసుకున్న పరిస్థితుల్లో ఎజెండాలో నీటి పంపకాల విషయం చేర్చలేదు. ఒక వేళ తాగునీటి అవసరాలపై చర్చకు వస్తే జూరాలకు వచ్చిన కొద్దిపాటి నీటిపై ఏపీ అధికారులు ప్రస్తావించే అవకాశం ఉంది. సాగర్‌లో మరింత దిగువకు వెళ్లి నీటిని తీసుకోవడానికి ఏర్పాట్లు చేసుకునే అవకాశాలపైనా చర్చకు రావచ్చు. శ్రీశైలం నుంచి ఉన్న కొద్దిపాటి నీటిని తాగునీటి అవసరాలకు విడుదలకు తెలంగాణ కోరవచ్చు. ప్రస్తుత నీటి సంవత్సరంలో ఇంకా నీరు దిగువకు రాకపోయినా 2017-18 సంవత్సరానికి నీటి పంపకాలపై గత రెండు సంవత్సరాల విధానాన్నే అనుసరించాలని బోర్డు తన ఎజెండాలో ప్రతిపాదించింది. ఈ విషయంపై రెండు రాష్ట్రాలు భిన్నాభిప్రాయంతోనే ఉన్నాయి. అలాగే బోర్డు విధివిధానాలకు సంబంధించిన చర్చ, బడ్జెట్‌పైనా కొంత చర్చ జరుగుతుంది. ప్రధానంగా టెలిమెట్రీ వ్యవస్థపై ఈ సమావేశంలో చర్చ ఉంటుంది. కృష్ణా బోర్డు లోగోను ఖరారు చేయనున్నారు.

అడుగంటిన చరిత్ర

(మొదటి పేజీ తరువాయి)

నాలుగోది కానుంది. సోమవారం ఆలమట్టిలోకి ఎలాంటి వరదా లేదు. మరోవైపు కర్ణాటక 35వేల క్యూసెక్కుల నీటిని నారాయణపూర్‌కు విడుదల చేసింది. ఆలమట్టిలోకి భారీ వరద వస్తే తప్ప శ్రీశైలానికి వచ్చే అవకాశం కనిపించడం లేదు.

వరదొస్తేనే ముందస్తు రబీ..

కృష్ణా బేసిన్‌లో రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రాజెక్టులన్నీ నిండాలంటే సుమారు 500 టీఎంసీలు అవసరమవుతాయి. ఆలస్యంగానైనా వరద వస్తేనే ముందస్తు రబీకి అవకాశం ఉంటుంది. కృష్ణా బేసిన్‌లో రెండు రాష్ట్రాల్లోని ప్రాజెక్టుల కింద నికర జలాల కేటాయింపులున్న ఆయకట్టే 50 లక్షల ఎకరాలు ఉంది. ఇందులో కృష్ణా డెల్టాలో పట్టిసీమ ద్వారా వచ్చే నీటితో కొంత మేర ఆయకట్టు సాగైంది. మిగులు జలాల ఆధారంగా చేపట్టిన తెలుగుగంగ, హంద్రీనీవా, ఏఎంఆర్‌పీ, కల్వకుర్తి తదితర ప్రాజెక్టుల కింద 25 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది.

తాగునీటికే 70 టీఎంసీలు కావాలి..

సాగునీటి సంగతి తర్వాత తాగునీటికి ఎలా అన్న ఆందోళన తెలుగు రాష్ట్రాల అధికారుల్లో మొదలైంది. రెండు రాష్ట్రాల్లో తాగునీటికే 70 టీఎంసీలకు పైగా అవసరం. ఈ మేరకైనా వస్తాయా లేదా అని ఆందోళన చెందుతున్నారు. హైదరాబాద్ తాగునీటి అవసరాలకు ఏడాదికి 18 టీఎంసీలు అవసరమవుతాయి. నాగార్జునసాగర్ కుడి, ఎడమ కాలువల కింద తాగునీటి అవసరాలకు కనీసం 20 టీఎంసీలు కావాలి. సాగర్ నుంచి ఏఎంఆర్‌పీ కింద నల్గొండ జిల్లాకు ఐదు టీఎంసీలు అవసరమవుతాయి. కృష్ణాడెల్టాకు ప్రస్తుతం పట్టిసీమ ద్వారా మళ్లించే నీరు కొంత మేర ఆయకట్టుకు సరిపోయినా, తాగునీటి అవసరాలకు పది టీఎంసీలు అవసరమవుతాయని నీటిపారుదల శాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి. రాయలసీమ జిల్లాలకు, మహబూబ్‌నగర్ జిల్లాకు శ్రీశైలం నుంచి తాగునీటిని తీసుకోవాల్సి ఉంది. శ్రీశైలంలో నీటిమట్టం పెరిగితే కానీ ఇది సాధ్యం కాదు.

నిరాశపర్చిన తుంగభద్ర

తుంగభద్ర రిజర్వాయర్‌కు ఈ ఏడాది నీటిలభ్యత మెరుగ్గా ఉంటుందని అంచనా వేయగా.. పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ఇప్పటివరకు 56 టీఎంసీలే వచ్చింది. రోజూ పదివేల క్యూసెక్కుల ప్రవాహం కూడా లేదు. తెలుగు రాష్ట్రాల్లో ఎల్లెల్సీ కింద మాత్రమే నామమాత్రంగా 0.7 టీఎంసీల వినియోగం జరిగింది. అత్యధిక ఆయకట్టు ఉన్న తుంగభద్ర హెచ్చెల్సీ కింద నీటిని విడుదల చేయలేదు. గతేడాది ఖరీఫ్ లేదు. ఈ సంవత్సరం కూడా లేనట్లే. ఆర్డీఎస్‌దీ ఇదే పరిస్థితి. ఆలమట్టి నుంచి నీటి విడుదలలో జాప్యం జరిగినా తుంగభద్ర నిండితే అక్కడి నుంచి విడుదల చేసే నీరు శ్రీశైలానికి వచ్చి చేరేది. ఇప్పుడా పరిస్థితి కూడా కనిపించడం లేదు.

శ్రీశైలం నిర్మాణం తర్వాత.. ఆగస్టు వరకు 100 టీఎంసీల కంటే తక్కువ నీరొచ్చిన సంవత్సరాలు

సంవత్సరం	వచ్చిన నీరు (టీఎంసీల్లో)
2003-04	44.105
2012-13	29.65
2015-16	0
2017-18 (ఆగస్టు21 వరకు)	4.57

500 టీఎంసీల కంటే ఎక్కువ వచ్చిన సంవత్సరాలు

1985-86	533.457
1986-87	547.730
1988-89	692.960
1989-90	561.993
1990-91	1040.336
1991-92	1343.922
1992-93	508.697
1993-94	588.194
1994-95	1307.920
1997-98	898.119
1999-2000	592.142
2005-06	1143.312
2006-07	1362.488
2007-08	995.296
2013-14	553.03

గ్రహం అనుగ్రహం
22-8-2017 మంగళవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం వర్ష రుతువు; భాద్రపద మాసం; శుక్ల పక్షం
పాడ్యమి: రా. 10-55 తదుపరి విదియ
మఖ నక్షత్రం: సా. 4-14 తదుపరి పుబ్బ
అమృతఘడియలు: మ. 1-53 నుంచి 3-26 వరకు
వర్జ్యం: ఉ.శే. 6-08 వరకు
తిరిగి రా. 12-06 నుంచి 1-41 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-18 నుంచి 9-09 వరకు
తిరిగి రా. 10-55 నుంచి 11-41 వరకు
రాహుకాలం: మ. 3-00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ.5-47; సూర్యాస్తమయం: సా.6-20

వాతావరణం

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
హైదరాబాద్	20.7	31.2
తిరుపతి	23.5	35.2
కర్నూలు	23.5	35.2
అనంతపురం	23.9	33.2
రాజమహేంద్రవరం	25.0	34.0
శ్రీకాకుళం	25.0	34.0
గుంటూరు	25.0	36.0
విశాఖపట్నం	25.4	33.6
విజయవాడ	25.5	33.8
ఒంగోలు	25.6	34.3
కడప	26.0	34.0
నెల్లూరు	26.0	35.0
తాడేపల్లిగూడెం	26.5	32.0
నరసాపురం	27.0	33.0



ప్రదర్శనలో పాల్గొన్న రఘువీరారెడ్డి, కోట్ల, తులసిరెడ్డి తదితరులు

ప్రజల తరఫున కాంగ్రెస్ పోరాటం: రఘువీరారెడ్డి

నంద్యాల, న్యూస్‌టుడే: రాబోయే రెండేళ్లలో కాంగ్రెస్ పార్టీ ప్రజల తరఫున పోరాటాలతో రాజకీయాల్లో క్రియాశీలక ప్రతిపక్ష పాత్ర పోషిస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి పేర్కొన్నారు. నంద్యాలలో ప్రచార ముగింపు సందర్భంగా సోమవారం కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలతో సంజీవనగర్ గేటు నుంచి శ్రీనివాసనగర్ కూడలి వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభలో రఘువీరారెడ్డి మాట్లాడుతూ స్థానికుడైన కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఎన్నికల ఫలితాలతో సంబంధం లేకుండా నంద్యాలలో చేపట్టిన రూ.1500 కోట్ల అభివృద్ధి పనులు, 13 వేల గృహాల నిర్మాణం, సిద్ధేశ్వరం అలుగు, గుండ్రేవుల జలాశయం, శ్రీశైలంలో 854 అడుగుల నీటి మట్టం నిర్వహణ, ఈ ప్రాంతంలోని ప్రాజెక్టుల పూర్తికి కాంగ్రెస్ అలుపెరగని పోరాటం చేస్తుందన్నారు. కడప ఉక్కు, రైల్వే జోన్ కోసం పోరాటం సాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి , మాజీ మంత్రి శైలజనాథ్, ఏపీసీసీ ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్.తులసిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు లక్కసాగరం లక్ష్మిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, అభ్యర్థి అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.

అవినీతిపై జగన్ మాట్లాడటం విడ్డూరం: యనమల

కాకినాడ, న్యూస్‌టుడే: గత కాంగ్రెస్ ప్రభుత్వంలో తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని రూ.లక్షల కోట్లు అక్రమంగా ఆర్జించిన ప్రతిపక్షనేత వై.ఎస్.జగన్ ఇప్పుడు అవినీతి గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. కాకినాడ తెదేపా జిల్లా కార్యాలయంలో మంత్రి జవహర్, ఆప్కాబ్ ఉపాధ్యక్షుడు వరుపుల రాజా తదితరులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఫ్యాక్షన్ కుటుంబం నుంచి వచ్చిన ఆయన అదే భావాలను పుణికిపుచ్చుకుని అరాచకవాదిగా మాట్లాడుతున్నారన్నారు. ఆర్థిక నేరాలకు పాల్పడిన జగన్‌కు త్వరలో శిక్షపడటం ఖాయమన్నారు. జగన్ మీడియా ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనలు పాటించటం లేదన్నారు. మాపై రాస్తూ మా వివరణ తీసుకోవటం లేదన్నారు. దీనిపై ఆధారాలతో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఎవరెన్ని చెప్పినా నంద్యాల, కాకినాడలో తామే గెలుస్తామని, ప్రజలంతా తమ పక్షాన్నే ఉన్నారని మంత్రి అన్నారు.

నంద్యాల ఉప ఎన్నికల్లో ధన ప్రభావం: సీపీఐ

విజయవాడ, న్యూస్‌టుడే : నంద్యాల ఉపఎన్నికల్లో ప్రధాన పార్టీలు విచ్చలవిడిగా ధనాన్ని వెదజల్లుతున్నాయని సీపీఐ రాష్ట్రకార్యదర్శి కె.రామకృష్ణ ఆరోపించారు. దీనిపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేస్తూ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ప్రజాసమస్యలన్నీ గాలికొదిలేసి ప్రజాప్రతినిధులంతా నంద్యాలలోనే తిష్ట వేశారని విమర్శించారు. ఎన్నికల్లో ధనం, మద్యం పంపిణీలను నియంత్రించి ఎన్నిక సజావుగా సాగేలా చూడాలని కోరారు.

మంత్రి ఆదినారాయణరెడ్డిపై హెచ్‌ఆర్‌సీలో ఫిర్యాదు

హైదరాబాద్, న్యూస్‌టుడే: దళితులను కించపరిచేలా ఏపీ మంత్రి ఆదినారాయణరెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ గుంటూరు జిల్లా తెనాలి ఎన్‌సీబీఎన్ కాలనీకి చెందిన యునైటెడ్ ట్రైబల్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి మంద కృష్ణ సోమవారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు దాఖలు చేశారు. కేసు విచారణకు స్వీకరించిన కమిషన్ అక్టోబరు 31లోపు ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలని కడప ఎస్పీకి ఆదేశాలు జారీ చేసింది.

ఓటర్లూ... స్వేచ్ఛగా ఓటు వేయండి

- నంద్యాల ఉప ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి
- 23న ఉదయం 7 నుంచి సాయంత్రం 6 వరకు పోలింగ్
- పరిశీలనకు 82 ప్రత్యేక స్క్వాడ్‌లు
- సర్వేలు నిర్వహిస్తే కఠిన చర్యలు
- తెలుగు రాష్ట్రాల సీఈవో భన్వర్‌లాల్

ఈనాడు – హైదరాబాద్

నంద్యాల ఉప ఎన్నికను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశామని తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారి భన్వర్‌లాల్ తెలిపారు. సోమవారం సాయంత్రం 6 గంటలతో ప్రచార గడువు ముగిసిందన్నారు. నంద్యాల ఎన్నికల ప్రచారానికి వచ్చిన మంత్రులు, వివిధ పార్టీల నాయకులు వెంటనే కర్నూలు జిల్లాను వీడి వెళ్లిపోవాలని ఆదేశించామని, ఈమేరకు వారికి నోటీసులు జారీ చేశామన్నారు. నంద్యాల నియోజకవర్గ రాజకీయపార్టీల నాయకులు, అభ్యర్థులు ఇంటిని వదిలి బయటకు రాకూడదని



ఆదేశించారు. ఈనెల 23న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఆరు గంటల వరకు వరుసలో ఉన్నవారందరికీ ఓటువేసే అవకాశం ఉంటుందన్నారు. నచ్చిన అభ్యర్థికి స్వేచ్ఛగా ఓటు వేసుకోవచ్చని, ఎవరూ నచ్చకుంటే నోటా ఆప్షన్ ఇచ్చామన్నారు. సోమవారమిక్కడ సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో పోలింగ్ పరిశీలనకు 82 ప్రత్యేక స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామన్నారు. "నంద్యాల నియోజకవర్గంలో 2.19లక్షల ఓటర్లు ఉన్నారు. వీరిలో 2.03లక్షల మందికి ఓటు రశీదులు పంపిణీ చేశాం. మిగతా 16వేల మందిలో 3,626 మంది చనిపోయారు. 4,865 మంది ఓటర్లు బదిలీ అయ్యారు. 4,269 మంది ఆచూకీ లేదు. 2,943 మంది పేర్లు డూప్లికేట్ అయ్యాయి. వీరిలో ఎవరైనా అర్హులుండి ఓటు వేయడానికి వస్తే రిటర్నింగ్ అధికారి వివరాలన్నీ పరిశీలించి అనుమతిస్తారు. 255 పోలింగ్ కేంద్రాల్లో లోపల, బయటి పరిస్థితులను పరిశీలించేందుకు లైవ్‌వెబ్‌కాస్ట్ ఏర్పాట్లు చేశాం. ఈవీఎంలో ఓటు వేశాక ఏడు సెకన్ల పాటు వీవీప్యాడ్‌పై పార్టీ గుర్తు కనిపిస్తుంది. ఓటరుకు ఏమైనా సందేహాలుంటే.. వెంటనే రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేయాలి. ఎలాంటి సహాయం కావాలన్నా, ఇబ్బందులు ఎదురైనా వెంటనే 9223166166 నెంబరుకు ఎస్ఎంఎస్ చేయాలి. ఈ సమాచారం సంబంధిత స్క్వాడ్స్‌కు వెళ్తుంది. ఓటర్లను ప్రభావితం చేసేలా వార్తల ప్రసారం, సర్వేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే 16తెలుగు ఛానెళ్లపై నిఘా పెట్టాం. బందోబస్తులో ఆరు కంపెనీల కేంద్ర బలగాలు, ఎనిమిది కంపెనీల ఏపీఎస్పీ బలగాలు, 2500మంది పోలీసులు ఉన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను కల్పించాం."అని వివరించారు.

ఫిర్యాదు చేసే హక్కు ఉంది...

సీఈవో మీద ఫిర్యాదు చేసే హక్కు అందరికీ ఉందని బన్వర్‌లాల్ అన్నారు. 'పార్టీల మీద వచ్చిన ఫిర్యాదులపై చర్యలు తీసుకున్నాం. తెదేపా ఫిర్యాదు చేయడానికి ముందుగానే వారిచ్చిన ఫిర్యాదులపై సుమోటోగా చర్యలు తీసుకున్నాం. అధికార దుర్వినియోగంపై హైకోర్టులో దాఖలైన పిటిషన్‌పై న్యాయవాదితో మాట్లాడుతాం. ఓటర్లు ప్రభావితమవుతారని సర్వేలను నిషేధించాం. ప్రస్తుతం ఈ విషయం న్యాయస్థాన పరిధిలో ఉంది. విధి నిర్వహణలో భాగంగానే పోలీసులు సీఎం భద్రతా వాహనాల వరుసలో ఒక వాహనాన్ని తనిఖీ చేశారు. అక్రమాలపై మంత్రులు, రాజకీయపార్టీల నాయకులపై ఇప్పటి వరకు అందిన వివరాలు, ఆయా కేసులు, నగదు వివరాలన్నీ మీడియాకు వెల్లడిస్తాం. అక్రమాలు, నగదు, మద్యం పంపిణీ తదితర ఘటనలపై 368 కేసులు నమోదయ్యాయి. దాదాపు రూ.1.16 కోట్ల నగదును సీజ్‌చేశాం. ఈ విషయమై విచారణ కొనసాగుతోంది. ఎమ్మెల్యే బాలకృష్ణపై వచ్చిన ఫిర్యాదును పరిశీలించి నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టరును ఆదేశించాం. ప్రాథమిక విచారణలో డబ్బు పంపిణీ చేయలేదని, ఎన్నికల ప్రచార సమాచారాన్ని పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. అయితే ఈసీ సమగ్ర విచారణతో నివేదిక ఇవ్వాలని సూచించింది. ఈ మేరకు మరోసారి కలెక్టర్‌ను నివేదిక పంపించాలని ఆదేశించాం. గత ఏడాది జులై 27 నుంచి ఆగస్టు 23 వరకు కర్నూలులో సరఫరా అయిన మద్యం పరిమాణంలోనే... ఇప్పుడూ పంపిణీ చేయాలని సూచించాం. అంతకంటే ఎక్కువ పంపిణీ చేసినట్లు తెలిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటాం. సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి 48 గంటల పాటు అన్ని మద్యం దుకాణాలను మూసివేయాలని ఆదేశించాము" అని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి వెన్నులో వణుకు పుట్టింది

- నందిగామ నియోజకవర్గానికి ఆయన మొహం చూపించారా?
- ఎన్నికలప్పుడు కాదు.. సీఎం హోదాలో నంద్యాలలో పర్యటించాలి
- వైకాపా అధ్యక్షుడు జగన్ వ్యాఖ్య

నంద్యాల, న్యూస్‌టుడే: నంద్యాలలోని ప్రతి కాలనీలో, నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో 13 రోజులు తిరిగా. ప్రజలు చూపించిన ఆప్యాయత, ప్రేమానురాగాలను చూశా. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెన్నులో వణుకు పుట్టిందని వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నంద్యాల ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం గాంధీచౌక్ వద్ద ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి, ఆయన మంత్రివర్గంలోని 22 మంది నియోజకవర్గంలో తిరిగారన్నారు. మూడున్నరేళ్లలో చంద్రబాబు నంద్యాలను చూశారా? అని ప్రశ్నించారు. సీఎం హోదాలో ఆయన పర్యటించాలని సూచించారు. 2014లో నందిగామ నియోజకవర్గంలో తెదేపా ఎమ్మెల్యే చనిపోతే సానుభూతితో వైకాపా అభ్యర్థిని బరిలోకి దింపలేదని గుర్తు చేశారు. పోటీ పెట్టనందుకు చంద్రబాబు నందిగామ నియోజకవర్గానికి ముఖం చూపించారా అని ప్రశ్నించారు.

మోసగాళ్లను బంగాళాఖాతంలో కలిపేయాలి

విశ్వసనీయత అనే పదానికి అర్థం వచ్చేందుకు అవినీతి, అక్రమాలకు వ్యతిరేకంగా ఓటు వేయాలని జగన్ ప్రజలకు పిలుపునిచ్చారు. రుణమాఫీ పేరుతో డ్వాక్రా మహిళలు, రైతుల్ని మోసం చేశారని విమర్శించారు. ప్రజలను మోసం చేసే వ్యక్తులను ఇంటికి పంపాలని, అలాంటి పార్టీలను బంగాళాఖాతంలో కలిపేయాలన్నారు. గోస్పాడులో ఓ రైతు స్వయంగా ముఖ్యమంత్రిని రాత్రికి ఇక్కడ ఉండండి సార్. ఉదయం బ్యాంకు వద్దకు పోదాం.. రుణాలు మాఫీ అయ్యాయా లేదా తెలుస్తుందని చెప్పినందుకు పోలీసులను పంపి బెదిరించారని ఆరోపించారు.



నంద్యాలలో ప్రసంగిస్తున్న జగన్

అభివృద్ధితో నంద్యాలను పరుగులు పెట్టిస్తా

నంద్యాల అభివృద్ధిని నాకు వదిలేయండి, ముఖ్యమంత్రి స్థానంలో కూర్చున్న తర్వాత పులివెందుల వైపు ఏవిధంగా శ్రద్ధ చూపిస్తానో నంద్యాలను అదేవిధంగా చూస్తా, నంద్యాలను జిల్లాను చేస్తా, ఎస్పీ, కలెక్టరు మీవద్దకు వస్తారు.. నవరత్నాలు ప్రతి ఇంటికి చేరతాయన్నారు. అభివృద్ధిలో నంద్యాలను పరుగులు పెట్టిస్తానన్నారు. ప్రతి పేదవాడికి ఉచితంగా ఇల్లు కట్టించి రిజిస్ట్రేషన్ చేయిస్తానని హామీ ఇచ్చారు. ఆటోనగర్ వాసులకు స్థలాలు రిజిస్ట్రేషన్ చేయిస్తాన్నారు. మార్కెట్ దుకాణదారులు రాయల్టీ కట్టకుండా చేస్తానన్నారు. గుండ్రేవులకు ముఖ్యమంత్రి వెన్నుపోటు పొడిచారని ధ్వజమెత్తారు. చంద్రబాబు చేయనిది జగన్ చేసి చూపిస్తారని ప్రజలకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి, శిల్పా చక్రపాణి రెడ్డి, ఎమ్మెల్సీ రహమాన్ పాల్గొన్నారు.

రహదారులు వారి జాగీరా?: రోజా

తనకు ఓటు వేయకపోతే రోడ్ల మీద తిరగవద్దు, పింఛన్లు తీసుకోవద్దు అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అంటున్నారని... అవేమన్నా వాళ్ల నాయన జాగీరా? లేక అత్త ఆస్తినా? అని సినీనటి, నగరి ఎమ్మెల్యే రోజా తీవ్రంగా విమర్శించారు. సోమవారం నంద్యాల మండలంలోని చాబోలు, గోస్పాడు మండలంలోని జిల్లెల్ల, యాళ్లూరు గ్రామాల్లో ఆమె రోడ్‌షో నిర్వహించారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో 600 హామీలు ఇచ్చారని, వాటిని నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారన్నారు. ఉప ఎన్నికలు రాగానే మైనార్టీలకు పదవులు ఇస్తున్నారన్నారు. భూమా నాగిరెడ్డిని డబ్బు, పదవులు ఆశ చూపి పార్టీలోకి లాక్కుని వెన్నుపోటు పొడవడంతోనే ఆయన గుండెపోటుతో మృతి చెందారన్నారు. ఓట్లు అడిగే అర్హత లేని మంత్రులు నంద్యాలలో పరమానందయ్య శిష్యుల్లా తిరుగుతున్నారని, వారికి బుద్ధి చెప్పేలా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

వైఎస్ జగన్ సెల్ఫ్ గోల్

నంద్యాలలో తెదేపా గెలుస్తోంది: మంత్రి ఉమా

ఈనాడు, అమరావతి: నంద్యాల ఎన్నికల్లో వైకాపా నేత వైఎస్ జగన్ సెల్ఫ్‌గోల్ చేసుకున్నారని, అక్కడ తెలుగుదేశం పార్టీ గెలవబోతోందని జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. తెదేపా అభ్యర్థి బ్రహ్మానందరెడ్డి బ్రహ్మాండమైన మెజారిటీతో గెలవబోతున్నారని చెప్పారు. జగన్ ప్రచారమే వైకాపా అభ్యర్థికి నష్టం చేసిందన్నారు. వెలగపూడి సచివాలయంలో సోమవారం సాయంత్రం మంత్రి విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రిని కాల్చి చంపాలని, ఉరి తీయాలంటూ జగన్ చేసిన ప్రచారమే వారికి బెడిసి కొట్టిందన్నారు. నంద్యాల ప్రజలు ఓటు అనే ఆయుధంతో వైకాపాకు బుద్ధి చెప్పబోతున్నారని దేవినేని అన్నారు. పట్టిసీమ నిర్మించి రాయలసీమకు నీరిస్తే ఇప్పటికీ జగన్ దాన్ని వ్యతిరేకిస్తున్నారన్నారు. శ్రీశైలం జలాశయానికి నీరు వచ్చిన వెంటనే సీమకు నీరిచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి చెప్పారు.

పట్టిసీమ నుంచి 100 టీఎంసీల వినియోగం

పట్టిసీమ ఎత్తిపోతల నుంచి మొత్తం ఇంతవరకు 100 టీఎంసీలు వినియోగించామని మంత్రి ఉమా వివరించారు. కృష్ణా జలాలకు సంబంధించి ఎగువ రాష్ట్రాలే నీటిని వాడుకుంటూ దిగువకు వదలకపోవడంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్లు చెప్పారు. పోలవరం ప్రాజెక్టులో సవరించిన అంచనాలను కేంద్ర జలసంఘానికి, కేంద్ర జలవనరులశాఖకు, ప్రాజెక్టు అథారిటీకి సమర్పించామన్నారు. సెప్టెంబరు నెలాఖరు నుంచి వారం రోజుల పాటు జలహారతి కార్యక్రమం చేపట్టనున్నట్లు చెప్పారు. జలాశయాలకు, పంట కుంటలకు ఎక్కడికక్కడ హారతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎక్కడోచోట ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

'వేధింపులకు గురిచేయకుండా పోలీసులను ఆదేశించండి'

ఈనాడు, హైదరాబాద్: నంద్యాల ఉప ఎన్నికలో పోలీసులు తమను వేధింపులకు గురిచేయకుండా తగిన ఆదేశాలు జారీచేయాలని అభ్యర్థిస్తూ వైకాపా అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి పోలింగ్ ఏజెంట్లు సోమవారం హైకోర్టును ఆశ్రయించారు. ఏజెంట్లుగా దరఖాస్తులు అందజేశాక నిర్బంధిస్తామని.. కేసులు నమోదు చేస్తామని పోలీసులు బెదిరిస్తున్నారన్నారు. వైకాపా తరఫున ఏజెంట్లు లేకుండా చేయాలన్న ఉద్దేశంతోనే ఇలా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ వ్యాజ్యంపై నేడు హైకోర్టు విచారణ జరిపే అవకాశం ఉంది. నంద్యాల ఉప ఎన్నికలను నిష్పాక్షికంగా జరిపేలా కేంద్ర ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాలని అభ్యర్థిస్తూ నంద్యాలకు చెందిన న్యాయవాది టి.కిషోర్ బాబు హైకోర్టులో మరో వ్యాజ్యం దాఖలు చేశారు.

రాష్ట్ర ఎన్నికల సంఘం ఏకపక్షంగా వ్యవహరిస్తోంది

- సీఈసీకి తెదేపా ఎంపీల ఫిర్యాదు

ఈనాడు, దిల్లీ: నంద్యాల ఉప ఎన్నికల్లో రాష్ట్ర ఎన్నికల సంఘం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు తెదేపా ఎంపీలు ఫిర్యాదు చేశారు. వైకాపా ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తున్న ఈసీ.. తెదేపా ఫిర్యాదులను నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. సోమవారమిక్కడ సీఈసీ అచల్‌కుమార్ జోతి, కమిషనర్ రావత్, ఆరుగురు ఎన్నికల అధికారులతో తెదేపా ఎంపీలు రామ్మోహన్‌నాయుడు, శ్రీరాం మాల్యాద్రి, నిమ్మల కిష్టప్పలు భేటీ అయ్యారు. రాష్ట్ర ఎన్నికల సంఘం తీరు, ప్రతిపక్షనేత వ్యాఖ్యలు, సాక్షి పత్రికలో పెయిడ్ న్యూస్‌లపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఎంపీలు మీడియాతో మాట్లాడారు. నంద్యాల వైకాపా అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి నామినేషన్ పత్రాలపై రామతులసిరెడ్డి అనే వ్యక్తి నోటరీ చేశారని, రామతులసి రెడ్డి నోటరీ 13.12.2013న రద్దు అయిందని ఈ నేపథ్యంలో నామినేషన్ పత్రాలపై ఆ సంతకం చెల్లదని సీఈసీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇదే విషయాన్ని స్థానిక ఆర్వో దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని చెప్పామన్నారు. మహిళా మంత్రి భూమా అఖిలప్రియ వస్త్రధారణపై వైకాపా ఎమ్మెల్యే ఆర్కే రోజా అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినా ఈసీ పట్టించుకోలేదన్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుని నడ్డిరోడ్డుపై ఉరితీయాలని, కాల్చి చంపాలి అంటూ వైకాపా అధినేత జగన్ చేసిన వాఖ్యలపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్, రిటర్నింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేదని ఆరోపించారు. సాక్షి పత్రిక, టీవీల్లో వస్తున్న వార్తలు, కథనాలు పెయిడ్ న్యూస్‌గా పరిగణించాలని కోరారు. ఈ-మెయిల్ ద్వారా ఒపీనియన్ పోల్స్‌పై వైకాపా అభ్యర్థి ఇచ్చిన ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన ఈసీ భన్వర్‌లాల్.. తెదేపా ఫిర్యాదులు పట్టించుకోవడంలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకి చెందిన ప్యాంట్రీ కారులో రూ.కోట్లు తరలిస్తున్నారంటూ వైకాపా నేతలు నడిరోడ్డుపై ఆపడం, తాళాలు బద్దలుకొట్టడం, ఎన్నికల అధికారులు తనిఖీ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని సీఈసీ దృష్టికి తీసుకెళ్లామన్నారు.

ప్రాంతాలవారీగా జగన్ మతం రంగు మార్చుకుంటున్నారు

అఖిల భారత దళిత క్రైస్తవ సంఘాల సమాఖ్య

ఈనాడు, అమరావతి: వైకాపా అధ్యక్షుడు జగన్ ప్రాంతాలవారీగా మతం రంగు మార్చుకుంటున్నారని అఖిల భారత దళిత క్రైస్తవ సంఘాల సమాఖ్య విమర్శించింది. వైఎస్ కుటుంబాన్ని అభిమానించే దళిత క్రైస్తవుల్నీ, రెడ్డి, కమ్మ, కాపు, బీసీ కన్వర్టెడ్ క్రైస్తవుల్నీ జగన్ మోసం చేస్తున్నారంటూ సమాఖ్య జాతీయ అధ్యక్షుడు జెరూసలెం మత్తయ్య సోమవారం ప్రకటన విడుదల చేశారు పుట్టు క్రైస్తవుణ్ని అని చెప్పుకొనే జగన్ ఇటీవల హిందువుల ఓట్లను ఆకర్షించేందుకు మెడలో శిలువ వేసుకునే పుష్కర స్నానాలు చేస్తున్నారని, పీఠాధిపతులకు మొక్కుతున్నారని, తన ఇంట్లో యజ్ఞాలు చేస్తున్నారని ఆరోపించారు. తాజాగా నంద్యాల ఎన్నికల్లో హిందూ పూజారులను దూరంగా ఉంచి ముస్లిం, క్రైస్తవులను మాత్రమే ప్రలోభ పెడుతున్నారని పేర్కొన్నారు. నంద్యాల ఓటర్లతోపాటు తెలుగు రాష్ట్రాల్లోని దళిత క్రైస్తవులు, మైనారిటీలు విజ్ఞతతో ఉండాలని సమాఖ్య నేతలు కె.జోసెఫ్, ప్రభాత్‌కుమార్, మరియదాసు ప్రకటనలో సూచించారు.

పోలింగ్ విశ్లేషణకు తెదేపా యాప్

ఈనాడు, అమరావతి: నంద్యాల ఉప ఎన్నికలో పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ విశ్లేషించుకొనేందుకు తెలుగుదేశం పార్టీ ఓ యాప్‌ను సిద్ధం చేసింది. బూత్‌లవారీగా తమకు కచ్చితంగా ఓటు వేసే వాళ్ల జాబితాను చూసుకుని వాళ్లు ఓట్లు వేసిందీ లేనిదీ చూసుకుంటూ యాప్‌లో నమోదు చేసుకోవాలని నిర్ణయించారు. అలాగే ఆ బూత్‌లో ఉన్న ఓట్లు.. ప్రతి గంటకీ నమోదయ్యే పోలింగ్ శాతం, తమవాళ్లు ఏ మేరకు ఓటు హక్కు వినియోగించుకున్నదీ నమోదు చేసుకుంటారు. అలా నియోజకవర్గం మొత్తం ఉన్న బూత్‌ల ద్వారా సమాచారాన్ని తీసుకొని విశ్లేషించుకునేలా ఈ యాప్‌ను సిద్ధం చేశారు.

ఒప్పంద ప్రాతిపదికన వైద్యుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఈనాడు, అమరావతి: అధునాతన లైఫ్ సపోర్టు అంబులెన్స్‌ల్లో పనిచేసేందుకు ఒప్పంద ప్రాతిపదికన వైద్యుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వైద్య విద్య డైరెక్టర్ డా. ఎన్.సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు విశాఖపట్నం, గుంటూరు, తిరుపతి కేంద్రంగా పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. తొలుత మూడేళ్ల కాలపరిమితితో ఈ పోస్టుల్లో నియమిస్తామని, తర్వాత ఏటా ఒప్పందాన్ని పొడిగిస్తామని అన్నారు. ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులు సమర్పించాలన్నారు. పూర్తి వివరాల కోసం http://dme.ap.nic.in సంప్రదించవచ్చన్నారు.

ద్వేషంతో పిల్లలను ఓడించాలని చూస్తున్నావా?

- జగన్‌కు సోమిరెడ్డి ప్రశ్న

నంద్యాల, పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: సిద్ధాంతాలు లేని పార్టీ వైకాపా అని మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. మంత్రి అఖిలప్రియతో కలిసి సోమవారం ఆయన నంద్యాల తెదేపా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మోహన్‌రెడ్డి పేరున్న 10 మందితో తెదేపా నామినేషన్ వేయించిందని అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ద్వేషంతో భూమా కుటుంబంలోని పిల్లలను ఓడించాలని చూస్తున్నావా? అని జగన్‌ను ప్రశ్నించారు. వైకాపా భాజపాతో కలుస్తున్నట్లు వస్తోన్న వార్తలపై జగన్ వివరణ ఇవ్వాలన్నారు.

శిల్పా ముఖం చూపి ఓట్లు అడగలేకపోతున్నారు: అఖిలప్రియ

ఆళ్లగడ్డ, నంద్యాల ప్రజలకు భూమా కుటుంబం అందుబాటులో ఉండి అండగా



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, అఖిలప్రియ

ఉంటుందని పర్యాటకశాఖ మంత్రి భూమా అఖిలప్రియ చెప్పారు. "మా అమ్మానాన్నల ఫొటోలతో ప్రచారం చేస్తుంటే విమర్శిస్తున్నావు. మీ తండ్రి ఫొటో పెట్టుకుని ఎందుకు తిరుగుతున్నావు. నీకున్నట్లే మాకు తండ్రిపై ప్రేమ ఉండదా. మీరు జైలుకు వెళ్లినప్పుడు వైకాపాలో ఉన్న మా అమ్మ శోభానాగిరెడ్డి అనేక కార్యక్రమాలు చేసి విజయమ్మకు మద్దతుగా నిలిచారు. ఇప్పుడా కుటుంబంపైనే కక్ష కట్టడం ఎంతవరకు న్యాయం" అని ఆమె జగన్‌ను ప్రశ్నించారు. మంత్రిగా ఉన్న సమయంలో శిల్పా ఏం అభివృద్ధి చేశారో చెప్పలేక, ఆయన ముఖం చూపించి ఓట్లు అడగలేకపోతున్నారన్నారు.

దళితుల పక్షపాతి చంద్రబాబునాయుడు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దళితుల పక్షపాతిగా పనిచేస్తున్నారని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనంద్‌బాబు చెప్పారు. సోమవారం నంద్యాల తెదేపా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "దళితుల దుర్భర స్థితికి కాంగ్రెస్ పార్టీనే కారణం. కాంగ్రెస్ నుంచి వచ్చిందే వైకాపా. వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎస్సీ, ఎస్టీ నిధులను ఇతర కార్యక్రమాలకు మళ్లించి దళితులను మోసం చేశారు. జగన్ 15 రోజులుగా నంద్యాలలో మకాం వేసి కుల, మత వర్గాల పరంగా జనాన్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. వైకాపాకు ఎన్నికల్లో ఘోర పరాభవం తప్పదు" అని వ్యాఖ్యానించారు.

అరాచక శక్తులను ఓడించాలి: జూపూడి

"రాష్ట్రాభివృద్ధికి నిరంతరం శ్రమిస్తోన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పోటీ పడాల్సిన ప్రతిపక్ష నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి.. మాయలేడి రోజాతో పోటీ పడి మాట్లాడుతున్నారన్నారని" ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ జూపూడి ప్రభాకర్ విమర్శించారు. అరాచక శక్తులను నంద్యాల ప్రజలు ఓడించాలన్నారు.

జగన్‌పై చర్యలు తీసుకోవాలి: ఎంపీలు కొనకళ్ల, కేశినేని

ఈనాడు, హైదరాబాద్ : నంద్యాల ఎన్నికల ప్రచారంలో చంద్రబాబుపై అసత్యాలు ప్రచారం చేస్తూ అసభ్యకరంగా మాట్లాడుతున్న జగన్మోహన్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ప్రధాన ఎన్నికల అధికారి భన్వర్‌లాల్‌కు ఫిర్యాదుచేసినట్లు ఎంపీలు కొనకళ్ల నారాయణ, కేశినేని నాని తెలిపారు. ఎన్టీఆర్ భవన్‌లో మీడియాతో మాట్లాడారు.

ఆర్వో ఉత్తర్వులు నిబంధనలకు విరుద్ధం

- ప్రాథమికంగా అభిప్రాయం వ్యక్తంచేసిన హైకోర్టు
- తదుపరి విచారణ మూడు వారాలకు వాయిదా

ఈనాడు, హైదరాబాద్: నంద్యాల ఉప ఎన్నికలో ప్రజాభిప్రాయ సర్వేలను నిలువరిస్తూ రిటర్నింగ్ అధికారి(ఆర్వో) జారీ చేసిన ఉత్తర్వులు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని హైకోర్టు అభిప్రాయపడింది. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 126(ఏ) మేరకు 48 గంటల ముందు నుంచి సర్వే నిర్వహణ, వాటి వివరాల ప్రచురణపై నిషేధం ఉన్న నేపథ్యంలో సోమవారం సాయంత్రం నుంచి సర్వేలపై ప్రసారాలు నిలిచిపోతాయని గుర్తుచేసింది. తాము విచారణ జరుపుతున్న సమయానికి ఆ 48 గంటల గడువు అమల్లోకి రావడానికి కేవలం 3 గంటలు మాత్రమే మిగిలి ఉందని గుర్తుచేసింది. అలాంటప్పుడు ఆర్వో ఇచ్చిన ఉత్తర్వులను నిలుపుదల చేసినా ఫలితం ఉండదంటూ నిలుపుదలకు నిరాకరిస్తూ.. ఈ వ్యాజ్యంపై పూర్తి వివరాలతో ప్రమాణపత్రం దాఖలు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శి, సీఈవో, ఆర్వోలకు నోటీసులు జారీచేసింది. విచారణను 3 వారాలకు వాయిదా వేసింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవితో కూడిన ధర్మాసనం సోమవారం ఈ మేరకు ఆదేశాలు జారీచేసింది.

నంద్యాల ఉప ఎన్నిక ముగిసే వరకు విద్యార్థులు, ఎన్జీవోలు, ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా నిర్వహించే ప్రజాభిప్రాయ సర్వేలను నిలువరిస్తూ ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఆర్వో) ఈనెల 15న ఉత్తర్వులు జారీ చేశారు. దీన్ని సవాలు సవాలు చేస్తూ హైదరాబాద్‌కు చెందిన 'సోషియో పొలిటిక్ అనాలసిస్ అండ్ రీసెర్చ్ సెంటర్(ఎస్‌పీఏఆర్‌సీ) కార్యదర్శి ఎన్.రాంబాబు హైకోర్టును ఆశ్రయించారు. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 126ఏ(1) ప్రకారం ఎన్నికకు 48 గంటలకు ముందు 'ఎగ్జిట్ పోల్స్' నిర్వహణ, ఫలితాల ప్రచురణపై నిషేధం ఉందని పిటీషనర్ తరఫు న్యాయవాది రవీంద్రకుమార్ వాదనలు వినిపించారు. పోల్ సర్వేలపై నిషేధం లేదని.. ఆర్వో ఉత్తర్వులను సస్పెండ్ చేయాలని కోరారు. అభిప్రాయ సర్వే ముసుగులో ఓటర్లను బెదిరిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయని కేంద్ర ఎన్నికల సంఘం తరఫున న్యాయవాది వాదించారు. వాదనలు విన్న ధర్మాసనం.. సర్వేపై నిషేధం విధిస్తూ ఇచ్చిన ఉత్తర్వులు చట్ట నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని అభిప్రాయ పడింది.

న్యాయశాస్త్రాన్ని అధికార భాషల్లో ప్రచురిస్తే ఆర్థిక సాయం

ఈనాడు, అమరావతి: న్యాయ శాస్త్రాన్ని అధికార భాషల్లో ప్రచురించే స్వచ్ఛంద సంస్థలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించనుంది. రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో ఉన్న హిందీ, ఇతర ప్రాంతీయ అధికార భాషల్లో న్యాయ శాస్త్రానికి సంబంధించిన పుస్తకాల్ని ప్రచురించే స్వచ్ఛంద సంస్థలకు సాయం ఇస్తామని కేంద్ర న్యాయశాఖ ప్రకటించింది. చట్టాలు, న్యాయ శాస్త్ర పుస్తకాల ప్రచురణ, ప్రామాణిక చట్టాలకు సంబంధించిన పుస్తకాల అనువాదాలు, న్యాయశాస్త్ర పదకోశం లాంటివి ప్రచురించి ప్రాచుర్యం కల్పించేందుకు ఈ ప్రయత్నం చేస్తున్నారు. ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తులు పంపించాలని కేంద్ర న్యాయశాఖ అధికార భాషల విభాగం సంయుక్త కార్యదర్శి రాంధన్ మీనా తెలిపారు. వివరాలు www.lawmin.nic.in/olwing వెబ్‌సైట్‌లో ఉంటాయని పేర్కొన్నారు.


ఈనాడు

అంత్యోదయ మహాయజ్ఞం

పేదరికాన్ని దాని కవలలైన ఆకలి, అనారోగ్యాల్ని పరిమార్చి జాతి జనులందరి గౌరవప్రద జీవనానికి భరోసా ఇచ్చే పటుతర వాగ్దానాలతో స్వతంత్ర భారతావని ఏరువాక మొదలై ఏడు దశాబ్దాలు దాటింది. పన్నెండు పంచవర్ష ప్రణాళికల్లో 200 లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చురాసి 'గరీబీ హఠావో' అని ఎంతగా నినదించినా- ప్రపంచంలోనే అధిక సంఖ్యలో నిరుపేదలు పోగుపడ్డ దేశంగా దుష్కీర్తిని ఇండియా నేడు నెత్తిన మోస్తోంది. భారతావని ఆత్మ పల్లెపట్టుల్లోనే ఉందని జాతిపిత ఉద్ఘోషిస్తే- ఏమాత్రం అభివృద్ధికి నోచని గ్రామాల ఆత్మఘోష ప్రణాళికాకర్తలకు సవాళ్లు రువ్వుతోంది. ఈ దురవస్థకు చెల్లుకొట్టి బాపూజీ 150వ జయంతి (2019 అక్టోబరు) నాటికి 50వేల గ్రామ పంచాయతీల్లో కోటిమందిని కడు పేదరికం ఊబి నుంచి బయటకు లాగాలని మోదీ ప్రభుత్వం బృహత్ సంకల్పాన్ని ప్రకటించింది. మిషన్ అంత్యోదయ పేరిట చేపట్టదలచిన ఈ పథకం ద్వారా ఎంపిక చేసిన పంచాయతీల్లో ఏయే అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలో కేంద్రం తాజాగా సూచించింది. ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపట్టిన కొత్తల్లోనే మోదీ- ఎంపీలు, ఎమ్మెల్యేలు గ్రామాల్ని దత్తత తీసుకొని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని ఉద్బోధించడం తెలిసిందే. నిధులు లేక నీరసపడిన ఆ సంసద్ ఆదర్శ్ గ్రామయోజనను తన రెక్కల కింద పొదువుకొన్న కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ- మిషన్ అంత్యోదయలో దాన్ని అంతర్భాగం చెయ్యడాన్ని స్వాగతించాల్సిందే! ఆదర్శ గ్రామయోజన మార్గదర్శకాల అమలు, స్వయం సహాయక సంఘాలకు ఇతోధిక తోడ్పాటు, జలసంరక్షణ, పల్లెల్లో పట్టణ సదుపాయాల అభివృద్ధి (రూర్బన్), బహిర్భూమి రహితంగా పంచాయతీల్ని తీర్చిదిద్దడం, శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి వంటివాటిపై రాష్ట్రాలు చొరవ చూపాలన్నది కేంద్రసర్కారు నిర్దేశం. పట్టుమని ఇంకా పాతిక నెలల వ్యవధే ఉన్నందున, ఎంపికైన పంచాయతీల్లో పేదరికాన్ని తరిమికొట్టే గుణాత్మక మార్పు వడివడిగా కళ్లకు కట్టేలా రెండు తెలుగు రాష్ట్రాలూ గట్టిగా పోటీపడటం నేటి అవసరం!

అవిద్య, అజ్ఞానం, అనారోగ్యం, అవకాశాలలేమికి ఆటపట్టుగా పల్లెపట్టులు కునారిల్లిపోతుంటే, వాటి సముద్ధరణ కోసం ప్రభుత్వాలు ఏటా వ్యయీకరిస్తున్నది దాదాపు మూడు లక్షల కోట్ల రూపాయలు! ఈ ఏడాది కేంద్ర గ్రామీణాభివృద్ధి బడ్జెట్ లక్షా ఏడు వేలకోట్ల రూపాయలు దాటిందన్న వాస్తవం విస్మరించకూడదు. సామాజిక ఆర్థిక కులగణన ఆధారంగా వెలుగులోకొచ్చిన సమాచార నిధి దేశంలోని ఆరు లక్షల 40వేల గ్రామాల దుస్థితి గతుల్ని ఎండగట్టింది. వేటికవిగా ఛప్పన్నారు సంక్షేమ పథకాల్ని అమలు చేస్తున్నా, అవన్నీ చిల్లికుండతో నీళ్లు మోసిన చందమై ఆశించిన ప్రగతి ఎండమావిగా మారుతోందని గ్రహించిన మోదీ ప్రభుత్వం- మిషన్ అంత్యోదయ గొడుగు కింద లక్షిత ప్రయోజనాల్ని సూటిగా సాధించేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలన్నీ సమ్మతించిన అంత్యోదయ విధాన పత్రం ప్రకారం- పంచాయతీకి రోడ్ల అనుసంధానం, అందరికీ ఇళ్లు, విద్యుత్, వంటగ్యాస్, పోషకాహారం, బ్యాంకుల ద్వారా రుణాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, డ్వాక్రా సంఘాల ద్వారా ఆర్థిక కార్యకలాపాలు విస్తృతం కావాల్సి ఉంటుంది. ఉపాధి హామీ సహా ఏడు ప్రధాన పథకాల నిధులతోనే ఏటా 20 శాతం దాకా జరిగే వృద్ధి పేదరిక నిర్మూలనకు దోహదపడుతుందని, ఐసీడీఎస్, స్వచ్ఛ భారత్ మిషన్ వంటివాటి సైదోడుగా పద్నాలుగో ఆర్థిక సంఘం నిధులు, పంచాయతీల రాబడులతో ఉట్టికొట్టేయగలమని కేంద్ర ప్రభుత్వం గట్టిగా విశ్వసిస్తోంది. దారిద్ర్యం ఇనుప సంకెళ్లను తెగతెంచుకు తీరాలన్న నిబద్ధత ఆయా పంచాయతీల్లో నిండుగా ఉన్నప్పుడే- అవినీతి చీడను తుదముట్టించే పటిష్ఠ సంకల్పం క్షేత్రస్థాయిలో పురివిప్పుతుంది. మిషన్ అంత్యోదయ సాఫల్యానికి అదే గీటురాయి!

భారతావని భూభాగంలో 94 శాతంగా ఉన్న పల్లెల్లో 69 శాతం నివసిస్తుంటే, తక్కిన ఆరు శాతం పట్టణాలు, నగరాల్లో ఎకాయెకి 31 శాతం జనావళి జీవిస్తున్నారు. నగరాల్లో ఆరోగ్యప్రద జీవనానికి అవసరమైన సకల మౌలిక వసతులపై తీవ్రమైన ఒత్తిడి ఉంటే, అవి ఏమాత్రం అందుబాటులో లేని గ్రామీణ భారతంలో ప్రాణాంతక అలజడి నెలకొంది. గ్రామీణ జనాభాలో నెలకు అయిదు వేల రూపాయల లోపు ఆదాయంతో నెట్టుకొస్తున్నవారు దాదాపు 66 కోట్లమంది అని సామాజిక ఆర్థిక గణన 2015లోనే నిగ్గుతేల్చింది. మూడోవంతు గ్రామీణ కుటుంబాలకు సెంటు భూమైనా లేదని, పల్లెప్రజల్లో సగం మంది కాయకష్టంతో పొట్టపోసుకొంటున్నారన్న సర్వే- అంత్యోదయ లక్ష్యసాధన ఎంత కష్టతరమో వెల్లడిస్తోంది. దేశవ్యాప్తంగా పేదరికంలో కూరుకున్న కుటుంబాల సంఖ్య సర్కారీ లెక్కల ప్రకారమే 10.69 కోట్లు! అందులో కోటి కుటుంబాల్ని పేదరికం ఉచ్చు నుంచి తప్పించడం స్థూలదృష్టికి పరిమిత లక్ష్యంగా కనిపించినా, అది జ్వలింపజేసే స్ఫూర్తి అంతాఇంతా కాదు. కరవును పారదోలే చర్యలు మొదలు అవసరార్థులకు గృహనిర్మాణం, పోషకాహార పంపిణీ దాకా అన్నింటినీ 33 ప్రభుత్వ విభాగాల మధ్య అర్థవంతమైన సమన్వయంతో సాధించగలమని కేంద్రం చెబుతోంది. ఇన్ని దశాబ్దాలుగా గ్రామీణాభివృద్ధి పథకాలన్నింటినీ కరిమింగిన వెలగపళ్లలా మార్చేసింది- అవినీతి! దాన్ని సమూలంగా మట్టగించి, సిసలైన లబ్ధిదారుల ఎంపిక నుంచి పంచాయతీ సుస్థిర ప్రగతికి ఏమేమి అవసరమో గ్రామసభలే నిక్కచ్చిగా మదింపు వెయ్యాలి. పారదర్శకత, జవాబుదారీతనాలకు పెద్దపీట వేసి, గ్రామాభ్యుదయ మహాయజ్ఞానికి స్వచ్ఛందంగా అవి సిద్ధం కావాలి!



మేధో యంత్రం... ప్రగతి మంత్రం!

కృత్రిమ మేధ (ఏఐ), రోబోల వల్ల మన ఉద్యోగ వ్యాపారాలకు ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడమెలాగని ప్రపంచవ్యాప్తంగా విధానకర్తలు, మేధావులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఆధునిక విజ్ఞానం దేశ సామాజిక, ఆర్థిక స్థితిగతులను మార్చేసి రాజకీయాలనూ ప్రభావితం చేయగల స్థాయికి చేరనుంది. ఈ సవాలును అధిగమించాలంటే మన ఆలోచనా విధానం, బోధన-అభ్యసన రీతులను సమూలంగా మార్చుకొనక తప్పదు. 21వ శతాబ్ది అధ్యాపకుడు తరగతి గదిలో మొక్కుబడిగా పాఠం చెప్పడం, విద్యార్థులు దాన్ని బట్టీపట్టి పరీక్షల్లో నెగ్గామనిపించుకోవడం ఇక ఎంతమాత్రం కుదరదు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వ్యవస్థలు రోజురోజుకూ మేధాశక్తిని పెంచుకుంటూ అన్ని రంగాల్లో మానవ మేధకు పోటీ ఇచ్చే స్థాయికి ఎదుగుతున్నాయి. కాబట్టి విద్యార్థులూ తమ ఆలోచనా పటిమను పెంచుకోవడానికి ప్రభుత్వం, విద్యాసంస్థలు, అధ్యాపకులు అన్ని విధాలా ఏర్పాట్లు చేయాలి. నేడు పరిశ్రమలు, వ్యాపారాల్లో ఆటోమేషన్, రోబోల వినియోగం సర్వసాధారణమైంది. ఏఐ, డేటా ఎనలిటిక్స్, క్లౌడ్ కంప్యూటింగ్, రోబోటిక్స్ వంటి అత్యాధునిక రంగాల్లో విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ రంగాలు ఉద్యోగాల్లో మానవుల భాగస్వామ్యాన్ని తగ్గిస్తాయి. కొన్నేళ్ల క్రితం వరకు ఉద్యోగాల కోసం మనుషుల మధ్యే పోటీ ఉండేది. ఇప్పుడు యంత్రాలూ పోటీపడుతున్నాయి. ఇది గతంలో కనీవినీ ఎరుగని పరిస్థితి. పరిశ్రమల్లో రోబోల వినియోగం పెరిగినకొద్దీ అన్ని సంస్థల్లో మానవ వనరుల నిర్వహణ (హెచ్.ఆర్.ఎం.) విభాగం మాదిరి రోబో వనరుల నిర్వహణ (ఆర్.ఆర్.ఎం.) విభాగమూ ఏర్పడే రోజు ఎంతో దూరంలో లేదనిపిస్తోంది. రోబోలు, ఏఐ ప్రతి జీవిత పార్శ్వంలో మానవులను అధిగమించేట్లు కనిపిస్తున్నాయి. ఉదాహరణకు కొన్ని రకాల క్యాన్సర్లను కచ్చితంగా గుర్తించడంలో అవి రేడియాలజిస్టులను మించిపోయాయి. పోనుపోను భూగోళంపై మానవ ఉనికిని ప్రశ్నించే స్థాయికి అవి ఎదగవచ్చునని శాస్త్రజ్ఞులు సైతం అనుమానిస్తున్నారు. ఈ విపత్తును నివారించాలంటే మన మీద కృత్రిమ మేధ ఆధిక్యం సాధించలేని స్థాయిని మానవ మేధ అందుకోవాలి. ఇక్కడ రెండింటికీ మధ్య తేడాలను స్పష్టంగా గుర్తించాలి.

కిం కర్తవ్యం?

విభిన్న అంశాలు, సమాచార రాశులు, పరిణామాల మధ్య సారూప్యతలను గుర్తించడంలో మానవులు ఘటికులు. వారికున్న ఈ శక్తిని 'ప్యారలెల్ ప్రాసెసింగ్' అని, 'ప్యాటర్న్ రికగ్నిషన్' అని అంటారు. రోబోలు, కంప్యూటర్లు ఈ విషయంలో మానవులకన్నా వెనకబడినా, తార్కికంగా కారణాలను అన్వేషించడంలో (లాజికల్ రీజనింగ్ లేదా సీక్వెన్షియల్ ప్రాసెసింగ్)లో ముందుంటాయి. ఈ లెక్కన మానవులు కృత్రిమ మేధను అధిగమించాలంటే సరికొత్త బోధన-అభ్యసన పద్ధతులను అనుసరించి తీరాలి. విద్యార్థి దశ నుంచే మేధాశక్తిని ఇనుమడింపజేయాలి.

ఇప్పుడు మన ముందున్నవి రెండే మార్గాలు. రోబోలు, కృత్రిమ మేధల సామర్థ్యాన్ని తగ్గించడం లేదా మానవుల మేధాశక్తిని పెంచడం. కృత్రిమ మేధను సరిగ్గా ఉపయోగించుకుంటే మానవులు భవిష్యత్తులో అద్భుతాలు సృష్టించగలరు. కనుక దాన్ని చూసి భయపడటం కన్నా కృత్రిమ మేధను సమర్థంగా ఉపయోగించుకునే స్థాయికి మనం ఎదగాలి. అందుకు మానవ మేధా శక్తిని ఇనుమడింపజేయాలి. బాల్యం నుంచే సృజనాత్మక శక్తి, సమస్యా పరిష్కార సత్తా, తార్కిక ఆలోచనా సామర్థ్యాలను పెంపొందించడంపై మన విద్యాసంస్థలు దృష్టి పెట్టాలి. కంప్యూటర్ హార్డ్‌డ్రైవ్‌కు విస్తృత సమాచారాన్ని నిల్వ చేసుకోగలిగే శక్తి

అదుపు తప్పితేనే తంటా

ఉంది. అంత శక్తి మానవ మస్తిష్కానికి లేకపోయినా కంప్యూటర్లకు సాధ్యం కాని పనులను అది చేయగలదు. కంప్యూటర్ దృశ్య శ్రవణ, సంఖ్యాపరమైన సమాచారాన్ని నిల్వ చేసుకుంటే, మెదడు అనితర సాధ్యమైన రీతిలో జ్ఞాపకాల ఖజానాగా నిలుస్తుంది. ఉదాహరణకు మల్లెపువ్వును చూడగానే దాని చిత్రమే కాకుండా దాని సువాసన కూడా మెదడులో నిక్షిప్తమవుతుంది. తరవాత మల్లె పూవు అనే మాట వినగానే అవన్నీ గుర్తుకొస్తాయి. కంప్యూటర్‌కు ఈ గుణం ఉండదు. అలాగే అమ్మ ప్రేమలోని మాధుర్యం, మిఠాయి తీయదనాలను గుర్తుంచుకోవడంలో మెదడు తనకుతానే సాటి. కాబట్టి కంప్యూటర్ కన్నా మిన్నగా మెదడు శక్తిసామర్థ్యాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోగలిగేట్లు విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలి. ఈ విషయంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర.

నేడు మన పాఠశాలల నుంచి విశ్వవిద్యాలయాల వరకు అన్ని విద్యాసంస్థలు తమ విద్యార్థులు ఏం చదవాలో, ఏం తెలుసుకోవాలో నిర్దేశిస్తున్నాయి తప్ప ఎలా తెలుసుకోవాలో, ఎందుకు తెలుసుకోవాలో నేర్పడంలేదు. విశ్లేషణాత్మక ఆలోచనా విధాన ఫలితాలను బోధిస్తున్నాయే తప్ప ఒక అంశాన్ని శాస్త్రీయంగా విశ్లేషించడానికి అనుసరించాల్సిన పద్ధతులను బోధించడంలేదు. తర్కబద్ధంగా ఆలోచించడం, సృజనాత్మక ఆలోచనా విధానం, సమస్యా పరిష్కార శక్తులను వారికి అలవరచడం లేదు. కేవలం ఫార్ములాలను బోధిస్తే విద్యార్థులు బట్టీ యంత్రాలుగా మారతారు తప్ప, సొంత ఆలోచనా శక్తి వికసించదు. సొంతంగా ఆలోచించడం, అంతర్దృష్టిని ఉపయోగించి సమస్యను పరిష్కరించడం వంటి లక్షణాలను మన యువతకు చిన్ననాటి నుంచి నేర్పించాలి. ఇలా పెంపొందే అంతఃప్రజ్ఞ వారికి వృత్తిలో పురోగమించడానికే కాదు, జీవిత సమస్యలను పరిష్కరించడానికీ ఉపకరిస్తుంది. మౌఖిక చర్చలను విశ్లేషణాత్మక సమాచారంగా మార్చే పద్ధతులను బోధించడం ద్వారా విద్యార్థుల్లో సహజ ప్రజ్ఞను అభివృద్ధి చేయవచ్చు.

ప్రశ్నించడం ప్రధానం

విద్యార్థులను కేవలం మన ప్రశ్నలకు సమాధానమిచ్చేవారిగా మలచి సరిపెట్టుకొంటున్నామా లేక విద్యార్థుల్లో ప్రశ్నించే శక్తిని పెంపొందిస్తున్నామా? దురదృష్టవశాత్తు వాళ్లను జవాబులిచ్చే యంత్రాలుగా మాత్రమే తీర్చిదిద్దుతున్నామని చెప్పుకోవాలి. ఏ రంగంలోనైనా సరే ప్రశ్నించే తత్వమే పురోగతికి పునాది. దీనికి న్యూటన్ ఉదంతమే నిదర్శనం. చెట్టు కింద కూర్చున్న న్యూటన్ తలపై ఆపిల్ పండు పడగానే- అది కిందకు ఎందుకు పడింది, పైకి ఎందుకు ఎగిరిపోలేదని ప్రశ్నించుకోబట్టేకదా గురుత్వాకర్షణ సిద్ధాంతం పుట్టింది? న్యూటన్‌కు ముందు చాలామంది ఆపిల్ చెట్ల కింద కూర్చున్నారు, వాళ్ల తలలపై పండ్లు పడే ఉంటాయి. కానీ, వారెవ్వరూ ఈ ప్రశ్న వేసుకోలేదు. అందుకే కొత్త విజ్ఞానం పుట్టలేదు. కాబట్టి ప్రశ్నలోనే ఉంది పరమార్థం. మన యువతకు చిన్నప్పటి నుంచే ప్రశ్నించే తత్వాన్ని అలవరచాలి. అది వారిలో అంతఃప్రజ్ఞ వికసించడానికి దోహదపడుతుంది. కృత్రిమ మేధ (ఏఐ) గురించి మనం అనవసరంగా భయపడనక్కర్లేదు. ఏఐ మన అదుపు తప్పి మనమీదే పెత్తనం చేస్తుందనుకోవడం అపోహ మాత్రమే. మనుషులు లేనిదే ఏఐని నిర్మించడం, నిర్వహించడం సాధ్యపడదు. ఏఐ యంత్రాలు వాటంతట అవే పుట్టుకురావు. ఉదాహరణకు డ్రైవర్ లేని కారు తయారీకి ఉబర్ వందలాది నిపుణులను నియోగించింది. వీరిలో 50 మంది కార్నెగీ మెలన్ విశ్వవిద్యాలయ రోబాటిక్స్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందినవారు. నేడు స్టాక్ మార్కెట్లలో ఏఐ నిపుణులకు గిరాకీ పెరిగింది. మానవులకు ఉండే లోకజ్ఞానం, సామాజిక నైపుణ్యాలు, అంతఃప్రజ్ఞ ప్రస్తుతం ఏఐ వ్యవస్థలకు లేవు. అవి మానవులకు మాత్రమే సొంతం. కాబట్టి రోబోలతో, ఏఐ వ్యవస్థలతో పనిచేయించడానికి మానవ సిబ్బంది తప్పనిసరి. అయితే, అందుకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థి దశ నుంచే వారికి అలవరచాలి.

– డాక్టర్ కె.బాలాజీరెడ్డి

ఎవరిది పైచేయి?

మనుషులు- మరమనుషుల స్పర్ధ



కాస్పరొవ్‌పై 'డీప్ బ్లూ' విజయం (1997)

మానవ మేధకున్న వ్యూహ రచనాశక్తి చదరంగం క్రీడలో ప్రదర్శితమవుతుంది. దీన్ని అధిగమించడానికి కంప్యూటర్ ప్రోగ్రామ్‌లను రాసినా అవి మానవ మేధను చదరంగంలో ఓడించలేకపోయాయి. కానీ, ఐబీఎం తయారుచేసిన 'డీప్ బ్లూ' అనే కంప్యూటర్ 1997లో ప్రపంచ చదరంగ ఛాంపియన్ కాస్పరొవ్‌ను ఓడించగలిగింది. అపారమైన జ్ఞాపక శక్తి (మెమరీ)ని, పని సత్తాను ఉపయోగించి కాస్పరొవ్ మీద ఆధిక్యం సాధించింది. కంప్యూటర్లు మనుషులకు భిన్నమైన రీతిలో ఆలోచించి సమస్యలను పరిష్కరిస్తాయని ఈ పోటీ నిరూపించింది.

వాట్సన్‌దే గెలుపు (2011)



ఐబీఎం తయారుచేసిన వాట్సన్ కంప్యూటర్ అచ్చం మనుషుల్లా స్వర గుర్తింపు, అన్వేషణ, భాషా సామర్థ్యాలను సంతరించుకుని 'జెపర్డీ గేమ్ షో'లో మానవులపై గెలిచింది. తార్కికంగా వేగంగా ఆలోచించే శక్తి, గేమ్ సిద్ధాంతంపై అవగాహన, తాను తీసుకునే చర్య ఎలాంటి పర్యవసానాలకు దారితీస్తుందో సరిగ్గా అంచనా వేసుకుంది. సరైన ఎత్తు వేసే సత్తా కనబరచి విజయం సొంతం చేసుకుంది. అందుబాటులో ఉన్న సమాచారాన్ని మానవులకన్నా ఎన్నోరెట్లు ఎక్కువ వేగంగా, కచ్చితంగా విశ్లేషించి సరైన నిర్ణయాలు తీసుకోవడంలో కంప్యూటర్లకు సాటిలేదు.

చోదక రహిత గూగుల్ కారు (2012)



ఎదురుగా వచ్చే కార్లను తప్పించుకోవడానికి ఎడమ పక్కకు తిరగడమనేది మానవులకు సులువే. ఆ నిర్ణయం వెనక చాలా జటిలమైన అంచెలు ఉంటాయి. వీటన్నింటినీ డ్రైవర్ లేని కారు నేర్చుకుంది.

పాదచారికి ఏదీ దారి?



భద్రత, బాధ్యత- ఏ వ్యవస్థలోనైనా అత్యంత కీలక పాత్ర పోషిస్తాయి. అన్నింటి కంటే ప్రజారవాణా రంగానికి ఆ రెండే ప్రాణాధారాలు. వాహనదారులు, పాదచారులు తమ భద్రత తాము చూసుకుంటూనే- ఎదుటివారి పట్ల ఎంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే అంత ముప్పు తగ్గుతుంది. ఇరువురిలో ఆ సామాజిక స్పృహ కొరవడినప్పుడే రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకొని- క్షణాల్లో నిండు ప్రాణాల్ని హరిస్తాయి, క్షతగాత్రులుగా మార్చి ఆస్పత్రుల పాలు చేస్తాయి. ఐక్యరాజ్య సమితి ప్రకటించిన 'రహదారి భద్రత కార్యాచరణ దశాబ్దం' (2011-'20) మరో మూడేళ్లలోనే ముగుస్తుంది. ప్రమాదాల్ని నివారించడమనే లక్ష్యసాధనకు సభ్యదేశాలన్నీ పునరంకితం కావాలని, ప్రాణహరణాల్ని అరికట్టేందుకు స్వల్ప, దీర్ఘకాలిక చర్యలన్నింటినీ సమర్థంగా చేపట్టాలని ఆ సంస్థ నినదిస్తూనే ఉంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయుల్లో నినాదాలు, విధానాలు, కార్యాచరణ ప్రణాళికలకు ఏ కొదవా లేదు. అసలు సమస్య అంతా వాటి అమలు తీరుతోనే! పాదచారులు ప్రాణాలు అరచేత పట్టుకొని, వాహనాల పరుగుల నడుమ నిమిషాల వ్యవధిలోనే రోడ్డుదాటుతుండటం మనదేశంలో తప్ప మరెక్కడా అంతగా కనిపించదు. అవే నిత్య దృశ్యాలుగా మారిన పరిస్థితుల్లో 'రహదారి భద్రత ఎవరి బాధ్యత' అన్నదే చిరకాల ప్రశ్న. ఎన్నో రకాల వాహనాల రణగొణల మధ్య చిన్నా పెద్దా తేడా లేకుండా పాదచారులు అవతలి వైపు పరుగుతీస్తుండటం నిరంతర పద్మవ్యూహాన్నే తలపిస్తుంది. నట్టనడుమ చిక్కువడుతున్న పాదచారులకు, రోడ్డు దాటే ఆ కొద్ది క్షణాల్లోనే చుక్కలు కనిపిస్తున్నాయి. పగలైనా, రాత్రి అయినా ఎప్పుడూ ట్రాఫిక్ జంఝాటంలోనే ఉక్కిరిబిక్కిరవుతుండే వారికి దారి ఇంకెక్కడ? నియమ నిబంధనల రీత్యా ఇతర దేశాల్లో పాదచారులకు ఎంతో కొంత ప్రాధాన్యం లభిస్తున్నప్పటికీ, ఇండియాలోని అనేక ప్రాంతాల్లో స్థితిగతులు వేరు!

ప్రాణసంకటం

కేంద్ర రోడ్డురవాణా మంత్రిత్వశాఖ నివేదిక (2015) ప్రకారం, ఆ ఒక్క సంవత్సరంలోనే రోడ్డు ప్రమాదాల కారణంగా ప్రాణాలు కోల్పోయిన పాదచారుల సంఖ్య 7,088. జాతీయ నేర గణాంకాల నమోదు సంస్థ వెల్లడించిన వివరాల్ని బట్టి, 2013-2015 మధ్యకాలంలో 26,163 మంది రోడ్డుదాటుతుండగానే మృత్యువు పాలయ్యారు. ఆ మాట కొస్తే, 1975-2005 మధ్యకాలంలో వాహనాలు ఢీకొని 1,80,000మందికి పైగా పాదచారులు తుదిశ్వాస విడిచారు. నమోదైన కేసులు, వాటి ఆధారంగా ప్రకటితమయ్యే అధికారిక గణాంకాల మాట ఎలా ఉన్నా- వాటికి దాదాపు రెట్టింపు సంఖ్యలో పాదచారుల దుర్మరణాలు ఏటా చోటుచేసుకుంటున్నాయని 'రైట్ టు వాక్' వంటి స్వచ్ఛంద సేవాసంస్థల ఇటీవలి నివేదికలు బయటపెట్టాయి. ముఖ్యంగా పిల్లలు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు నరక యాతన పడుతున్నారు. రోడ్డుమీద కాసేపు నిలబడాలంటేనే భయం ఆవహిస్తుంది. కదలాలంటే గుండె దడదడలాడుతుంది. రోడ్డు దాటి వెళ్లడం అంటే, ప్రాణ సంకటమే! దిల్లీ మొదలు ఏ నగరంలోనైనా పలుచోట్ల పాదచారులకు కనీస ఏర్పాట్లు లేవు. వారు రోడ్డు దాటేందుకు వీలుగా అంతటా ప్రత్యేక సదుపాయం ఉండాలని నిబంధనలు చెబుతున్నాయి. నడక దారులు, జీబ్రా లైన్లు, సబ్‌వే లు, పై వంతెనలు కావాలని నిర్దేశిస్తున్నాయి. మెట్రో రైలు పనులు కొనసాగుతున్న భాగ్యనగరంలోనూ, అనేక రోడ్డు కూడళ్ల వద్ద ఉన్నా సకాలంలో పనిచేయని సిగ్నళ్లు ఎన్నో! నడిరోడ్లమీద గుంపులుగా పాదచారుల ఉరకలు పరుగులు రివాజు. నిర్మాణ పనుల్లో భాగంగా ఆ మూల నుంచి ఈ మూల దాకా డివైడర్ గోడలు, వాటిని ఏదో విధంగా దాటి వెళ్లడానికి స్త్రీలైనా, పురుషులైనా పడే పాట్లు లెక్కలేనన్ని. ఇవన్నీ నానాటికీ ప్రాణాంతకాలుగా మారుతున్నాయి. సమగ్ర రహదారి అభివృద్ధి పేరిట ప్రభుత్వాలు రూపొందించిన పథకాలు సైతం పాదచారుల కష్టనష్టాల్ని విస్మరించాయి. కొత్తగా నిర్మించే రహదారుల్లోనూ వారికి సరిపడా మార్గాలు ఉండటం లేదు. చాలా చోట్ల పేరుకే ఫుట్‌పాత్‌లు తప్ప- వాటిపై పాదం మోపే పరిస్థితే ఉండదు. ప్రధాన చౌరస్తాల సంగతి అటుంచి సాధారణ కూడళ్లలోనే జనం రోడ్డు దాటలేక అగచాట్లు పడుతుంటే, ప్రాణరక్షణ గాలిలో దీపంగా మారక ఇంకేమవుతుంది?



కాలిబాట ఉత్తమాట!

భారత్‌లో రోడ్డుప్రమాదాలకు గురయ్యే బాధితుల్లో ప్రతి అయిదుగురిలోనూ ఒకరు పాదచారి- అని పాదచారుల అంతర్జాతీయ సమాఖ్య (ఐఎఫ్‌పీ) తేల్చిచెప్పింది. రోడ్డురవాణా రంగ నిపుణుడు సి. కృష్ణకుమార్ ఆధ్వర్యం వహించిన సంఘం- ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అనేది బహుళార్థ సాధకంగా మారాల్సిన అవసరాన్ని చాటింది. అప్పుడే పాదచారుల కష్టాలు తగ్గే అవకాశం ఉంటుందని అది అభిప్రాయపడింది. వారి సంక్షేమ సాధనలో రోడ్డుపనుల నిర్వహణ, అభివృద్ధికి సంబంధించిన ప్రభుత్వ శాఖలతో పాటు- పోలీసు విభాగం, స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సేవాబృందాల పాత్ర ఎనలేనిది. వారి ప్రయత్నాలు ఉమ్మడిగా కొనసాగితే తప్ప, రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టవు. రహదారులపై దూసుకువెళ్లే వాహనాల్ని నిర్ణీత సమయంలో ఎక్కడికక్కడ ఆపడం ద్వారా, పాదచారుల్ని రోడ్డు దాటించే ప్రత్యేక సిగ్నళ్లు అత్యవసరం. పాదచారులకు ప్రత్యేక జోన్లు, వారి భద్రతకు ఉద్దేశించిన సైన్‌బోర్డులు- బారికేడ్ల ఏర్పాటు... ప్రభుత్వాలు నిర్వహించే వార్షిక, మాసిక, వార, దినోత్సవాలకే పరిమితం కాకూడదు. ఆక్రమణల్లో చిక్కుకొన్న నడక దారుల్ని తిరిగి పూర్వస్థితికి తేవడం కేంద్ర, రాష్ట్రప్రభుత్వ యంత్రాంగాల చిత్తశుద్ధిపైనే ఆధారపడి ఉంటుంది. అదనంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణ అంశమూ సంబంధిత ప్రభుత్వ విభాగాల దస్త్రాల్లోనే ఇప్పటికీ మగ్గిపోతోంది. పాదచారుల భద్రతే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం రూపుదిద్దిన 'బ్లింకర్స్' విధానం పూర్తిస్థాయిలో ఆచరణకు రాలేదు. జనం రోడ్డుదాటే సమయంలో ఆయా యంత్రపరికరాల్ని వినియోగిస్తే, ఎర్ర గుర్తు పడి వాహనాలు వెంటనే ఆగుతాయి. అలాగే ప్రభుత్వ, ప్రైవేటు కార్పొరేట్ ఆస్పత్రులతో పాటు వివిధ విద్యాసంస్థల వద్ద వాహనాల అతి వేగాన్ని నియంత్రించేందుకు రహదారి మధ్యలో పెద్దపెద్ద సిమెంటు దిమ్మెలు ఉంచుతారు. పాదచారులకు ప్రత్యేక కూడళ్ల ఏర్పాటు అంశాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమూ పరిశీలిస్తోంది. పలువురు పాదచారులు ఒకేచోట గుంపుగా నిలిచి, ఒక్కసారే రోడ్డు దాటక తప్పడం లేదు. కొన్ని సందర్భాల్లో ఇదీ అపాయకరమే! వాహనదారుల వేగం తగ్గడం, పాదచారుల భద్రత పెరగడం అనేవి కేవలం చట్టాలతోనే సాధ్యపడేవి కావు. పాదచారుల హక్కును గుర్తించి గౌరవించడం అంటే ఏమిటో కొన్ని రాష్ట్రాలు, దేశాలను చూసైనా నేర్చుకోవాలి.

నేర్వాల్సిన పాఠాలెన్నో...

తమిళనాట పాదచారుల రాకపోకలు ఎక్కువగా జీబ్రా క్రాసింగ్ ఆధారంగానే సాగుతుంటాయి. నడక దారులకు అవసరమైన రక్షణ ఏర్పాట్లూ అక్కడ కనిపిస్తుంటాయి. మరో పొరుగు రాష్ట్రం కర్ణాటకలోనూ తగిన సంఖ్యలో సబ్‌వే లు, వంతెనలు ఉన్నాయి. అందువల్ల రోడ్డు దాటడంలో ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందులు అక్కడ కొంత తక్కువ. దివ్యాంగ పాదచారులకు అనువుగా దిల్లీలోని పలు ఫుట్‌పాత్‌ల వద్ద విడిగా సదుపాయాలుంటాయి. సూచికలు, శబ్దాల ఆధారంగా వారు నిర్భయంగా ముందుకు సాగుతుంటారు. ఐరోపా నగరాల్లో పాదచారుల మార్గంలోకి వాహనాలు వెళ్లడమన్నది ఓ నేరం. స్వీడన్‌లో వారికి తగినంత రక్షణతో కూడిన ప్రత్యేక దారులుంటాయి. ఎరుపు సిగ్నల్ పడగానే, వాహనాలన్నీ స్టాప్ లైన్ వద్ద వరస వెంబడి ఆగుతాయే కానీ, ఒక్క అడుగైనా దాటి ముందుకు కదలవు. నిబంధనల్ని తు.చ. తప్పక పాటించే అలవాటు సింగపూర్‌లోనూ ఎక్కువే. అక్కడ పాదచారి అయినా సరే, ఇష్టానుసారం రోడ్డు దాటితే ఆ నేర తీవ్రతను బట్టి జైలు, జరిమానా శిక్షలు తప్పవు. బంగ్లాదేశ్‌లో నడక దారుల నిర్మాణం, నిర్వహణ తీరుతెన్నులు ఆదర్శప్రాయాలని అంతర్జాతీయ రోడ్డు అంచనాల పథకం సంస్థ (ఐఆర్‌ఏపీ) ప్రశంసించింది. మనదేశంలోనూ పరిస్థితులకు అనుగుణమైన మార్పులు చేర్పులు మరెన్నో కావాలి, రావాలి. రహదారి భద్రత- కేవలం ప్రభుత్వానికే పరిమితమైనది కాదు. అది ప్రతి ఒక్కరికీ వర్తించి తీరాల్సిన సామాజిక బాధ్యత. దాన్ని ఉద్యమ స్థాయికి చేర్చడంలోనే, పాదచారుల హక్కుల పరిరక్షణా ఇమిడి ఉంది!

– శరత్

మంగళాశాసనం

మహాభారతం అంటే, పంచమ వేదం. అన్ని శాస్త్రాలకు, నీతులకు, ధర్మాలకు అది నిలయం. వేదసారాన్ని కాచి వడబోసిన వ్యాసమహర్షి ఆ పంచమ వేదాన్ని పండిత పామరులకు అనువుగా రచించాడు. సమాజం జ్ఞాన, కర్మ, భక్తి మార్గాల్లో పయనించాలంటూ మహాభారత గ్రంథాన్ని ఆయన ఇతిహాస రూపంలో వెలయించాడు. అది కథారూపంగానే కాక, కవితాత్మకంగానూ ఉండేలా ఓ శిల్పిలా తీర్చిదిద్దాడు. గ్రంథాన్ని మంగళ శ్లోకంతో ప్రారంభించడమే దానికి నిదర్శనం.

ఆ శ్లోక సారాంశం: శ్రీమన్నారాయణుడు దేవతలకు గురువు. ఆయన జగదేక నాథుడు, భక్తప్రియుడు, అన్ని లోకాలకూ వందనీయుడు. త్రిగుణాలకూ అతీతుడైన ఆ స్వామి అంతటా ఉంటాడు. అటువంటి పరమాత్మే అందర్నీ ఉద్ధరిస్తాడు. ఆ సంస్కృత శ్లోకానికి మధ్వాచార్యులు చేసిన పద్యరూప అనువాదం- వ్యాస హృదయాన్ని చక్కగా ఆవిష్కరిస్తుంది.

జ్ఞానాన్ని ప్రసాదించే భగవానుడు భక్తలోక పరిపాలకుడు. సర్వ ధర్మాల్నీ పరిరక్షించే ఆయన ఉదారుడు. సద్గుణ సంపన్నమైన అన్ని ఆత్మలకూ ఆయనే శక్తి, మోక్ష ప్రదాత అని మధ్వాచార్య విరచితమైన ఆ పద్యం విష్ణుతత్వాన్ని విశదీకరిస్తుంది. పూర్వభాగంలో- సురులు అంటే, దుఃఖం లేనివారు. వారికి జ్ఞానమిచ్చినవాడే ఆ 'సుర గురుడు'. ఆయన మరెవరో కాదు, సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే!

నాశనమన్నదే లేని చేతనా జగత్తుకు ఆధారం- జగత్ ప్రభువైన నారాయణుడు. అందుకే ఆయన సుర గురుడు, జగదేక నాథుడు అయ్యాడన్నది మధ్వాచార్యుల వ్యాఖ్యాన సారాంశం. భగవంతుడు భక్తప్రియుడు కాబట్టి, వారిని ఆదుకుంటాడు. త్రిగుణాతీతుడు కావడం వల్ల తమోగుణాల వంటివి ఆయనను అంటవు. 'నార' అంటే, నరులకు సంబంధించినది. వారిని ఆ సంసార సాగరం దాటించేవాడే భగవాన్ శ్రీమన్నారాయణుడు.

'విభు' అంటే సర్వవ్యాపకుడైన ఆ నారాయణుడే! 'నార' అనే పదానికి జగత్తు అనే అర్థమూ ఉంది. దీన్ని సృష్టించిన ఆదిపురుషుడు నారాయణుడే కాబట్టి, 'ఆది'



అంతర్యామి

అనే శబ్దం ఆయనకే చెల్లుతుంది. 'ఈశుడు' అంటే, సంసార సాగర మయమైన ప్రపంచాన్ని నియంత్రించే నారాయణుడు. అంతర్యామి ఆయనే. 'భవజ్ఞుడు' అంటే, భవసాగరం అనే సంసార సాగరాన్ని దాటించేవాడు. మానవులకు మోక్షానందం ప్రసాదించేది ఆయనే.

దేవతలకు, రాక్షసులకు (సురాసురులు) వంద్యుడు నారాయణుడే! మోక్షానందం అంటే స్వరూపానందం. అజ్ఞానం మూలంగా మనిషి దుఃఖాలకు లోనవుతుంటాడు. దానికి ముఖ్య కారణం అతడికి తన నిజరూపం తెలియకపోవడమే! అజ్ఞానపు చీకటి అంతరించడం వల్ల కలిగే ఆనందమే మోక్షానందం. ముక్తులు అందరూ జ్ఞానానందమయులే.

వ్యక్తిత్వపు పూర్ణ వికాసమే ముక్తి. ఎవరి సాధన వారిది. సాధన బట్టి వారికి ఫలసిద్ధి కలుగుతుంది. పాత్రలు వేరైనా, నీళ్లు నిండగానే అన్నీ పూర్ణకుంభాలే అవుతాయి. అలాగే పూర్ణత్వం అనేది మానవుల పరిణతిని బట్టి అనుభవానికి వస్తుంది.

భగవంతుడు ఒక్కడే పరిపూర్ణుడు. వ్యక్తిగత పూర్ణత్వాలు ఎన్ని ఉన్నా, అవేవీ ఆయనకు సాటిరావు. పూర్ణత్వం దేనికి అదే అయినా, మూలం ఆ భగవంతుడి పరిపూర్ణత్వమే! అందుకే నిండుకుండల్లా వ్యక్తిత్వాలన్నీ పూర్ణం అవుతాయి. చివరికి మిగిలేది పరిపూర్ణత్వమే అని మంత్రం స్పష్టంగా చెబుతోంది.

ముక్తి లేదా మోక్షం అంటే, వ్యక్తి అంతరించాక కలిగే ఒక ప్రత్యేకమైన సుఖనిలయం కాదు. ఆ వ్యక్తి పూర్ణవికాసమే అతడికి ముక్తి కలిగిస్తుంది. జీవన్ముక్తి అంటే, ఇక్కడే పొందగల భవబంధ విమోచన. ఇదొక వ్యక్తిగత అనుభూతి.

మోక్షం అనేది ఆంతరంగిక వ్యక్తిత్వపు పూర్ణానంద రసానుభూతి.

సత్వగుణం గలవారికి ఆ సాత్విక పూర్ణానందమే మోక్షం. రజోగుణం గలవారికి మోక్షం అంటే, తమను తాము మళ్లీ పొందగలగటం. తమోగుణం గలవారికి అదే ఆనందమయ లోకం. అక్షర తత్వం గల జీవుడికి యోగ్యానుసారం కలిగే ఆనందమే, అతడి జీవన పంచమ వేదానికి మహా మంగళాశాసనం!

– ఉప్పు రాఘవేంద్రరావు

ఒకే ఒరలోకి రెండాకులు

• విలీనమైన అన్నాడీఎంకే చీలిక వర్గాలు
• తమిళనాట పార్టీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు


విలీన ప్రకటన సమయంలో కరచాలనం చేసుకుంటున్న పన్నీర్‌సెల్వం, పళనిస్వామి


అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం వెలుపల కార్యకర్తల సందడి

చెన్నై: దేశవ్యాప్తంగా ఆసక్తి రేపిన అన్నాడీఎంకేలోని రెండు చీలిక వర్గాల విలీనం ఎట్టకేలకు పూర్తయింది. దీంతో ఆరు నెలలకుపైగా కొనసాగిన ఉత్కంఠకు తెరపడింది. రెండు వర్గాల మధ్య అనేక చర్చలు, సమావేశాలు జరిగిన మీదట రెండు వర్గాలు ఏకమయ్యేందుకు మార్గం సుగమమైంది. పార్టీ ప్రధాన కార్యాలయానికి చేరుకొన్న ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి, మాజీ సీఎం పన్నీర్‌సెల్వం తమ వర్గాలను ఏకం చేస్తున్నట్లు సోమవారం ప్రకటించడంతో రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. నాయకులు, కార్యకర్తలు వేడుకలు చేసుకున్నారు.

చరిత్ర తిరగరాసి...

గత సంవత్సరం మేలో జరిగిన ఎన్నికల్లో చరిత్రను తిరగరాస్తూ అన్నాడీఎంకే రెండోసారి అధికారాన్ని చేజిక్కించుకుంది. ముఖ్యమంత్రిగా జయలలిత ప్రమాణ స్వీకారం చేశారు. సెప్టెంబరు 22న అనారోగ్యంతో ఆమె ఆస్పత్రిలో చేరారు. డిసెంబరు 5న జయలలిత మరణించారు. ఆమె మంత్రివర్గంలో అప్పుడు ఆర్థికశాఖ నిర్వహిస్తున్న పన్నీర్‌సెల్వం వెంటనే తాత్కాలిక ముఖ్యమంత్రిగా నియమితులయ్యారు. అనంతరం ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. సమస్యలను పరిష్కరించుకుంటూ పాలనాదక్షుడిగా మంచి పేరు కూడా పొందారు. పార్టీలో తలెత్తిన అంతర్గత పరిణామాలతో ఈ ఏడాది ఫిబ్రవరి 5న ముఖ్యమంత్రి పదవికి పన్నీర్‌సెల్వం రాజీనామా చేశారు. చిన్నమ్మ శశికళ అనూహ్యంగా అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి అయ్యారు. దీంతో ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగుతున్న పన్నీర్‌సెల్వం మెరీనా తీరంలోని జయలలిత సమాధి వద్ద గంటపాటు దీక్షకు దిగారు. తనతో బలవంతంగా రాజీనామా చేయించారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫిబ్రవరి 7న శశికళపై తిరుగుబాటు బావుటా ఎగరవేశారు. అనంతరం కోర్టు తీర్పుతో ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఆమె జైలుకు వెళ్లారు. ఆపై జరిగిన నాటకీయ పరిణామాల మధ్య ఎడప్పాడి పళనిస్వామి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. శశికళ జైలుకు వెళుతూ మేనల్లుడు టీటీవీ దినకరన్‌ను పార్టీ ఉప ప్రధాన కార్యదర్శిగా నియమించారు. అనంతరం జరిగిన విశ్వాస పరీక్షలో 122 మంది ఎమ్మెల్యేల మద్దతుతో ఎడప్పాడి పళనిస్వామి గెలుపొందారు. పన్నీర్‌కు మాత్రం 11 మంది ఎమ్మెల్యేల మద్దతు మాత్రమే లభించింది. ముఖ్యమంత్రిగా ఎడప్పాడి పళనిస్వామి బాధ్యతలు చేపట్టిన తర్వాత దాదాపు ఆరు నెలలకు పైగా అనేక పరిణామాలు రాష్ట్రంలో చోటుచేసుకున్నాయి. అన్నాడీఎంకేలో వచ్చిన చీలికలతో అన్నాడీఎంకే అమ్మ వర్గానికి పళనిస్వామి, అన్నాడీఎంకే పురట్చి తలైవి అమ్మ వర్గానికి పన్నీర్‌సెల్వం నేతృత్వం వహించారు. పన్నీర్‌సెల్వం ధర్మయుద్ధం పేరుతో రాష్ట్రవ్యాప్త పర్యటన చేసి పార్టీశ్రేణుల మద్దతును కూడగట్టే ప్రయత్నం చేశారు.

దినకరన్ దూకుడుతో తెరపైకి విలీనం

రెండు వర్గాలు ఒక్కటవుతాయని నాలుగు నెలల క్రితమే ప్రచారం సాగింది. ఈ క్రమంలో వర్గాల కమిటీలను కూడా వేశారు. తమ డిమాండ్లను పళనిస్వామి వర్గం నెరవేర్చకపోవడంతోపాటు మోసపూరితంగా వ్యవహరిస్తోందని పన్నీర్‌సెల్వం విలీన కమిటీని రద్దు చేశారు. జయలలిత మరణంపై న్యాయ విచారణ, పార్టీ నుంచి శశికళ కుటుంబాన్ని దూరం చేయడానికి అంగీకరిస్తేనే విలీనం చేస్తామని తేల్చిచెప్పారు. దీంతో విలీనంపై కొన్నిరోజులుగా సందిగ్ధత కొనసాగుతూ వచ్చింది. జైలు నుంచి బెయిల్‌పై వచ్చిన దినకరన్ దూకుడుగా వ్యవహరించడం, ఎమ్మెల్యేలను తనవైపునకు మళ్లించుకోవాలని ప్రయత్నించడం లాంటి చర్యలతో పళనిస్వామి అప్రమత్తం అయ్యారు. ఈ క్రమంలో పన్నీర్‌ వర్గంతో విలీనానికి పావులు కదిపారు. భాజపా కూడా రంగంలోకి దిగడంతో వడివడిగా రెండు వర్గాల విలీనానికి అడుగులు పడ్డాయి. పదవులు, డిమాండ్లు పూర్తిగా అమలు కావాలన్న విషయంలో కొంత సందిగ్ధత నెలకొంది. రెండు రోజుల పాటు కొనసాగిన ఈ ఉత్కంఠకు ఎట్టకేలకు పన్నీర్‌సెల్వం తెరదించారు. అనుకున్నట్లుగానే పదవుల విషయంలో స్పష్టత, పార్టీ అగ్రనాయకుల మధ్య ఏకాభిప్రాయం రావడంతో విలీనానికి సోమవారం ముహూర్తం పెట్టారు. ముఖ్యమంత్రి పళనిస్వామి, మాజీ సీఎం పన్నీర్‌సెల్వం నేరుగా పార్టీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. రెండువర్గాలు ఏకమవుతున్నట్లు ఇద్దరూ ప్రకటించారు. దీంతో అన్నాడీఎంకే వర్గాల విలీనం పూర్తయింది.

కారాగారంలో శశికళ 'ఇష్టారాజ్యం'పై దర్యాప్తు

• జైలు బయట కూడా తిరిగేవారని ఆరోపణలు

బెంగళూరు, న్యూస్‌టుడే: అక్రమ ఆస్తుల కేసులో పరప్పన అగ్రహార కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న శశికళకు అక్కడ ఇష్టారాజ్యంగా తిరిగేందుకు అధికారులు అవకాశం కల్పించారన్న ఆరోపణలపై మరో అనుబంధ దర్యాప్తు ప్రారంభమైంది. ఆమె తీరుపై గతంలో కారాగార శాఖ అధికారిగా పనిచేసిన డి.రూప ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన అంశంపై విశ్రాంత ఐఏఎస్ అధికారి దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. జులై నెలాఖరున రూప నుంచి వివరాలు పొందిన రాష్ట్ర అవినీతి నియంత్రణ దళం (అనిద) అధికారులు తాజాగా 'ఇష్టారాజ్యం' వ్యవహారంపైనా దర్యాప్తు ముమ్మరం చేశారు. 'అనిద' అధికారులు ఈ విషయమై వివరాలు ఇవ్వడానికి తమ ముందు హాజరు కావాలని అప్పటి కారాగార డీఐజీ సత్యనారాయణరావుకు నోటీసులు జారీ చేశారు. కారాగారంలో కోరుకున్న చోటుకు వెళ్లడానికి- ఇష్టం వచ్చిన దుస్తులను ధరించి శశికళ బయటకు వెళ్లేందుకు మరో అధికారిణి అనిత సహకరించేవారనేది ప్రధాన ఆరోపణ. కారాగారం నుంచి బయటకు కూడా తీసుకెళ్లేవారని రూప గతంలో ఆరోపించారు. అలా చేయడానికే సత్యనారాయణరావు, అనితలకు రూ.రెండు కోట్ల వరకు నగదు ఇచ్చారని ఆరోపణ పత్రంలో వివరించారు. వాటికి ఆధారంగా పలు వీడియో ఫుటేజ్‌లను దర్యాప్తు అధికారులకు అందించారు. శశికళ తరఫు వ్యక్తుల నుంచి ముడుపులు, నగరంలో ఒక చోట ఇంటి స్థలం, పలు నజరానాలు అందుకున్నారంటూ కారాగారంలోని అధికారులు, సిబ్బందిపైనా ఆమె ఫిర్యాదు చేశారు. ఆ నేపథ్యంతోనే సత్యనారాయణరావు, రూపలను వేర్వేరు శాఖలకు ప్రభుత్వం బదిలీ చేసింది. తాజాగా.. శశికళ కారాగారం బయటకు వెళ్లేవారంటూ ఆరోపణలు రావడంతో 'అనిద' అధికారులు సోమవారం నుంచి దర్యాప్తు ముమ్మరం చేశారు.

త్వరలోనే 'చిన్నమ్మ' ప్రకటన

• దినకరన్ వర్గం స్పష్టీకరణ
• 16 మంది ఎమ్మెల్యేల ప్రత్యేక భేటీ

చెన్నై: ద్రోహులు పదవుల్లో కొనసాగకుండా ఉండేందుకు త్వరలోనే 'చిన్నమ్మ' నుంచి ప్రకటన వస్తుందని అన్నాడీఎంకే బహిష్కృత నేత టీటీవీ దినకరన్ వర్గీయులు పేర్కొన్నారు. పన్నీర్‌సెల్వం, పళనిస్వామి వర్గాల విలీనంపై వారు మండిపడ్డారు. తాము రాజ్‌భవన్‌కు వెళ్లిన తర్వాత జరిగే పరిణామాలను రాష్ట్ర ప్రజలు చూస్తారని వ్యాఖ్యానించారు. శశికళ, దినకరన్‌లను పార్టీ పదవుల నుంచి ఎవరూ తొలగించలేరని పునరుద్ఘాటించారు. చెన్నైలోని దినకరన్ ఇంటికి సోమవారం దాదాపు 16 మంది ఎమ్మెల్యేలు చేరుకున్నారు. మరోవైపు గొంతునొప్పి, జ్వరంతో బాధపడుతున్నందున సోమవారం నాటి కార్యక్రమాల్లో తాను పాల్గొనలేకపోయానని.. 23న అందర్నీ కలుస్తానని దినకరన్ ట్వీట్ చేశారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఏక్షణం ఏమైనా జరగవచ్చని శశికళ సోదరుడు దివాకరన్ ఓ టీవీ ఛానల్ ఇంటర్వ్యూలో హెచ్చరించారు.

ధర్మయుద్ధమంటే ఇదా?.. స్టాలిన్: ధర్మయుద్ధం చేస్తున్నామంటూ పళనిస్వామి, పన్నీర్ సెల్వం వర్గాలు ప్రజలను తప్పుదోవ పట్టించారని డీఎంకే కార్య నిర్వాహక అధ్యక్షుడు స్టాలిన్ ఆరోపించారు. వారి కలయిక వెనుక పదవుల ఆలోచన తప్పితే వేరేమీ లేదని విమర్శించారు.

భాజపా హస్తం ఉంది.. ప్రకాశ్ కారాట్: అన్నాడీఎంకే వర్గాల విలీనం వెనుక భాజపా హస్తం ఉందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు ప్రకాశ్ కారాట్ ఆరోపించారు. అందులో భాగంగానే పన్నీర్‌సెల్వం, పళనిస్వామి ఒక్కటయ్యారని కోయంబత్తూరులో పేర్కొన్నారు.

కేంద్ర కేబినెట్‌లోకి ఏఐఏడీఎంకే, జేడీయూ

అతి త్వరలోనే ప్రధాని మోదీ మంత్రిమండలి విస్తరణ!

దిల్లీ: కేంద్రంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమి(ఎన్‌డీఏ) ప్రభుత్వ మంత్రి మండలి విస్తరణ ఊహించిన సమయానికన్నా ముందే జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. భాజపా జాతీయాధ్యక్షుడు అమిత్ షా మూడు రోజుల తమిళనాడు పర్యటనను రద్దు చేసుకొని పలువురు కేంద్ర మంత్రులతో సమావేశం కావటం ఈ ఊహాగానాలకు తావిస్తోంది. అతి త్వరలోనే ప్రధాని నరేంద్ర మోదీ తన కేబినెట్‌ను పునర్వ్యవస్థీకరిస్తారని సమాచారం. ఈ దఫా విస్తరణలో కొత్తగా ఏఐఏడీఎంకే, జేడీ(యు)లకూ స్థానం దక్కవచ్చని తెలుస్తోంది. ఏఐడీఎంకేకు చెందిన ఈపీఎస్, ఓపీఎస్ వర్గాల విలీనం పూర్తయినందున ఈ పార్టీ కూడా ఎన్‌డీఏ గూటికి చేరటం ఖాయంగా కనిపిస్తోంది. కేంద్ర మంత్రి వర్గ విస్తరణలో ఏఐడీఎంకేకు చెందిన నలుగురు ఎంపీలకు పదవులు దక్కే అవకాశం ఉంది. ఇద్దరికి కేబినెట్, మరో ఇద్దరికి సహాయ మంత్రి పదవులు లభించవచ్చని సమాచారం. ఇటీవల ఎన్‌డీఏలో చేరిన బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్ నేతృత్వంలోని జేడీ(యు)కి ఎంపీల సంఖ్య తక్కువ కనుక ఆ పార్టీ ఒక మంత్రి పదవికే పరిమితం కావచ్చు. 2019 సాధారణ ఎన్నికలకు వెళ్లే లోపు జరిగే చివరి భారీ మంత్రి వర్గ విస్తరణ ఇదే కావచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతున్న నేపథ్యంలో గత పదిహేను రోజులుగా అమిత్ షా కేంద్ర మంత్రులతో విస్తృతంగా మంతనాలు జరుపుతున్నారు.

ఉపముఖ్యమంత్రిగా పన్నీర్‌సెల్వం

• ప్రమాణ స్వీకారం చేయించిన గవర్నరు

చెన్నై: అన్నాడీఎంకేలోని చీలిక వర్గాలు ఏకమవడంతో తిరుగుబాటు నేత ఓ పన్నీర్‌సెల్వం(ఓపీఎస్) రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. పార్టీ మార్గదర్శక కమిటీ కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఎడప్పాడి పళనిస్వామి మంత్రివర్గంలోని కీలకమైన ఆర్థిక, గృహనిర్మాణశాఖల మంత్రిగానూ బాధ్యతలు తీసుకున్నారు. ఆయన వర్గంలోని మాఫోయ్ పాండియ రాజన్ పురావస్తు, తమిళభాషాభివృద్ధి శాఖల మంత్రిగా ప్రమాణం చేశారు.

అంతకుముందు అన్నాడీఎంకే వర్గాల విలీనం నేపథ్యంలో రాష్ట్ర ఇన్‌ఛార్జి గవర్నరు సీహెచ్ విద్యాసాగర్ రావు మహారాష్ట్రలోని తన కార్యక్రమాలను రద్దు చేసుకుని సోమవారం మధ్యాహ్నం చెన్నైకి చేరుకున్నారు. మంత్రివర్గ విస్తరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గిరిజా వైద్యనాథన్ రాజ్‌భవన్‌లో ఆయనతో సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి పళనిస్వామి ప్రతిపాదన మేరకు సాయంత్రం రాజ్‌భవన్‌లో ఉప ముఖ్యమంత్రి, మంత్రిగా పన్నీర్‌సెల్వంతో, మంత్రిగా మాఫోయ్ పాండియరాజన్‌తో గవర్నరు ప్రమాణస్వీకారం చేయించారు. మంత్రివర్గ విస్తరణలో భాగంగా పన్నీర్‌సెల్వానికి ఆర్థికశాఖ, గృహనిర్మాణశాఖ, పాండియరాజన్‌కు పురావస్తు, తమిళభాషాభివృద్ధి శాఖలు లభించాయి. ఇప్పటివరకు ఆర్థికమంత్రిగా ఉన్న డి.జయకుమార్ ఇకపై మత్స్యశాఖకు పరిమితం కానున్నారు. గతంలో పశు సంవర్ధకశాఖ మంత్రిగా ఉన్న పి.బాలకృష్ణారెడ్డికి యువజన సంక్షేమం, క్రీడా శాఖలను అప్పగించారు. పశు సంవర్ధక శాఖను కె.రాధాకృష్ణన్‌కు కేటాయించారు. గనుల శాఖను మంత్రి ఎంసీ సంపత్ నుంచి తొలగించి సీవీ షణ్ముగానికి అప్పగించారు.


ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణం చేస్తున్న పన్నీర్‌సెల్వం. చిత్రంలో ముఖ్యమంత్రి పళనిస్వామి

పార్టీ కార్యకలాపాల నిర్వహణకు కమిటీ

అంతకుముందు పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో పన్నీర్‌సెల్వం మాట్లాడుతూ... రెండు వర్గాల విలీనంతో తనపై ఉన్న భారం తొలగిపోయిందని పేర్కొన్నారు. 'అమ్మ' ఆశయాలకు అనుగుణంగా ముందుకుసాగుతామని చెప్పారు. అనంతరం ముఖ్యమంత్రి పళనిస్వామి ప్రసంగిస్తూ...పార్టీ కార్యకలాపాలను ఇకపై మార్గదర్శక కమిటీ నిర్వహిస్తుందని చెప్పారు. ఈ కమిటీకి పన్నీర్‌సెల్వం కన్వీనర్‌గా... తాను, కేపీ మునస్వామి సహ కన్వీనర్లుగా వ్యవహరిస్తామని తెలిపారు. మొత్తం 11 మంది సభ్యుల ఈ కమిటీ మున్ముందు పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్నిక జరిగేవరకు కొనసాగుతుందని చెప్పారు. ఎన్నికల సంఘం స్తంభింపజేసిన పార్టీ గుర్తు 'రెండాకుల'ను తిరిగి సాధించుకోవడానికి తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. ప్రమాణ స్వీకారోత్సవానికి వెళ్లే ముందు పన్నీర్‌సెల్వం, పళనిస్వామి, పార్టీ ముఖ్య నాయకులు కలిసి మెరీనా తీరంలోని పార్టీ వ్యవస్థాపకుడు ఎంజీఆర్, జయలలిత సమాధుల వద్ద నివాళి అర్పించారు.

తమిళనాడు అభివృద్ధికి సహకరిస్తాం: మోదీ

తమిళనాడు ఉప ముఖ్యమంత్రి, ఆర్థికమంత్రిగా సోమవారం బాధ్యతలు చేపట్టిన ఓ.పన్నీర్‌సెల్వం, మంత్రి పాండియరాజన్‌కు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి అన్నివిధాలా సహాయసహకారాలు అందిస్తామని ముఖ్యమంత్రి పళనిస్వామి, ఉప ముఖ్యమంత్రికి ప్రధాని హామీ ఇచ్చారు. ఈ మేరకు ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

వెంకయ్యకు 26న అమరావతిలో పౌరసన్మానం

ఈనాడు, అమరావతి: ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు ఈ నెల 26న అమరావతిలో పౌరసన్మానం చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఆ రోజు ఉదయం ఉపరాష్ట్రపతి వెంకయ్య, గవర్నర్ నరసింహన్ గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో అమరావతికి వస్తారు. ఈ నేపథ్యంలో గుంటూరు జిల్లా కలెక్టర్ కోన శశిధర్ సోమవారం ఐనవోలు దగ్గర ఉన్న హెలిప్యాడ్‌ను పరిశీలించారు. ప్రొటోకాల్ ప్రకారం మూడు హెలిప్యాడ్‌లు అవసరమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం ఉపరాష్ట్రపతి తెనాలిలో నిర్వహించే పుస్తకావిష్కరణ కార్యక్రమానికి హాజరవుతారు.

ఉద్యోగినులకు 2 నెలల శిశు సంరక్షణ సెలవు

• దస్త్రంపై ముఖ్యమంత్రి సంతకం

ఈనాడు, అమరావతి: మహిళా ఉద్యోగులు తమ బిడ్డల సంరక్షణ కోసం రెండు నెలల సెలవు తీసుకునేందుకు అనుమతిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన దస్త్రంపై సోమవారం ఆయన సంతకం చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో శ్రీకాకుళంలో నిర్వహించిన ఏపీఎన్జీవోల 19వ రాష్ట్ర మహాసభకు ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఆ సందర్భంగా ఎన్జీవో నేతలు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగినుల తరహాలో రెండేళ్లపాటు శిశు సంరక్షణ సెలవు ఇవ్వాలని.. శ్రీకాకుళం, మచిలీపట్నం, చిత్తూరుల్లో పని చేస్తున్న ఉద్యోగులకు 20శాతం హెచ్‌ఆర్‌ఏ ఇవ్వాలని కోరారు. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగినులు రెండు నెలల సెలవు తీసుకునేందుకు అనుమతించారు. అలాగే ఇతర జిల్లాకేంద్రాల తరహాలోనే శ్రీకాకుళం, మచిలీపట్నం, చిత్తూరుల్లో పని చేస్తున్న ఉద్యోగులకు 20 శాతం హెచ్‌ఆర్‌ఏ ఇచ్చేందుకు అంగీకరించారు. ముఖ్యమంత్రి సానుకూల నిర్ణయంపై ఏపీ ఎన్జీవో నేతలు పి.అశోక్‌బాబు, చంద్రశేఖర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. వారిద్దరూ మాట్లాడుతూ త్వరలోనే వీటికి సంబంధించిన ఉత్తర్వులు వస్తాయన్నారు. కారుణ్య నియామకాల కోటాపై ఇటీవల ఇచ్చిన జీవోను పాత తేదీ నుంచి వర్తింపజేసేలా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్‌ను కోరామని, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

ఉపాధి నిధులు సమర్థంగా వినియోగించాలి

• శాఖల మధ్య సమన్వయం అవసరం
• నీరు-ప్రగతి టెలికాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు
• ఆర్ఎంపీ వైద్యులకు గుర్తింపునిస్తూ నిర్ణయం

ఈనాడు - అమరావతి

'ఉపాధి నిధులు రాష్ట్రానికి రాకుండా అడ్డుకోవాలని దిల్లీకి కొందరు లేఖలు రాశారు.. స్వల్పకాలంలో పనులు పూర్తి చేసి వారి లేఖలకు తిరుగులేని జవాబిచ్చాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర నిధులు సమర్థంగా వినియోగించుకోవాలని, శాఖల మధ్య సమన్వయం పెరగాలని సూచించారు. 'నీరు-ప్రగతి', వ్యవసాయం పురోగతిపై సోమవారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో రాష్ట్రంలోని ప్రాజెక్టులు, వ్యవసాయరంగ పరిస్థితిని ముఖ్యమంత్రి సమీక్షించారు. ఉపాధి నిధులు రూ.460కోట్లు ఉన్నాయని, మరో రూ.550 కోట్లు వస్తున్నాయని, వీటితో గ్రామాల్లో పనులు వేగవంతం చేయాలని సూచించారు.

పట్టిసీమ పూర్తిచేయడం మంచిదైంది

వర్షాలు కురవడం వల్ల రైతులకు కొంతమేర ఊరట లభించిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఎగువ రాష్ట్రాల నుంచి కృష్ణానదిలోకి నీటి చేరిక లేనందున సమస్య క్లిష్టమైందన్నారు. ఇలాంటి పరిస్థితి ఊహించే పట్టిసీమ పూర్తి చేశామని గుర్తు చేశారు. అదే ఇప్పుడు మంచిదైందని వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంకా 5.5శాతం వర్షపాత లోటు ఉందని తెలిపారు. రాయలసీమలో భూగర్భ జలాలు పెరగాల్సి ఉందన్నారు. అక్కడ పెద్దఎత్తున పంటకుంటల తవ్వకం, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టాలన్నారు. రాష్ట్రంలో 54వేల పంటకుంటలకు గాను 22వేల కుంటల్లో నీరు నిలిచిందని వివరించారు. ప్రతి మండలంలో నెలకు వంద ఇళ్లను నిర్మించాలని అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ఇప్పటికి 76వేల ఇళ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. ఇంకా 3.20లక్షల ఇళ్లను మంజూరు చేయాల్సి ఉందని వివరించారు. గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, అనంతపురం జిల్లాల్లో పశుగ్రాస క్షేత్రాల అభివృద్ధి ఊపందుకోవాలన్నారు. చెత్త నుంచి విద్యుత్తు తయారీ ప్లాంట్ల నిర్మాణానికి భూముల గుర్తింపు ప్రక్రియ చురుగ్గా చేపట్టాలన్నారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌లో మంచి విధానాలు ప్రోత్సహించాలని, ఆదర్శప్రాయులకు అక్టోబరు 2న అవార్డులిచ్చి సత్కరించాలని సూచించారు.

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులకు చట్టబద్ధమైన గుర్తింపునివ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయించారు. సచివాలయంలో వైద్యఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఎంపీ, పీఎంపీ సంఘాల నేతలు ముఖ్యమంత్రిని కలుసుకున్నారు. వీరితో జరిగిన సమావేశంలో గుర్తింపు ఇస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మంత్రి కామినేని మాట్లాడుతూ 40ఏళ్ల నుంచి ఈ డిమాండ్ ఉందని, ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో ఇచ్చిన హామీకి అనుగుణంగా సానుకూల నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. కమ్యూనిటీ పారామెడికల్ కోర్సులో శిక్షణ ఇచ్చి ధ్రువీకరణ ఇస్తామని వివరించారు. సమావేశంలో పాల్గొన్న ఆర్ఎంపీ, పీఎంపీ సంఘాల నేతలు ముఖ్యమంత్రికి, వైద్య శాఖ మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

నైపుణ్యాభివృద్ధికి పీఎఫ్‌సీ చేయూత

• సీఎం సమక్షంలో ఒప్పందం

ఈనాడు, అమరావతి: కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) కింద ఆంధ్రప్రదేశ్ యువతలో నైపుణ్యాభివృద్ధి పెంపొందించేందుకు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్(పీఎఫ్‌సీ) ముందుకు వచ్చింది. ఈ మేరకు సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో ఒప్పందం కుదుర్చుకుంది. గ్రామీణ యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే కార్యక్రమాన్ని ప్రభుత్వం పెద్ద ఎత్తున చేపట్టిందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. నిరుద్యోగ యువతకు భృతి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని, నైపుణ్య శిక్షణ పొందే యువతకూ భృతి ఇవ్వాలని సంకల్పించామన్నారు. ఈ ఏడాది రూ.5 కోట్లతో యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇప్పించాలని తలపెట్టామని, 2,550 మంది నిరుద్యోగులు ప్రయోజనం పొందే అవకాశముందని పీఎఫ్‌సీ డైరెక్టర్ డి.రవి ముఖ్యమంత్రికి తెలిపారు. దేశంలో మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే నైపుణ్యాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ ముందుందని, దీనిపై సీఎం ప్రత్యేక శ్రద్ధ పెట్టి యువతను ప్రోత్సహిస్తున్న తీరు తమను ఆకట్టుకున్నట్లు రవి తెలిపారు. గత సంవత్సరం రూ.178 కోట్లతో 8,300 పాఠశాలల్లో మరుగుదొడ్లు నిర్మించినట్లు తెలియజేశారు. స్వచ్ఛ భారత్ కింద అనంతపురం జిల్లాలో చేపట్టిన సామాజిక కార్యక్రమాలకు ప్రధాన మంత్రి నుంచి పురస్కారం అందుకున్నామని తెలిపారు. సమావేశంలో పీఎఫ్‌సీ ప్రతినిధులతోపాటు ఏపీఎస్ఎస్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ సత్యనారాయణ, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో ప్రొఫెసర్ గంటా సుబ్బారావు, ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి ఏవీ రాజమౌళి, తదితరులు పాల్గొన్నారు.


సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకున్న పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, ఏపీఎస్ఎస్‌డీసీ ప్రతినిధులు. చిత్రంలో పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ రవి, ఏపీఎస్ఎస్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ సత్యనారాయణ, గంటా సుబ్బారావు తదితరులు

థర్మోమీటర్ పట్టుకోవడం సైతం తెలియని దుస్థితి!

• నర్సింగ్‌లో శిక్షణ పొందిన వారిపై అధ్యయనం

దిల్లీ: మనదేశంలో శిక్షణ పొందిన నర్సుల్లో సుమారు 45 శాతం మందికి వైద్యపరమైన కీలక అవగాహన, దైనందిన సంరక్షణ కార్యకలాపాలకు సంబంధించిన విజ్ఞానం కొరవడినట్లు ఓ అధ్యయనం పేర్కొంది. ఉపాధి అంచనా వ్యవహారాలు చూసే 'అస్పైరింగ్ మైండ్స్' సంస్థ ఈ అధ్యయనాన్ని నిర్వహించింది. అంతేకాదు, శిక్షణ కార్యక్రమం ముగించుకుని ఉత్తీర్ణులైన వారిలో సుమారు 40 శాతం మంది నర్సులకు థర్మోమీటర్ వంటి మౌలికమైన వైద్య పరికరాలను ఎలా వాడాలనే అంశంపై పెద్దగా అవగాహన ఉండటం లేదని పేర్కొంది. మనదేశానికి సుమారు 2లక్షల40 వేల మంది నర్సుల అవసరం ఉందంటూ ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌వో) పేర్కొన్న విషయాన్ని 'అస్పైరింగ్ మైండ్స్' ఈ సందర్భంగా ఉటంకించింది. పక్షవాతం బాధితుడిని మంచం మీద నుంచి చక్రాలకుర్చీలోకి మార్చడానికి సంబంధించిన మౌలికమైన శిక్షణ కూడా 31-45 శాతం అభ్యర్థులకు ఉండటం లేదంటూ ఉదాహరణగా చెప్పింది. ఈ రంగంలో వాస్తవ పరిస్థితులపై మరింతగా దృష్టిసారించి... తదనుగుణమైన చర్యలను చేపట్టాల్సిన అవసరాన్ని ఈ అధ్యయనం నొక్కి చెప్పింది.

కనకదుర్గ పైవంతెన పనుల వేగం పెంచాలి

• ఆర్ అండ్ బీ ముఖ్యకార్యదర్శి ఆదేశం
• నాలుగు నెలలు ట్రాఫిక్ మళ్లింపు



ఈనాడు, అమరావతి: విజయవాడకు ప్రతిష్ఠాత్మకమైన కనకదుర్గ పైవంతెన పనుల్లో వేగం పెంచడంతోపాటు ట్రాఫిక్ మళ్లింపునకు సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే పైవంతెన పనుల్లో జాప్యం జరగడంపై ఇటీవల ముఖ్యమంత్రి అసహనం వ్యక్తం చేశారు. రహదారులు, భవనాల శాఖ ముఖ్యకార్యదర్శి సుమితాదావ్ర సోమవారం సచివాలయంలో ఇంజినీరింగ్ అధికారులతో కనకదుర్గ పైవంతెనతోపాటు కీలక ప్రాజెక్టులపై సమీక్షించారు. పైవంతెనకు సంబంధించి సాంకేతికంగా ఉన్న సమస్యలపై చర్చించారు. ఈ నిర్మాణంలో కీలకమైన స్పైన్, వింగ్ లాంటివి అమర్చేటప్పుడు తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రమాదాలకు అవకాశం ఇవ్వొద్దని ఆమె సూచించారు. వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకు ప్రాజెక్టు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని, ఇందుకు అనుగుణంగా పనుల్లో వేగం తీసుకురావాలని ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు.

రహదారుల సుందరీకరణ: జాతీయ రహదారుల వెంట పచ్చదనాన్ని పెంచి సుందరీకరించే ప్రాజెక్టుపై ఈ సందర్భంగా చర్చించారు. రాజధాని పరిధిలోని జాతీయ రహదారులపై మొక్కల పెంపకాన్ని చేపడుతున్నారు. విజయవాడ-గుంటూరు మధ్య మూడు ప్యాకేజీల్లో పనులు నడుస్తున్నాయి. విజయవాడ-మంగళగిరి మధ్య ఉన్న ప్యాకేజీ పనులు సెప్టెంబరు మాసాంతానికి పూర్తవుతాయి. వనం-మనంలో భాగంగా రహదారుల వెంట మొక్కల పెంపకంపై అటవీశాఖ, డీఆర్‌డీఏ అధికారుల సహకారం తీసుకోవాలని సూచించారు. న్యాయస్థాన భవనాల నిర్మాణ పురోగతిపై సమీక్షించారు. రూ.434.68 కోట్లతో 62 భవనాల నిర్మాణం మొదలుపెట్టారు. ఇందులో ఇప్పటివరకూ 13 పూర్తయ్యాయి. ప్రపంచబ్యాంకు రూ.2245 కోట్ల రుణసాయంతో ఎనిమిది రహదారి అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టారు. ఇందులో రెండు పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఈ ప్రాజెక్టును 2018 డిసెంబరుకల్లా పూర్తి చేయాలని నిర్ణయించారు. సమావేశంలో ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు జగన్నాథరావు, సుబ్బరాయశర్మ, సుబ్బారావు, ఆర్.మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్కళ్ ప్రమాదంలో మరో కోణం

ముజఫర్‌నగర్: ఉత్తర్‌ప్రదేశ్‌లో ఘోరమైన రైలు ప్రమాదం చోటు చేసుకోవడానికి ముందే- పట్టాల మరమ్మతుల నిమిత్తం రాకపోకల్ని కొంత సమయం నిలిపివేయాల్సిందిగా (బ్లాక్ చేయాల్సిందిగా) ఖతౌలీ స్టేషన్‌మాస్టర్ కనీసం రెండుసార్లు అడిగారా? దిల్లీలో ఉంటే కంట్రోలర్ దానికి నిరాకరించడంతో అనుమతి లేకుండానే పనులు చేపట్టారా? ప్రమాదానికి అదే కారణమయిందా? ... కొంతమంది అధికారులు వెల్లడిస్తున్న సమాచారాన్ని చూస్తే వీటికి అవుననే సమాధానమే వస్తోంది. పట్టాలపై ఎలాంటి పనులు చేపట్టాలన్నా ముందుగా డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలోని సంబంధిత విభాగ కంట్రోలర్ నుంచి అనుమతి తీసుకోవాలి. ఖతౌలీ స్టేషన్ మాస్టర్ రెండుసార్లు అనుమతి కోరినా కంట్రోలర్ నిరాకరించడం అతిపెద్ద నిర్లక్ష్యమని రైల్వే అధికారి ఒకరు పేర్కొన్నారు. రైలు ప్రమాదంపై విచారణ చేపట్టిన రైల్వే భద్రత కమిషనర్ శైలేష్‌కుమార్ పాఠక్ సోమవారం ఘటనాస్థలిని సందర్శించి, అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగానే అనుమతి నిరాకరణ గురించి అధికార వర్గాలు ఆయన దృష్టికి తీసుకువెళ్లాయి. ఘటనానంతరం అధికారులపై తీసుకున్న చర్యలు రైల్వే చరిత్రలోనే అతిపెద్దవని పాఠక్ విలేకరులకు చెప్పారు.

అవి వి'చిత్ర'పటాలు!

- భూచిత్రపటాల రేఖల్లో కానరాని కచ్చితత్వం
- ఏపీశాక్ పనుల్లో వెల్లడవుతున్న లోపాలు
- తప్పులు దిద్దుకునే బాధ్యత సర్వేయర్ల నెత్తిన
- సర్వే శాఖలో తలకు మించిన భారంగా మారిన డిజిటలీకరణ

ఈనాడు - అమరావతి



భూచిత్రపటాల (ఎఫ్ఎంబీ) డిజిటలీకరణ ప్రక్రియ ప్రహసనంగా మారింది. కేటాయించిన సొమ్ములు సరిపోలేదంటూ పనులు నిలిపేసిన సంస్థ చేసిన పనుల్లోనూ కచ్చితత్వం చూపించలేకపోయింది. వాళ్ల తప్పులతడకగా ముగించేయడంతో లోపాలను సరిదిద్దుకునే భారం ప్రస్తుతం సర్వేయర్లపై పడింది. రాష్ట్ర సర్వే శాఖలో దాదాపు 49 లక్షల ఎఫ్ఎంబీల డిజిటలీకరణ బాధ్యతను ఏపీ స్పేస్ అప్లికేషన్ సెంటర్ (ఏపీఎస్ఏసీ) తీసుకుంది. వీటిలో నాణ్యత లోపాలున్నాయని పనులు మొదలైనప్పటి నుంచే విమర్శలున్నాయి. ఇప్పటివరకు 80శాతం మేర ఎఫ్ఎంబీలు డిజిటలీకరణ అయ్యాయి. ఇందులో కచ్చితత్వం లేనివే ఎక్కువ ఉన్నాయని సర్వే శాఖ గుర్తించింది. డిజిటలీకరణ బాధ్యత తీసుకున్న ఏపీశాక్‌తోనే మరోమారు సరిదిద్దింపజేయాల్సి ఉంటుంది. కొల్లాబ్ ల్యాండ్ అనే సాఫ్ట్‌వేర్ ద్వారా డిజిటలీకరణ చేయగా, డిజిటల్ సంతకం కోసం ఆ ఎఫ్ఎంబీని భూనక్షా సాఫ్ట్‌వేర్‌లోకి తీసుకురావాల్సి వస్తోంది. ఇలా మార్చే ప్రక్రియలో సాంకేతిక లోపాలు వస్తున్నట్లు గుర్తించారు.

రేఖలు... గొలుసుల లెక్కల్లో తప్పులు: ఎఫ్ఎంబీల డిజిటలీకరణను సెప్టెంబరు నెలాఖరుకు ముగించాలని సర్వే శాఖ స్పష్టం చేసింది. అన్ని జిల్లాల్లో సంయుక్త కలెక్టర్లు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. ఇటీవల రాయలసీమలోని ఓ జిల్లాలో సంయుక్త కలెక్టర్ యాదృచ్ఛిక పరిశీలన చేయగా డిజిటలీకరణ చేసిన ఎఫ్ఎంబీల్లో లోపాలున్నట్లు గుర్తించారు. ఇదే తరహాలో ఇతర జిల్లాల్లోనూ తప్పులు దొర్లాయని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. ఆ లోపాల్లో కొన్ని ఇవి...

- ★ ఎఫ్ఎంబీలో కీలకమైన ఊహారేఖలు (జీలైన్) సక్రమంగా రాలేదు. భూచిత్రపటానికి సంబంధించిన రేఖల్లోనూ కచ్చితత్వానికి సంబంధించిన లోపాలున్నాయి.
- ★ హద్దులను సక్రమంగా గుర్తించకుండా డిజిటలీకరణ చేశారు. హద్దుల మధ్య ఉండే గొలుసు లెక్కల్లోనూ తప్పులు దొర్లాయి.
- ★ విస్తీర్ణం విషయంలోనూ తేడాలు వస్తున్నాయని తేలింది.
- ★ కొన్ని రికార్డులు గల్లంతయ్యాయని ఎఫ్ఎంబీ డిజిటలీకరణ సమయంలో చెప్పారు. అవి గల్లంతు కాలేదని, వరుసక్రమంలో చేయడంలో కొన్నింటిని వదిలిపెట్టినట్లు సర్వేయర్లు గుర్తించారు.

ఏ పని చేయాలి?: డిజిటలీకరణకు కేంద్రం నిధులు సమకూర్చింది. కేంద్ర నిబంధనల మేరకు ఒక్కో ఎఫ్ఎంబీకి రూ.33కే పనులు చేయాల్సి ఉన్నా రూ.41 చొప్పున పనులు చేసేందుకు ఏపీశాక్‌కు ఇచ్చారు. ఈ మేరకు కూడా పనులు సక్రమంగా చేయలేకపోయారు. అదనంగా మరో రూ.10 కోట్లు కావాలని ఏపీశాక్ తేల్చింది. చివరకు రూ.ఐదు కోట్లు ఇచ్చారు. లోపభూయిష్టంగా ఉన్న పనులను తిరిగి వారితో చేయించడంలో అధికారులు సఫలం కాలేకపోతున్నారని, ఆ సంస్థ నియమించుకున్న సిబ్బందికి తగిన నైపుణ్యం ఉండటం లేదని సర్వేయర్లు చెబుతున్నారు. జిల్లా కేంద్రానికి వెళ్లి డిజిటలీకరణ చేసిన ఎఫ్ఎంబీలను పరిశీలించి లోపాలు సవరింపజేసుకోవాలని వారికి సర్వే శాఖ ఆదేశాలిచ్చింది. నాణ్యత తనిఖీల్లో భాగంగా తొలి దశలో డిజిటల్ అయిన ఎఫ్ఎంబీలను పరిశీలిస్తారు. రెండో దశలో మండల సర్వేయర్లు పరిశీలించి లోపాలను సరిదిద్ది డిజిటల్ సంతకాలు చేస్తున్నారు. ఇప్పటివరకూ తొలి దశలో 50శాతం డిజిటల్ ఎఫ్ఎంబీలనే పరిశీలించారు. మండలకేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు వెళ్లి ఈ పనులు చేస్తుంటే రోజువారీ పనులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ క్రమంలో ఒకపూట రోజువారీ విధులకు, మరో పూట డిజిటలీకరణ పనుల పరిశీలనకు వెళ్లాలనే సూచనలు వచ్చాయి. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న సర్వేయర్లకు ఇందుకు అవకాశం ఉన్నా దూర ప్రాంతాలకు సాధ్యం కావడం లేదని ఉద్యోగుల వాదన. మరో వైపు సెప్టెంబరు నెలాఖరుకు పూర్తి చేయాలంటున్నారని, మరో ఆరు నెలలు కేటాయిస్తేగానీ పూర్తి కాదని చెబుతున్నారు. కొల్లాబ్ ల్యాండ్‌పై తొలి నుంచే అభ్యంతరాలున్నా అప్పటి ఉన్నతాధికారి ఈ సాఫ్ట్‌వేర్‌కే మొగ్గు చూపారు. ఇప్పుడు డిజిటల్ సంతకానికి సాంకేతికపరమైన ఇబ్బందులు వస్తున్నాయని ఉద్యోగులు తెలిపారు.

నేడు బ్యాంకు ఉద్యోగుల దేశవ్యాప్త సమ్మె

విజయవాడ, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక బ్యాంకింగ్ సంస్కరణలకు నిరసనగా యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ల పిలుపు మేరకు మంగళవారం దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నట్లు బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.అజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వరంగ బ్యాంకుల ప్రైవేటీకరణ, విలీనం, కార్పొరేట్ రుణ మాఫీ చేయడమే కాకుండా ఇటీవల ఫైనాన్షియల్ రిజల్యూషన్ డిపాజిట్ ఇన్సూరెన్స్ బిల్లు- 2017ను కేంద్ర మంత్రివర్గం ఆమోదించిందని తెలిపారు. ఈ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందితే డిపాజిట్‌దారులకు రక్షణగా ఉన్న డిపాజిట్ ఇన్సూరెన్స్, క్రెడిట్ గ్యారెంటీ రద్దవుతుందని తెలిపారు. కార్పొరేట్ సంస్థల మొండిబకాయిలతో బ్యాంకుల మనుగడకు ప్రమాదం పొంచి ఉందని, ప్రభుత్వం డిఫాల్టర్ల వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ బ్యాంకుల ప్రైవేటీకరణ, విలీనం చేపట్టవద్దని, జీఎస్టీ పేరిట సేవల రుసుం పెంపు ఉపసంహరించాలని కోరారు. బ్యాంకు పాలకమండళ్లలో డైరెక్టర్ల ఖాళీల భర్తీ, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా కారుణ్య నియామకాలు చేపట్టడం తదితర 17 డిమాండ్ల పరిష్కారానికి సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జీఎస్టీపై అధ్యయనానికి ఏడుగురు సభ్యులతో కమిటీ

ఈనాడు, అమరావతి: జీఎస్టీ అమల్లోకి వచ్చినందున పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహకాల విషయంలో కార్యాచరణపై అధ్యయనానికి ప్రభుత్వం ఏడుగురు ఉన్నతాధికారులతో కమిటీని నియమించింది. దీనికి వాణిజ్య పన్నుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధ్యక్షుడిగా, పరిశ్రమలశాఖ కార్యదర్శి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. సభ్యులుగా ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి, పరిశ్రమలశాఖ సంచాలకులు, వాణిజ్య పన్నులశాఖ కమిషనర్, ఫుడ్ ప్రాసెసింగ్ కార్యదర్శి ఉంటారు.

'రేరా' కోసం అర్హుల ఎంపికకు కమిటీ

ఈనాడు అమరావతి: స్థిరాస్తి వ్యాపార నియంత్రణ ప్రాధికార సంస్థ (రేరా) ఛైర్మన్, సభ్యుల పేర్లు ప్రభుత్వానికి సూచించేందుకు విశ్రాంత ప్రధాన కార్యదర్శి ఎస్పీ టక్కర్ ఛైర్మన్‌గా ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేస్తూ పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి కరికల్ వలవెన్ సోమవారం సవరించిన ఉత్తర్వులు జారీచేశారు.

ఆహారం, కాస్మొటిక్స్ పరిస్థితిని పసిగట్టే కొత్త స్మార్ట్ పట్టీ

న్యూయార్క్: చవకైన, తేలిగ్గా తరలించగలిగిన, కాగితం ఆధారిత 'స్మార్ట్ పట్టీ'ని శాస్త్రవేత్తలు రూపొందించారు. పాడయిన నిల్వాహారాన్ని, కాస్మొటిక్స్‌ను పసిగట్టి, ఫలితాల్ని సరళతరంగా అందజేస్తుందని చెబుతున్నారు. అమెరికాలోని క్లార్క్‌సన్ విశ్వవిద్యాలయం పరిశోధకులు అన్ని రకాల రసాయన కారకాల్ని గ్రహించగలిగే సెన్సర్‌ను కాగితంపై రూపొందించారు. ఈ కాగితాన్ని ఆహార కల్తీ, యాంటీఆక్సిడెంట్స్, ఫ్రీరాడికల్స్ వంటివాటిని గుర్తించే దిశగా విభిన్న అవసరాల్లో ఉపయోగించుకోవచ్చు. ఇదే తరహా సెన్సర్లపై ఎంతోమంది కృషిచేసినా.. తాము సుస్థిరంగా ఉండే ఆర్గానికేతర రేణువుల్ని ఉపయోగించినట్లు పరిశోధకులు సిల్వన ఆండ్రీస్కు పేర్కొన్నారు.

తరలించేందుకు తేలికగా ఉండే ఈ సెన్సర్లను మారుమూల ప్రాంతాల్లోనూ ఉపయోగించవచ్చనీ, ఉదాహరణకు అమెజాన్ వర్షారణ్యాల్లో సహజసిద్ధమైన యాంటీఆక్సిడెంట్లు గుర్తించేందుకూ తోడ్పడుతుందని వివరించారు.

రాష్ట్రంలో బౌద్ధ క్షేత్ర వలయం..

- అమరావతి సహా 5 కేంద్రాలను కలుపుతూ ప్రాజెక్ట్
- స్వదేశ్ దర్శన్ పథకం కింద రూ.60 కోట్లు కేటాయించేందుకు కేంద్రం అనుమతి



ధ్యాన బుద్ధ వనం నమూనా

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో బౌద్ధ క్షేత్ర వలయం(బుద్ధిస్ట్ సర్క్యూట్) ఏర్పాటుకు మరో అడుగు ముందుకుపడింది. దీని అభివృద్ధికి స్వదేశ్ దర్శన్ పథకం కింద రూ.60కోట్లు కేటాయించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. అమరావతి, నాగార్జునసాగర్, బావికొండ, తొట్లకొండ, దంతవరపుకోట(దంతపురి) కేంద్రాలను కలుపుతూ ఈ వలయాన్ని తీర్చిదిద్దాలని రాష్ట్ర పర్యాటక శాఖ ప్రతిపాదనలను సిద్ధం చేసింది. సోమవారం దిల్లీలో జరిగిన కేంద్ర మంజూరు, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో ఈ ప్రతిపాదనలను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతికశాఖ కార్యదర్శి ముకేష్‌కుమార్ మీనా, ఆ శాఖ సంచాలకుడు హిమాన్షు శుక్లా వివరించారు. ఈ క్రమంలో ప్రాజెక్టుకు రూ.60కోట్లు కేటాయించేందుకు కమిటీ ఆమోదముద్ర వేసింది. ఏపీలో బౌద్ధమత చారిత్రక సంపదకు కొదవలేదని, దాన్ని పూర్తిస్థాయిలో పరిరక్షించుకోవడంతోపాటు, జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులకూ పరిచయం చేయాలనే ఈ సర్క్యూట్‌ను ప్రతిపాదించినట్లు వివరించారు. చారిత్రక ఆనవాళ్లను భద్రపరచి భావితరాలకు అందించడం ద్వారా వారసత్వ సంపదను కాపాడినట్లు అవుతుందని అభిప్రాయపడ్డారు. స్వదేశ్ దర్శన్ పథకం కింద మొదట అమరావతిలో ధ్యానబుద్ధ వనం, పర్యాటక సౌకర్య కేంద్రం, సౌండ్, లైటింగ్ ప్రదర్శన, విద్యుదీకరణ, పార్కింగ్ తదితర పనులను ఇందులో చేపట్టాలని ప్రతిపాదించినట్లు కమిటీకి వివరించారు. తర్వాత తొట్లకొండ, బావికొండ, సాగర్, దంతపురి క్షేత్రాలను అభివృద్ధి చేస్తామన్నారు. మరోవైపు శాలిహుండం, బొజ్జనకొండ, లింగల కొండలను కూడా పర్యాటకులను ఆకర్షించేలా అభివృద్ధి చేయనున్నామని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలుకోసం కేంద్ర ప్రభుత్వం సోమవారం రూ.411 కోట్లు విడుదల చేసింది. ఇందులో వేతనాల కోసం రూ.257 కోట్లు, మెటీరియల్ కోసం రూ.154 కోట్లు విడుదల చేస్తూ కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది.

విశ్రాంత ఐఏఎస్ అధికారి

పీవీఆర్‌కే ప్రసాద్ అస్తమయం

- ఉపరాష్ట్రపతి, తెలుగు రాష్ట్రాల సీఎంల సంతాపం



పీవీఆర్‌కే ప్రసాద్ (పాతచిత్రం)

ఈనాడు, దిల్లీ, హైదరాబాద్, న్యూస్‌టుడే: విశ్రాంత ఐఏఎస్ అధికారి పీవీఆర్‌కే ప్రసాద్(77) (పత్తి వెంకట రామకృష్ణప్రసాద్) గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. రెండు రోజుల క్రితం ఆయనకు గుండె నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు బంజారాహిల్స్ కేర్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు ఆయనకు స్టెంట్ వేశారు. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. మాజీ ప్రధాని పి.వి.నరసింహారావుకు అదనపు కార్యదర్శిగా, మీడియా సలహాదారుగా కూడా ప్రసాద్ పనిచేశారు. తితిదే ఈవోగా తనదైన ముద్ర వేశారు. విశాఖ పోర్టు ఛైర్మన్‌గా ఆయన హయాంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్‌గా పనిచేశారు. ఖమ్మం జిల్లా కలెక్టర్‌గా, హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ ఛైర్మన్‌గా, ఉన్నత విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా బాధ్యతలు సమర్థంగా నిర్వర్తించారు. ఆయన 'అసలేం జరిగిందంటే, తిరుమల లీలామృతం, తిరుమల చరితామృతం' పుస్తకాలను రచించారు. ప్రసాద్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. చంద్రమాన పంచాంగం ప్రకారం సోమవారమే ఆయన పుట్టినరోజు కావడం గమనార్హం.

ఉపరాష్ట్రపతి సంతాపం : పీవీఆర్‌కే ప్రసాద్ మృతి పట్ల ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సంతాపం తెలిపారు. నిజాయతీ, కష్టపడేతత్వం ఉన్న పీవీఆర్‌కేకు పాలనపై అపార అనుభవం, అవగాహన, పట్టు ఉందని చెప్పారు. పీవీఆర్‌కే ప్రసాద్ మృతిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు కేసీఆర్, చంద్రబాబునాయుడు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తితిదే ఈవోగా ఎన్నో సంస్కరణలు ప్రవేశపెట్టి భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించారని చంద్రబాబు తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. పీవీఆర్‌కే మృతి విషయం తెలిసిన వెంటనే పలువురు ప్రముఖులు బంజారాహిల్స్‌లోని ఆయన నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. ఏపీ ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్, విశ్రాంత ఐఏఎస్‌లు ఐవైఆర్ కృష్ణారావు, మోహన్ కందా, జె.రాంబాబు, విశ్రాంత ఐపీఎస్‌లు ఎంవీ భాస్కర్‌రావు, రావులపాటి సీతారామారావు, ప్రెస్ అకాడమీ మాజీ ఛైర్మన్ పొత్తూరి వెంకటేశ్వరరావు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. పంజాగుట్ట శ్మశాన వాటికలో పీవీఆర్‌కే ప్రసాద్ అంత్యక్రియలు జరిగాయి.

న్యూయార్క్‌లో 'ఇండియా డే' పరేడ్

న్యూయార్క్: ఎటుచూసిన త్రివర్ణ పతాక రెపరెపలు, రహదారులపై జనాల కోలాహలం. ఉప్పొంగుతున్న దేశభక్తి ఓవైపు, భారత్ మాతాకి జై అంటూ నినాదాలు మరోవైపు. దేశం కాని దేశం అయితేనేం మేమంతా భారతీయులం, మా పండుగ స్వాతంత్ర్యదినోత్సవం అంటూ న్యూయార్క్‌లో 71వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. న్యూయార్క్, న్యూజెర్సీ, కనెక్టికట్‌కు చెందిన భారతీయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో 37వ 'ఇండియా డే' పరేడ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 'బాహుబలి' నటీనటులు రానా, తమన్నా హాజరై ప్రవాసుల్ని అలరించారు. మన్‌హట్టన్‌లోని మాడిసన్ అవెన్యూలో పలు వీధులగుండా సాగిన ఈ కవాతులో భారతీయ-అమెరికన్ చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. త్రివర్ణ పతాకాన్ని చేతబూనిన నగర మేయర్ బిల్ డి బ్లాసియో భారతీయ అమెరికన్ల విశిష్ట సేవలను శ్లాఘించారు. ఇంతమంది భారతీయ-అమెరికన్ల మధ్య స్వాతంత్ర్యదినోత్సవం జరుపుకోవడం గర్వంగా ఉందని రానా అన్నారు.



మన్‌హటన్‌లో నిర్వహించిన ఇండియా డే పరేడ్‌లో పాల్గొన్న నటీనటులు తమన్నా, రానా దగ్గుబాటి

వెనక నడవమంటే ముందుకెందుకు వెళ్లావ్!

- భార్యపై కోపంతో విడాకులిచ్చిన భర్త
- సౌదీలో ఘటన

దుబాయ్: "ఎన్నిసార్లు చెప్పాను...నా కంటే ముందు నడవద్దని. ..వినిపించుకోవేంటి..." అంటూ కోపోద్రిక్తుడైన ఓ భర్త తన భార్యకు విడాకులిచ్చేసిన విచిత్రమైన సంఘటన సౌదీలో జరిగినట్లు 'ది గల్ఫ్ న్యూస్' సోమవారం తెలిపింది. తనకంటే ఒక అడుగు వెనకగా నడవాల్సిందిగా ఎంత చెప్పినా వినిపించుకోకుండా ముందుగా అడుగులు వేసినందుకు అతడు అంతపెద్ద నిర్ణయాన్ని తీసుకున్నాడు.

మరో గృహస్తు అయితే తన స్నేహితులకు ఏర్పాటు చేసిన విందులో పద్ధతి ప్రకారం మేకతలను ముందుగా టేబుల్ వద్ద ఉంచనందుకు భార్యపై కినుక వహించాడు. అతిథులంతా వెళ్లిపోయాక ఆమెపై విరుచుకుపడ్డాడు. అత్యంత కీలకమైన ఆ చర్య చేపట్టనందుకు వాళ్లందరి ముందు తలకొట్టేసినట్లయిందంటూ భార్యపై నిప్పులు చెరిగాడు. చివరకు విడాకులిచ్చేశాడు.

ఇంకో సంఘటనలో అయితే హనీమూన్ సమయంలోనే భార్యకు విడాకులిచ్చేశాడు ఓ భర్త. ఆమె కాళ్లకు కడియాలు వేసుకోవడమే అతడి కోపానికి కారణం. కాళ్లకు ఈ కడియాలేమిటి అంటూ భార్యపై ఛర్రుమంటూ ఎగిరాడు. తర్వాత విడాకులిచ్చేశాడు.

ఇటీవలి కాలంలో చీటికిమాటికీ...చిన్నచిన్నకారణాలక్కూడా విడాకులిచ్చేయడం పెరిగిపోతోందని సౌదీ అధికారి ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. స్త్రీ, పురుషులకు పెద్దవారు ఇంటివద్దే సంసార విలువల గురించి...ఓర్పు...కుటుంబ జీవన సౌందర్యం గురించి చైతన్యపరచాలని లతీఫా హమీద్ అనే కౌన్సెలర్ పేర్కొన్నారు.

నిమ్మగడ్డి పెంచేద్దామా!

ఇంట్లో కాస్త స్థలం ఉంటే అలంకరణ మొక్కలో, పూల మొక్కలతోనో స్థలాన్ని నింపేస్తాం. అవి మాత్రమే కాదు...వంటింటికి అవసరమయ్యే కూరగాయలూ, ఆకుకూరల్నీ కూడా చక్కగా పెంచుకోవచ్చు.



ఏ పంట: ముందుగా ఏ రకం కూరగాయలు పెంచాలనుకుంటున్నారో ఓ అంచనాకు రండి. తులసి, పుదీనా, పచ్చిమిర్చీ, నిమ్మగడ్డీ, గోధుమగడ్డీ, పాలకూర వంటివి మేలు. ఎందుకంటే ఇవి తక్కువ వెలుతురులోనూ సులభంగా ఎదుగుతాయి. వీటిని నాటాలనుకున్నప్పుడు హైబ్రిడ్ విత్తనాలకు బదులుగా సహజ రకాలను ఎంచుకోవాలి. చాలా తక్కువ సమయంలోనే మొలకలు వస్తాయి. ఆ తరవాత వాటి ఎదుగుదలపై దృష్టిపెట్టండి.



కుండీలు: ఇంట్లో ఆకు కూరలూ లేదా కూరగాయల్ని పెంచుకోవాలనుకున్నప్పుడు మొదట కుండీల ఎంపికలో జాగ్రత్త తీసుకోవాలి. అవి కాస్త లోతుగా వెడల్పుగా ఉండేట్లు చూసుకోవాలి. ఇవి కొత్తవే అయి ఉండాలని లేదు. పెద్దపెద్ద నీళ్ల డబ్బాలూ, వెడల్పాటి టబ్బులూ, బకెట్... వంటివీ ఎంచుకోవచ్చు.



మట్టి: వీటిని పెంచుకోవడానికి సారవంతమైన మట్టి అవసరం. ఈ మట్టి పొడిపొడిగా ఉండేలా చూసుకోవాలి. సారవంతమైన ఎర్రమట్టిని ఎంచుకోవడం మేలు.

ఎరువులు: మట్టి సారవంతమైనది కానప్పుడు కంపోస్ట్, కోకోపీట్‌నీ కలుపుకోవాలి. మొక్కల్ని నాటుకోవడానికి ముందే కలపాలి. సేంద్రియ ఎరువుగా వంటింట్లో కూరగాయల తొక్కలూ, కాఫీ, టీపొడి వృథా వంటివన్నీ ఈ మట్టిలో వేసుకోవచ్చు. మొక్క నాటిన నెలా, పదిహేను రోజులకో వాటిని వేస్తుంటే ఆరోగ్యంగా ఎదుగుతాయి. అలానే గోమూత్రం, పేడ, నల్లబెల్లం వంటివి నీళ్లల్లో కలిపి నెలకోసారి చల్లినా మంచిదే.

వసుంధర

వినాయక చవితి వచ్చిందంటే చాలు.. పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు ఉత్సాహంగా రంగురంగుల పూలతో పాలవెల్లి కట్టి 'ఓ బొజ్జ గణపయ్యా, నీ బంటు మేమయ్యా'... అంటూ వినాయకుడిని పూజిస్తారు!. దాంతోపాటూ కుడుములూ, ఉండ్రాళ్లూ తప్పనిసరే.. అవి కాకుండా ఇంకేం చేసుకోవచ్చో కూడా ఓసారి చూద్దామా.



ఓ బొజ్జగణపయ్యా.. విందారగించయ్యా!



వాక్కాయ పులిహోర

కావల్సినవి: అన్నం - కప్పు, వాక్కాయలు - అరకప్పు, నూనె - పెద్దచెంచా, మినప్పప్పు, సెనగపప్పు, ఆవాలు - అరచెంచా చొప్పున, ఎండుమిర్చి, పచ్చిమిర్చి - మూడు చొప్పున, కరివేపాకు - రెండు రెబ్బలు, పసుపు - చిటికెడు, ఉప్పు - తగినంత.

తయారీ: వాక్కాయల మధ్య ఉండే గింజల్ని తీసేసి మిక్సీలో ముద్దలా చేసుకోవాలి. పొయ్యిమీద బాణలి పెట్టి.. నూనె వేయాలి. అది వేడయ్యాక మినప్పప్పూ, సెనగపప్పూ, ఆవాలూ, ఎండుమిర్చీ వేయాలి. అవి వేగాక పచ్చిమిర్చీ కరివేపాకు రెబ్బలూ కూడా వేయించాలి. రెండు నిమిషాలయ్యాక వాక్కాయ ముద్ద వేసి వేయించి దింపేయాలి. వేడి కాస్త తగ్గాక ఈ తాలింపును అన్నంలో పసుపూ, తగినంత ఉప్పు వేసి బాగా కలిపితే చాలు.

పెసరపప్పు బూరెలు



కావల్సినవి: బియ్యప్పిండి, మైదా - కప్పు చొప్పున, పెసరపప్పు, తెల్ల నువ్వులు - కప్పు చొప్పున, ఎండు కొబ్బరి పొడి -రెండు చెంచాలు, యాలకులపొడి - చెంచా, నీళ్లు - పావుకప్పు, ఉప్పు - పావుచెంచా, నూనె - వేయించేందుకు సరిపడా, బెల్లంతరుగు - కప్పు.

తయారీ: పొయ్యిమీద బాణలిని పెట్టి.. పెసరపప్పును వేయించుకుని తీసుకోవాలి. తరవాత తెల్ల నువ్వులు వేయించుకోవాలి. రెండు గంటల పాటు పెసరపప్పును నానబెట్టుకుని ముద్దలా చేసుకోవాలి. నువ్వుల్ని పొడిచేసుకోవాలి. గిన్నెలో బెల్లం తరుగూ, నీళ్లూ తీసుకుని పొయ్యిమీద పెట్టాలి. బెల్లం కరిగి తీగపాకం పడుతున్నప్పుడు పెసరపప్పు ముద్ద, ఎండుకొబ్బరి పొడీ, తెల్లనువ్వుల పొడి కలపాలి. ముద్దలా అవుతున్నప్పుడు యాలకుల పొడి వేసి దింపేయాలి. వేడి చల్లారాక ఈ పూర్ణాన్ని ఉండల్లా చేసుకుని పెట్టుకోవాలి. మైదా, బియ్యప్పిండీ, ఉప్పు ఓ గిన్నెలోకి తీసుకుని నీళ్లు పోసుకుంటూ దోశపిండిలా కలుపుకోవాలి. ఇందులో ఒక పెసరపప్పు ఉండను ముంచి.. కాగుతోన్న నూనెలో వేయాలి. ఎర్రగా వేగాక తీసేయాలి. ఇలాగే మిగిలినవీ చేసుకోవాలి.

బటన్ కుడుముల తాలింపు



కావల్సినవి: తాజా బియ్యప్పిండి - కప్పు(బియ్యాన్ని ముందురోజు నానబెట్టుకోవాలి. మర్నాడు బాగా ఆరనిచ్చి పిండిలా చేసుకోవాలి), పెసరపప్పు (ముందుగా నానబెట్టుకోవాలి), పచ్చి కొబ్బరి తురుము - అరకప్పు చొప్పున, జీలకర్ర, ఆవాలు - చెంచా చొప్పున, ఎండుమిర్చి - నాలుగు, కరివేపాకు రెబ్బలు - రెండు, నూనె - మూడు చెంచాలు, నీళ్లు - కప్పు, నెయ్యి - చెంచా, ఉప్పు - తగినంత.

తయారీ: ఓ గిన్నెలో రెండుకప్పుల నీళ్లు తీసుకుని పొయ్యిమీద పెట్టాలి. అందులో చిటికెడు ఉప్పూ, చెంచా నూనె వేయాలి. నీళ్లు మరుగుతున్నప్పుడు బియ్యప్పిండి వేసుకుంటూ ఉండలు కట్టకుండా కలుపుకోవాలి. ఇది ముద్దలా అయ్యాక దింపేయాలి. చేతికి నెయ్యి రాసుకుని పిండిని పొడుగ్గా చేసుకుని చిన్నచిన్న ముక్కలుగా కోసుకోవాలి. ఒక ముక్కను తీసుకుని వెడల్పుగా వచ్చేలా నొక్కాలి. ఇలా చేసుకున్న వాటిని ఆవిరిపై ఐదు నిమిషాలు ఉడికించుకుని తీసుకోవాలి. తరువాత నానబెట్టిన పెసరపప్పులోని నీళ్లు వంపేసి పచ్చికొబ్బరి తురుము వేసి మరీ మెత్తగా కాకుండా రుబ్బుకోవాలి. ఇప్పుడు బాణలిని పొయ్యిమీద పెట్టి మిగిలిన నూనె వేయాలి. అది వేడయ్యాక ఆవాలూ, జీలకర్రా, ఎండుమిర్చీ, కరివేపాకు వేయించుకోవాలి. ఈ తాలింపులో పెసరపప్పు ముద్దను వేసి రెండు నిముషాలు వేయించి, ముందుగా ఆవిరి పట్టి పెట్టుకున్న కుడుములూ, తగినంత ఉప్పు వేసి వేయించుకుని తీసుకోవాలి.

కొబ్బరి మోదక్

కావల్సినవి: పచ్చి కొబ్బరి తురుము - కప్పు, బెల్లం తురుము - కప్పు, యాలకులపొడి - చెంచా, బియ్యప్పిండి - కప్పు, నూనె - మూడు చెంచాలు, నీళ్లు - కప్పు, ఉప్పు - చిటికెడు.

తయారీ: ఓ గిన్నెలో నీళ్లు తీసుకుని పొయ్యిమీద పెట్టాలి. అవి వేడయ్యాక ఉప్పూ, నూనె వేయాలి. వెంటనే బియ్యప్పిండి వేస్తూ ఉండలు కట్టకుండా కలుపుకోవాలి. ముద్దగా అయ్యాక దింపేయాలి. ఇది చల్లారేలోగా పచ్చికొబ్బరితురుమూ, బెల్లం తురుమూ ఓ గిన్నెలో తీసుకుని సన్నని మంటపై పెట్టాలి. ఇది దగ్గరకు అవుతున్నప్పుడు యాలకులపొడి వేసి దింపేయాలి. దీన్ని చిన్నచిన్న ఉండల్లా చేసుకోవాలి. ఇప్పుడు మోదక్ అచ్చుకు కాస్త నూనె రాసి అందులో బియ్యప్పిండి ముద్దను పరిచి.. మధ్యలో కొబ్బరి పూర్ణాన్ని ఉంచాలి. అచ్చుని నొక్కితే మోదక్‌లా అవుతుంది. ఇలా మిగిలిన పిండినీ చేసుకుని అన్నింటినీ కలిపి ఇడ్లీ కుక్కర్‌లో ఉంచి పది నిమిషాలు ఆవిరిపై ఉడికించుకుని తీసుకుంటే చాలు.



ఉల్లికాడల వడలు



కావల్సినవి: సెనగపప్పు - కప్పు, మినప్పప్పు - పావుకప్పు, ఉల్లికాడల తరుగు - కప్పు, పచ్చిమిర్చి - ఆరు, జీలకర్ర - చెంచా, ఉప్పు - తగినంత, కరివేపాకు రెబ్బలు - రెండు, నూనె - వేయించేందుకు సరిపడా.

తయారీ: మినప్పప్పూ, సెనగపప్పును కలిపి రెండుగంటల ముందు నానబెట్టుకోవాలి. తరవాత మరీ మెత్తగా కాకుండా రుబ్బిపెట్టుకోవాలి. ఇందులో నూనె తప్ప మిగిలిన పదార్థాలన్నీ వేసి.. బాగా కలపాలి. ఈ పిండిని వడల్లా తట్టుకుని కాగుతోన్న నూనెలో వేసి వేయించుకుని తీసుకోవాలి.



ఎన్.అన్నపూర్ణ, తిరుపతి

ఇంట్లోనే... తీరైన ఆకృతి

వ్యాయామాలు చేయాలంటే జిమ్‌కే వెళ్లాలి. అక్కడయితే అన్ని పరికరాలు అందుబాటులో ఉంటాయి. వ్యాయామం చేయడం తేలిక అనుకుంటారు చాలా మంది. కానీ ఇంట్లోనే కొన్ని వస్తువులు పెట్టుకుంటే... జిమ్‌కే వెళ్లాల్సిన అవసరం లేదు.



రెసిస్టెంట్ బ్యాండు: కొత్తగా వ్యాయామం చేసేవారికి ఇది చక్కగా ఉపయోగపడుతుంది. దీంతో వ్యాయామం చేస్తే గాయాల పాలయ్యే అవకాశం తక్కువ. పైగా ప్రయాణాల్లో దీనిని తీసుకెళ్లడమూ తేలికే. మొదట్లో అయితే మీడియం స్ట్రెంగ్త్ ట్రైనింగ్ బ్యాండుని వాడుకోవచ్చు. అయితే దీంతో స్ట్రెచింగ్ చేయాలనుకున్నప్పుడు మాత్రం నిపుణులు ఆధ్వర్యంలో కొద్దిపాటి శిక్షణ తీసుకుంటే పూర్తి ఫలితాలు అందుకోవచ్చు.

స్టెబులిటీ బాల్: తేలిగ్గా ఉండే ఈ బంతిపై నిటారుగా ఓ పదినిమిషాల పాటూ కూర్చున్నా చాలు. ఛాతీదగ్గర నుంచి నడుము వరకూ ఉండే శరీర ఆకృతి తీరువుగా మారుతుంది. వెన్నెముకపై పడిన ఒత్తిడీ తగ్గుతుంది.



యోగా మ్యాట్: అదేంటి ఇదీ ఓ పరికరమేనా అంటారా? దీంతో కేవలం యోగా మాత్రమే కాదు... .పిలాటస్, వార్మప్ వ్యాయామాలు కూడా చేయొచ్చు. కండరాలకు గాయాలు కాకుండా చూస్తుంది. వెల్లకిలా పడుకుని వ్యాయామాలు చేసేటప్పుడు వెన్నెకు దన్నుగా ఉంటుంది.

హార్ట్‌రేట్ మానిటర్: మీరు చేసే వ్యాయామాలని ఈ పరికరంతో సమీక్షించుకోవచ్చు. రోజంతా వ్యాయామాలు చేసినా అసలు చెయ్యకపోయినా పెద్దగా ఫలితం ఉండదు. గుండె కొట్టుకునే వేగాన్ని 80 నుంచి 85 శాతం మధ్యలో ఉండేట్లు చూసుకోవాలి. ఆ శాతాన్ని తెలియజేస్తుందిది.

వాళ్లకోసం 625 పరీక్షలు రాశా...



ఓ చిన్న పుస్తకాన్ని ఇచ్చినా బోలెడంత ప్రచారం పొందాలని చూసేవాళ్లు మన చుట్టూ ఎంతో మంది.. కానీ ఏళ్ల తరబడి పుష్ప తాను చేస్తున్నది గొప్ప సేవని ఎవరు చెప్పినా ఒప్పుకోదు. ఇంతకీ పుష్ప ఏం చేస్తోందో తెలుసా... మాకూ అందరిలానే ఓ డిగ్రీ కావాలి.. అని తపనపడే దివ్యాంగులకోసం పరీక్షలు రాస్తోంది.



ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా 625 పరీక్షలు.. అదీ రకరకాల శారీరక లోపాలున్నవారికోసం రాశా. ఇదంతా ఎలా ప్రారంభమయ్యిందంటే... మాది బెంగళూరుకు దగ్గర్లోని దొడ్డబళ్లాపుర.. అయినా నాన్న ఉద్యోగరీత్యా 40 ఏళ్లుగా బెంగళూరులోనే ఉంటున్నాం. అప్పుడు నేను ఆరో తరగతి చదువుతున్నా. నాన్న కంపెనీలో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు చేతులు విరిగిపోయాయి. ఊహించని ఈ సంఘటన మా కుటుంబాన్ని మానసికంగా, ఆర్థికంగా కుంగదీసింది. కంపెనీ నాన్నకు ఇచ్చిన అరకొర పరిహారంతో ఎలాగోలా ఏడాది నెట్టుకొచ్చాం.. క్రమంగా పూట గడవటం కష్టం కావడంతో అమ్మ బాధపడేది. తప్పని పరిస్థితుల్లో అమ్మ ఓ కుటీర పరిశ్రమలో రోజుకూలీగా వెళ్లేది. అయినా నాకు ఏడో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఫీజు కట్టలేని పరిస్థితి కావడంతో పరీక్ష రాయకూడదనుకున్నా. కానీ మా క్లాసులోనే ఎవరో ఫీజు కట్టేశారు. ఫీజు ఎవరు కట్టారో... ఎందుకు కట్టారో... ఆరా తీసేంత సమయం లేదు. పరీక్షలకు సిద్ధం కావటం, రాయటం ఓ కలలా గడిచిపోయింది. తర్వాత తీరిగ్గా తెలుసుకునే ప్రయత్నం చేశా. అమ్మ నా ఫీజు గురించి బాధపడుతూ చుట్టుపక్కలవాళ్లతో చెప్పిందట. వైకల్యంతో బాధపడుతోన్న వాసు అనే వ్యక్తి.. అది విని నా ఫీజు కట్టాడట.. తాను చదవలేదు కాబట్టి చదవాలన్న ఆసక్తి ఉన్న వారికి సాయం చేయాలని అతనిలా చేశాడని తెలిసింది. కానీ అతన్ని కలవలేపోయా. ఆ బాధ నాలో ఎప్పుడూ ఉండేది. ఇప్పుడు నేను ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా చేస్తున్నా.. నేనెవరో తెలియకుండానే నాకు సాయం చేసిన ఆ అజ్ఞాత వ్యక్తికి గుర్తుగా ఏదైనా చేయాలనుకునేదాన్ని.

ఎందుకు ఒప్పుకున్నానా అనుకున్నా... నేను పని చేసే సంస్థ వారాంతాల్లో పర్యటనలు ఏర్పాటు చేసేది. అలా వెళ్లినప్పుడల్లా ఆ సమయాన్ని మరేదయినా మంచి పనికి ఉపయోగించొచ్చు కదా అనిపించేది. నెమ్మదిగా వాటిని తగ్గించుకుని నాలానే ఆలోచించే స్నేహితులతో కలిసి దివ్యాంగులకు సేవలందించే స్నేహదీప్, ప్రేమాంజలి, సమర్థనం వంటి స్వచ్ఛందసంస్థలకు వెళ్లి తోచిన సాయం చేసేదాన్ని. అలా వెళ్తున్నప్పుడే ఓ అంధ విద్యార్థి పదోతరగతి పరీక్ష రాయాలనుకుంటున్నాడనీ, అతనికి పరీక్షల్లో స్క్రైబర్‌గా పనిచేస్తారా అని అక్కడివాళ్లు అడిగారు. ఒప్పుకున్నా. మూడు గంటల సమయం. మొదటి అరగంట బాగానే సాగింది. తర్వాత నాకు ఆ విద్యార్థి ఏం చెబుతున్నాడో అర్థంకాలేదు. విసుగొచ్చేసింది. పరీక్ష చివరన మాత్రం అంధుడైన ఆ విద్యార్థి ముఖంలో ఏదో తెలియని వెలుగు కనిపించింది. ప్రపంచాన్ని చూడలేని ఆ విద్యార్థి పరీక్ష రాసి అంతలా ఆనందపడుతుంటే నేనేంటిలా? అనిపించింది. అప్పటి నుంచే అంధుల ప్రవర్తన, వారి వ్యవహార శైలిని తెలుసుకోవడం మొదలుపెట్టా. వీడియోలు, పుస్తకాలు, సినిమాలు చూశా. ఓ నెల తర్వాత నాకు నేనుగానే అంధులకు పరీక్ష రాస్తానని స్వచ్ఛంద సంస్థలకు సమాచారం అందించా. అలా 2008లో తొలి పరీక్ష రాసిన నేను ఇప్పటి వరకు 625పరీక్షలు రాశానంటే నాకే నమ్మబుద్ధి కావటం లేదు..

ఒక్కరూ ఫెయిల్ కాలేదు... కేవలం పదో తరగతి మాత్రమే కాదు.. ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంఏ, బీఏ, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్‌లతోపాటూ బ్యాంకింగ్, ఎస్ఎస్‌సీ, పబ్లిక్ సర్వీస్ కమీషన్ వంటి పోటీ పరీక్షలు రాశా. ఒకే విద్యార్థికి తొలి సెమిస్టర్ నుంచి చివరి సెమిస్టర్ వరకు పరీక్షలు రాసిన సందర్భాలూ ఉన్నాయి. ఏడేళ్లక్రితం వెంకటేష్ అనే విద్యార్థికి సంగీత పరీక్షలు రాస్తే... అతనికి స్వర్ణ పతకం, గతేడాది అర్పిత అనే విద్యార్థికి బీకాం పరీక్ష రాస్తే...డిస్టింక్షన్‌లో పాసవ్వడం నాకో జ్ఞాపకం. అయితే ఈ పరీక్షలన్నీ ఏదో మొక్కుబడిగా రాయడం కాదు. ఎవరికోసం రాస్తానో వారినీ ముందే పరీక్షల కోసం సన్నద్ధం చేస్తాను. అందుకోసం పాఠాలు రికార్డు చేసి వినిపిస్తాను. అలానే నేనూ కొంత అవగాహన తెచ్చుకుంటాను. ఆ విద్యార్థి చెప్పిన కామాలు, ఫుల్‌స్టాప్‌లను కూడా వదలకుండా రాస్తాను కాబట్టే వారి జవాబులు సాధారణ విద్యార్థులకు ఏమాత్రం తీసిపోకుండా రాయగలుగుతున్నా. అలాగని ఏదైనా ప్రశ్నకు నాకు సమాధానం తెలిసినా ఏరోజు నాకు నేనుగా జవాబు రాయలేదు. ఎందుకంటే విద్యార్థి వాస్తవ ప్రతిభకు ప్రాధాన్యం ఇవ్వాలిగా.

– కె.ముకుంద, బెంగళూరు

స్నేహితురాలి తల్లే.. బాస్ అయితే?



డా॥ కవిత గూడపాటి
ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్


? నేను ఇదివరకు ఓ సంస్థలో పనిచేస్తూ మానేశాను. అది తెలిసి నా స్నేహితురాలు ఆమె తల్లి నడుపుతున్న సంస్థలో చేరమని చెప్పింది. ఆ సంస్థకి వెళ్లాను. వాళ్లమ్మే నన్ను ఇంటర్వ్యూ చేసి కంపెనీలోకి చేర్చుకుంది. నిజానికి నా కష్టపడేతత్వం, ప్రతిభ గురించి తెలిసి ఆమే వాళ్లమ్మాయి ద్వారా నాకు చెప్పించి.. సంస్థలోకి తీసుకుందని చెప్పాలి. అంతా బాగానే ఉందికానీ.. మా బాస్‌వాళ్లమ్మాయి నాకు స్నేహితురాలు కావడం వల్లే నేనీ సంస్థలోకి 'సులువుగా' రాగలిగానని నా సహోద్యోగులు అనుకుంటారేమోనని భయంగా ఉంది. రేపు నాకు ఏ పదోన్నతి వచ్చినా, కనీసం అభినందించినా అందరూ ఇలాగే అంటారేమోనని కూడా! నిజానికి మా బాస్‌తో నాకు ముందే పరిచయముందన్న విషయం మొన్నటిదాకా ఇక్కడెవరికీ తెలియదు. ఆ మధ్య మా బాస్ రాక కోసం అందరం ఎదురు చూస్తూ ఉన్నాం. అప్పుడు నేను 'బాస్ ఎక్కడుందో చెప్పాలని వాళ్లమ్మాయికి కూడా మెసేజ్ పెట్టాను.. !' అని ఓ సహోద్యోగితో చెప్పి నాలుక్కరుచుకున్నా. ఇంకో సందర్భంలో నా క్యాబిన్‌లో స్నేహితురాళ్లతో నేను దిగిన ఫొటోలు అతికించాను. అందులో ఓ ఫొటోలో బాస్ వాళ్లమ్మాయీ ఉంది! దాన్ని అదే సహోద్యోగి చూశాడు. అతనికి తెలిస్తే.. ఇక ఆఫీసుమొత్తం తెలిసినట్టే. అప్పటి నుంచి నాకు ఆందోళనగా ఉంది! నేనిలా మాట్లాడటం, ఫొటోలు అంటించడం వంటివి బాస్‌కి తెలిస్తే ఆమె ఏమంటారోనని?! ఇకపై నేనెలా జాగ్రత్తగా ఉండాలి?

- ఓ సోదరి

ఆ రెండు సందర్భాల్లోనూ మీరు చేసింది తప్పే కానీ.. దానిపై ఎక్కువగా ఆలోచించకండి. మిమ్మల్ని మీరు తిట్టుకోకండి. మీరు ఎదుర్కొంటున్నది చాలా సున్నితమైన సమస్య. ఇలాంటివాటికి 'ఇలాగే నడుచుకోవాలి.. ఇలాగే ఉండాలి' అంటూ నిర్దిష్ట నియమాలేవీ ఉండవు. ఇవన్నీ ఏ రూల్ బుక్‌లోనూ రాయరు! పనిలోభాగంగా మనం ప్రతిదీ నేర్చుకుంటూ వెళ్లడమే. చేసిన తప్పులు మళ్లీ జరగకుండా చూసుకోవడమే. ఇకపై ఈ విషయంపై మీ తీరు ఎలా ఉండాలో చెబుతాను. మనకి ఎంతబాగా తెలిసినవారైనా సరే.. ఆఫీసులో పైఅధికారులతో తగిన దూరం పాటించి తీరాల్సిందే. వ్యక్తిగతాన్నీ, వృత్తిగతాన్ని ఇక్కడ కలిపేయకూడదు. వాళ్లతో మీకు ఎంత చనువున్నా. . ఆఫీసు బయటే వదిలేసి లోపలికి రావాలి. మీ సహోద్యోగులు వాళ్లతో ఎలా నడుచుకుంటారో మీరూ అలాగే ప్రవర్తించాలి. ఉదాహరణకి మీ బాస్ రాక ఆలస్యమైతే వాళ్లమ్మాయికి మీరు మెసేజ్ పెట్టి కనుక్కోవడానికి ప్రయత్నించారు. ఆ అవకాశం మిగతా ఉద్యోగులకి ఉండదుకదా! మీరూ వాళ్లలాగే ఉండిపోవాలి. మీకున్న ఆ అవకాశాన్ని ఏ పరిస్థితిలోనూ వాడుకోకూడదు. 'అత్యవసరమైతే..?' అంటారా? అలాంటి పరిస్థితులు ఎప్పుడూ రావనే నిజం మీకే తెలుసు..! మరో విషయం.. ఆఫీసులో బాస్‌తో ఒంటరిగా మాట్లాడే అవకాశం ఉన్నప్పుడు వాళ్లమ్మాయి ప్రస్తావన తేవద్దు. పొరబాటున కూడా 'మీ అమ్మాయి ఇలా అంటోంది ఆంటీ!' అనొద్దు! ఒకవేళ ఆమే ప్రస్తావిస్తే వీలైనంత క్లుప్తంగా సమాధానమిచ్చి వచ్చేయండి చాలు. ఇంకెవరైనా ఆమె గురించీ, వాళ్లమ్మాయి గురించీ మిమ్మల్ని అడిగినా జవాబు చెప్పకండి. దాటవేయడానికే ప్రయత్నించండి. ఒక్క మాటలో చెప్పాలంటే.. ఆమెని మీరు ఇప్పుడే మొదటి సారి ఆఫీసులో చూస్తున్నట్టు నడుచుకోవాలి. అలా నటించాలి.. తప్పదు!

-kavitha.eenadu@gmail.com

బంగారం-వెండి




21న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	------	------	29,900	30,200
ఆర్నమెంట్	------	------	27,750	28,100
వెండి (కిలో)	------	------	40,200	40,500
	ప్రొద్దుటూరు		రాజమండ్రి	
బంగారం(24క్యా)	29,830	29,900	29,500	29,510
ఆర్నమెంట్	27,710	27,730	27,580	27,590
వెండి (కిలో)	39,800	40,000	39,150	39,200
	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	29,920	29,990	-------	-------
ఆర్నమెంట్	27,530	27,590	2,758	2,759గ్రా
వెండి (కిలో)	40,500	40,500	41.90	41.90గ్రా

కాస్త షాంపూ + కాస్త కలబంద


తలస్నానం చేసేందుకు షాంపూ వాడతాం కదా.. ఈసారి అందులో ఈ పదార్థాలను కలిపి చూడండి. తలకు సంబంధించిన కొన్ని సమస్యల్ని చాలా సులువుగా అదుపులో ఉంచుకోవచ్చు.



తల దురదగా ఉందా.. మీ షాంపూలో చిన్న మూత రోజ్‌వాటర్‌ని కలిపి వాడుకుని చూడండి. మార్పు కనిపిస్తుంది.

మీరు వాడే షాంపూలో కాస్త నిమ్మరసం వేస్తే గనుక నిర్జీవంగా ఉన్న జుట్టు నిగనిగలాడుతుంది.

జుట్టుకు తేమ అంది.. ఆరోగ్యంగా కనిపించాలంటే షాంపూలో కొద్దిగా తేనె కలపాలి.



విపరీతంగా జుట్టు రాలుతోందా. కొన్ని చుక్కలు ఏదయినా అరోమా నూనెను మీ షాంపూలో కలిపి చూడండి. ఆ సమస్య అదుపులోకి రావడంతోపాటూ.. జుట్టు కూడా ఆరోగ్యంగా మారుతుంది.

కలబందను షాంపూతో కలిపి తలస్నానం చేస్తే చుండ్రు సమస్య తగ్గుతుంది.

ఉసిరి రసం వల్ల జుట్టు బలంగా తయారవుతుంది. అలాగే జుట్టు రాలే సమస్య చాలా వరకూ తగ్గుతుంది.

సెన్సెక్స్ ▼ 266	నిఫ్టీ ▼ 83	రూపాయి 64.14 ▲ (ఒక అమెరికా డాలరుకు) 01 పైసా	బంగారం 29,125 ▼ (ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత) రూ.లలో 160	వెండి 38,945 ▼ ముంబయిలో కిలో రూ.లలో 355	ముడి చమురు 51.82 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)
31259	9754				




ప్రధాన ప్రపంచ మార్కెట్లు

సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	21,685	+10
నాస్‌డాక్	6,207	−10
నిక్కీ 225 (జపాన్)	19,393	−77
స్ట్రెయిట్స్ టైమ్స్ (సింగపూర్)	3,247	−05
షాంఘై(చైనా)	3,287	+19
ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్)	7,319	−05
డాక్స్ (జర్మనీ)	12,066	−99

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం సోమవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	58.30	67.60
పౌండ్ స్టెర్లింగ్	75.05	87.05
యూరో	68.50	79.45
జపనీస్ యెన్/100	53.35	61.89
ఆస్ట్రేలియా డాలరు	46.20	53.50
సింగపూర్ డాలరు	42.77	50.68
థాయ్ బాత్/100	175.38	209.81
బహ్రెయిన్ దీనార్	157.95	180.91
కువైట్ దీనార్	175.40	218.42
సౌదీ రియాల్	15.50	18.37
యూఏఈ దిర్హమ్	15.87	18.60
మలేషియా రింగిట్	13.30	16.36
చైనీస్ యువాన్	06.79	11.03

సోమవారం నిఫ్టీ కదలికలు



ఎస్సార్ ఆయిల్ ఇక రాస్‌నెఫ్ట్‌దే

- 13 బి. డాలర్ల విక్రయం పూర్తి
- దేశంలోనే అతిపెద్ద ఎఫ్‌డీఐ ఇది

ముంబయి: ఎస్సార్ గ్రూప్ తన ప్రధాన కంపెనీ అయిన ఎస్సార్ ఆయిల్‌ను మాస్కోకు చెందిన చమురు దిగ్గజం రాస్‌నెఫ్ట్‌కు విక్రయించే ప్రక్రియను పూర్తి చేసింది. దీంతో రాస్‌నెఫ్ట్, కన్సార్షియంలోని ఇతర మదుపర్ల నుంచి కంపెనీకి 12.9 బిలియన్ డాలర్లు(దాదాపు రూ.83,850 కోట్లు) దక్కాయి. భారత్‌లోకి అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి(ఎఫ్‌డీఐ) ఇదే కావడం గమనార్హం. రష్యా నుంచి ఏ దేశానికైనా వెళ్లిన భారీ పెట్టుబడి కూడా ఇదే. అక్టోబరు 15, 2016న బ్రిక్స్ సదస్సు అనంతరం జరిగిన ఈ కొనుగోలు ఒప్పందంలో భాగంగా బ్యాంకర్లు రూ.4,000 కోట్లు పొందుతారు. ఇందులో ఎల్ఐసీకి రూ.800 కోట్లు లభిస్తుంది. రూ.45,000 కోట్లకు పైగా రుణాలిచ్చినప్పటికీ.. కొత్త యాజమాన్యంతో ప్రయాణం చేయాలని బ్యాంకర్లు నిర్ణయించుకోవడం ఇందుకు నేపథ్యం.



ముంబయిలో విలేకర్ల సమావేశంలో ఎస్సార్ ఆయిల్ కొత్త ఛైర్మన్ టోనీ ఫౌంటెన్

ఇదీ ఒప్పందం

- లావాదేవీ ప్రకారం.. ఎస్సార్ ఆయిల్‌కు చెందిన 20 మిలియన్ టన్నుల వాడినార్ రిఫైనరీ(గుజరాత్), సొంత పోర్టు(58 మిలియన్ టన్నుల సామర్థ్యం), విద్యుత్ ప్లాంటు(1010 మెగావాట్ల సామర్థ్యం), 3500కు పైగా పెట్రోలు పంపుల్లో 49.13 శాతం వాటా రాస్‌నెఫ్ట్‌కు చెందుతాయి.
- ఇక నెదర్లాండ్స్‌కు చెందిన ట్రాఫిగురా గ్రూప్, రష్యన్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ అయిన యునైటెడ్ క్యాపిటల్ పార్టనర్స్‌లకు మరో 49.13 శాతం వాటాను సమానంగా పంచుతారు. వీటి విలువ 10.9 బిలియన్ డాలర్లుగా లెక్కగట్టారు. పోర్టు, సంబంధిత ఆస్తుల విలువను 2 బిలియన్ డాలర్లుగా లెక్కవేశారు. ఎస్సార్ ఆయిల్‌లో 98.26 శాతం వాటా ఎస్సార్ ఎనర్జీ హోల్డింగ్స్, ఆయిల్ డిజ్కో మారిషస్‌దే. మిగిలిన 1.75 శాతం వాటా మైనారిటీ వాటాదార్లది. వీరు వీరి షేర్లను విక్రయించడానికి నిరాకరించారు.
- ఎస్సార్ ఆయిల్ కొత్త యాజమాన్యం పాత యాజమాన్యానికి చెందిన 5 బిలియన్ డాలర్ల(దాదాపు రూ.32,500 కోట్లు) రుణాన్ని టేకోవర్ చేసుకుంటుంది. అదే సమయంలో నాన్-కాంపీట్ ఫీజు, ఎస్సార్ బ్రాండ్‌ను ఉపయోగించుకున్నందుకు రాయల్టీని చెల్లిస్తుంది.

తిరిగి ఆ వ్యాపారంలోకి వెళ్ల కూడదు

ఎస్సార్ గ్రూప్ చమురు రంగంలోనే కొనసాగుతుంది. కంపెనీకున్న బ్రిటిష్ ఆస్తులు, అక్కడి సీబీఎమ్ గనులు ఇందుకు దోహదం చేస్తాయి. అయితే ఒప్పందం(నాన్ కాంపీట్ పాక్ట్)లో భాగంగా రుయాలు భారత్‌లో చమురు రిఫైనింగ్, రిటైలింగ్ వ్యాపారంలో ఎప్పటికీ అడుగుపెట్టకూడదని.. రిఫైనరీలను కానీ.. పెట్రోలు స్టేషన్లను కానీ నిర్మించకూడదని ఎస్సార్ ఆయిల్ కొత్త నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జొనథన్ కొలెక్ పేర్కొన్నారు. మరో పక్క, తాజా ఒప్పందం పూర్తి నేపథ్యంలో ఎస్సార్ గ్రూప్ తనకున్న మొత్తం రూ.1.05 లక్షల కోట్ల రుణంలో 67 శాతాన్ని తగ్గించుకోనుంది.

రాస్‌నెఫ్ట్‌కు ఆహ్వానం: ధర్మేంద్ర ప్రధాన్

ఈ లావాదేవీ వల్ల గ్రూప్ పోర్ట్‌ఫోలియో వృద్ధిలో ఒక సరికొత్త దశ ప్రారంభమవుతుందని ఎస్సార్ గ్రూప్ వ్యవస్థాపకుడు శశి రుయా పేర్కొన్నారు. ఎస్సార్ గ్రూప్‌కు అభినందనలు చెబుతూనే భారత్‌లోకి రాస్‌నెఫ్ట్, ట్రాఫిగురా, యూసీపీలకు చమురు మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆహ్వానం పలికారు.

ఎస్సార్ ఆయిల్ సీఈఓ రాజీనామా: ఎస్సార్ ఆయిల్‌ను రాస్‌నెఫ్ట్ కొనుగోలు చేసిన నేపథ్యంలో ఎస్సార్ ఆయిల్ సీఈఓ లలిత్ కె. గుప్తా రాజీనామా చేశారు. అయితే కొత్త యాజమాన్యంలో సీనియర్ సలహాదారుగా ఆయన ఉంటారు. గుప్తా గత ఆరేళ్లుగా సీఈఓగా సేవలందించారు. ట్రాఫిగురా ఇండియా సీఎఫ్ఓగా ఉన్న బి. ఆనంద్‌ను కొత్త సీఈఓగా నియమించారు. ఇక యూసీపీ నామినీగా టోనీ ఫౌంటెన్ ఎస్సార్ ఆయిల్ ఛైర్మన్ అవుతారు.

చిత్తూరులో ఇన్నోవేటివ్ ఫుడ్స్ ఉత్పత్తి కేంద్రం

ఈనాడు, హైదరాబాద్: శీతలీకరణ చేసిన ఆహార పదార్థాలను (ఫ్రోజెన్ ఫుడ్స్) ఉత్పత్తి చేసే ఇన్నోవేటివ్ ఫుడ్స్ తన రెండో ఉత్పత్తి కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరులో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ ఏడాది డిసెంబరు నాటికి ఈ కేంద్రం పని చేయడం ప్రారంభించనుంది. దీంతో సంస్థ ఉత్పత్తి సామర్థ్యం ఇప్పుడున్న నెలకు 300 టన్నుల సామర్థ్యం రెట్టింపు అవుతుందని సంస్థ సేల్స్, మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ సౌరభ్ కుమార్ తెలిపారు. సుమేరు బ్రాండ్ పేరుతో ఉత్పత్తులను అందించే ఈ సంస్థ సోమవారం నాలుగు కొత్త రకాల పరోటాలను విపణిలోకి విడుదల చేసింది. ఈ సందర్భంగా సౌరభ్ మాట్లాడుతూ.. ఫ్రోజెన్ ఆహార పదార్థాల మార్కెట్ గత నాలుగైదు ఏళ్లుగా స్థిరంగా వృద్ధి చెందుతోందని, ప్రస్తుతం ఈ విభాగం మార్కెట్ విలువ రూ.800 కోట్లకు పైగానే ఉందని తెలిపారు. ఈ ఆహార పదార్థాలపై ప్రజలకు అవగాహన పెరుగుతుండటంతో విక్రయాలు కూడా ఊపందుకున్నాయని, వచ్చే 4-5ఏళ్లలో మార్కెట్ విలువ రెట్టింపు అయ్యే అవకాశం ఉందన్నారు. మొత్తం విక్రయాల్లో తమ వాటా 10శాతం ఉందని, పరోటాల విభాగంలో 50 శాతం మార్కెట్ వాటా ఉందని తెలిపారు. 2017-18లో రూ.100కోట్ల అమ్మకాలు సాధిస్తామన్నారు. దేశంలో 200 పట్టణాల్లో విక్రయాలు కొనసాగుతున్నాయనీ, ద్వితీయ శ్రేణి నగరాలకు కూడా విస్తరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు వివరించారు. పౌల్ట్రీ, గ్రీన్ పీస్ సంబంధిత ఉత్పత్తులకు మంచి గిరాకీ ఉందన్నారు. కొత్త ఉత్పత్తుల్లో.. బీట్‌రూట్, పసుపు, మెంతి, మల్టీ గ్రెయిన్ పరోటాలను చెఫ్ అజయ్ చోప్రా విడుదల చేశారు.



సుమేరు బ్రాండ్ నాలుగు కొత్త రకాల పరోటాలను విడుదల చేస్తున్న చెఫ్ అజయ్ చోప్రా

మార్కెట్ కబుర్లు

- **టాటా మోటార్స్** కొత్త బ్రాండ్ చిహ్నాన్ని విడుదల చేసింది. సృజనాత్మకత ఉట్టిపడుతూ ఆధునికతకు చిహ్నంగా ఉండేలా దీన్ని తీర్చిదిద్దింది. 'కనెక్టింగ్ యాస్పిరేషన్స్' అనే ఉపశీర్షికను తగిలించారు.
- **హెచ్‌పీసీఎల్‌**లో 51.11 శాతం వాటా కొనుగోలుకు ఓఎన్‌జీసీ బోర్డు సూత్రప్రాయ అంగీకారం తెలిపింది.
- నాడీ మండల వ్యవస్థ చికిత్సలో వినియోగించే కొత్త రసాయన సమ్మేళనాలకు జపాన్ నుంచి పేటెంట్ లభించినట్లు **సువెన్ లైఫ్ సైన్సెస్** వెల్లడించింది. ఈ మేధో సంపత్తి హక్కులు 2034వరకూ అమలులో ఉంటాయి.
- రైట్స్ ఇష్యూ విధానంలో రూ.1,500 కోట్ల వరకు నిధులు సమీకరించేందుకు బోర్డు ఆమోదం తెలిపినట్లు **ఇండియన్ హోటల్స్** వెల్లడించింది.
- మార్పిడి రహిత డిబెంచర్లను జారీ చేయడం ద్వారా రూ.2,000 కోట్ల వరకు నిధులు సమీకరించేందుకు వచ్చే నెల 27న జరగనున్న సమావేశంలో వాటాదార్ల అనుమతి కోరనున్నట్లు **ఎన్‌హెచ్‌పీసీ** తెలిపింది.
- ఉదరంలోపల వచ్చే వ్యాధుల చికిత్సకు వినియోగించే డ్రాక్స్ ఎక్సామెటాజెమ్ కొత్త ఔషధానికి అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ నుంచి అనుమతులు వచ్చినట్లు **జుబిలెంట్ లైఫ్ సైన్సెస్** వెల్లడించింది.
- మార్పిడి రహిత డిబెంచర్లను జారీ చేయడం ద్వారా రూ.15,000 కోట్ల వరకు నిధులు సమీకరించేందుకు వాటాదార్ల అనుమతి కోరినట్లు ప్రభుత్వరంగ **ఎన్‌టీపీసీ** తెలిపింది.
- తొలి పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు వచ్చేందుకు సెబీ నుంచి అనుమతులు పొందినట్లు **ఇండియన్ ఎనర్జీ ఎక్ఛేంజ్** ప్రకటించింది.

అరబిందో ఎయిడ్స్ ఔషధానికి అనుమతి

ఈనాడు, హైదరాబాద్: ఎయిడ్స్ చికిత్సకు వినియోగించే జనరిక్ ఔషధాన్ని తయారు చేసి విక్రయించడానికి అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ ప్రాధికార సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) నుంచి అరబిందో ఫార్మా తాత్కాలిక అనుమతి పొందింది. అమెరికా ప్రెసిడెంట్స్ ఎమర్జెన్సీ ప్లాన్ ఫర్ ఎయిడ్స్ రిలీఫ్ (పెప్‌ఫార్) కార్యక్రమం కింద డొలుటెగ్రావిర్, లామివుడైన్ అండ్ టెనోఫోవిర్ డిసోప్రోగ్జిల్ ఫుమరేట్ (టీఎల్‌డీ) కాంబినేషన్ ఔషధం తయారీకి తాత్కాలిక అనుమతి లభించిందని అరబిందో ఫార్మా వెల్లడించింది. ఈ మూడు రకాల ఔషధాలు 50 ఎంజీ/300 ఎంజీ/300 ఎంజీ మోతాదుల్లో ఒకే ఉత్పత్తిలో ఉంటాయి. హెచ్ఐవీ-1తో బాధపడుతున్న పెద్దలు, చిన్న పిల్లలకు ఇచ్చే సమగ్ర చికిత్సలో భాగంగా దీన్ని వినియోగిస్తారు.

రాయితీలతోనే విద్యుత్తు వాహనాల సవారీ

- లేకపోతే 2032కు లక్ష్యం అసాధ్యం: యూబీఎస్

దిల్లీ: 2032 కల్లా దేశంలో వాహనాలన్నీ విద్యుత్తుతో నడిచేవే అయి ఉండాలనే లక్ష్యాన్ని చేరడం భారత్‌కు తీవ్ర సవాలేనని అంతర్జాతీయ ఆర్థిక సేవల సంస్థ యూబీఎస్ తన అధ్యయన పత్రంలో పేర్కొంది. ఈ విభాగం అభివృద్ధి చెందాలంటే, తయారీదార్లు, వినియోగదార్లకు ప్రభుత్వం అధికంగా రాయితీలు ఇవ్వాల్సి ఉంటుందని వివరించింది. అయితే ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వం అలా చేయలేదని పేర్కొంది. బ్యాటరీల ధరలు బాగా తగ్గుతున్నా, ఒకసారి ఛార్జింగ్ చేస్తే, ఎక్కువదూరం ప్రయాణించే వాహనాల తయారీ అత్యధిక ఖర్చుతోనే ఉంటోందని, వాటిని కొనుగోలు చేసుకోవాలంటే ప్రభుత్వ రాయితీలతోనే సాధ్యమవుతుందని తేల్చి చెప్పింది. నివేదిక ముఖ్యాంశాలివీ..

- భారత్‌లో మధ్యశ్రేణి కారు ధర 10,000 డాలర్లు (సుమారు రూ.6.5 లక్షలు-ఎక్స్‌షోరూం) ఉందని, 2025లోనూ దాదాపు ఈ స్థాయిలోనే ఉండొచ్చని యూబీఎస్ అంచనా వేసింది. అదే ఎలక్ట్రిక్ వాహనాల కొస్తే 190 కిలోమీటర్లు ప్రయాణించే కారు ధర 16,000 డాలర్లు (సుమారు రూ.10.40 లక్షలు) 380 కి.మీ. ప్రయాణించే కరు ధర 21,500 డాలర్లు (సుమారు రూ.14 లక్షలు) ఉండొచ్చని అంచనా వేసింది. కిలోవాట్ అవర్ బ్యాటరీ ధర 2025కు 130 డాలర్లుగా ఉండొచ్చని అంచనాలు వెలువరించింది.

హైబ్రిడ్ వాహనాలకు ప్రోత్సాహకాలివ్వాలి

ఆర్థిక పరిస్థితికి అనుగుణంగా, హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వాహనాల మనుగడకు తోడ్పడేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇవ్వాలని యూబీఎస్ సూచించింది. ఇవి చిన్న బ్యాటరీలు వాడతాయి కనుక, ఛార్జింగ్ సులభంగా చేసుకోవచ్చని, క్రమంగా వీటి వాడకం పెరిగితే, అధిక సామర్థ్యం బ్యాటరీలను వినియోగించే వాహనాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు మెరుగు పడతాయని వివరించింది.

జీఎస్‌టీ ప్రభావంతో..
16% తగ్గిన కంపెనీల లాభం

- ఏప్రిల్-జూన్‌లో రూ.87,475 కోట్లకు పరిమితం
- 8.7 శాతం తగ్గిన విక్రయాలు: కేర్ రేటింగ్స్ నివేదిక

ముంబయి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో దేశీయ కంపెనీల లాభం 15.7 శాతం తగ్గి రూ.87,475 కోట్లకు చేరిందిన ఒక నివేదిక అంచనా వేసింది. 2016-17 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీల నికర లాభం రూ.1.04 లక్షల కోట్లుగా నమోదైంది. వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) అమల్లోకి రాకముందు కంపెనీలు తమ వద్ద ఉన్న సరకును వదిలించుకోవడానికి మొగ్గు చూపడమే ఇందుకు కారణమని రుణ రేటింగ్ ఏజెన్సీ కేర్ రేటింగ్స్ అభిప్రాయపడింది. 2108 కంపెనీల ఆర్థిక వివరాలను విశ్లేషించినట్లు తెలిపింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలంలో కంపెనీల నికర విక్రయాలు 8.7 శాతం తగ్గాయి. ఇక ఏడాది క్రితం ఇదే సమయంలో కంపెనీలు తమ విక్రయాల్లో 9.5 శాతం వృద్ధి నమోదు చేయడం గమనార్హం. జీఎస్‌టీ అమలు నేపథ్యంలో అన్ని కంపెనీలు ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో అనిశ్చితి పరిస్థితులు ఎదుర్కొన్నాయని, ఎక్కువ శాతం కంపెనీలు తమ సరకును వదిలించుకోవాలని చూడటంతో వాటి కార్యకలాపాలపై ప్రభావం పడిందని కేర్ రేటింగ్స్ వెల్లడించింది.

జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ఏడు కంపెనీలు నికర నష్టాన్ని నమోదు చేయగా.. వార్షిక ప్రాతిపదికన చూస్తే 33 విభాగాలు నికర లాభంలో తక్కువ వృద్ధి సాధించాయని నివేదిక స్పష్టం చేసింది. మన్నికైన వినిమయ వస్తువులు, వాహన, అనుబంధ విభాగాలు, నిర్మాణం- స్థిరాస్తి, ఫైనాన్స్, రిఫైనరీలు, పేపర్, పేపర్ ఉత్పత్తులు, క్రిమి సంహారకాలు, వ్యవసాయ రసాయనాల రంగాలు ఎక్కువ క్షీణతను చవిచూశాయని కేర్ రేటింగ్స్ తెలిపింది. ఆతిథ్యం, రిటైలింగ్ వంటి సేవా రంగాల లాభదాయకతపై సైతం జీఎస్‌టీ ప్రభావం పడిందని వెల్లడించింది.

కొనసాగిన ఇన్ఫీ కుదుపు

- మరో 5% పడిన షేరు
- 9800 దిగువకు నిఫ్టీ

ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ నష్టాలు కొనసాగాయి. సీఈఓ విశాల్ సిక్కా రాజీనామా కుదుపు నుంచి తేరుకోలేకపోయింది. కంపెనీ రూ.13,000 కోట్ల విలువైన భారీ షేర్ల బైబ్యాక్‌ను ప్రకటించినా.. మదుపర్లు అమ్మకాలకే మొగ్గుచూపారు. ఇంట్రాడేలో 5.75 శాతం కోల్పోయిన షేరు రూ.870 వద్ద 52 వారాల కనిష్ఠానికి చేరింది. చివరకు 5.37 శాతం నష్టంతో రూ.873.50 వద్ద ముగిసింది. గత రెండు సెషన్లలో కంపెనీ మార్కెట్ విలువ రూ.33,911.93 కోట్లు తగ్గి రూ.2,00,640.07 కోట్లకు చేరింది.

ఇక ఇన్ఫీ ప్రభావంతో వరుసగా రెండో రోజూ సూచీలు నష్టాలు చవిచూశాయి. విదేశీ మదుపర్లు స్థిరంగా అమ్మకాలు కొనసాగించడం సైతం ఇందుకు తోడైంది. అంతర్జాతీయ మార్కెట్ల బలహీనతలు సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగియగా, ఐరోపా షేర్లు నష్టాల్లో ట్రేడయ్యాయి.

సమీక్ష

ఆరంభ లాభాలు పోయే..: సెన్సెక్స్ ఉదయం 31609.93 పాయింట్ల వద్ద లాభాల్లోనే ప్రారంభమైంది. మదుపర్లు స్థిరంగా అమ్మకాలు కొనసాగించడంతో నష్టాల్లోకి జారుకున్న సూచీ.. ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. ఒకానొకదశలో 31,220.53 పాయింట్ల వద్ద కనిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. చివరకు 265.83 పాయింట్లు కోల్పోయి 31,258.85 దగ్గర స్థిరపడింది. ఇక నిఫ్టీ సైతం 83.05 పాయింట్ల నష్టంతో 9,754.35 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 24 డీలాపడ్డాయి. అదానీ పోర్ట్స్ 2.74%, డాక్టర్ రెడ్డీస్ 2.51%, సన్ ఫార్మా 2.01%, ఓఎన్‌జీసీ 1.99% చొప్పున నష్టపోయాయి. మరోవైపు యాక్సిస్ బ్యాంక్ 0.70 శాతం పెరగ్గా.. టీసీఎస్ 0.34%, ఎం అండ్ ఎం 0.27%లు రాణించిన వాటిలో ఉన్నాయి. సూచీల వారీగా చూస్తే.. ఐటీ సూచీ 2.04% కుదేలైంది. టెక్నాలజీ, పీఎస్‌యూ, ఆరోగ్య సంరక్షణ రంగాలు సైతం అదే బాటలో నడిచాయి. బీఎస్ఈలో 1715 షేర్లు నష్టపోగా, 876 స్క్రిప్‌లు లాభపడ్డాయి.

నేటి మార్కెట్

నేడు సూచీలు బలహీనంగా ప్రారంభం కావొచ్చు. ఇన్ఫోసిస్ షేర్ల నష్టాలు కొనసాగే అవకాశం ఉండటంతో మదుపర్ల సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం పడొచ్చని డీలర్లు అంచనా వేస్తున్నారు. మదుపర్లను మెప్పించే వార్తలేవీ లేవని, ఫలితంగా నిఫ్టీ 9650 పాయింట్లను పరీక్షించే అవకాశం కనిపిస్తోందని బ్రోకరేజీ సంస్థలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఇన్ఫోసిస్ ప్రతిష్ఠ, కార్యనిర్వాహక వర్గం కొనసాగింపు, వ్యవస్థాపకులు, బోర్డు సభ్యుల మధ్య విబేధాలు వంటి విషయాల్లో మదుపర్లు ఆందోళన చెందుతున్నారని విశ్లేషకులు అంటున్నారు. దీని వల్లే కంపెనీ షేర్ల బైబ్యాక్ మార్కెట్లను మెప్పించడంలో విఫలమైందని విశ్లేషిస్తున్నారు. నిఫ్టీ 9650-9890 పాయింట్ల శ్రేణిలో కదలాడొచ్చని అంచనా.

కోడిగుడ్లు — 21వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)



హైదరాబాద్	355	విశాఖపట్నం	362
చిల్లరగా(ఒక గుడ్డు)	4.15	వరంగల్	357
బెంగళూరు	382	చిత్తూరు	390
22న		చెన్నై	397
విజయవాడ/గోదావరి	359	నమక్కల్	387

ఎన్ఎస్ఈ

సోమవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ACC 1792.60 (1794.30) 326985
ADANI PORT & 375.95 (386.20) 1999552
AMBUJA CEMEN 274.40 (274.95) 1420376
ASIAN PAINTS 1134.45 (1140.00) 456594
AUROBIND PHA 696.10 (704.75) 1463279
AXIS BANK LT 494.80 (490.40) 17884400
BAJAJ AUTO L 2766.50 (2811.35) 77884
BANK OFBAROD 142.10 (147.20) 11173367
BHARTI AIRTE 419.15 (421.00) 1870782
BHARTI INFRA 386.60 (395.30) 1956668
BOSCH LTD 21969.50 (22034.00) 9562
BPCL 497.75 (503.30) 4359678
CIPLA 561.75 (565.30) 1222907
COAL INDIA L 238.45 (243.35) 6555861
DR. REDDYS 1931.10 (1982.00) 418295
EICHER MOTOR 31634.25 (31511.45) 44213
GAIL 374.20 (381.25) 3318044
HCL TECH 874.05 (876.25) 669837
HDFC 1738.15 (1735.05) 1685595
HDFC BANK 1743.20 (1752.15) 1002431
HERO MOTOCOR 3972.05 (3986.70) 246195
HINDALCO IND 224.90 (230.05) 7018024
HINDUSTAN UN 1191.45 (1202.20) 965962
ICICI BANK 293.50 (293.15) 10623264
INDIABULLS H 1198.70 (1202.40) 673167
INDIAN OIL 413.20 (427.35) 5343565
INDUSINDBANK 1616.10 (1621.05) 484815
INFOSYS LTD 873.40 (923.25) 45203588
ITC 281.60 (281.85) 13088154
KOTAK MAHIND 969.55 (983.55) 845249
LARSEN & TOU 1127.10 (1130.60) 1651344
LUPIN 923.40 (938.35) 1160593
M&M 1378.65 (1370.00) 702542
MARUTI SUZIK 7501.90 (7598.80) 277519
NTPC LTD 172.00 (173.40) 4131886
ONGC 157.15 (160.90) 11137965
POWER GRID C 220.30 (222.95) 2926811
RELIANCE IND 1564.40 (1575.40) 1731188
SBI 274.65 (278.70) 9247153
SUN PHARMA 460.55 (470.15) 4215469
TATA CONSULT 2528.80 (2513.80) 1152417
TATA MOT DVR 222.85 (226.95) 757639
TATA MOTORS 374.35 (380.40) 5123101
TATA POWER 80.20 (80.30) 2749000
TATA STEEL L 621.55 (625.65) 4175647
TECH MAHINDR 431.10 (428.85) 2657468
ULTRATECH 4007.90 (4014.35) 170312
VEDANTA LIMI 293.80 (298.40) 8748518
WIPRO 287.70 (288.10) 2855010
YES BANK LTD 1716.70 (1720.75) 1432922
ZEE ENTERTAI 509.30 (511.60) 2214978

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1356.10 (1372.50) 35376
ASHOK LEYLAN 102.25 (103.65) 5274904
BAJAJ FINANC 1690.60 (1704.95) 1090057
BAJAJ FINSER 5216.85 (5309.50) 164539
BEL 179.10 (182.50) 5962952
BHEL 124.60 (129.90) 5148814
BRITANNIA 4229.80 (4251.45) 96344
CADILA HEALT 473.25 (473.40) 1141690
COLGATE PALM 1080.45 (1074.20) 278475
CONTAINER 1221.95 (1254.15) 775918
CUMMINS INDI 881.50 (899.00) 137990
DABUR INDIA 304.25 (310.05) 575264
DIVIS LAB 622.15 (635.20) 310755
DLF LIMITED 180.40 (183.45) 7554907
EMAMI LIMITE 1110.05 (1101.65) 47669
GLAXOSMI CON 5382.20 (5357.00) 2161
GLAXOSMI PHA 2385.50 (2395.80) 5204
GLENMARK PHA 595.80 (610.90) 661451
GODREJ CONSU 903.60 (918.40) 307145
HAVELLS INDI 474.45 (478.25) 671549
HINDUSTAN ZI 290.90 (294.50) 1493473
HPCL 433.80 (442.40) 4348880
ICICI PRU LI 420.15 (427.25) 1023989
IDEA CELLULR 89.25 (90.30) 4120928
INTERGLOBE A 1270.80 (1269.50) 470732
JSW STEEL LT 233.70 (237.05) 3182064
LIC HOUS.FIN 648.40 (658.10) 796523
MARICO LIMIT 317.85 (319.90) 947075
MCDOWELL 2532.60 (2601.90) 223696
MOTHERSON 320.40 (325.50) 2479407
NHPC LTD 29.85 (30.15) 1551574
NMDC LTD 121.25 (120.75) 5583348
OIL INDIA 272.70 (286.45) 843293
ORACLE FIN S 3417.85 (3432.50) 11262
P&G HYG&HEAL 8179.15 (8228.65) 861
PETRONET LNG 228.90 (228.55) 3858819
PIDILITE IND 816.50 (821.55) 555230
PIRAMAL ENTE 2617.00 (2695.00) 128862
PNB 137.60 (142.15) 9064019
POWER FIN CO 118.50 (123.10) 6041053
RURAL ELEC C 161.30 (166.90) 5626573
SAIL 59.45 (59.70) 6574776
SHREE CEMENT 17128.80 (17347.95) 7609
SHRIRAM TRAN 959.55 (972.35) 525352
SIEMENS 1280.70 (1308.75) 81288
SUN TV LTD 719.25 (742.40) 1144055
TITAN IND 615.50 (623.50) 1009586
TORRENT PHAR 1249.10 (1270.65) 156779
UNITED BREWE 803.25 (802.40) 105028
UPL LIMITED 810.75 (844.95) 1405283

ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 176.45 (177.10) 1534933
ADANI ENTERP 107.50 (112.25) 2773290
ADANI POWER 27.90 (28.80) 7101688
ALL BANK 64.20 (66.15) 1998616
AMARA RAJA 759.75 (796.55) 810424
ANANT RAJIND 55.75 (54.90) 1418218
ANDHRA BANK 49.80 (50.90) 1691516
APOLLO HOSPI 1051.30 (1068.25) 629596
APOLLO TYRES 268.90 (270.15) 2921377
APTECH 228.45 (229.30) 1503303
BAJAJ ELECT. 327.55 (329.60) 117727
BAJAJ HIND 14.55 (14.80) 2608212
BAJAJ HOLDIN 2622.00 (2636.35) 12748
BALAJI TELE 157.95 (157.55) 571112
BALLARPUR IN 14.05 (14.20) 434781
BALRAMPUR CH 165.55 (166.95) 959538
BANK OF MAHA 26.95 (26.75) 111131
BANK OFINDIA 139.50 (143.35) 3331293
BATA INDIA 669.40 (679.65) 821531
BGR ENERGY S 129.05 (131.35) 41110
BHARAT FORGE 1135.85 (1169.95) 853355
BHUSHAN STEE 68.20 (68.40) 499680
BIOCON LTD 327.35 (328.95) 1651928
BOMBAY DYE 75.85 (77.85) 631357
CANARA BANK 326.75 (332.70) 1425228
CEAT LIMITED 1675.65 (1704.20) 532482
CENTRAL BANK 73.85 (74.45) 672531
CHAMBAL FERT 140.15 (140.30) 566833
CHENNAI PETR 402.00 (398.75) 3153018
CITY UNIBANK 155.60 (154.10) 234873
CORPO BANK 45.15 (45.55) 130792
COX & KINGS 265.10 (273.40) 113913
D B REALTY L 36.10 (36.70) 314388
DELTA CORP L 171.30 (169.90) 5246824
DENA BANK 30.95 (31.45) 391904
DHANALAKBANK 33.95 (34.40) 382382
EDELWEISS CA 245.00 (252.25) 1663679
EDUCOMP SOLU 8.00 (8.15) 95165
EID PARRY 323.90 (324.85) 149119
EIH 138.15 (135.20) 96235
ESSAR SHIPPI 29.00 (25.65) 2096425
ESTER INDUST 32.75 (32.35) 13002
EXIDE INDUST 201.35 (208.95) 1268006
FEDERAL BANK 106.00 (108.55) 3826756
FINOLEX CABL 530.30 (524.90) 122636
G E SHIP LTD 390.55 (385.85) 44246
GAMMON INDIA 8.55 (8.70) 256954
GAMMON INFRA 3.95 (4.00) 887128
GATI LIMITED 108.05 (109.90) 234229
GAYATRI PROJ 161.05 (162.40) 26390
GITANJALIGEM 61.15 (61.50) 380259
GMR INFRASTR 17.50 (18.25) 25971372
GODREJ IND 582.90 (598.00) 258981
GRASIM IND 1111.45 (1098.05) 1297494
GUJ ALK&CHEM 410.60 (404.40) 142297
HCL INFOSYS 42.90 (43.70) 588734
HEXA TECH 265.65 (273.75) 805392
HIMACHAL FUT 15.85 (16.45) 2024136
HINDU MOTORS 8.00 (7.90) 245298
HOUSING DEV 58.20 (59.70) 14743927
IDBI 54.10 (54.30) 3102663
IDFC 54.30 (55.85) 3575892
IFCI 22.90 (23.10) 3243336
IL&FS TRANS 78.20 (78.00) 146610
IND SWIFTLAB 33.20 (33.85) 12248
INDBULLS REL 222.50 (229.55) 7266341
INDIA CEM 177.65 (182.75) 3134657
INDIAN BANK 296.90 (304.10) 446851
INDO RAMA SY 26.70 (27.45) 49687
INDRAPRASTHA 1256.25 (1277.50) 513825
IND-SWIFTLTD 7.85 (8.15) 10283
INGERSOLL-R 790.50 (805.45) 6785
IOB 22.55 (22.60) 396215
IPCA LAB 409.70 (416.65) 597583
IRB INFRA DE 206.45 (213.40) 878187
J&K BANK 80.85 (81.80) 402382
JAI CORP 78.25 (81.50) 712168
JAIN IRRIGAT 95.90 (98.05) 2362991
JAYPEE INFRA 15.45 (16.25) 1980680
JAYSHREE TEA 99.90 (102.15) 57047
JET AIRWAYS 559.85 (580.25) 1699952
JINDAL SAW 90.75 (92.35) 586502
JINDAL STEEL 131.70 (136.30) 6302704
JK LAKSHMI C 413.30 (416.85) 28643
JK PAPER LIM 93.15 (93.50) 317943
JM FINANCIAL 121.25 (125.70) 809247
JP ASSOCIATS 21.85 (22.80) 66434486
JSW ENERGY L 62.80 (63.95) 6686128
JUBILANT FOO 1383.60 (1394.55) 1008859
JUBILANT ORG 697.20 (703.40) 369093
JYOTHY LABS 375.60 (375.15) 9624
KARNATA BANK 141.80 (146.30) 1355371
KEC INTL LTD 297.45 (294.65) 353354
KOLTE PATIL 164.40 (165.50) 66677
KPIT CUMMINS 110.90 (113.45) 509341
L&TFIN.HOLD 171.90 (175.80) 3005800
LAK VIL BANK 177.80 (178.70) 524279
M & M FINANC 403.95 (415.55) 1982255
MANAPPURAM G 94.60 (84.80) 65453622
MMTC LIMITED 55.75 (56.30) 430175
MOSER-BEAR 4.75 (4.55) 696544
MPHASIS LTD 592.30 (591.15) 18667
MRPL 123.40 (124.55) 3661159
MTNL 17.70 (18.10) 479898
NCC LIMITED 85.05 (87.15) 2141119
NETWORK18 FI 50.35 (51.55) 229697
NEULAND LAB 1252.15 (1271.95) 1279
NIIT LTD 89.00 (90.45) 285366
NIIT TECHNOL 483.55 (496.65) 95434
OMAXE LTD 201.15 (201.35) 673166
ONMOBILE GLO 57.60 (58.15) 109183
ORIENT PAPER 95.30 (96.40) 75360
ORIENTALBANK 120.00 (123.10) 1897327
PARSVNATH DE 20.70 (22.35) 386952
PATEL ENGG 69.35 (71.60) 143718
PFIZER 1779.70 (1793.20) 30937
POLARIS SOFT 239.95 (240.25) 60500
POWERTRADING 111.00 (113.95) 1288173
PRAJ IND 67.50 (68.50) 301770
PRISM CEMENT 111.30 (112.25) 32477
PROVOGUE (IN 4.05 (4.15) 96510
PUNJ LLOYD 19.00 (19.45) 834791
PUNJAB & SIN 47.90 (49.00) 93949
PURAVANKARA 72.55 (71.60) 120666
PVP VENTURES 4.75 (4.85) 59134
PVR LIMITED 1280.65 (1321.75) 160371
RADICO KHAIT 160.90 (166.55) 406685
RAJ OIL MILL 1.30 (1.30) 36378
RAJESH EXPOR 720.35 (719.45) 865947
RALLIS INDIA 228.35 (228.80) 81028
RAMCO IND 230.45 (227.50) 131580
RAMCO SYS 342.25 (345.85) 31511
RAMKY INFRA 81.75 (81.60) 149996
RAYMOND 744.90 (774.35) 476078
RELIANCE CAP 775.45 (783.55) 3189830
RELIANCE COM 23.40 (24.15) 16564924
RELIANCE INF 468.70 (487.80) 1862840
RELIANCE POW 39.25 (40.35) 2423704
ROLTA INDIA 53.15 (53.75) 295536
SAGAR CEMENT 818.75 (807.40) 923
SAREGAMA 394.75 (394.25) 101272
SHANTHI GEAR 130.75 (131.05) 19710
SHIPPNG CORP 89.50 (90.75) 1449523
SHREE RENUKA 16.90 (16.90) 1716090
SINTEX IND 31.50 (33.30) 20723316
SOBHA DEVELO 392.30 (386.30) 133174
SOUTHINDBANK 26.95 (27.90) 9900969
STERLITE TEC 215.50 (223.55) 787748
SUJANA METAL 1.60 (1.65) 118343
SUN PHARMA 406.20 (398.65) 1365966
SUND FASTNER 388.95 (390.50) 85849
SUZLON ENERG 16.15 (16.95) 39983196
SYND. BANK 63.00 (64.25) 1128989
TATA CHEM 586.50 (592.70) 422721
TATA COFFEE 137.35 (135.10) 1407541
TATA COMMUN 631.00 (641.95) 341724
TATA GLOBAL 196.15 (194.40) 15744338
TATA METALIK 638.00 (650.80) 84233
TATA TELESER 6.65 (6.90) 1610421
THE INDIAN H 119.90 (123.95) 316935
TORRENT POWE 211.60 (214.10) 1373741
TRIVENI ENGG 90.65 (91.60) 982570
TTK PRESTIGE 6351.50 (6160.80) 10301
TV TODAY NET 244.45 (240.05) 80310
TV18 BROADCA 35.90 (36.40) 2093821
TVS MOTOR 574.35 (584.60) 684100
UCO BANK 30.15 (30.90) 409229
UNION BANK 131.00 (132.05) 3517270
UNITECH 7.50 (7.55) 26628243
UNITED BANK 17.95 (18.20) 324218
USHA MARTIN 19.30 (18.95) 852702
VADILAL INDU 860.00 (853.80) 35272
VENKYS 2007.05 (2063.80) 85949
V-GUARD IND 177.55 (179.80) 353182
VIJAYA BANK 62.90 (64.60) 752177
VIP 206.10 (195.05) 2604093
VOLTAS 532.60 (537.70) 686697
ZEE LEARN LI 41.85 (42.60) 171645
ZUARI GLOBAL 116.10 (116.50) 1422
ZYDUS WELLNE 860.85 (861.45) 2852

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

AISHWARYA TE 4.29 (4.10) 13629
ALPHAGEO 767.75 (788.05) 4152
AMAR RAJA BA 759.95 (796.50) 54697
ANDHRA BANK 49.85 (50.80) 134974
ANDHRA PAPER 296.70 (294.25) 1469
ANDHRA PETRO 28.85 (27.05) 128502
ANDHRA SUGAR 341.85 (324.60) 9720
ANJANI PORTL 210.10 (206.25) 5225
ASTRA MICROW 122.10 (122.80) 8438
AUROBINDO PH 695.50 (704.50) 191633
AVANTEL SOFT 238.75 (217.20) 4729
AVANTI FEEDS 1929.95 (1922.15) 19112
BALAJI AMIN 313.95 (314.25) 1819
BARTRONICS 14.15 (14.05) 31522
BHAGIRA CHEM 191.15 (199.35) 7509
BHAGYA NAG 21.60 (23.10) 9880
BRILLIANT SE 7.60 (7.59) 134050
CAMBRIDGE TE 72.10 (70.70) 6207
CONT COFFEE 275.80 (276.15) 393
COROMAN FERT 437 (444.70) 12009
CYIENT LIMIT 508.45 (510.70) 1125
DIVI'S LAB 622.45 (634.10) 32825
DIVYA GRANIT 97.20 (100.90) 1347
DR REDDY 1933.15 (1982.90) 452887
FOUR SOFT 101.50 (85.35) 7119
GATI CORPN 107.60 (109.20) 66090
GMR INFRASTR 17.50 (18.30) 1926862
GOLDST INFRA 136.85 (130.35) 159323
GOLDSTONE EN 12.05 (12.05) 13626
GRANULES (I) 126 (126.75) 135654
GVK POWER 12.77 (13.48) 2340503
HBL NIFE POW 44.70 (44.50) 32358
HERITAGE FOO 1290.45 (1302.30) 894
HYD INDUS 1118.65 (1155.45) 1156
ILFS ENGINEE 41.70 (41.75) 11701
INNAREDY COM 2.61 (2.69) 5793
IVRCL INFRAS 4.96 (5.09) 130925
KAKATIYA CEM 340.20 (342.35) 10165
KALLAM SPG 34.90 (33.50) 609980
KAVERI SEED 542.15 (560.80) 96305
KNR CONSTRUC 218.60 (218.40) 6237
LANCO INDUS 363 (364.20) 4632
LANCO INFRAT 0.90 (0.94) 2811719
LAURUS LABS 526.35 (536.40) 10765
MADHUCON PRO 29.20 (29.50) 10165
MIC ELECTRON 7.92 (7.91) 48185
MOLD-TEK.TEC 49.80 (49.35) 7312
MOLDTK PLA 297.85 (292.10) 150812
NAGARJAGRICH 35.30 (35.90) 40448
NATCO PHARMA 723.70 (752.80) 32100
NAVA BH VENT 124.15 (127.60) 15613
NCC 85.20 (87.30) 276740
NCL IND 235.60 (221.30) 223665
NEHA INTER 5.04 (4.99) 10192
NEULAND LAB 1264.65 (1279) 2160
NIHAR INFO 16.95 (16.50) 9761
NILE 607.50 (616.60) 3157
PANYAM CEMEN 60.80 (59.10) 3338
PENNER IND 57.10 (59.60) 151058
PIONEER DIST 191.50 (199.25) 1061
PITTI LAMIN 60.30 (64.25) 131468
PREMIER EXPL 452.95 (481.35) 4771
PRISM CEMENT 111.15 (111.85) 8784
PRUDENTL PHA 4.03 (3.88) 88166
RAIN INDUSTR 139.80 (138) 807195
RAJ PACKAGIN 57.90 (55.15) 9910
SAMKRG PIST 253.75 (257.95) 7939
SATVAH. ISPA 35.75 (38) 69448
SPHERE GLOBA 44.50 (47.50) 19208
SREE RAYAL A 27.55 (28) 137368
STEEL EXCHAN 80.30 (83.70) 206972
SUJANA METAL 1.61 (1.65) 24641
SUJANA TOWER 4.25 (4.38) 3810
SURYALAKSH.C 97.25 (98.70) 12025
SURYALATA SP 135.60 (135.60) 459
SUVEN PHARMA 164.55 (160.85) 60675
TAJ GVK HOTE 156.80 (160.95) 2295
TANLA 33 (33.60) 86366
TERA SOFTWAR 62.25 (65.20) 3527
VBC FERRO 40.10 (39.90) 1658
VICEROY HOTE 17 (16.80) 42353
VISAKA IND 520.55 (496.55) 18434
VISTA PHARMA 32.45 (31.25) 15614
VIVIMED LABS 104.25 (106) 52604
VST INDUS 2751.25 (2835.80) 76
YBRANT DIGIT 6.53 (6.65) 130756
ZENTECH 51.15 (51.05) 9486

కారు రుణాలపై ప్రాసెసింగ్ రుసుము రద్దు: ఎస్‌బీఐ

దిల్లీ: కారు కొనుగోలుకు ఇచ్చే రుణాలపై ప్రాసెసింగ్ రుసుమును 100 శాతం వరకు రద్దు చేస్తున్నట్లు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ప్రకటించింది. డిసెంబరు 31 వరకు ఈ ఆఫర్ అమల్లో ఉంటుందని తెలిపింది. పసిడి ఆభరణాల తనఖాపై తీసుకునే రుణాలకు ప్రాసెసింగ్ రుసుమును 50 శాతం తగ్గిస్తున్నట్లు, అక్టోబరు 31 వరకు ఇది అమల్లో ఉంటుందని ఎస్‌బీఐ వెల్లడించింది. ఎక్స్‌ప్రెస్ క్రెడిట్ కింద పొందే వ్యక్తిగత రుణాలపైనా ప్రాసెసింగ్ ఛార్జీలను 50 శాతం మేర తగ్గించామని, సెప్టెంబరు 30 వరకు ఈ ఆఫర్ ఉంటుందని వివరించింది. ఇప్పటికే వేరే బ్యాంకులో ఉన్న గృహరుణాన్ని ఎస్‌బీఐకు మార్చుకునేందుకు కూడా, ప్రాసెసింగ్ ఛార్జీలను బ్యాంక్ రద్దు చేసిన సంగతి విదితమే.



‘రిటైల్’లో ఉద్యోగార్థులకు ‘ఐసీఐసీఐ’ శిక్షణ

ఈనాడు, హైదరాబాద్: నైపుణ్యాలు లేని ఉద్యోగార్థులకు ఉచితంగా శిక్షణ ఇచ్చి వారికి వివిధ కంపెనీల్లో ఐసీఐసీఐ అకాడమీ ఫర్ స్కిల్స్ హైదరాబాద్ కేంద్రం ఉద్యోగావకాశాలు కల్పిస్తోంది. ఆర్థిక స్తోమత లేని విద్యార్థులకు విక్రయ నైపుణ్యాల్లోను, సంఘటిత రంగంలోని రిటైల్ గొలుసుకట్టు రంగం, కార్యాలయ నిర్వహణ విభాగాల్లో 3 నెలలు శిక్షణ ఇచ్చి వారికి కంపెనీల్లో ఉద్యోగం వచ్చేలా చూస్తున్నామని ఐసీఐసీఐ అకాడమీ హైదరాబాద్ కేంద్రం అధిపతి అభయ్ శర్మ తెలిపారు. ఉద్యోగాలు ఇప్పించేందుకు తమకు అపోలో ఫార్మసీ, టాటా క్రోమా, కార్వీ మేనేజిమెంట్ వంటి 512 కంపెనీలతో భాగస్వామ్యం ఉందని విలేకరుల సమావేశంలో తెలిపారు. 3 నెలలు శిక్షణ ఉంటుందని, త్రైమాసికానికి 650 మందికి శిక్షణ ఇస్తామని చెప్పారు.

సీపీఆర్ఎల్‌తో మెక్‌డొనాల్డ్స్ ఒప్పందం రద్దు

- రెండేళ్లుగా రాయల్టీ చెల్లించనందునే
- కొత్త భాగస్వామి కోసం మెక్ అన్వేషణ



దిల్లీ: దేశ ఉత్తర, తూర్పు ప్రాంతాల్లో ఫ్రాంఛైజీలు నిర్వహిస్తున్న కన్నాట్ ప్లాజా రెస్టారెంట్ లిమిటెడ్ (సీపీఆర్ఎల్)తో ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్లు అమెరికా దిగ్గజ ఆహార సంస్థ మెక్‌డొనాల్డ్స్ కార్పొరేషన్ దేశీయ విభాగమైన మెక్‌డొనాల్డ్స్ ఇండియా ప్రకటించింది. ఒప్పంద షరతులను సీపీఆర్ఎల్ ఉల్లంఘించడంతో పాటు, రాయల్టీ చెల్లింపులు సరిగా జరపనందునే ఈ నిర్ణయం తీసుకున్నట్లు మెక్‌డొనాల్డ్స్ కార్పొరేషన్ అంతర్జాతీయ అధిపతి (కార్పొరేట్ వ్యవహారాలు) రాన్ క్రిస్టియన్‌సన్ తెలిపారు. రెండేళ్లుగా రాయల్టీ చెల్లించకపోవడం, పలు షరతులను అతిక్రమించడమే ఇందుకు కారణమని వెల్లడించారు.

దేశంలో మెక్‌డొనాల్డ్స్ బ్రాండ్‌పై 430 ఆహార శాలలు నడుస్తున్నాయి. వీటిని రెండు ఫ్రాంఛైజీల ద్వారా నిర్వహిస్తున్నారు. దేశ పశ్చిమ, దక్షిణ ప్రాంతాల్లో హార్డ్‌క్యాజిల్ రెస్టారెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ 261 ఆహార శాలలను నిర్వహిస్తోంది. సీపీఆర్ఎల్ నేతృత్వంలో దేశ ఉత్తర, తూర్పు ప్రాంతాల్లో 169 మెక్‌డొనాల్డ్స్ ఆహార శాలలున్నాయి. ఒప్పందం రద్దు నోటీసు అందిన 15 రోజుల్లోగా మెక్‌డొనాల్డ్స్ పేరు, వ్యవస్థ, ట్రేడ్ మార్క్, డిజైన్లతో పాటు మేధోసంపత్తి ఆస్తులను ఈ 169 ఆహారశాలల్లో వినియోగించడాన్ని సీపీఆర్ఎల్ మానివేయాలి. సీపీఆర్ఎల్‌లో 50 శాతం వాటా కలిగిన విక్రమ్ బక్షి, ఇకపై ఆయా ఆహార శాలల్లో మెక్‌డొనాల్డ్స్ బ్రాండ్ వాడకూడదని సంస్థ స్పష్టం చేసింది. ఒప్పందం రద్దు వల్ల వేల మంది ఉద్యోగులు, సరకు సరఫరాదార్లు, భూ యజమానులపై అధిక ప్రభావం పడుతుందని, వీరికి ఇబ్బందులు తగ్గించేందుకు ప్రాధాన్యమిస్తామని, ఇందుకోసం సీపీఆర్ఎల్‌తో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని మెక్‌డొనాల్డ్స్ స్పష్టం చేసింది. దిల్లీలో మెక్‌డొనాల్డ్స్ బ్రాండ్‌పై నిర్వహిస్తున్న 43 ఆహారశాలల లైసెన్సు ఫీజును సీపీఆర్ఎల్ పునరుద్ధరించుకోకపోవడంతో, వాటిని మూసివేశారు. అది జరిగిన వారాల వ్యవధిలో తాజా నిర్ణయం వెలువడటం గమనార్హం. దేశ తూర్పు, ఉత్తర ప్రాంతాలకు సరైన లైసెన్సు దారును అన్వేషిస్తున్నామని మెక్‌డొనాల్డ్స్ ఇండియా తెలిపింది.

చట్టపరమైన అవకాశాలు పరిశీలిస్తున్నాం..విక్రమ్ బక్షి: మెక్‌డొనాల్డ్స్ తమతో ఫ్రాంఛైజీ ఒప్పందాన్ని రద్దు చేసుకోవడంపై, చట్టపరంగా పరిష్కార మార్గాలు అన్వేషిస్తున్నాం. జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) తీర్పును సవాలు చేసేలా మెక్‌డొనాల్డ్స్ నిర్ణయం ఉంది. వివిధ అంశాలపై సమావేశమై, పరిష్కార మార్గాలు అన్వేషించాలని సీపీఆర్ఎల్ బోర్డుకు ఎన్‌సీఎల్‌టీ సూచించింది. దిల్లీలో మూతబడిన 43 ఆహారశాలలను పునఃప్రారంభించడంపైనా బోర్డు సమావేశంలో చర్చించాలనుకున్నాం. అయితే బోర్డు తొలి సమావేశం రోజే, మెక్‌డొనాల్డ్స్ ఈ నిర్ణయం తీసుకుంది.

మీ చెత్త పనితీరును కప్పిపుచ్చుకోవడానికేగా!

- అందుకే మూర్తిపై విమర్శలు
- సిక్కాపై విరుచుకుపడ్డ పాయ్



బెంగళూరు/దిల్లీ/ముంబయి

విశాల్ సిక్కా తన చెత్త పనితీరును కప్పిపుచ్చుకునేందుకు సహ వ్యవస్థాపకుడైన నారాయణ మూర్తిని తాజా సంక్షోభానికి కారకుడిగా చూపిస్తున్నారని ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్ఓ మోహన్‌దాస్ పాయ్ విమర్శించారు. ‘అవును. ఇది నిజం. ఆయన(సిక్కా) ఫిబ్రవరి నుంచే కంపెనీని వీడాలని అనుకుంటున్నారు. ఆయన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు మూర్తిని లక్ష్యంగా చేసుకున్నార’ని సోమవారం పీటీఐకిచ్చిన ఇ-మెయిల్ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. సిక్కా రాజీనామాతో ఇన్ఫోసిస్ పలు సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోన్న సంగతి తెలిసిందే. అందులో ఒకటి సీఈఓ నియామకం. మోసపూరిత, వ్యక్తిగత దూషణలను తట్టుకోలేకే రాజీనామా చేస్తున్నట్లు మూర్తి పేరును వెల్లడించకుండా.. సిక్కా పేర్కొన్న సంగతి తెలిసిందే. కాగా, సిక్కాను ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్‌గా నియమించడాన్నీ పాయ్ తప్పుపట్టారు. ‘కంపెనీలో ఇపుడు ఛైర్మన్, సహ ఛైర్మన్, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్‌కు తోడు తాత్కాలిక సీఈఓ ఉన్నారు. ఇది గందరగోళానికి గురి చేసేదిగా ఉంది’ అని ఆయన అన్నారు. నారాయణ మూర్తిని తిరిగి కంపెనీలోకి అడుగుపెట్టకుండా చేసే అధికారం బోర్డుకు ఉందా అని ప్రశ్నించగా.. ‘ప్రపంచంలోని ఏ బోర్డు కూడా ఒక ప్రమోటరుపై అలాంటి ప్రకటన చేయలేదు. ఒక వేళ అలా చేస్తే అది అసంబద్ధ, తప్పుడు చర్య అవుతుంద’ని పాయ్ సమాధానమిచ్చారు. ‘బోర్డులు డైరెక్టర్లను నియమిస్తాయి. అయితే అందుకు వాటాదార్ల అనుమతి పొందాలి కాబట్టి బోర్డులకు పూర్తి అధికారమంటూ ఉండద’ని మరో ప్రశ్నకు సమాధానంగా పేర్కొన్నారు.



ఛైర్మన్, సహ-ఛైర్మన్ వైదొలగాలి: బాలకృష్ణన్

కొత్త సీఈఓను వెతికే ముందు ఛైర్మన్ ఆర్. శేషశాయి, సహ-ఛైర్మన్ రవి వెంకటేశన్‌లు తప్పుకోవాలని ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్ఓ వి. బాలకృష్ణన్ పేర్కొన్నారు. ‘ఆడిట్(రూపా కుద్వా), రెమ్యునరేషన్(జెఫ్రె ఎస్. లేమాన్) కమిటీల అధిపతులు కంపెనీలోని కార్పొరేట్ పాలన విషయంలో అవకతవకలు జరగకుండా బాధ్యత తీసుకోవాల’ని ఆయన అన్నారు. బోర్డును చక్కదిద్దకుండా.. కొత్త సీఈఓను తీసుకురావడం ‘ఆత్మహత్యా సదృశ్యమ’ని చెప్పారు. అంతక్రితం కూడా ఇన్ఫీ బోర్డును పునర్నిర్మించాలని బాలకృష్ణన్ పలుమార్లు పేర్కొన్న సందర్భాలున్నాయి. కాగా, భారత వాటాదార్లు ప్రజా వేదికలపై మాట్లాడరని.. అయితే సరైన వ్యక్తులతో తమ ఆందోళనలు వెలిబుచ్చుతారన్నారు. ఇక బైబ్యాక్ పరిమాణాన్ని బోర్డు పెంచి ఉండాల్సిందని ఆయన అభిప్రాయపడ్డారు.

తిరిగి పుంజుకుంటాం: ప్రవీణ్ రావు



సిక్కా నిష్క్రమణ కారణంగా కంపెనీలో గందరగోళ పరిస్థితులు తలెత్తిన మాట వాస్తవమేనని తాత్కాలిక సీఈఓ ప్రవీణ్ రావు పేర్కొన్నారు. అయితే ప్రస్తుత పరిస్థితుల నుంచి త్వరలోనే పుంజుకుంటుందన్న విశ్వాసం తనకున్నట్లు ఉద్యోగులకు రాసిన లేఖలో ఆయన అన్నారు. ఇన్ఫీకి సవాళ్లు ఎదురుకావడం కొత్తేమీ కాదన్నారు. ‘కంపెనీ ఇప్పటిదాకా చాలా నేర్చుకుంది. చాలా చేసింది. చాలా దూరం ప్రయాణించింది. భవిష్యత్ కూడా బలంగా కనిపిస్తోంది. అంతక్రితం లాగే ముందుకు వెళ్లాలని భావిస్తున్నామ’ని రావు అన్నారు. సాధ్యమైనంత వరకు ఉద్యోగులకు లేఖలు రాస్తూనే ఉంటానని తన తొలి లేఖలో ఆయన పేర్కొనడం విశేషం.

తగ్గనున్న ఆదాయ అంచనాలు!

- 2017-18పై విశ్లేషకుల భయాలు

సిక్కా రాజీనామా నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఆదాయ అంచనాలను కంపెనీ తగ్గించవచ్చేమోనని విశ్లేషకులు భయపెడుతున్నారు. అందుకే ఈ షేరును సిఫారసు చేయడంలో జాగ్రత్త వహిస్తున్నారు. నాయకత్వం విషయంలో అనిశ్చితులు ఈ ఏడాది ఆదాయ పనితీరుపై ఒత్తిడి పెంచవచ్చని వారు భావిస్తున్నారు. ‘రాబోయే 6నెలల్లో కొత్త సీఈఓను కంపెనీ నియమించేంత వరకు మరికొంత మంది సీనియర్ స్థాయి వ్యక్తులు వైదొలగవచ్చని అంచనా వేస్తున్నాం. దీంతో 2017-18 అంచనాలు తగ్గే అవకాశం ఉంద’ని బ్రోకరేజీ సంస్థ సీఎల్ఎస్ఏ ఏషియా పసిఫిక్ మార్కెట్స్ పేర్కొంది.

షేరు రేటింగ్ తగ్గింపు

ఇన్ఫోసిస్‌పై రేటింగ్‌ను ‘ఓవర్ వెయిట్’ నుంచి ‘తటస్థం’కు మారుస్తున్నట్లు జేపీ మోర్గాన్ సెక్యూరిటీస్ ఇండియా తెలిపింది. ప్రస్తుత ఇన్ఫోసిస్ క్లయింట్లను అసెంచర్, టీసీఎస్, కాగ్నిజెంట్‌లు ఎగరేసుకువెళ్లే అవకాశం ఉందని మోతీలాల్ ఓస్వాల్ సెక్యూరిటీస్ అంటోంది. ‘ఉద్యోగుల్లో ఉత్సాహం నింపే, సాంకేతికతపై నిర్ణయాత్మక శక్తి ఉన్న, క్లయింట్ల నిర్ణయాలను ప్రభావితం చేసే కొత్త సీఈఓను వెతికిపట్టుకోవడం అంత సులువు కాద’ని కోటక్ ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ అంటోంది. ఈ భయాల నేపథ్యంలో యాక్సిస్ క్యాపిటల్, ప్రభుదాస్ లీలాధర్, ఎడెల్‌వీజ్ సెక్యూరిటీస్, మేబ్యాంక్ కిమ్ ఎంగ్, ఐడీఎఫ్‌సీ క్యాపిటల్ మార్కెట్స్ ఇన్ఫీ షేరు రేటింగ్‌ను తగ్గించాయి. ఇవన్నీ షేరు లక్ష్యాన్ని 6-18% వరకు తగ్గించాయి. అయితే స్వల్పకాలంలో బైబ్యాక్ కారణంగా నష్టాలు తగ్గే అవకాశం ఉంది.

వలసలు అరికట్టాలి

అంతర్జాతీయ విశ్లేషకుల అంచనా

సీనియర్ మేనేజ్‌మెంట్ స్థాయి వ్యక్తులతో పాటు.. ఉద్యోగులు కూడా వలస వెళ్లడం అధికమయ్యే అవకాశం ఉందని.. ఇన్ఫీ తాత్కాలిక సీఈఓ ప్రవీణ్ రావు, ఆయన బృందానికి ఇది ప్రధాన సవాలుగా మారవచ్చని విశ్లేషకులు అంటున్నారు. యాజమాన్యంలో మార్పుల కారణంగా క్లయింట్లు జాగ్రత్తగా వ్యవహరించొచ్చు. అలాగే పోటీదార్లు వీరిని ఆకర్షించే ప్రయత్నం చేయొచ్చని మెక్వారీ రీసెర్చ్ పేర్కొంది. కొద్ది రోజులుగా జరుగుతున్న పరిణామాలపై క్లయింట్లకు ఏవైనా ఆందోళనలుంటే.. స్పష్టతనివ్వడానికి సైతం కంపెనీ సిద్ధంగా ఉందన్న సంకేతాలనిచ్చింది. సీనియర్ స్థాయి వలసలు కొనసాగితే దీర్ఘకాల వృద్ధిపై ప్రభావం పడుతుందని నొమురా పేర్కొంది. 2017-18, 2018-19లపై ప్రభావం పడొచ్చని జేపీ మోర్గాన్ అభిప్రాయపడింది.

పసిడి దిగుమతిపై 3 శాతం ఐజీఎస్‌టీ

- బ్యాంకులూ చెల్లించాలి: సీబీఈసీ
- అమ్మకంలో మినహాయింపు పొందొచ్చు
- వినియోగదారులకు మొత్తం పన్నురేటు 13 శాతమే



దిల్లీ: బంగారం దిగుమతి చేసుకునే బ్యాంకులు బేసిక్ కస్టమ్స్ సుంకం 10 శాతంతో పాటు సమీకృత వస్తు సేవల పన్ను (ఐజీఎస్‌టీ) కింద మరో 3 శాతం చెల్లిస్తాయని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ (సీబీఈసీ) స్పష్టం చేసింది. ఈ బంగారాన్ని విక్రయించే సమయంలో, తాము చెల్లించిన ఐజీఎస్‌టీని బ్యాంకులు మినహాయించుకోవచ్చని (ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్) తెలిపింది. అంటే బ్యాంకులు మొత్తం 13 శాతం పన్ను చెల్లించినా, మళ్లీ తాము విక్రయించే సమయంలో 3 శాతాన్ని మినహాయింపు పొందుతాయి కాబట్టి, అవి చెల్లించేది కస్టమ్స్ సుంకం (10 శాతమే) అవుతుంది. బ్యాంకుల వద్ద కొనుగోలు చేసుకునే ఆభరణాల తయారీ సంస్థలు, బులియన్ సంస్థలు 13 శాతం పన్ను చెల్లిస్తాయి. విదేశాల నుంచి బంగారాన్ని సరఫరా చేసే సంస్థలేమీ ఐజీఎస్‌టీ చెల్లించవని, బ్యాంకులు-దిగుమతికి అనుమతి పొందిన సంస్థలే చెల్లించి, వాపసు పొందాల్సి ఉంటుందని పేర్కొంది.

జీఎస్‌టీ అమల్లోకి రాక ముందు, పసిడి దిగుమతి చేసుకునే బ్యాంకులు, కస్టమ్స్ సుంకం 10 శాతం మాత్రమే చెల్లించేవి. అప్పుడు విలువ జత చేరిన సుంకం (వ్యాట్)ను బ్యాంకులేమీ చెల్లించలేదని సీబీఈసీ తెలిపింది. ఇప్పుడు ఐజీఎస్‌టీ మినహాయింపు ఉన్నందున, బ్యాంకులపై అదనంగా పడే భారమేమీ లేదని వివరించింది. వెండి వంటి ఇతర విలువైన లోహాల దిగుమతికీ ఇదే విధానం అమలవుతుందని తెలిపింది.

ఆభరణాలపై జీఎస్‌టీ విధింపు ఇలా

దుకాణంలో ఉన్న ఆభరణాలపై 13 శాతం పన్ను చెల్లించినట్లు లెక్క. మనకు నచ్చిన ఆభరణం కొనుగోలు చేసేప్పుడు, ముందస్తుగా బంగారం విలువలో నుంచి 3 శాతం పన్నును మినహాయించి లెక్క చూసుకోవాలి. అనంతరం తయారీ ఛార్జీల వంటివన్నీ కలిపి ఆభరణం ధర రూ.50,000 అయిందనుకుందాం. దీనిపై 3 శాతం జీఎస్‌టీని వినియోగదారు చెల్లించాల్సి ఉంటుంది. తయారీ ఛార్జీలు ఆభరణం ధరలో కలిపి చూపినా, విడిగా చూపినా, మొత్తం లావాదేవీ విలువపై జీఎస్‌టీ 3 శాతం చెల్లించాల్సి వస్తుందని సీబీఈసీ స్పష్టం చేసింది.

జీఎస్‌టీ వసూళ్లు రూ.42,000 కోట్లు!

- జులై రిటర్న్‌ల ద్వారా వచ్చాయ్
- గడువు పొడిగింపుతో మరింత పెరగొచ్చు
- ప్రభుత్వ వర్గాల అంచనా

దిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) కింద మొదటి నెల (జులై)కు దాఖలు చేసిన రిటర్న్‌ల ద్వారా ఇప్పటి వరకు ప్రభుత్వానికి రూ.42,000 కోట్లు వచ్చి చేరాయి. జులై రిటర్న్‌ల దాఖలు, పన్నుల చెల్లింపునకు గడువును ఈ నెల 25 దాకా పొడిగించిన నేపథ్యంలో రాబడులు మరింత పెరిగే అవకాశం కనిపిస్తోందని ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అంతరాష్ట్ర సరకు రవాణాపై విధించే సమీకృత జీఎస్‌టీ(ఐజీఎస్‌టీ) ద్వారా దాదాపు రూ.15,000 కోట్లు, కార్లు, పొగాకుపై విధించిన సెస్ రూపంలో మరో రూ.5000 కోట్లు వచ్చాయని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. మిగిలిన రూ.22000 కోట్లు కేంద్ర జీఎస్‌టీ, రాష్ట్ర జీఎస్‌టీ ద్వారా వచ్చాయని అన్నారు. ఇప్పటి వరకు 10 లక్షల మంది పన్ను చెల్లింపుదార్లు రిటర్న్‌లు దాఖలు చేశారని, మరో 20 లక్షల మంది వెబ్‌సైట్‌లో లాగిన్ కావడంతో పాటు రిటర్న్ ఫారాలను పొందుపరిచారని వెల్లడించారు. 90-95 శాతం మంది మదింపుదార్లు రిటర్న్‌లు దాఖలు చేయడంతో పాటు పన్నులు చెల్లించే అవకాశం ఉందని ఉన్నతాధికారి అంచనా వేశారు.

డేటా భద్రతపై వివరాలివ్వండి

మరో 9 స్మార్ట్‌ఫోన్ సంస్థలకు ఐటీ శాఖ లేఖలు

దిల్లీ: వినియోగదార్ల డేటా భద్రతకు అవలంభిస్తున్న విధానాలు తెలపాలని కోరుతూ మరో 9 స్మార్ట్‌ఫోన్ సంస్థలకు సమాచార, సాంకేతిక (ఐటీ) శాఖ లేఖలు రాసింది. ఈనెల 12న 21 సంస్థలకు ఇలాంటి లేఖలనే శాఖ రాసిన సంగతి విదితమే. తాజాగా లేఖలు అందుకున్న వాటిలో రిలయన్స్ రిటైల్‌కు చెందిన లైఫ్ బ్రాండ్, మోటరోలా, ఆనర్, ఆసుస్, వన్‌ప్లస్, ఇన్‌ఫోకస్ ఉన్నాయని సమాచారం. దేశంలో స్మార్ట్‌ఫోన్లు విక్రయిస్తున్న అన్ని సంస్థల నుంచి సమాచారం కోరుతున్నట్లు ఐటీ శాఖ స్పష్టం చేసింది. ఇప్పటికే యాపిల్, శామ్‌సంగ్, హువావె, సోనీ, జియోని, ఒప్పో, హెచ్ఎండీ, లావా, మైక్రోమ్యాక్స్ వంటి సంస్థలకు లేఖలు అందాయి.

ఏది..ఎప్పుడు..ఎలా..



సతీష్ సరాఫ్

వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) విధానంలో రిటర్న్‌ల దాఖలు సంక్లిష్టమే అని చెప్పొచ్చు. ఒకటి కాదు.. రెండు కాదు పలు రకాల రిటర్న్‌లను వ్యాపారులు సమర్పించాలి. జీఎస్‌టీ అమల్లోకి వచ్చి కొన్ని రోజులే అయినందున తొలి రెండు నెలలకు (జులై, ఆగస్టు) రిటర్న్‌ల ఫైలింగ్ విషయంలో ప్రత్యేక వెసులుబాటును ఇచ్చారు. ఇక సెప్టెంబరు నుంచి రిటర్న్‌లకు సంబంధించి అసలు తంతు మొదలవుతుంది. మరి వ్యాపారులు దీనికి సన్నద్ధం కావాలంటే రిటర్న్‌ల ఫైలింగ్‌పై అవగాహనను పెంచుకోక తప్పని పరిస్థితి. అందుకే జీఎస్‌టీ విధానంలో ఎన్ని రకాల రిటర్న్‌లు ఉన్నాయి? ఎవరెవరు.. వేటి వేటిని.. ఎప్పుడెప్పుడు దాఖలు చేయాలి? ఏయే వివరాలు సమర్పించాలో తెలుసుకుందాం.

వార్షిక టర్నోవరు నిర్దేశిత పరిమితి (రూ.20 లక్షలు) మించిన ప్రతి ఒక్క వ్యాపారి జీఎస్‌టీకి నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. రూ.75 లక్షల్లోపు టర్నోవరు ఉన్న వ్యాపారులైతే జీఎస్‌టీలోని కాంపోజిషన్ పథకాన్ని కూడా ఎంపిక చేసుకోవచ్చు అయితే జీఎస్‌టీ కింద రిజిస్టర్ అయినంత మాత్రానా అందరికీ రిటర్న్‌ల దాఖలు ప్రక్రియ ఒకేలా ఉండదు. సాధారణ వ్యాపారులకు ఒకలా.. ప్రవాస వ్యాపారులు/ ఇన్‌పుట్ సేవల పంపిణీదార్లకు (ఐఎస్‌డీ)కి మరోలా.. కాంపోజిషన్ వర్తకులకు ఇంకోలా రిటర్న్‌ల దాఖలు ప్రక్రియ ఉంటుంది. ఆ వివరాలు పట్టిక-1లో చూద్దాం.

జీఎస్‌టీఆర్-1లో పొందుపరచాల్సిన వివరాలు



✦ జీఎస్‌టీఐఎన్ ✦ చట్టబద్ధ పేరు ✦ స్థూల టర్నోవరు (గత సంవత్సరం, ప్రస్తుత సంవత్సరం ఇప్పటి వరకు) ✦ జీఎస్‌టీ కింద రిజిస్టర్ అయిన వ్యక్తులకు, యూఐఎన్ ఉన్న వారికి చేసిన సరఫరా వివరాలు (పన్ను పరిధిలోనివి) ✦ జీఎస్‌టీ కింద రిజిస్టర్ కాని వ్యక్తులకు చేసిన సరఫరా వివరాలు (ఇన్‌వాయిస్ విలువ రూ.2.5 లక్షలకు పైగా ఉన్నవి) ✦ శూన్య రేటింగ్ సరఫరాలు, ఎగుమతుల వివరాలు ✦ జీఎస్‌టీ కింద రిజిస్టర్ కాని వ్యక్తులకు ఐదుకు మించి చేసిన సరఫరాల వివరాలు (పన్ను పరిధిలోనివి) ✦ శూన్య రేటింగ్, పన్ను పరిధిలో లేని, మినహాంపు ఉన్న సరఫరాల వివరాలు ✦ గత రిటర్న్‌లలో పొందుపరిచిన సరఫరా వివరాలకు సంబంధించి సవరణలు ✦ గత రిటర్న్‌లలో పొందుపరిచిన జీఎస్‌టీ గుర్తింపు లేని వ్యక్తులకు చేసిన వివరాలకు సంబంధించి సవరణలు ✦ అడ్వాన్సులు అందుకున్నవి/ సర్దుబాటు చేసిన వివరాలు ✦ హెచ్‌ఎస్ఎన్ కోడ్ వారీగా చేసిన సరఫరా వివరాలు ✦ సమీక్ష పన్ను కాలంలో జారీ చేసిన పత్రాల వివరాలు

జీఎస్‌టీఆర్-2లో పొందుపరచాల్సిన వివరాలు

✦ జీఎస్‌టీఐఎన్ ✦ చట్టబద్ధ పేరు ✦ రివర్స్ ఛార్జీ మినహా జీఎస్‌టీ కింద గుర్తింపు ఉన్న వ్యాపారుల నుంచి పొందిన సరఫరా వివరాలు ✦ రివర్స్ ఛార్జీ చెల్లించిన సరఫరా వివరాలు ✦ విదేశాల నుంచి లేదా సెజ్‌లద్వారా సరఫరా అయిన సరుకులు/ భారీ యంత్రపరికరాలు ✦ గత రిటర్న్‌లలో పొందుపరిచిన ఇన్‌వార్డ్ సరఫరా వివరాల్లో సవరణలు ✦ కాంపోజిషన్ వర్తకులు చేసిన సరఫరాలతో పాటు పన్ను మినహాయింపు/ శూన్య రేటెడ్/ పన్ను వర్తించని సరఫరాల వివరాలు ✦ ఐఎస్‌డీ క్రెడిట్ వివరాలు ✦ టీడీఎస్, టీసీఎస్ వివరాలు ✦ సరఫరా అయిన ఉత్పత్తులకు ముందస్తు చెల్లింపులు/ ముందస్తు సర్దుబాట్ల ఏకీకృత వివరాలు ✦ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ రివర్సల్/ రీక్లెయిమ్ ✦ పన్ను చెల్లింపుల్లో వ్యత్యాసానికి సంబంధించిన వివరాలు, కారణాలు ✦ హెచ్‌ఎస్ఎన్ కోడ్ వారీగా పొందిన సరఫరా వివరాలు

నెలవారీ/ త్రైమాసిక / వార్షిక రిటర్న్‌లు, పొందుపరచాల్సిన వివరాలు, గడువు తేదీలు

ఫారం	పొందుపరిచాల్సిన వివరాలు	దాఖలుకు గడువు తేదీ
జీఎస్‌టీఆర్-1	సరఫరా చేసిన (అవుట్‌వార్డ్) వస్తు/ సేవల వివరాలు	మరుసటి నెల 10న
జీస్‌టీఆర్-1ఏ	సరఫరా చేసిన వస్తు/ సేవల వివరాలు (ఆటో డ్రాఫ్టెడ్)	మరుసటి నెల 16/ 17 తేదీల్లో
జీఎస్‌టీఆర్-2	సరఫరా అయిన (ఇన్‌వార్డ్) వస్తు/ సేవల వివరాలు	మరుసటి నెల 15న
జీఎస్‌టీఆర్-2ఏ	జీఎస్‌టీఆర్-1 లేదా జీఎస్‌టీఆర్-5 నుంచి ఆటో డ్రాఫ్ట్ అయిన గ్రహీత సరఫరా వివరాలు	మరుసటి నెల 11 నుంచి 15 వరకు
జీఎస్‌టీఆర్-3	నెలవారీ రిటర్న్‌లు	మరుసటి నెల 20న
జీఎస్‌టీఆర్-4	త్రైమాసిక రిటర్న్‌లు (కాంపోజిషన్ వర్తకులు)	త్రైమాసికం పూర్తయిన మరుసటి నెల 18న
జీఎస్‌టీర్-4ఏ	కాంపోజిషన్ కింద గుర్తింపు పొందిన వ్యాపారుల సరఫరా వివరాలు (ఆటో డ్రాఫ్టెడ్)	-
జీఎస్‌టీఆర్-5	ప్రవాస వ్యాపారుల రిటర్న్‌లు	మరుసటి నెల 20, రిజిస్ట్రేషన్ ఆఖరి రోజు
జీఎస్‌టీఆర్-5ఏ	భారత్‌లోని పన్ను పరిధిలోలేని వ్యక్తికి ప్రవాస వ్యాపారులు చేసిన సరఫరా వివరాలు	-
జీఎస్‌టీఆర్-6	ఇన్‌పుట్ సేవా పంపిణీదార్ల రిటర్న్‌లు	మరుసటి నెల 13న
జీఎస్‌టీఆర్-6ఏ	జీఎస్‌టీఆర్-1 లేదా జీఎస్‌టీఆర్-5 నుంచి ఆటో డ్రాఫ్ట్ అయిన ఐఎస్‌డీ సరఫరా వివరాలు	-
జీఎస్‌టీఆర్-7	మూలం వద్ద పన్ను మినహాయింపు (టీడీఎస్) రిటర్న్‌లు	మరుసటి నెల 10న
జీఎస్‌టీఆర్-8	మూలం నుంచి పన్ను వసూలు (టీడీఎస్) నివేదిక	మరుసటి నెల 10న
జీఎస్‌టీఆర్-9	జీఎస్‌టీ వార్షిక రిటర్న్	ఆర్థిక సంవత్సరం ముగిశాక డిసెంబరు 31న
జీఎస్‌టీఆర్-9ఏ	కాంపోజిషన్ విధానంలోని వ్యాపారులు వార్షిక రిటర్న్‌లు	ఆర్థిక సంవత్సరం ముగిశాక డిసెంబరు 31న
జీఎస్‌టీఆర్-10	జీఎస్‌టీ తుది రిటర్న్	గుర్తింపు రద్దయిన రోజు నుంచి 3 నెలల్లోపు
జీఎస్‌టీఆర్-11	యూఐఎన్ ఉన్న వ్యక్తులకు సరఫరా అయిన వివరాలు	మరుసటి నెల 28న

పట్టిక-1

వ్యాపారులు	నెలవారి	త్రైమాసిక	వార్షిక	తొలి	తుది
జీఎస్‌టీ కింద నమోదైన వ్యాపారులు	సమర్పించాలి	అవసరం లేదు	సమర్పించాలి	సమర్పించాలి	సమర్పించాలి
ఇన్‌పుట్ సేవా పంపిణీదారు/ ప్రవాస భారతీయులు/ టీడీఎస్/ టీసీఎస్	సమర్పించాలి	అవసరం లేదు	అవసరం లేదు	సమర్పించాలి	సమర్పించాలి
కాంపోజిషన్ డీలర్లు	అవసరం లేదు	సమర్పించాలి	సమర్పించాలి	అవసరం లేదు	సమర్పించాలి

రుసుములు.. వడ్డీలు.. జరిమానాలు

జీఎస్‌టీ కింద గుర్తింపు ఉన్న వ్యక్తులు గడువు తేదీలోపు జీఎస్‌టీఆర్-1, జీఎస్‌టీఆర్-2, జీఎస్‌టీఆర్-3 లేదా తుది రిటర్న్‌లను దాఖలు చేయాలి. లేకుంటే రోజుకు రూ.100 నుంచి గరిష్ఠంగా రూ.5000 వరకు ఆలస్య రుసుం చెల్లించాల్సి ఉంటుంది. అదే వార్షిక రిటర్న్‌లకైతే రోజుకు రూ.100 నుంచి గరిష్ఠంగా రాష్ట్ర టర్నోవరులో 0.25 శాతం రుసుము చెల్లించాలి. ఆలస్య రుసుంతో పాటు చెల్లించాల్సిన పన్నుపై వడ్డీని, జరిమానాను కూడా పన్ను చెల్లింపుదార్లు చెల్లించాల్సి ఉంటుంది.

సాయం చేస్తారు..

జీఎస్‌టీ విధానంలో పలు రకాల రిటర్న్‌లు సమర్పించాల్సి ఉండటంపై వ్యాపారుల్లో ఆందోళన నెలకొంది. అదే సమయంలో రిటర్న్‌ల్లో పొందుపరచాల్సిన వివిధ వివరాలపైనా వాళ్లకు అనేక సందేహాలున్నాయి. అయితే రిటర్న్‌ల ఫైలింగ్ విషయంలో సాయం అందించేందుకు ఇప్పటికే 34 మంది జీఎస్‌టీ సువిధా ప్రొవైడర్లను ప్రభుత్వం గుర్తించింది. వీళ్లనే జీఎస్‌పీలుగా నియమిస్తోంది. తిరిగి వీరు అప్లికేషన్ సువిధా ప్రొవైడర్లను (ఏఎస్‌పీలు) నియమిస్తారు.

(రచయిత చార్టర్డ్ అకౌంటెంట్)

గమనిక: **జీఎస్‌టీలో రిటర్న్‌లు ఎలా దాఖలు చేయాలనే విషయంపై కొంత అవగాహన తేవడంలో భాగంగా పై వివరాలు తెలియజేశాం. అయితే ఏదేని అంశంపై పూర్తిగా తెలుసుకోవాలంటే చట్టంలోని సంబంధిత నిబంధనలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి.**

జీఎస్‌టీకి సంబంధించి పాఠకుల సందేహాలకు సమాధానాలు రేపటి సంచికలో

ఈనాడు సినిమా



బాలకృష్ణ



నయనతార

మూడోసారి మరింత అందంగా!

బాలకృష్ణ - నయనతారలది విజయవంతమైన జోడీ. 'సింహా', 'శ్రీరామరాజ్యం' చిత్రాల్లో కలిసి నటించి ప్రేక్షకుల మనసుల్ని దోచుకొన్నారు. ముచ్చటగా మూడోసారి కలిసి అలరించబోతున్నారు. కె.ఎస్. రవి కుమార్ దర్శకత్వంలో సి. కె. ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై తెరకెక్కుతున్న చిత్రంలో బాలకృష్ణ, నయనతార జోడీ కలిసి నటిస్తోంది. ఇది బాలకృష్ణకి 102వ చిత్రం. సి. కల్యాణ్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం రామోజీ ఫిలిం సిటీలో చిత్రీకరణ జరుగుతోంది. నయనతార సోమవారమే సెట్లోకి అడుగుపెట్టింది. తొలి రోజు తన గెటప్‌తో కూడిన కొన్ని చిత్రాల్ని ట్విట్టర్‌లో పోస్ట్ చేసింది. వాటిలో నయనతార అందం, కట్టుబొట్టు ఆకట్టుకొనేలా ఉన్నాయి. బాలకృష్ణ సినీ ప్రయాణంలోనే ఓ సంచలన చిత్రమవుతుందని చిత్ర నిర్మాత సి. కల్యాణ్ పేర్కొన్నారు. బ్రహ్మానందం, ప్రకాష్‌రాజ్, అశుతోష్ రాణా, మురళీమోహన్, బాహుబలి ప్రభాకర్, శివపార్వతి తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కథ-మాటలు: ఎం. రత్నం, ఛాయాగ్రహణం: సి. రాంప్రసాద్, సంగీతం: చిరంతన్ భట్.

గీతోపదేశం

అంగడిలో దొరకనిది అమ్మ ఒక్కటే
అందరికీ ఇలవేలుపు అమ్మ ఒక్కటే
అమ్మ ఉన్న ఇంటిలో లేనిది ఏదీ?
అమ్మ అనురాగం ఇక నుంచి నీదీ నాదీ

గీతం: అమ్మ అన్నది ఒక కమ్మనిమాట... చిత్రం: బుల్లెమ్మ బుల్లోడు
రచన: దాశరథి - పంపినవారు: జఫరుల్లాఖాన్, మహబూబ్‌నగర్

చిరునామా: సినిమా డెస్క్,
ఈనాడు కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ,
అనాజ్‌పూర్,
అబ్దుల్లాపూర్‌మెట్ మండలం,
రంగారెడ్డి జిల్లా- 501512
మెయిల్ ఐడీ:
cinema@eenadu.net

పంచ్ డైలాగ్

ముడి విప్పడంతో మజా ఉంటే... విప్పలేని ముడి వెయ్యడంలో ఇంకెంత మజా ఉంటుందో!
చిత్రం: శకుని
- పంపినవారు: బీపీఎస్ ప్రసాద్, చాగల్లు



ఆయన రాఘవేంద్రుడు కాదు... 'రాగ'వేంద్రుడు..!
ఎందుకంటే... ఆయన సినిమాల్లో కథ 'బలంగా' ఉంటుంది.
కానీ మనకు పాటలు నచ్చేస్తాయి.
ఆయన సినిమాల్లో హీరోయిజం పుష్కలంగా కనిపిస్తుంది.
అయినా.. పాటల్లో అందమే చటుక్కున గుర్తొస్తుంది.
తన సినిమాల్లో కుటుంబ బంధాలూ, భావోద్వేగాలూ, కమర్షియల్ అంశాలు అన్నీ మేళవిస్తారు.
అప్పటికీ... ఆ పాటలే పూగంధంలా మత్తెక్కిస్తాయి.
ఓ పాటని కనులకు ఇంపుగా.. రంగుల హరివిల్లులా.. మర్చిపోలేని మహాకావ్యంలా చూపించడంలో రాఘవేంద్రరావు తరవాతే ఎవరైనా.
అందుకే తెలుగు సినిమా పాటల ప్రపంచంలో... ఆయనే రారాజు! తిరుగులేని చక్రవర్తి.

రాఘవేంద్రరావు సినిమాల్లో ఆరు పాటలుంటే ఆరూ సూపర్ హిట్టే! అందులో ఒక్కో పాటదీ ఒక్కో కథ... ఒక్కో కళ! వాటన్నింటి గురించీ దర్శకేంద్రుడు మనతో పంచుకొంటే ఎలా ఉంటుంది? 'రాగ'వేంద్రరావు పాటల ప్రపంచంలోకి ప్రేక్షకుల్నీ తీసుకెళ్తే ఏమవుతుంది? ఈ ఆలోచనలో పుట్టిన కార్యక్రమమే... 'సై సై సయ్యారే'. నేటి నుంచి ప్రతి మంగళవారం రాత్రి గం.9.30 ని॥లకు ఈటీవీలో ప్రసారం కాబోతోంది. ఆర్.కె. టెలీషో సంస్థ నిర్మించిన ఈ కార్యక్రమానికి మురళీధర్ కేసరి దర్శకత్వం వహించారు. అసలు ఈ ఆలోచన ఎలా వచ్చింది? దాని కోసం ఎంత కసరత్తు జరిగింది? 'సై సై సయ్యారే'లో ఏమేం ఉండబోతున్నాయి? వీటి గురించి దర్శకేంద్రుడు కె. రాఘవేంద్రరావు ఏమంటున్నారంటే..!

దర్శకేంద్రుడి రాగలహరి సై సై సయ్యారే!

"ఈటీవీకీ నాకూ బాగా దగ్గర అనుబంధం ఉందనుకొంటా. నా తొలి ధారావాహిక 'శాంతి నివాసం' ఈటీవీలోనే ప్రసారమైంది. నేను తొలిసారి గొంతు విప్పి మనసారా మాట్లాడిన 'సౌందర్య లహరి' కూడా ఈటీవీలోనే వచ్చింది. 'సౌందర్య లహరి'కి వచ్చిన స్పందన అంతా ఇంతా కాదు. 'మనం ఏదైనా మాట్లాడితే అది కనీసం పదిమందికైనా ఉపయోగపడాలి' అనుకొనే వ్యక్తిని నేను. చిత్రసీమలో అడుగుపెట్టాలని కలలుకనే యువతరం కోసం 'సౌందర్య లహరి' కార్యక్రమాన్ని చేపట్టా. అయితే అనూహ్యంగా ఆ కార్యక్రమం అందరికీ నచ్చింది. నేనెక్కడైనా కనిపిస్తే 'సౌందర్య లహరి' గురించే మాట్లాడుతున్నారంతా. అందులో కుర్రవాళ్ల నుంచి వయసు మళ్లినవాళ్లు కూడా ఉన్నారు. అది చూసి నాకు ఆశ్చర్యం వేసింది. 'బుల్లి తెర ప్రభావం ఈ స్థాయిలో ఉందా? ఇంతమందికి నా మాటలు చేరువ అయ్యాయా' అనిపించింది. 'సౌందర్య లహరి' తరవాత మరో కార్యక్రమం ఏమైనా చేద్దామా' అని ఈటీవీ అడిగేసరికి... నాకు 'సై సై సయ్యారే' ఆలోచన వచ్చింది.

నేను అన్ని రకాల సినిమాలూ చేశా. కుటుంబ కథలు, ఫాంటసీ, మాస్ చిత్రాలు, ఆధ్యాత్మిక కథలు... ఇలా దాదాపు అన్ని జోనర్లూ టచ్ చేశా. అయితే ఏ తరహా కథ చేసినా 'మీ సినిమాలో పాటలు బాగుంటాయండీ' అంటుంటారు. 'పాటలంటే గుర్తొచ్చేది మీరే..' అని చెబుతుంటారు. నిజానికి చాలా గొప్ప ప్రశంస అది. సినీ పరిశ్రమలో దిగ్గజాలైన దర్శకులు ఎంతోమంది ఉన్నారు. వాళ్లెవ్వరికీ రాని గుర్తింపు నాకూ, నా పాటలకూ వచ్చిందంటే అంతకంటే సంతోషం ఏముంది? అందుకే ఆ పాటల్లో కొన్నింటి గురించి సవివరంగా ప్రేక్షకులకు, ఈతరం దర్శకులకు చెప్పాలనుకొన్నా. అందుకే ఈ 'సై సై సయ్యారే' కార్యక్రమం"

> "నేను దాదాపుగా నా పాటలన్నీ సెట్లోనే తీస్తుంటా. ఫారిన్ లొకేషన్‌కు వెళ్తే... కథానాయిక కంటే ఆ లొకేషన్‌నే ఫ్రేముల్లో బంధించాల్సివస్తుంది. ఆ బిల్డింగులూ, కొండలూ చూపించడానికే పాట మొత్తం వాడుకొంటే.. ఇక కథానాయికల్ని ఎక్కడ చూపిస్తాం? అలాంటి దశలో కూడా నాదైన సంతకం కనిపించాలని అక్కడక్కడ కొన్ని బిట్లు వాడుకొంటుంటా. 'ఈ పాటంతా మీ శైలిలో తీయండి. ఈ బిట్టు మాత్రం నాకు వదిలేయండి' అంటూ కొరియోగ్రాఫర్లకు చెబుతుంటా. నా పాటలు అందంగా ఉన్నాయంటే దానికి కారణం నేనొక్కడ్నే కాదు. చక్కటి స్టెప్పులు వేయించిన డాన్స్ మాస్టర్లు, ఆ పాటపై అంత ఖర్చు పెట్టిన నిర్మాతలు, గుర్తుండిపోయే స్వరాలు అందించిన సంగీత దర్శకులు, వాటిని తీర్చిదిద్దిన గాయకులు, గీత రచయితలు, నర్తించిన నటీనటులు ఇలా అందరి వాటా ఉంది"

యాపిల్ ఎందుకు వాడాం?: నా పాటల్లో పాలు, పళ్లు ఎక్కువ కనిపిస్తుంటాయి. అయితే... వాటి వల్లే ఆయా పాటలకు అందం వచ్చిందనుకోను. ఎక్కడ ఏ ఫ్రేములో ఏం చూపిస్తే అందంగా ఉంటుందో గ్రహించాలి. ఓ పాట అనుకొంటే... ఆ పాట చుట్టూ ఓ థీమ్ అల్లుకొంటా. ఉదాహరణకు 'ఘరానా మొగుడు' సినిమానే తీసుకోండి. ఆ సినిమాలో హీరో హీరోయిన్ల మధ్య ఎప్పుడూ చిన్న సైజు యుద్ధం జరుగుతుంటుంది. అలాంటి కథలో పాటలకు, అందులోనూ యుగళ గీతాలకూ ఛాన్స్ ఉండదు. అయినా సరే.. 'పండు పండు పండు' అంటూ డ్యూయెట్ పెట్టాం. వారిద్దరి మధ్య పాట పెట్టడానికి, ఆ పాటలో యాపిల్ పండు వాడడానికీ ఓ కారణం ఉంటుంది. పాటకు ముందొచ్చే లీడ్ సీన్ చూస్తే ఆ విషయం అర్థం అవుతుంది. 'గుగ్గుగుగ్గు గుడిసుందీ..', 'ఆరేసుకోబోయి..', 'భీమవరం బుల్లోడా పాలు కావాలా..' ఇలాంటి మాస్ గీతాలు తీసుకొన్నా సరే... ఇలా ప్రతి పాటకూ ఓ టేకాఫ్ అనుకొంటా. దాని చుట్టూ పాటని నడిపిస్తా. లేదంటే.. ఆ పాటలో ఏం చూపించినా అందం, అర్థం రెండూ ఉండవు.

ఓ వారధి కావాలి: 'సై సై సయ్యారే'లో నా పాటల గురించి ఈతరం కథానాయికలు, దర్శకులు ఏం అనుకొంటున్నారు, వాళ్లయితే ఎలా తీస్తారు? అనే ఆసక్తికరమైన చర్చకు వేదిక కల్పించాం. నిన్నటి తరానికీ ఈ తరానికీ ఓ వారధిలా ఈ కార్యక్రమం ఉపయోగపడాలని నా ఆశ. పైగా నన్ను నేను అప్‌డేట్ చేసుకొనే వీలు చిక్కుతుంది. అంతే కాదు... ఇప్పుడు పరిశ్రమలో అడుగుపెట్టబోతున్న కొరియోగ్రాఫర్స్, 'ఢీ' లాంటి కార్యక్రమాలతో ప్రతిభ చాటుకొంటున్న డ్యాన్సర్లు ఆ పాటని వాళ్ల స్టైల్‌లో కంపోజ్ చేస్తే ఎలా ఉంటుందో చూపిస్తున్నాం. ఇప్పటికే వాళ్లు చాలా పాటల్ని వాళ్ల శైలిలో కంపోజ్ చేసి చూపించారు. వాళ్ల ఆలోచనలు చూస్తుంటే చాలా ఆనందం వేస్తోంది. దీని ద్వారా తప్పకుండా ప్రతిభావంతులైన నవతరం డ్యాన్స్ మాస్టర్లు వెలుగులోకి వస్తారన్న నమ్మకం ఉంది"

"కొంతమంది కథానాయికల్ని చూస్తే... 'వీళ్లకు తప్పకుండా మంచి భవిష్యత్తు ఉంది' అనిపిస్తుంటుంది. ఖుష్బూని చూసిన తొలిరోజే... 'నువ్వు గొప్ప స్టార్‌వి అవుతావు' అని చెప్పా. రమ్యకృష్ణ కెరీర్ ప్రారంభంలో అన్నీ ఫ్లాపులే. 'నీ కాల్షీట్ల కోసం బతిమాలే రోజు వస్తుంది చూసుకో' అన్నాను. ఆ తరవాతి కాలంలో ఆ స్థాయికి చేరుకొంది కూడా. అనుష్క విషయంలోనూ అదే జరిగింది. 'సూపర్' కంటే ముందు అనుష్కని చూశా. 'నీది సౌత్ ఇండియన్ ఫేస్... రాబోయే కొన్నేళ్లలో నువ్వు నెంబర్ వన్ అవుతావు' అని చెప్పా. టబుని పరిచయం చేసింది నేనే. ఆరోజే తన ప్రతిభ అర్థమైంది. 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' చూశాక రకుల్‌ప్రీత్ సింగ్ స్టార్ అవుతుందనిపించింది. అదే నిజమైంది"



'సై సై సయ్యారే' కార్యక్రమం తొలి ఎపిసోడ్‌లో కథానాయిక రకుల్‌ప్రీత్ సింగ్ సందడి చేయబోతోంది. కె.రాఘవేంద్రరావుతో కలిసి ఆయన పాటలపై తన అభిప్రాయాన్ని తెలియజేస్తుంది.

పోలీస్ 'దేవి'

నదియా ప్రధాన పాత్రధారిగా తమిళంలో తెరకెక్కిన 'తిరుక్కు వరాధకాది' తెలుగులో 'దేవి' పేరుతో విడుదలవుతోంది. డి. తులసిదాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని సువర్ణ తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. అనువాద కార్యక్రమాలు పూర్తయ్యాయి. త్వరలోనే విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నిర్మాత మాట్లాడుతూ "విజయవంతమైన 'దృశ్యం' తర్వాత నదియా పోలీసు అధికారి పాత్రలో నటించిన చిత్రమిది. దేవిగా ఆమె తెరపై చేసే సందడి ఆకట్టుకుంటుంది. తమిళంలో విజయం సాధించిన ఈ చిత్రం తెలుగు ప్రేక్షకుల్నీ తప్పక మెప్పిస్తుందనే నమ్మకం మాకుంది. దర్శకుడు ఈ చిత్రాన్ని తీర్చిదిద్దిన విధానం బాగుంది" అన్నారు. ఈ చిత్రానికి కథ: మనోజ్.ఆర్, సంగీతం: ఎం.జి.శ్రీకుమార్, కూర్పు: కె.శ్రీనివాస్, ఛాయాగ్రహణం: సంజీవ్‌శంకర్.



నదియా

అఖిల్ చిత్రం పేరు 'హలో'

అందరినీ హలో హలో అని పలకరిస్తూ అలరించబోతున్నాడు అఖిల్ అక్కినేని. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రానికి 'హలో!' అనే పేరును ఖరారు చేశారు. ఆ విషయాన్ని నాగార్జున సోమవారం ట్విట్టర్‌లో వీడియో ద్వారా తెలియజేశారు. శనివారమే అఖిల్ సినిమా పేరుని ఊహించండి అంటూ నాగార్జున ఓ హింట్‌ని ఇచ్చాడు. ఆదివారం నాగచైతన్య కూడా తన సినిమా 'ఏమాయ చేసావె'లోని హల్లో... అంటూ ముగిసే పాటని ట్వీట్ చేసి మరో హింట్ ఇచ్చాడు. దాంతో 'హలో..' పేరుతోనే సినిమా పేరు మొదలయ్యే అవకాశాలున్నాయని అర్థమైంది. 'హలో గురూ ప్రేమకోసమే' అనే పేరు ఖరారు చేస్తారేమో అని ఊహించారంతా. అయితే చిత్రబృందం మాత్రం కేవలం 'హలో!' అని సినిమాకి నామకరణం చేసింది. విక్రమ్ కె.కుమార్ దర్శకత్వం వహించిన చిత్రాలకి రెండు అక్షరాల పేర్లే ఎక్కువగా ఉంటాయి. ఈ చిత్రానికి కూడా అదే సెంటిమెంట్‌ని అనుసరించినట్టు తెలుస్తోంది. నాగార్జున ట్విట్టర్ ద్వారా విడుదల చేసిన వీడియోలో ఎన్టీఆర్, కాజల్, ప్రభాస్, శ్రుతిహాసన్, నాగచైతన్య, రామ్‌చరణ్, వరుణ్ తేజ్, సమంత, సూర్య, నాని, వెంకటేష్, రాజమౌళి, రకుల్‌ప్రీత్‌సింగ్, రానా తదితరులు హలో అంటూ సినిమా పేరును ప్రకటించారు. అక్కినేని నాగేశ్వరరావు పాట 'హలో హలో అమ్మాయి...'తో ఆ వీడియో పూర్తవడం విశేషం. ఈ సినిమాలో అఖిల్ సరసన కల్యాణి ప్రియదర్శన్ కథానాయికగా నటిస్తోంది. డిసెంబరు 22న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు.



అఖిల్



రాశీ ఖన్నా

నా కోసమే పుట్టాయేమో!

"నా శక్తి సామర్థ్యాల గురించి నేను మాట్లాడటం కంటే, వాటి గురించి వేరొకరు చెప్పుకుంటేనే అందం" అంటోంది రాశీ ఖన్నా. నేనేం చేయగలననేది నాకంటే బాగా దర్శకులకే తెలుసని చెబుతోంది. ప్రస్తుతం తెలుగు చిత్రసీమలో ఓ ప్రధాన కథానాయికగా కొనసాగుతోందీమె. మరోపక్క తమిళం, మలయాళం భాషల్లోనూ రాణించే ప్రయత్నం చేస్తోంది. తెలుగులో ఎన్టీఆర్‌తో 'జై లవకుశ', రవితేజతో 'టచ్ చేసి చూడు'తో పాటు వరుణ్‌తేజ్‌తో ఓ చిత్రం చేస్తోంది రాశి. కెరీర్ ఆరంభంతో, ప్రస్తుతాన్ని పోల్చి చూసుకొంటే మీలో మీకు ఎలాంటి మార్పులు కనిపిస్తున్నాయని అడిగితే ఆసక్తికరమైన సమాధానమిచ్చింది రాశీ ఖన్నా. "ఆరంభంలో నాకు నేనుగా కొన్ని పరిమితులు విధించుకొనేదాన్ని. నేను ఫలానా పాత్రలే చేయగలనేమో అనుకొనేదాన్ని. కానీ కొద్దిమంది దర్శకులు నా ఊహకు కూడా అందని రీతిలో నన్ను తెరపై చూపించారు. అప్పట్నుంచి దర్శకులు ఎలాంటి కథలతో, పాత్రలతో వచ్చినా ఇవి నా కోసమే పుట్టాయేమో అనుకొని సిద్ధమైపోతుంటా. నన్నెందుకు ఎంచుకొంటున్నారని అసలు అడగను. ఎలాంటి పాత్రతోనైనా ప్రేక్షకుల్ని మెప్పించడంలోనే నటుల పనితనం దాగి ఉంది. అందుకే ఇక నుంచి సవాళ్లతో కూడిన ప్రయాణం సాగించాలని నిర్ణయించుకొన్నా" అని చెప్పుకొచ్చింది రాశి.

దొరికాం కదాని... రాళ్లు విసురుతున్నారు

అర్జున్‌రెడ్డి వేడుకలో తమ్మారెడ్డి

"నటులకి చేసే పనిపై నమ్మకం ఉండాలి. ఆ నమ్మకంతోనే ఈ సినిమా గురించి మొదట్నుంచీ ధైర్యంగా మాట్లాడుతున్నా. అంతే కానీ అత్యుత్సాహంతో కాదు" అన్నారు విజయ్ దేవరకొండ. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'అర్జున్‌రెడ్డి'. షాలిని కథానాయిక. సందీప్‌రెడ్డి వంగా దర్శకుడు. ప్రణయ్‌రెడ్డి వంగా నిర్మాత. రథన్ స్వరాలు సమకూర్చారు. ఈ నెల 25న సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. సోమవారం హైదరాబాద్‌లో ముందస్తు విడుదల కార్యక్రమం జరిగింది. ఇదే వేడుకలో తొలి సీడీని శర్వానంద్ ఆవిష్కరించారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ "సెన్సార్‌వాళ్లు ఈ సినిమాకి ఏ సర్టిఫికెట్ ఇచ్చారు. ఈ సినిమాతో యువతరం తలెత్తుకొని బతకాలనే సందేశం ఇచ్చాం తప్ప మరొకటి కాదు. రథన్ సమకూర్చిన స్వరాలు బాగున్నాయి" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ఒక సినిమాని చూశాక మనతో పాటే మనింటికి రావాలి అంటుంటారు కదా... అలాగే ఉంటుందీ సినిమా. ఈ యేడాది వీణ్ని తొక్కేయాల్సిందే అనుకొంటుంటారు కొంతమంది. అలా సెన్సార్‌వాళ్లు ఈ సినిమాకి ఏ సర్టిఫికెట్ ఇచ్చార"న్నారు. నిర్మాత మాట్లాడుతూ "ప్రేక్షకులు ప్రత్యేకంగా మాట్లాడుకొనేలా ఉంటుందీ సినిమా" అన్నారు. దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ "తెలుగు చిత్ర పరిశ్రమలో మంచి సినిమాలు రూపుదిద్దుకొంటున్నాయి. అయితే కొన్ని మరుగున పడిపోతున్నాయి. అందుకు కారణం థియేటర్ల కొరత. నిజానికి థియేటర్ల కొరతేమీ లేదు. కబ్జాలో ఉన్నాయంతే. వస్తు సేవల పన్ను వచ్చాక 20 శాతం అదనపు పన్ను సినిమాపై పడుతోంది. రూ.20 టికెట్టుపై రూ. 3 లేదంటే రూ.4 రూపాయలు మాత్రమే నిర్మాతకి వస్తాయి. ఈ మధ్య నాయకులు, సోషల్ మీడియా సినిమావాళ్లలని పిచ్చోళ్లలాగా చూస్తున్నారు. ఊరికే దొరికారు కదా అని ఎవరు పడితే వాళ్లు రాళ్లు విసురుతున్నారు. సినిమా 3 గంటలైతే ఏంటి? ఒక నాయకుడు విమర్శిస్తున్నట్టు అందులో ముద్దులుంటే ఏంటి? ఇష్టం లేకపోతే చూడ్డం మానేయాలంతే. సమస్యల్ని ఎదుర్కోవడానికి సినిమావాళ్లంతా ఏకం కావల్సిన అవసరం ఉంది" అన్నారు. కార్యక్రమంలో తరుణ్‌భాస్కర్, నందినిరెడ్డి, క్రాంతి మాధవ్, శివ నిర్వాణ, స్వప్న దత్ తదితరులు పాల్గొన్నారు.



శర్వానంద్, ప్రణయ్‌రెడ్డి వంగా, సందీప్‌రెడ్డి వంగా, విజయ్ దేవరకొండ, షాలిని

నెలాఖరు నుంచి జలహారతి

- ప్రజల భాగస్వామ్యంతో అట్టహాసంగా చేపట్టాలి
- పోలవరం కాంక్రీటు పనుల వేగం పెంచాలి
- అధికారులకు సీఎం ఆదేశం

ఈనాడు - అమరావతి

జలసిరికి హారతి కార్యక్రమం ఈ నెలాఖరు నుంచి వారం రోజుల పాటు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. కృష్ణా, గోదావరి పుష్కరాల సమయంలో నదులకు హారతి ఇచ్చినట్లే ప్రస్తుతం ప్రజల భాగస్వామ్యంతో వివిధ ప్రాజెక్టులకు, జలాశయాలకు, పంటకుంటలకు హారతి ఇచ్చే కార్యక్రమం చేపట్టాలన్నారు. ఆగస్టు 30 నుంచి జలహారతి ప్రారంభించే అవకాశం ఉంది. వెలగపూడి సచివాలయంలో సోమవారం పోలవరం ప్రాజెక్టు పనుల తీరుపై సమీక్షించడంతో పాటు ఇతర ప్రాజెక్టులపైనా సీఎం సమీక్షించారు. పోలవరంలో కాంక్రీటు పనుల వేగం పెంచాలన్నారు. పనుల పురోగతి, నిధుల వినియోగం, క్షేత్రస్థాయి ఇబ్బందులపై ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలన్నారు. భూగర్భజలాల పరిస్థితిపైనా సమీక్షించారు. భూగర్భజలాలు తక్కువగా ఉన్న చోట చెక్‌డ్యాంల నిర్మాణం వంటి వాటికి ప్రాధాన్యం ఇద్దామని సీఎం అన్నారు. నిర్దేశించుకున్న 28 ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షించారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతలకు సంబంధించి మరో రెండు పంపులు సిద్ధం చేస్తున్నామని సంబంధిత అధికారులు చెప్పారు. వంశధార పనులు జనవరి నాటికి పూర్తి కావాలన్నారు. పోగొండ రిజర్వాయర్ అక్టోబరు 22 నాటికి సిద్ధమవుతుందన్నారు. శారదానదిపై ఆనకట్ట నిర్మాణం పూర్తి కావడంతో అక్కడ జలసిరికి హారతి కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించాలన్నారు. కొండవీటి వాగుపంపింగ్ స్కీంపైనా సమీక్షించారు. ఇంకా పనులు పూర్తి కానందున వరద వస్తే ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి సారించాలన్నారు. గోదావరికి వరద వస్తే సంసిద్ధంగా ఉండి ఎదుర్కోవాలన్నారు. ఈ నెల 26న నుంచి గుంటూరు, కర్నూలు, కృష్ణా జిల్లాల్లో సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని ఇస్రో శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ సమావేశంలో జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిని సచివాలయంలో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

సీఎంతో కాలిఫోర్నియా వర్సిటీ ప్రతినిధుల భేటీ

రాష్ట్రంలోని ఐదు జిల్లాలో నైపుణ్యాభివృద్ధికి సహకారం అందించడానికి యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా ముందుకొచ్చింది. ఆ వర్సిటీ ప్రొఫెసర్ సాల్మన్ డార్విన్ సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అయిదు జిల్లాల్లో వృత్తి నైపుణ్య కేంద్రాలను అభివృద్ధి చేసే ప్రణాళికపై చర్చకు వచ్చింది. ఐదు జిల్లాల్లోని 466 గ్రామాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. వీటికి తగిన సహకారం అందించడానికి తాము ఆసక్తిగా ఉన్నట్లు ప్రొఫెసర్‌సాల్మన్ డార్విన్ ముఖ్యమంత్రికి వివరించారు. ఈ నెల 31వ తేదీన కేఎల్ వర్సిటీలో 'ఓపెన్ ఇన్నోవేషన్ ఫోరమ్' పేరిట సదస్సు నిర్వహించనున్నారు. ఇందులో నాసా, గూగుల్, టాటా లాంటి పెద్దపెద్ద సంస్థలకు చెందిన ప్రతినిధులు హాజరై నైపుణ్యాభివృద్ధికి సంబంధించిన అంశాలపై వివరించనున్నారు. ఈ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాల్గొని ప్రసంగించనున్నారు.

విశాఖ ఇళ్ల పట్టాల పంపిణీలో లంచావతారులు

- సీఎంకు ఆర్టీజీ అధికారుల నివేదిక

విశాఖలో ఇటీవల ఇళ్ల పట్టాల పంపిణీ సందర్భంగా పట్టాలివ్వడానికి 30 మంది అధికారులు లంచాలడిగినట్లు సర్వేలో వెల్లడైందని రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్‌టీజీ) అధికారుల బృందం ముఖ్యమంత్రి చంద్రబాబుకు నివేదించింది. దీంతో వారినుంచి బాధితులకు డబ్బును తిరిగి ఇప్పించడంతోపాటు ఆ అధికారులపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మొత్తంమీద ఇళ్లపట్టాల పంపిణీపై ఎక్కువమంది సంతృప్తి వ్యక్తం చేశారని ఆర్‌టీజీ బృందం వివరించింది. మద్యం విధానంపై 85 శాతంమంది సంతృప్తి వ్యక్తం చేసినట్లు చెప్పగా, ఇళ్ల మధ్య ఇంకా మద్యం దుకాణాలుంటే వాటిని తరలించాలని సీఎం స్పష్టం చేశారు. ఆర్‌టీజీ సర్వేలపై ముఖ్యమంత్రి సోమవారం సమీక్ష నిర్వహించారు. టౌన్‌ప్లానింగ్ పనితీరు, అన్న అమృతహస్తం అమలు, రైతు బజార్లపై సర్వే నివేదికలను అధికారులు అందజేశారు. ఈ సందర్భంగా ఇసుక అక్రమ రవాణా గురించి ముఖ్యమంత్రి ప్రస్తావించారు. వారిపై కఠినచర్యలు తీసుకోవాలని, ఇసుక రీచ్‌లన్నింటి వద్దా సీసీ కెమెరాలు, గట్టి బందోబస్తు పెట్టాలని ఆదేశించారు. అక్రమంగా ఇసుకను తరలించే వాహనాలను సీజ్ చేయాలని, వాటి యజమానులపై భారీ జరిమానాలు విధించాలని సూచించారు. అక్రమ రవాణా గురించి తెలియజేసే వారికి ప్రోత్సాహకాలు అందిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు.





దుప్పట్లు అడ్డుపెట్టి సేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది
★ పుట్టిన శిశువును చూపుతున్న మహిళ

రోడ్డుపైనే మహిళ ప్రసవం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ఓ మహిళ నడిరోడ్డుపైనే శిశువుకు జన్మనిచ్చింది. ఆపదలో ఉన్న ఆమెకు ప్రయాణికులు, వ్యవసాయ కూలీలు అండగా నిలవడంతో ప్రాణాపాయం తప్పింది. కచ్చితమైన ప్రసవ సమయాన్ని వైద్యులు తెలపకపోవడంతోనే ఇలా జరిగిందని మహిళ భర్త ఆరోపించారు. పశ్చిమ గోదావరి జిల్లా ద్వారకాతిరుమల మండలం సూర్యచంద్రరావుపేటకు చెందిన సంపదల కాశీ నిండు గర్భిణి. సోమవారం ఆమెకు నొప్పులు రావడంతో భర్త ద్వారకా తిరుమల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అక్కడి వైద్యులు పరిశీలించి మందులిచ్చారు. ప్రసవానికి ఇంకా నెల రోజుల గడువుందని తెలిపారు. దీంతో భర్త లక్ష్మీనరసింహ ఆమెను ద్విచక్ర వాహనంపై దూబచర్ల తీసుకువెళుతుండగా రాళ్లకుంట వద్దకు వచ్చేసరికి నొప్పులు రాగా ఆమె వాహనం దిగి రోడ్డుపై కూర్చుండిపోయింది. నొప్పులు అధికమవడంతో దారివెంట వెళ్లే మహిళలు, ప్రయాణికులు, పొలాల్లో వ్యవసాయ కూలీలు వచ్చి దుప్పట్లు అడ్డుపెట్టి ఆమె ప్రసవం అయ్యేలా చూశారు. ఆడబిడ్డకు జన్మనివ్వడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ద్వారకా తిరుమల వైద్యులకు ఫోన్ చేయడంతో గంట తర్వాత వైద్యులు వచ్చి వైద్యసేవలందించి ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లారు.

రైల్వే వంతెనలు, మార్గాలు తనిఖీ చేయండి

ఈనాడు, హైదరాబాద్: వర్షాలు కురుస్తున్నందున వంతెనలు, చెరువులు, కుంటల మీదుగా వెళ్తున్న రైల్వే మార్గాలను తనిఖీ చేసి, అవసరమైన చర్యలు తీసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్ డివిజన్ రైల్వే మేనేజర్లకు ఆదేశాలిచ్చారు. సోమవారం సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, నాందేడ్ డివిజన్ల మేనేజర్లతో దూరదృశ్య సమావేశం నిర్వహించారు.

ఈ రైళ్లు రద్దు: వర్షాల నేపథ్యంలో ఈనెల 29న తిరువనంతపురం నుంచి గువాహటి వెళ్లాల్సిన ఎక్స్‌ప్రెస్‌ను, ఈనెల 24న కన్యాకుమారి నుంచి, ఈనెల 31న తాంబరం నుంచి దిబ్రూగడ్ వెళ్లాల్సిన ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దుచేశారు.

చైనా భారీ సైనిక విన్యాసాలు

- భారత్‌ను భయపెట్టడమే లక్ష్యం

దిల్లీ: భారత్‌లో భయాందోళనలు నింపడమే లక్ష్యంగా తమ సైన్యం భారీ యుద్ధవిన్యాసాలకు దిగినట్లు చైనా అధికారిక పత్రిక 'గ్లోబల్ టైమ్స్' పేర్కొంది. డోక్లామ్‌లో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో పీఠభూమి ప్రాంతంలో చేపట్టే యుద్ధానికి సన్నద్ధమయ్యేందుకు వీటిని నిర్వహించినట్లు తెలిపింది. చైనా సైన్యంలో పశ్చిమ విభాగానికి చెందిన 10కిపైగా యూనిట్లు ఈ విన్యాసాల్లో పాల్గొన్నట్లు వివరించింది. వైమానిక, ట్యాంకు విభాగాలు కూడా ఇందులో ఉన్నట్లు పేర్కొంది. భారత్‌కు చేరువలో ఉన్న క్వింగాయ్-టిబెట్ పీఠభూమిలో ఈ పశ్చిమ సైనిక విభాగం కార్యకలాపాలు నిర్వర్తిస్తుంటుంది. చైనా కమ్యూనిస్టు పార్టీ అధికారిక టీవీ ఛానల్ అయిన చైనా సెంట్రల్ టీవీ.. యుద్ధవిన్యాసాలకు సంబంధించిన 5 నిమిషాల వీడియోను ప్రసారం చేసింది. ఈ నెల మొదటి వారంలో కూడా టిబెట్‌లో గుర్తుతెలియని ఒక ప్రాంతంలో జరుగుతున్న సైనిక విన్యాసాలను సీసీ టీవీ ప్రసారం చేసింది. జులైలోనూ ఇలాంటి విన్యాసాలను చైనా సైన్యంలోని టిబెట్ మిలటరీ విభాగం నిర్వహించింది.

లద్దాఖ్ ఘటనలో భారత్‌దే తప్పు: చైనా

బీజింగ్: లద్దాఖ్‌లోని పాంగాంగ్ సరస్సు వద్ద ఇరు దేశాల సైనికుల మధ్య జరిగిన ఘర్షణకు భారత బలగాలదే తప్పని చైనా ఆరోపించింది. దీనిపై భారత్‌కు నిరసన తెలియజేసింది. ఈ నెల 15న లద్దాఖ్ ప్రాంతంలో భారత భూభాగంలోకి చొరబడటానికి ప్రయత్నించిన చైనా సైనికులను భారత బలగాలు అడ్డుకున్న సంగతి తెలిసిందే. ఆ సందర్భంగా ఇరు పక్షాలూ పరస్పరం రాళ్లు రువ్వుకున్నాయి. ఇరు దేశాల సైనికులకు స్వల్పంగా గాయాలయ్యాయి. వాస్తవాధీన రేఖ వెంబడి తమ భూభాగంలోనే తమ సైనికులు గస్తీ తిరుగుతున్నప్పుడు ఈ ఘటన జరిగిందని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి హువా చున్యింగ్ తెలిపారు.

అమెరికా, దక్షిణ కొరియా సంయుక్త విన్యాసాలు ప్రారంభం

సియోల్: అమెరికా, దక్షిణ కొరియాల వార్షిక సంయుక్త సైనిక విన్యాసాలు సోమవారం ప్రారంభమయ్యాయి. తమ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరుగుతాయంటూ ఉత్తర కొరియా అభ్యంతరాల మధ్యే ఇరు దేశాలు విన్యాసాల్ని చేపట్టాయి. వేలమంది సైనికులు 'ఉల్చి ఫ్రీడం గార్డియన్' సంయుక్త సైనిక కసరత్తు నిర్వహించాయి. దక్షిణ కొరియాలో రెండు వారాలపాటుసాగే ఈ విన్యాసాల్లో క్షేత్రస్థాయిలో కాల్పులు, ట్యాంకుల విన్యాసాలు వంటివేమీ లేకుండా కంప్యూటర్ల ఆధారంగా సాధన జరుగుతుంది. ఇవి రక్షణాత్మక విన్యాసాలంటూ ఇరుదేశాలు ప్రకటించినా.. దాడుల కోసం రెచ్చగొట్టే చర్యలంటూ ఉత్తర కొరియా విమర్శించింది. ఈ విన్యాసాల ద్వారా అమెరికా అగ్నికి ఆజ్యం పోస్తోందని వ్యాఖ్యానించింది. వీటిలో సుమారు 17,500 మంది అమెరికా సైనికులు, 50 వేల మంది దక్షిణకొరియా సైనికులు పాల్గొననున్నారు. ఇవి రక్షణాత్మక విన్యాసాలేననీ, వీటిని ఉత్తర కొరియా మళ్లీ రెచ్చగొట్టే చర్యల కోసం ఉపయోగించుకోవద్దని దక్షిణకొరియా అధ్యక్షుడు మూన్ జేఇన్ పేర్కొన్నారు. సంయుక్త విన్యాసాల్ని రద్దు చేసుకోవాలంటూ చైనా మరోసారి పిలుపునిచ్చింది.

బాల్యాన్ని చిదిమేస్తున్న క్షయ!

2015లో భారత్‌లో 55 వేల మంది మృతి

లండన్: భారత్‌లో అత్యధిక సంఖ్యలో పిల్లలు క్షయ(టీబీ)తో చనిపోతున్నట్లు లాన్సెట్ అధ్యయనం వెల్లడించింది. 2015లో ఈ వ్యాధితో 55 వేల మంది పిల్లలు మృతి చెందినట్లు పేర్కొంది. వ్యాధి లక్షణాలను గుర్తించలేకపోవడం.. అవసరమైన పరీక్షలు చేయించకపోవడం వల్లే ఎక్కువ మంది చనిపోతున్నట్లు హెచ్చరించింది. ప్రపంచవ్యాప్తంగా 217 దేశాల్లో ఈ వ్యాధి తీవ్రత ఉన్నట్లు అధ్యయనం వెల్లడించింది. వ్యాధిని పూర్తిగా నయంచేసే మందులు అందుబాటులో ఉన్న నేపథ్యంలో.. దీన్ని సత్వరం గుర్తించి చికిత్స అందిస్తే చాలామంది ప్రాణాలు కాపాడే వీలుందని షెఫీల్డ్, బోస్టన్ విశ్వవిద్యాలయాల నిపుణులు సూచిస్తున్నారు. చాలామంది పిల్లలకు ఇది సోకుతున్నట్లు కూడా తెలియడం లేదని.. ఆయా దేశాలు అప్రమత్తంగా ఉండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించింది.

★ 2015లో ప్రపంచవ్యాప్తంగా 10 లక్షల మంది పిల్లలు (15 ఏళ్లలోపు) క్షయ బారిన పడ్డారు. 217 దేశాల్లో 2.39 లక్షల మంది మృత్యువాత పడ్డారు. ఇందులో 80 శాతం మంది ఐదేళ్లలోపు వారే. ★ పిల్లల మరణాలకు అత్యధికంగా కారణమవుతున్న 10 వ్యాధుల్లో టీబీ ఒకటి. ఈ వ్యాధితో మృతి చెందుతున్న పిల్లల్లో 96 శాతం మంది చికిత్స తీసుకోకపోవడం ఆందోళనకరం.

1న సీపీఎస్ రద్దు కోరుతూ మిలియన్ మార్చ్

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం (సీపీఎస్) రద్దు చేయాలని కోరుతూ ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం విజయవాడలో మిలియన్ మార్చ్ నిర్వహించనుంది. సెప్టెంబర్ 1న తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి బిషప్ అజరయ్య పాఠశాల వరకూ మార్చ్ ఉంటుందని సంఘం నేతలు ఎస్‌కె ఖాజా రహమతుల్లా, కుసుమ మునిప్రసాద్, కె.పార్థసారధి, సచివాలయం మహిళ ఉద్యోగుల నేత వరలక్ష్మి తెలిపారు.

రైలులో కిలో బంగారు ఆభరణాల పట్టివేత

వినుకొండ, న్యూస్‌టుడే: సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న కిలో బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గుంటూరుకు చెందిన విఘ్నేశ్వర బంగారం దుకాణంలో పనిచేస్తున్న గుమస్తా అనూష్ సోమవారం కిలో బంగారు ఆభరణాలు విక్రయ బిల్లులేకుండా రైల్లో తీసుకెళుతుండగా పోలీసులు పట్టుకున్నారు. వినుకొండ రైల్వేస్టేషన్‌లో దించి బంగారంతో పాటు అనూష్‌ను వాణిజ్య పన్నుల శాఖ అధికారికి అప్పగించారు. స్వాధీనం చేసుకున్న ఆభరణాల విలువ సుమారు రూ.29 లక్షలు ఉంటుందని సీటీఓ వై.లక్ష్మణప్రసాద్ తెలిపారు. సంబంధిత వ్యాపారికి నోటీసు ఇస్తామని ఆయన పేర్కొన్నారు.

రొంపిచర్ల ఘటనపై పన్ను విధింపు: నరసరావుపేటకు చెందిన ఎస్‌జేఎస్ జ్యువెలరీస్‌కు చెందిన షేక్‌మహ్మద్‌రఫీ, జిలానీలు 4.830 కిలోల బంగారం ఆభరణాలను ఈ నెల 16న కారులో తరలిస్తుండగా.. పోలీసులకు చిక్కారు. సంబంధిత వ్యాపారికి నోటీసులు జారీ చేసి రూ.11,95,809లు అపరాధ రుసుం విధించినట్లు సీటీవో పేర్కొన్నారు.

ముక్కంటి చెంత.. అశేష భక్తజనం



ముక్కంటి దర్శనానికి నిరీక్షిస్తున్న భక్తులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయం సోమవారం అమావాస్యను పురస్కరించుకుని భక్తజన సంద్రంగా మారింది. అర్ధరాత్రి నుంచే భక్తులు ఆలయ ప్రవేశ గోపురాల వద్ద నిరీక్షించారు. వేకువజామున ఆలయాన్ని తెరిచే సమయానికి అన్ని వరుసలు నిండిపోయాయి. స్వామి, అమ్మవార్లకు నిర్వహించే రుద్రాభిషేకాలు, రాహు, కేతు సర్పదోష నివారణ పూజలు చేయించేందుకు భక్తులు అనూహ్యంగా తరలివచ్చారు. రాహు, కేతు పూజలు, దర్శన టిక్కెట్ల ద్వారా ఒక్క రోజున ఆలయానికి దాదాపు రూ.50 లక్షలకు పైగా ఆదాయం సమకూరింది. దాదాపు 80 వేల మందికి పైగానే ముక్కంటీశుని దర్శనార్థం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

భోగాపురానికి పర్యావరణ అనుమతులు

- 2,004 ఎకరాల్లో విమానాశ్రయ నిర్మాణం
- రూ.2,260 కోట్ల వ్యయం
- వెయ్యిమందికి ఉద్యోగావకాశాలు

ఈనాడు, దిల్లీ, అమరావతి: విజయనగరం జిల్లా భోగాపురంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి కేంద్రం పర్యావరణ అనుమతులు మంజూరుచేసింది. 2,004.52 ఎకరాల్లో రూ.2,260.73 కోట్లతో చేపట్టే ఈ విమానాశ్రయం ద్వారా నిర్మాణ సమయంలో 1100 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని అంచనా. ఇందులో 500 మంది రోజువారీ కార్మికులు, 500 మంది స్థానిక కార్మికులు, వంద మంది అధికారులు పాల్గొనే అవకాశం ఉంది. విమానాశ్రయ కార్యకలాపాలు ప్రారంభించాక వెయ్యిమందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఇందులో 500 మంది శాశ్వత, 500 మంది కాంట్రాక్టు ఉద్యోగులు ఉంటారు. ఈ విమానాశ్రయ నిర్మాణం కోసం అటవీ, ప్రైవేటు, ప్రభుత్వ భూమిని ఉపయోగిస్తున్నారు. ప్రతిపాదిత విమానాశ్రయం విశాఖకు 45 కిలోమీటర్లు, విజయనగరానికి 25 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. తూర్పువైపున కిలోమీటరున్నర దూరంలో బంగాళాఖాతం, పశ్చిమాన కిలోమీటరున్నర దూరంలో ఐదో నంబర్ జాతీయ రహదారి వెళ్తుంది. ప్రతిపాదిత విమానాశ్రయ స్థలం అమతం, రావివలస, సవరపల్లి, గూడెపువలస, కంచేరు, కావులవాడ, రావాడ గ్రామాల పరిధిలోకి వస్తుంది. దీని పరిధిలోకి వచ్చే కంచేరు, కావులవాడ, గూడెపువలస గ్రామాలను ఖాళీ చేయిస్తారు. ఈ విమానాశ్రయానికి విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ నుంచి నీరు సరఫరా చేస్తారు. విమానాశ్రయం కార్యకలాపాలు మొదలుపెట్టిన తర్వాత.. రోజూ 1,576.8 కేఎల్‌డీల నీటి అవసరం ఉంటుంది. ఇందులో 872.5 కేఎల్‌డీ మంచినీళ్లు, 674.7 కేఎల్‌డీ పునఃవినియోగ నీటిని వాడుకుంటారు. విమానాశ్రయంలో ఏ380 లాంటి భారీ విమానాలూ దిగనున్నాయి. ఈ విమానాల రాకపోకల కోసం ఇక్కడ 3.8 కిలోమీటర్ల పొడవైన అతిపెద్ద రన్‌వేను నిర్మిస్తారు. తొలిదశలో ఏటా 60.60లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారని అంచనా వేస్తున్నారు. దీంతోపాటు ఈ విమానాశ్రయంలోనే 600 ఎకరాల్లో పౌరవిమానయాన ఆధారిత పరిశ్రమల కేంద్రాన్ని అభివృద్ధి చేస్తారు. పరిశోధన-అభివృద్ధి కేంద్రం, ప్రయోగశాలలు, మల్టీమోడల్, లాజిస్టిక్స్, ఎగ్జిబిషన్, సమావేశ మందిరం, విమానయాన విద్యా సంస్థ, శిక్షణ కేంద్రం, ప్రయాణికుల కోసం వినోద కేంద్రం లాంటివి ఇందులో ఏర్పాటుచేస్తారు.

విమానాశ్రయం ప్రారంభమైతే ప్రస్తుత విశాఖ విమానాశ్రయంపై ట్రాఫిక్ ఒత్తిడి పూర్తిగా తగ్గనుంది. దేశీయంగా వివిధ రాష్ట్రాలకు అనుసంధానం పెరిగి వ్యాపార లావాదేవీలు విస్తరించుకోడానికి అవకాశం ఏర్పడుతుంది. విశాఖ పర్యాటక ప్రాంతంగా మరింత అభివృద్ధి చెందడానికి మార్గం సుగమం కానుంది.

ఎయిర్‌పోర్ట్ అథారిటీకే నిర్మాణ బాధ్యతలు

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ (బీఐఏసీఎల్) నిర్మాణ, నిర్వహణ బాధ్యతలను ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా దక్కించుకుంది. 'నమూనా తయారీ, నిర్మాణం, పెట్టుబడి, నిర్వహణ, బదిలీ' (డీబీఎఫ్‌ఓటీ) విధానంలో ప్రభుత్వ- ప్రైవేటు భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టు చేపట్టాలని కేంద్రం నిర్ణయించింది. పనులను దక్కించుకోడానికి ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా, జీఎంఆర్ సంస్థలు పోటీ పడ్డాయి. భోగాపురం విమానాశ్రయం ద్వారా వచ్చే ఆదాయంలో 30.2 శాతం వాటా బీఐఏసీఎల్‌కు ఇవ్వడానికి ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ముందుకొచ్చింది. జీఎంఆర్ సంస్థ కేవలం 21.6 శాతం ఆదాయ వాటా ఇవ్వడానికే సిద్ధమైంది. టెండర్ల ఎంపిక నిర్ణయాన్ని బీఐఏసీఎల్ సంస్థ రాష్ట్ర మంత్రిమండలి సమావేశం ముందుకు తేనుంది. మంత్రివర్గం దీన్ని ఆమోదించగానే ఎయిర్‌పోర్టు అథారిటీకి నిర్మాణ పనులను అప్పగించనున్నారు.

విజయవాడ రన్‌వే విస్తరణకూ అనుమతులు

విజయవాడ విమానాశ్రయ రన్‌వే విస్తరణకూ కేంద్రం పర్యావరణ అనుమతులు మంజూరుచేసింది. రాష్ట్ర విభజన అనంతరం విజయవాడ నుంచి రద్దీ పెరిగినందున బోయింగ్ 777, బోయింగ్ 747 విమానాలు తిరిగేందుకు వీలుగా ప్రస్తుతం రన్‌వేను విస్తరించనున్నారు. ప్రస్తుతం ఇక్కడినుంచి ఏటా 3.6 లక్షలమంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. రన్‌వే విస్తరణ తర్వాత ఈ సంఖ్య 7.5 లక్షలకు పెరుగుతుందని అంచనా. ప్రస్తుతం విమానాశ్రయం 531.65 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ప్రస్తుత విస్తరణ పనులకోసం మరో 698 ఎకరాలు సేకరించారు. దీంతో మొత్తం విస్తీర్ణం 1,229.65 ఎకరాలకు చేరనుంది. విస్తరణ పనుల కోసం రూ.144.93 కోట్లు ఖర్చు చేయనున్నారు.



దెబ్బతిన్న అమెరికా యుద్ధనౌక

లైబీరియా ట్యాంకర్‌ను ఢీకొన్న అమెరికా యుద్ధ నౌక

- సింగపూర్ సముద్ర జలాల్లో ప్రమాదం
- పదిమంది యూఎస్ నావికుల గల్లంతు

సింగపూర్: అమెరికా యుద్ధ నౌక ఒకటి లైబీరియాకు చెందిన వాణిజ్య(ట్యాంకర్) నౌకను ఢీకొన్న ఘటనలో పది మంది యుఎస్ నావికులు గల్లంతయ్యారు. మరో అయిదుగురు గాయపడ్డారు. క్షిపణుల విధ్వంసక వ్యవస్థ లున్న అమెరికా యుద్ధ నౌక (జాన్ ఎస్ మెక్‌కెయిన్) సింగపూర్ పోర్టుకు వస్తుండగా మలక్కా జలసంధి సమీప సముద్ర జలాల్లో సోమవారం తెల్లవారు జామున ఈ ప్రమాదం జరిగింది. యుద్ధ నౌక ముందు భాగం కొంత వరకూ ధ్వంసమైంది. ప్రమాద సమయంలో లైబీరియా వాణిజ్య నౌక (అల్నిక్ మెక్)లో 30వేల టన్నుల బరువైన చమురు ఉన్నట్లు సమాచారం. గల్లంతైన నావికుల కోసం గాలింపు జరుగుతోంది. రెండు నెలల వ్యవధిలో అమెరికా యుద్ధ నౌకలు ప్రమాదానికి గురికావటం ఇది రెండో సారి. జూన్‌లో జపాన్‌లోని యొకొసుక సమీపంలోనూ అమెరికా యుద్ధ నౌక ఒకటి ఇలాంటి ప్రమాదానికే గురైంది.

పరిష్కారమా... నీ ఊరెక్కడ?

- మీడియాలో వచ్చే కథనాలపై స్పందన అంతంతమాత్రమే
- జిల్లా అధికార్లలో నిర్లక్ష్య ధోరణి
- ఘోరంగా శ్రీకాకుళం, విశాఖ, నెల్లూరు జిల్లాలు
- నెల రోజుల్లో రెండువేలకు పైగా సమస్యలు
- పరిష్కరించినవి 400 లోపే

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతాశయంతో ఆరంభించిన 'పరిష్కార వేదిక' ద్వారా వచ్చే సమస్యల పరిష్కారం పట్ల అధికార యంత్రాంగంలో పెద్ద స్పందనలేని సరళి కనిపిస్తోంది. ప్రజలకు మెరుగైన పాలన అందించడానికి, వారి సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించడానికి ప్రభుత్వం ఈ పరిష్కార వేదికను ఏర్పాటు చేసింది. ఇందుకోసం 1100 నెంబర్ కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ఈ నెంబరుకు రోజూ కొన్ని వందల మంది ఫోన్ చేసి తమ సమస్యలను ఫిర్యాదు చేస్తున్నారు. వాటిని సంబంధిత శాఖలకు ఇక్కడున్న సిబ్బంది పంపుతూ వాటిపై ప్రగతి నివేదికలు తెప్పిస్తున్నారు. దాంతో పాటు పత్రికలు, ప్రసార మాధ్యమాలు, సామాజిక మాధ్యమాల్లోనూ వస్తున్న ప్రజా సమస్యల పరిష్కారానికి పరిష్కార వేదికలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఈ మొత్తం వ్యవహారాన్ని పర్యవేక్షించడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా 'రియల్‌టైమ్ గవర్నెన్స్ సొసైటీ'ని ఏర్పాటు చేసింది. ఈ విభాగం రోజూ పత్రికల్లో వచ్చే, ప్రసార మాధ్యమాల్లో వచ్చే ప్రజా సమస్యల కథనాలు గుర్తించి వాటిని సంబంధిత అధికారులకు పంపి వాటి పరిష్కారాన్ని పర్యవేక్షిస్తోంది. రియల్‌టైమ్ గవర్నెన్స్ అధికారులు సమస్యలు గుర్తించి అధికారులకు పంపుతున్నా వారి నుంచీ స్పందన మాత్రం అంతంత మాత్రంగానే వస్తోంది.

మూడు జిల్లాల్లో 459కి 18 పరిష్కారం

అధికారిక గణాంకాల ప్రకారమే నెల రోజుల్లో 2,245 సమస్యలను గుర్తించి ఆయా శాఖలకు పంపారు. వాటిలో అధికారులు పరిష్కరించినవి, స్పందించినవి కేవలం 378 మాత్రమే. మిగిలినవన్నీ అపరిష్కృతంగానే ఉన్నాయి. కొన్ని జిల్లాల పరిస్థితి దారుణంగా ఉంది. శ్రీకాకుళంలో 119 ప్రజా సమస్యలను పత్రికల్లో వచ్చిన కథనాల ద్వారా గుర్తిస్తే అక్కడ యంత్రాంగం కేవలం ఐదింటిని మాత్రమే పరిష్కరించింది. విశాఖపట్నంలో 220 సమస్యలను గుర్తిస్తే తొమ్మిదింటిని పరిష్కరించారు. ఇక నెల్లూరులో అయితే 120 సమస్యలకుగాను కేవలం నాలుగు సమస్యలే పరిష్కరించారు. ఈ జిల్లాల్లో సమస్యలపై ఏమాత్రం స్పందించారు, ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో సరైన వివరాలు కూడా పరిష్కార వేదికకు రావడం లేదు. కృష్ణా జిల్లా అధికారులు మాత్రం సమస్యల పరిష్కారానికి కొంత ప్రయత్నం చేస్తున్నారు. ఇక్కడ 304 సమస్యలను గుర్తిస్తే అందులో 98 పరిష్కరించారు. తూర్పు గోదావరి జిల్లాలోనూ 134 సమస్యలకుగాను 72 పరిష్కరించి మిగిలిన వారికంటే ముందంజలో ఉన్నారు. పరిష్కారమైన సమస్యల్లో ఎక్కువగా పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు సంబంధించినవే ఎక్కువ ఉన్నాయి. ఈ శాఖలో 73, వైద్య, ఆరోగ్యం 47, రోడ్లు భవనాలు 42, పంచాయతీరాజ్ 36, ఎక్సైజు శాఖలో 29, విద్యాశాఖలో 18 సమస్యలు పరిష్కారం అయ్యాయి. మిగిలిన శాఖల్లో సమస్యల పరిష్కారం నామమాత్రంగా ఉంది.

నెల రోజుల్లో వివిధ మీడియాల్లో వచ్చిన సమస్యల వివరాలు


జిల్లా	గుర్తించిన మొత్తం సమస్యలు	పరిష్కారమైనవి	అపరిష్కృతంగా ఉన్నవి
శ్రీకాకుళం	119	5	114
విజయనగరం	76	15	61
విశాఖపట్నం	219	9	210
తూర్పుగోదావరి	134	72	62
పశ్చిమ గోదావరి	105	31	74
కృష్ణ	304	98	206
గుంటూరు	282	24	258
ప్రకాశం	122	21	101
నెల్లూరు	120	4	116
చిత్తూరు	183	19	164
కడప	171	18	153
అనంతపురం	190	41	149
కర్నూలు	219	21	198
మొత్తం	2,245	378	1,867

సుఖీభవ

యాంకిలోజింగ్ స్పాండిలైటిస్

నొప్పి ఒకటే కావొచ్చు. అది నడుంలోనే ఉండొచ్చు! కానీ అన్ని నడుంనొప్పులూ ఒకటి కాదు. శారీరక శ్రమ ఎక్కువైనప్పుడో, అడ్డదిడ్డంగా కూచోవటం వల్లనో తలెత్తే నొప్పి వేరు. ఇది విశ్రాంతి తీసుకుంటే తగ్గొచ్చు. కానీ ఒంట్లోనే పొడసూపే సమస్యలతో తలెత్తే నొప్పి వేరు. అలాంటిదే యాంకిలోజింగ్ స్పాండిలైటిస్. ఇది విశ్రాంతితో తగ్గదు సరికదా.. మరింత ఎక్కువవుతుంది! వెన్నెముకలోని పూసలను క్రమంగా దెబ్బతీస్తూ.. చివరికి వెన్నెముకను గడకర్రలానూ మార్చేస్తుంది. తలపై బరువేదో మోస్తున్నట్టుగా మెడనూ, నడుమునూ ముందుకు వంగిపోయేలా చేసేస్తుంది. దీంతో ప్రతి కదలికా భారమై.. రోజువారీ పనులు సైతం చేసుకోలేక.. పక్కలకు చూడాలన్నా శరీరం మొత్తాన్ని తిప్పాల్సిన దుస్థితికి తీసుకెళ్తుంది. దీని ఆనవాళ్లు యవ్వనదశలోనే మొదలైనా పోల్చుకోలేకపోవటం పెద్ద సమస్య. ఇది దీర్ఘకాల జబ్బు కావటం.. దీనిపై అంతగా అవగాహన లేకపోవటం మరో సమస్య. మామూలు నడుమునొప్పిగా కొందరు.. వయసుతో పాటు వచ్చే మార్పుగా మరికొందరు భావిస్తూ చేజేతులా సమస్యను తీవ్రం చేసుకుంటున్నారు. కానీ తొలిదశలోనే గుర్తించి, చికిత్స తీసుకుంటే.. వ్యాయామాల వంటివి ఆరంభిస్తే దీన్ని చాలావరకు అదుపులో ఉంచుకోవచ్చు. అందరిలా హాయిగానూ గడపొచ్చు. అందుకే బిర్రబిగుసుకునే ఈ వెన్ను సమస్యపై సమగ్ర కథనం అందిస్తోంది ఈ వారం సుఖీభవ.

వెన్ను వెదురుకర్ర!





డా॥ వి. శరత్‌చంద్రమౌళి
క్లినికల్ డైరెక్టర్
రుమటాలజీ విభాగం
కిమ్స్ హాస్పిటల్
సికింద్రాబాద్

నిటారుగా నిలబడతాం. ముందుకు వంగుతాం, పక్కలకు తిరుగుతాం. ఇలాంటి పనులన్నింటినీ మనం చాలా తేలికగా, అలవోకగా చేస్తున్నామంటే అదంతా వెన్నెముక చలవే. వెన్నెముకలోని పూసలు సున్నితంగా, మృదువుగా కదలటం వల్లనే. మన తల నుంచి కటి భాగం వరకూ పూసలు పూసలుగా.. ఒక దండలా ఉంటుంది వెన్నెముక. ఒక్కో వెన్ను పూసా ఒక్కో ఎముక అనుకోవచ్చు. వీటి మధ్య మందంగా, దృఢంగా ఉండే రబ్బర్ల వంటి డిస్కులుంటాయి. వీటికి అతుక్కొని ఉండే కండరబంధనాలు (లిగమెంట్లు), స్నాయువులు (టెండన్లు) పూసలు కదిలినా పక్కలకు తొలగిపోకుండా స్థిరంగా పట్టి ఉంచుతాయి. యాంకిలోజింగ్ స్పాండిలైటిస్ సరిగ్గా వీటి మీదే దాడి చేస్తుంది. వెన్నెముకలో వాపు ప్రక్రియ (స్పాండిలైటిస్) మూలంగా పూసలు ఒకదాంతో మరోటి అతుక్కుపోవటం (యాంకిలోజింగ్) దీనిలోని ప్రత్యేకత. ముందుగా వాపు ప్రక్రియ తలెత్తిన చోట ఎముక క్షీణిస్తుంది. దీంతో శరీరం అక్కడ కొత్త ఎముకను వృద్ధి చేసి మరమ్మతు చేయటానికి ప్రయత్నిస్తుంది. ఇది నిరంతరం కొనసాగుతూ రావటం వల్ల పూసలు ఒకదాంతో మరోటి కలిసిపోతాయి. అంటే ఇటుకల మధ్య సిమెంటు వేస్తే గట్టిపడినట్టుగా అయిపోతాయన్నమాట. సమస్య తీవ్రమవుతున్నకొద్దీ- పూసలన్నీ అతుక్కుపోయి వెన్నెముక వెదురుబొంగులా (బ్యాంబూ స్పైన్) తయారవుతుంది కూడా. దీంతో కదలికలు తగ్గిపోవటం, నడుంనొప్పి వంటివన్నీ బయలుదేరతాయి. ఇది ఒక్క వెన్నెముకతోనే ఆగిపోదు. మోకాలు, మోచేయి, పాదాల్లోని కీళ్లపైనా ప్రభావం చూపుతుంది. కొందరిలో కంటి సమస్యకూ దారితీయొచ్చు.



నడుంనొప్పి తొలి లక్షణం

యాంకిలోజింగ్ స్పాండిలైటిస్ తొలి లక్షణం నడుంనొప్పి. ముఖ్యంగా పొద్దున లేస్తూనే తీవ్రమైన నొప్పి వేధిస్తుంటుంది. ఈ నొప్పి 45 నిమిషాల నుంచి గంట వరకూ అలాగే ఉంటుంది! దీని బారినపడ్డవాళ్లు వెంటనే పక్క మీది నుంచి లేవలేరు కూడా. శరీరం కాసేపు కుదురుకున్నాకే లేస్తుంటారు. మామూలుగా నడవటానికి దాదాపు గంట సేపు పట్టొచ్చు. రాత్రిపూట పడుకున్న తర్వాత కూడా నొప్పి వేధించొచ్చు. దీంతో అర్ధరాత్రి, తెల్లవారుజామున మెలకువ వచ్చేస్తుంటుంది. వీరికి పడుకొని పక్కలకు దొర్లటమూ సాధ్యం కాదు. నడుము కదలికలు కష్టం కావటం వల్ల చేతులను పక్కవైపులకు ఆనించి, వాటి సాయంతో నెమ్మదిగా కదులుతుంటారు. పిరుదుల్లో మార్చి మార్చి నొప్పి కనబడటం మరో ప్రత్యేకత. కొద్దిరోజులు ఎడమ పిరుదులో నొప్పి వేధిస్తే.. కొన్నాళ్లకు కుడి పిరుదులో నొప్పి తలెత్తుతుంది. కొందరిలో రెండు పిరుదుల్లోనూ నొప్పి ఉండొచ్చు.

ఎంథిసైటిస్: ఎముకతో స్నాయువులు కలిసేచోట వాపు తలెత్తటం (ఎంథిసైటిస్) మరో ముఖ్య లక్షణం. దీంతో చాలామందిలో మడమల వద్ద ఎకిలిస్ టెండన్‌లో నొప్పి పుడుతుంది. మోకాలు, మోచేతి స్నాయువుల్లోనూ వాపు తలెత్తొచ్చు. ఒకోసారి పక్కటెముకలకు అంటుకునే స్నాయువులు, కండర బంధనాలతోనూ ఒకరకమైన ఛాతీనొప్పి రావొచ్చు. దీంతో శ్వాస తీసుకోవటమూ కష్టమవుతుంది. చాలామంది దీన్ని గుండెనొప్పిగానూ పొరపడుతుంటారు.

కంటి వాపు: యాంకిలోజింగ్ స్పాండిలైటిస్ బాధితుల్లో కనుగుడ్డు మధ్యపొరలో వాపు (యువిఐటిస్) కూడా తలెత్తొచ్చు. దీంతో కళ్లు ఎర్రబడటం, నీరు కారటం, నొప్పి, చూపు మసకబారటం వంటివి మొదలవుతాయి. నిర్లక్ష్యం చేస్తే శుక్లాలకూ దారితీయొచ్చు. అరుదుగా చూపు కూడా పోవచ్చు.

ఇతర లక్షణాలు: బరువు తగ్గటం, నిస్సత్తువ, కొద్దిపాటి జ్వరం, రాత్రిపూట చెమటలు పట్టటం వంటివీ ఉండొచ్చు. ముఖ్యంగా తొలిదశలో ఇలాంటివి కనబడుతుంటాయి.


ఇది మామూలు నడుం నొప్పి కాదు!

మామూలుగా మనం చూసే చాలా నడుంనొప్పులు డిస్కులకు సంబంధించినవే. కావటానికి నడుంనొప్పే అయినా యాంకిలోజింగ్ స్పాండిలైటిస్ వాటికి చాలా భిన్నం. ఉదయం నిద్ర లేచాక వెన్నెముక ఎంతసేపు బిగుసుకుంటోందనే దాన్ని బట్టి వీటి మధ్య తేడాను తేలికగానే గుర్తించొచ్చు. లేచాక అరగంట కన్నా తక్కువసేపుంటే డిస్కు సమస్యగానూ.. ముప్పావుగంట కన్నా ఎక్కువసేపు బిగుసుకుపోతుంటే యాంకిలోజింగ్ స్పాండిలైటిస్‌గానూ అనుమానించొచ్చు.

డిస్కు నడుంనొప్పి	యాంకిలోజింగ్ నొప్పి
డిస్కులు అరగటం, తోసుకొని రావటం దీనికి మూలం.	వెన్నెముకలో వాపు ప్రక్రియ దీనికి మూలం.
ఉదయం పూట వెన్ను బిగుసుకుపోవటం అరగంట కన్నా తక్కువసేపే ఉంటుంది.	సాధారణంగా 45 ఏళ్లలోపే మొదలవుతుంది.
విశ్రాంతి తీసుకుంటే నొప్పి తగ్గుతుంది.	ఉదయం పూట వెన్నెముక బిగుసుకుపోవటం 45 నిమిషాల కన్నా ఎక్కువసేపు ఉంటుంది.
కదలికలు, వ్యాయామాలతో నొప్పి ఎక్కువవుతుంది.	క్రమంగా ఎక్కువవుతూ వస్తుంది. దీర్ఘకాలంగా వేధిస్తుంది.
	కదలికలతో వెన్ను బిగువు, నొప్పి తగ్గుతాయి.
	విశ్రాంతి తీసుకుంటే నొప్పి ఎక్కువవుతుంది.

పిరుదుల్లో ఆరంభం!

యాంకిలోజింగ్ స్పాండిలైటిస్ ప్రధానంగా నడుం, మెడలపై ప్రభావం చూపినప్పటికీ.. ఇది పిరుదుల వద్దే ఆరంభమవుతుంది. కటి ఎముకలోని సాక్రమ్, ఇలియమ్ మధ్యలోని సాక్రోఇలియాక్ కీళ్లలో వాపు తలెత్తటం దీనికి మూలం. అనంతరం నడుము భాగంలోని వెన్నెముక.. అక్కడ్నుంచి ఛాతీ దగ్గర.. తర్వాత మెడ దగ్గరి పూసలు.. ఇలా ఒకదాని తర్వాత మరోటి ప్రభావితమవుతాయి. అయితే కొందరికి సాక్రో ఇలియాక్ కీలులో మొదలై నేరుగా మెడ దగ్గరి పూసల్లోనే సమస్యకు దారితీయొచ్చు. కొందరికి మోకాళ్లు, మోచేతులు, పాదాల్లోని పెద్ద కీళ్లు సైతం ప్రభావితమవుతుంటాయి.



పురుషుల్లోనే ఎక్కువ

నిజానికి కీళ్లవాతం సమస్యలు ఆడవారిలోనే ఎక్కువ. కానీ యాంకిలోజింగ్ స్పాండిలైటిస్ మహిళల్లో కన్నా పురుషుల్లో 9 రెట్లు అధికం. ఇది సాధారణంగా 20-45 ఏళ్ల మధ్యలో మొదలవుతుంది. 45 ఏళ్ల తర్వాత రావటం చాలా అరుదు. ఇది లోలోపలే నెమ్మదిగా ముదురుతూ వస్తుంటుంది. అందుకే చాలామంది జబ్బు మొదలైన 10-20 ఏళ్ల తర్వాత గానీ గుర్తించరు. కొందరు వయసుతో పాటు ఇలాంటి మార్పులు వస్తున్నాయని పొరబడి, నిర్లక్ష్యం చేస్తుంటారు కూడా. జబ్బు తీవ్రత అందరిలోనూ ఒకేలా ఉండకపోవటమూ దీనికి కారణమే. ఇది ఒకొకరిలో ఒకోలా ఉంటుంది. కొందరిలో తీవ్ర దశకు చేరితే.. మరికొందరికి తొలిదశ లక్షణాలతోనే ఆగిపోవచ్చు. ఆ తర్వాత మళ్లీ ఎప్పుడూ కనబడకపోనూవచ్చు.

జీవనశైలి మార్పులతో మేలు

యాంకిలోజింగ్ స్పాండిలైటిస్ బాధితులు క్యాల్షియం, విటమిన్ డితో కూడిన పదార్థాలు మరింత ఎక్కువగా తీసుకోవటం మంచిది. ఖర్జూరం, అంజీరా వంటి ఎండుఫలాలు.. బాదం, అక్రోట్ల వంటి గింజపప్పులు ఎంతో మేలు చేస్తాయి. గోరువెచ్చటి నీటితో స్నానం చేయటం ద్వారా నొప్పి నుంచి ఉపశమనం కలుగుతుంది. బరువును అదుపులో ఉంచుకోవటం, పొగ అలవాటుకు దూరంగా ఉండటం ఉత్తమం. మెడను విరవటం, గట్టిగా మర్దనలు చేయటం తగదు. ముందు నుంచే దిండు సైజు తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. మరీ గట్టిగా, మరీ మెత్తగా లేని పరుపులు వాడుకోవాలి. వీరికి ప్రమాదాల్లో కుదుపులకు ఎముకలు విరిగే అవకాశం ఎక్కువ కాబట్టి జాగ్రత్తగా ఉండాలి.

ఎందుకొస్తుంది?

యాంకిలోజింగ్ స్పాండిలైటిస్ ఎందుకొస్తుందో కచ్చితంగా చెప్పలేం. కానీ హెచ్ఎల్ఏ బి27 జన్యువుతో దీనికి బలమైన సంబంధం ఉంటుండటం మాత్రం నిజం. యాంకిలోజింగ్ స్పాండిలైటిస్ బారినపడ్డ 90% మందిలో ఈ జన్యువు కనబడుతుండటమే దీనికి నిదర్శనం. అయితే హెచ్ఎల్ఏ బి27 జన్యువు ఉన్నా కూడా జబ్బు రావాలనేమీ లేదు. ఈ జన్యువు ఉన్నవారిలో కేవలం 2% మందికే వచ్చే అవకాశముంది. కాబట్టి జన్యువు ఉండటంతో పాటు నడుంనొప్పి, కీళ్లనొప్పులు, ఉదయం పూట శరీరం బిగుసుకుపోవటం వంటి లక్షణాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని సమస్యను నిర్ధరించాల్సి ఉంటుంది. ఇది వంశపారంపర్యంగా వస్తుందనీ చెప్పలేం. ఎందుకంటే హెచ్ఎల్ఏ బి27 తల్లిదండ్రుల నుంచి పిల్లలకు సంక్రమించే అవకాశం 50 శాతమే. ఒకవేళ పిల్లల్లో జన్యువు ఉన్నా కూడా జబ్బు వచ్చే అవకాశం 15 శాతమే కావటం గమనార్హం. పేగుల్లో ఇన్‌ఫెక్షన్, మూత్ర ఇన్‌ఫెక్షన్ల వంటి ఇతరత్రా అంశాలు కూడా దీన్ని ప్రేరేపించొచ్చు.

నిర్ధరణ-పరీక్షలు

యాంకిలోజింగ్ స్పాండిలైటిస్ తీవ్రమైతే చూడగానే గుర్తుపట్టొచ్చు. వీరిలో శరీర భంగిమ బాగా మారిపోతుంది. నడుము ముందుకు వంగిపోయి, గూని వచ్చినట్టుగా ఉంటారు. మెడను అటూఇటూ సరిగా తిప్పలేరు. పక్కకు చూడాలంటే శరీరం మొత్తాన్ని తిప్పి చూస్తారు. ముందుకు వంగి పాదాలను చేత్తో తాకటమూ సాధ్యం కాదు. బాసింపట్టు వేసుకొని కూచోవటం (సుఖాసనం) సాధ్యం కాదు. వీటిని బట్టి చాలావరకు దీన్ని సులభంగానే గుర్తించొచ్చు. అయితే అందరిలోనూ ఇలాంటి లక్షణాలే ఉండాలనేమీ లేదు. అందువల్ల రక్తపరీక్ష, జన్యుపరీక్ష, ఎక్స్‌రేల వంటి వాటి ద్వారా సమస్యను నిర్ధరిస్తారు. వీరికి ఈఎస్ఆర్, సీఆర్‌పీ ఎక్కువగానూ.. హిమోగ్లబిన్ తక్కువగానూ ఉంటుంది. జన్యుపరీక్షలో హెచ్ఎల్ఏ బి27 జన్యువు ఉంటే బయటపడుతుంది.

ఎక్స్‌రే: ఇందులో కండరబంధనాలు, స్నాయువులు గట్టిపడటం.. వెన్నుపూసలు, కీళ్ల మధ్య ఖాళీ పూడుకుపోవటం వంటివి తెలుస్తాయి. సాక్రో ఇలియాక్ కీళ్లు గట్టిపడితే సమస్య తొలిదశలో ఉందని అర్థం. అదే తీవ్రదశకు చేరుకుంటే కీళ్లు పూర్తిగా పూడుకుపోతాయి. ఏమాత్రం ఖాళీ కనిపించదు. కొన్నిసార్లు ఎక్స్‌రేలో తేడా కనబడకపోయినా లక్షణాలు ఉండొచ్చు. ఇలాంటివారికి ఎంఆర్ఐ చేసి పరిశీలిస్తారు. అవసరమైతే ఐసోటోప్ బోన్‌స్కాన్ కూడా చేస్తారు.

చికిత్స- వ్యాయామమే కీలకం

యాంకిలోజింగ్ స్పాండిలైటిస్ మూలంగా దెబ్బతిన్న ఎముక తిరిగి కోలుకోవటం దాదాపు అసాధ్యం. అందువల్ల సమస్యను వీలైనంత త్వరగా నిర్ధరించి, చికిత్స తీసుకోవటం చాలా అవసరం. దీంతో ఎముక మరింత దెబ్బతినకుండా కాపాడుకోవచ్చు. ఇందుకు ఫిజియోథెరపీ, వ్యాయామాలు, మందుల వంటివి బాగా ఉపయోగపడతాయి.

ఫిజియోథెరపీ: వెన్ను బిర్రబిగుసుకోవటానికి విశ్రాంతి పెద్ద శత్రువు. ఎందుకంటే కదలికలు తగ్గినకొద్దీ కీళ్లు బిగుసుకుపోవటం ఎక్కువవుతుంది. చురుకుగా ఉండటం, బాగా కదిలేలా చూసుకోవటమే దీనికి మంచి మందు. అందుకే చికిత్సలో ఫిజియోథెరపీ, వ్యాయామాలే చాలా కీలకం. రోజుకు కనీసం గంట సేపు వ్యాయామం చేయటం అవసరం. నొప్పులు ఎక్కువున్నా మందులు తీసుకుంటూనైనా వ్యాయామాలు ఆరంభించాలి. కొందరు యువకులు వ్యాయామాన్ని పెద్దగా పట్టించుకోరు. కదలికలన్నీ బాగానే ఉంటున్నాయి కదా అని నిర్లక్ష్యం చేస్తుంటారు. కానీ దీర్ఘకాలంలో ఇది తీవ్ర అనర్థాలను తెచ్చిపెడుతుంది. వెన్నెముక గడకర్రలా తయారయ్యాక చేసేదేమీ ఉండదని గుర్తించాలి. వీరికి ఈత, యోగ బాగా ఉపయోగపడతాయి. వీలైతే నడక వంటి ఇతరత్రా వ్యాయామాలూ చేయొచ్చు. ఒకసారి ఫిజియోథెరపీ తీసుకొని, వ్యాయామాలను నేర్చుకున్నాక ఎవరికివారు ఇంట్లోనే చేసుకోవచ్చు. కానీ పెద్ద పెద్ద బరువులు ఎత్తటం, బాక్సింగ్, ఫుట్‌బాల్ వంటి ఒంటికి దెబ్బలు తగలటానికి ఆస్కారం గల వ్యాయామాలు చేయకూడదు.

> **ఒక పూట భోజనం మానేసినా తప్పులేదు గానీ వ్యాయామం మాత్రం మానరాదు.**

నొప్పి మందులు: ఐబూప్రొఫెన్, డైక్లోఫెనాక్ వంటి ఎన్ఎస్ఏఐడీ రకం నొప్పి మందులు బాగా ఉపయోగపడతాయి. మొదట్లో రెండు మూడు నెలల పాటు క్రమం తప్పకుండా వీటిని వాడుకోవాల్సి ఉంటుంది. అప్పటికి వ్యాయామాల ప్రభావం మొదలవుతుంది. కొంతకాలానికి వ్యాయామమే మందుగా పనిచేస్తుంది. నొప్పి తగ్గుతూ వస్తుంది. తర్వాత క్రమంగా నొప్పి మందులు మానెయ్యొచ్చు. అయితే నొప్పి మందులను సొంతంగా కొనుక్కొని వేసుకోవటం తగదు. డాక్టర్ల పర్యవేక్షణలోనే వాడాలి. లేకపోతే కిడ్నీలు దెబ్బతినటం వంటి దుష్ప్రభావాలు తలెత్తొచ్చు.

సల్ఫసలజైన్, మిథట్రెక్సేట్: ఇవి కీళ్లవాతానికి దారితీసే మూల కారణాలను తగ్గించేందుకు ప్రయత్నిస్తాయి. వీటి వాడకం ఆరంభించిన రెండు, మూడు నెలల తర్వాత పూర్తి ప్రభావం కనబడుతుంది. సల్ఫసలజైన్‌ను ఉదయం, సాయంత్రం 1 గ్రాము మోతాదులో ఇస్తారు. మిథట్రెక్సేట్‌ను వారానికి ఒకసారి మాత్రమే.. అదీ 15-25 మి.గ్రా. మోతాదులో ఇస్తారు. మిథట్రెక్సేట్‌తో దుష్ప్రభావాలు తలెత్తకుండా పాటు ఫోలిక్ యాసిడ్ కూడా తీసుకోవాల్సి ఉంటుంది. గర్భధారణకు ప్రయత్నించేవారు మూడు నెలల ముందుగానే మిథట్రెక్సేట్ మానెయ్యాల్సి ఉంటుంది.

స్టిరాయిడ్లు: కీళ్లు బాగా వాచిపోయి, విపరీతమైన నొప్పితో బాధపడేవారికి ఇంజెక్షన్ల రూపంలో నేరుగా కీళ్లలోకి ఇస్తారు. దీంతో వెంటనే ఉపశమనం కలుగుతుంది. ఇవి ఎంథెసైటిస్‌కు కూడా బాగా ఉపయోగపడతాయి. అరుదుగా కొందరికి స్టిరాయిడ్ మాత్రలు ఇవ్వాల్సి రావొచ్చు.

బయలాజికల్స్: ఇవి సజీవ కణాల నుంచి ఉత్పత్తి చేసే ప్రోటీన్ అణువులు. చాలా వేగంగా, సమర్థంగా పనిచేస్తాయివి. కాకపోతే ఖరీదు ఎక్కువ. ఇటీవలి కాలంలో కాస్త చవకగానూ లభిస్తున్నాయి. వీటి రాకతో కీళ్లవాతం చికిత్సలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ఇవి వాపుప్రక్రియను ప్రేరేపించే టీఎన్ఎఫ్, ఇంటర్‌ల్యూకిన్-17 అనే సైటోకైన్లను అడ్డుకుంటూ.. వెన్నెముక బిగుసుకుపోవటాన్ని, కీళ్లవాపును తగ్గిస్తాయి. యాంటీ టీఎన్ఎన్ఎఫ్ మందుల్లో ఇన్‌ఫ్లిక్సిమాబ్, ఎటనొర్‌సెప్ట్, అడలి మాబ్, గొలిముమాబ్, సెరటొలిజుమాబ్ అని ఐదు రకాలు అందుబాటులో ఉన్నాయి. తాజాగా సెకిక్యునిమాబ్ అనే యాంటీ ఐఎల్-17 యాంటీబాడీ చికిత్స కూడా అందుబాటులోకి వచ్చింది. ఇప్పుడు బయలాజికల్స్ మాదిరిగానే పనిచేసే ఎటాసెప్ట్, ఇన్‌ఫ్లిమాబ్, ఎగ్జిమ్షియా వంటి బయోసిమిలర్లు కూడా వస్తున్నాయి. వీటి ఖరీదూ తక్కువే.

మెదడుకు యవ్వన 'బీట్'!



మెదడు చురుకుగా ఉండాలని కోరుకుంటున్నారా? అయితే వ్యాయామం చేయటానికి ముందు కాస్త బీట్‌రూట్ రసం తాగి చూడండి. ఎందుకంటే ఇలా చేయటం వల్ల విషయగ్రహణ సామర్థ్యం, భావోద్వేగాలు, కదలికలతో ముడిపడిన మెదడు భాగాలు ఆరోగ్యంగా ఉంటున్నట్టు వేక్ ఫారెస్ట్ విశ్వవిద్యాలయ అధ్యయనం ఒకటి పేర్కొంటోంది. బీట్‌రూట్‌లో నైట్రేట్ దండిగా ఉంటుంది. ఇది వ్యాయామం చేసేప్పుడు త్వరగా అలసిపోకుండా చూడటానికి, మెదడుకు రక్త సరఫరా మెరుగవ్వటానికి తోడ్పడుతుందని పరిశోధకులు చెబుతున్నారు. దీంతో మెదడు క్షీణించటమూ తగ్గుతుంది. అంటే మెదడు ఆయుష్షు కూడా పెరుగుతుందన్నమాట. నైట్రిక్ ఆక్సైడ్ చాలా శక్తిమంతమైంది. ఇది మన శరీరంలో ఆక్సిజన్ అవసరమైన భాగాల్లోకి చొచ్చుకొని వెళ్తుంది. ఆక్సిజన్‌ను పెద్దమొత్తంలో వినియోగించుకునే అవయవం మెదడే. కాబట్టి ఇది మెదడుకు మరింత ఎక్కువగా ఆక్సిజన్ సరఫరా అయ్యేలా చేస్తుంది. బీట్‌రూట్‌లోని నైట్రేట్ ముందు నైట్రైట్‌గానూ, అనంతరం నైట్రిక్ ఆక్సైడ్‌గానూ మారుతుంది. ఇది రక్తనాళాలు విప్పారేలా చేస్తుంది. ఫలితంగా రక్త ప్రసరణ సాఫీగా జరుగుతుంది. బీట్‌రూట్ రసంతో రక్తపోటు తగ్గుతున్నట్టు గత అధ్యయనాల్లోనూ వెల్లడైంది. ఇది కూడా మెదడుకు మేలు చేసేదే. కాబట్టి బీట్‌రూట్‌ను ఆహారంలో భాగంగా చేసుకోవటం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

పుండు మానదేం?

చర్మం మీద ఎక్కడ పుండు పడినా ఇబ్బందే. గీసుకోవటం, కోసుకుపోవటం వంటి పైపై గాయాలకు ప్రథమ చికిత్స చేసి, కట్టుకడితే తేలికగానే మానిపోతాయి. కానీ చర్మం లోలోతుల్లోకి చొచ్చుకెళ్లే పుండ్ల విషయంలో నిర్లక్ష్యం తగదు. ఏమాత్రం అశ్రద్ధ చూపినా ఇన్‌ఫెక్షన్ తలెత్తొచ్చు. అలాగే కండరం, ఎముక, స్నాయువులు, నాడుల వంటివి దెబ్బతినొచ్చు కూడా. కొన్నిసార్లు అవయవాలు తొలగించాల్సిన పరిస్థితికీ దారితీస్తుంది. ఇలా దీర్ఘకాలం వేధించే పుండ్లలో చాలా రకాలున్నాయి.

బ్యాక్టీరియా, వైరస్, ఫంగల్ ఇన్‌ఫెక్షన్లకు సరైన చికిత్స తీసుకోకపోవటం వల్ల కొందరికి దీర్ఘకాలంగా పుండ్లు మానకుండా వేధిస్తుంటాయి.

తీవ్రంగా గాయమైనప్పుడు రక్తప్రసరణ తెగిపోవటం వల్ల తగినంత ఆక్సిజన్, పోషకాలు అందకపోవటం కూడా కొందరిలో దీర్ఘకాల పుండ్లు తలెత్తుతుంటాయి.

జబ్బులతో దీర్ఘకాలం మంచాన పడ్డవారికి, గంటలకొద్దీ చక్రాల కుర్చీలో కూచునేవారికి చర్మం మీద ఒత్తిడి పడి, రక్తప్రసరణ దెబ్బతినటం వల్ల పుండ్లు పడుతుంటాయి. మధుమేహులకు, కాళ్లలోని రక్తనాళాల్లో సమస్యలు గలవారికి, పోషణలోపం గలవారికి కూడా వీటి ముప్పు ఎక్కువే. ఇవి ఒక పట్టాన మానవు.



నివారణ-చికిత్స

దీర్ఘకాల పుండ్లకు దారితీసే ముప్పులను నివారించుకోవటమే అన్నింటికన్నా ఉత్తమమైన పద్ధతి. పుండు పడిన చోట శుభ్రంగా ఉంచుకోవటం, డాక్టర్ చెప్పినట్టుగా మందులు వాడుకోవటం తప్పనిసరి. ఎక్కువసేపు ఒకే వైపు పడుకోకుండా చూసుకోవటం, తరచుగా పక్కలకు దొర్లటం ద్వారా ఒత్తిడి పుండ్లు పడకుండా చూసుకోవచ్చు. దీర్ఘకాల పుండ్ల చికిత్సలో వాటికి దారితీస్తున్న కారణాలను తగ్గించటానికే ప్రాధాన్యం ఇస్తారు. కొందరిలో పుండ్లు తలెత్తిన చోట మృత కణజాలాన్ని తొలగించాల్సి ఉంటుంది. దీంతో రక్తప్రసరణ మెరుగుపడి.. పుండు పడిన భాగానికి తగినంత ఆక్సిజన్, పోషకాలు అందుతాయి. తరచుగా కట్టు మారుస్తుండటం, పుండ్లను శుభ్రం చేయటం, యాంటీబయోటిక్ మందులు రాయటం, అవసరమైతే నొప్పి నివారణ మందులు వాడుకోవటం ద్వారా పుండ్లు త్వరగా మానేలా చూసుకోవచ్చు. అయితే పుండ్లు మొండిగా మారాక బాధపడటం కన్నా అవి తలెత్తకుండా చూసుకోవటమే మేలు. ఇందుకు ఆరోగ్యకరమైన జవనశైలిని పాటించటం.. మధుమేహం, కాలి రక్తనాళాల్లో పూడికల వంటి ఆయా జబ్బులను నియంత్రణలో ఉంచుకోవటం ఉత్తమం.

నౌకాదళంలోకి ఉభయచర యుద్ధనౌక



దిల్లీ: నేల, సముద్రంలోనూ పోరాడగలిగేలా ఉభయచర యుద్ధ సామర్థ్యాన్ని భారత నౌకాదళం మరింత పెంచుకోనుంది. ఈ దిశగా సోమవారం ఒక అధునాతన 'ల్యాండింగ్ క్రాఫ్ట్ యుటిలిటీ' (ఎల్‌సీయూ) యుద్ధనౌక మన అమ్ములపొదిలో చేరింది. దీనిద్వారా యుద్ధట్యాంకులు, ఇతర భారీ ఆయుధ వ్యవస్థలు, సైనిక బలగాలను యుద్ధరంగానికి రవాణా చేయవచ్చు.

పోర్ట్‌బ్లెయిర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో అండమాన్, నికోబార్ దీవుల లెఫ్టినెంట్ గవర్నర్ జగదీశ్ ముఖీ ఈ నౌకను నావికా దళంలోకి ప్రవేశపెట్టారు. దీన్ని స్వదేశీ పరిజ్ఞానంతో కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ సంస్థ రూపొందించింది. ఈ యుద్ధనౌక అండమాన్ దీవుల్లోనే విధులు నిర్వర్తిస్తుంది. ఈ శ్రేణికి చెందిన మరో ఆరు నౌకలు నిర్మాణంలో ఉన్నాయి. వచ్చే రెండేళ్లలో అవి నౌకాదళంలో చేరనున్నాయి.

వైమానిక దళానికి మరో 36 రాఫేల్ యుద్ధవిమానాలు

భారత వైమానిక దళం కోసం ఫ్రాన్స్ నుంచి మరో 36 రాఫేల్ యుద్ధవిమానాల కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం త్వరలో ఆమోదం తెలిపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ దళం కోసం ఇప్పటికే 36 రాఫేల్‌లకు భారత్ ఆర్డర్ ఇచ్చింది. అయితే నౌకాదళం కోసం 56 యుద్ధవిమానాలు అవసరం కావడంతో పాటు భారత్‌లో తయారీ కార్యక్రమం దృష్ట్యా వైమానిక దళానికి మరో 36 రాఫేల్‌లను అందించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తొలుత నిర్ణయించిన ప్రకారం 36 యుద్ధవిమానాలనే కొనుగోలు చేస్తే.. వాటిని భారత్‌లో ఉత్పత్తి చేసేందుకు మౌలికవసతులను ఏర్పాటు చేయడం సాధ్యం కాదు. ఎఫ్-18, రాఫేల్ యుద్ధవిమానాలపై నౌకాదళం ఆసక్తి ప్రదర్శిస్తోంది. గణనీయ సంఖ్యలో కొనుగోలుకు సిద్ధపడితే వీటిని భారత్‌లోనే ఉత్పత్తి చేసేందుకు రెండు సంస్థలూ సిద్ధంగా ఉన్నాయి.

చైనాలో పట్టాలెక్కనున్న వేగవంతమైన బులెట్ రైలు

- **బీజింగ్ నుంచి షాంఘైకి నాలుగున్నర గంటల్లోనే**



బీజింగ్: ప్రపంచంలో అత్యంత వేగంగా ప్రయాణించే బులెట్ రైలును చైనా సెప్టెంబరు 21 నుంచి నడపనుంది. రాజధాని బీజింగ్ నుంచి వాణిజ్య రాజధాని షాంఘైకి (దూరం 1250 కి.మీ.) ఈ రైలు కేవలం నాలుగున్నర గంటల్లో చేరుకోగలదు. ప్రస్తుతం నడుస్తున్న బులెట్ రైళ్లు ఈ దూరానికి ఆరు గంటల సమయం తీసుకుంటున్నాయి. ఫక్సింగ్ పేరుతో ప్రవేశపెడుతున్న అధునాతన బులెట్ రైళ్లు గంటకు 350 కి.మీ. వేగంతో ప్రయాణించగలవు. వాణిజ్య ప్రాతిపదికన ప్రపంచంలో అత్యంత వేగవంతమైన రైలు ఇదే అవుతుందని చైనా రైల్వే సంస్థ తెలిపింది. మొట్టమొదటి అధికవేగ రైలును 350 కి.మీ. వేగంతో బీజింగ్ నుంచి తియాంజిన్‌కు 2008 ఆగస్టులో చైనా నడిపింది. ఆ తర్వాత మరో మూడు అధికవేగ మార్గాలను తెరిచింది. 2011 జులైలో రెండు బులెట్ రైళ్లు ఒకదానినొకటి ఢీకొని 40 మంది చనిపోయిన తర్వాత వీటి వేగాన్ని 250-300 కి.మీ.కి తగ్గించింది. కొత్తగా ఫక్సింగ్ రైళ్లను జూన్‌లో సిద్ధం చేసింది. ఇవి గరిష్ఠంగా గంటకు 400 కి.మీ. దూరం ప్రయాణించగలవు. వీటి భద్రత, విశ్వసనీయతపై గత నెలలోనే పరీక్షలన్నీ పూర్తయ్యాయి.

పూర్తిగా దేశీయంగా తయారైన ఈ రైళ్లపై మేధోపరమైన హక్కులన్నీ చైనాకే ఉన్నాయి. వచ్చే నెల 21 నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి వస్తున్న ఈ రైళ్లు రోజుకు 7 సార్లు బీజింగ్-షాంఘై మధ్య తిరుగుతాయి. ఈ రెండు నగరాల మధ్యనున్న దూరం భారతదేశంలో జమ్ము నుంచి భోపాల్‌కి ఉన్న దూరంతో సమానం. ప్రపంచంలో అత్యంత పొడవైన అధిక వేగ రైల్వే వ్యవస్థ (22 వేల కి.మీ.) చైనాలోనే ఉంది. ప్రపంచంలో ఉన్న మొత్తం వ్యవస్థలో ఇది 60 శాతంతో సమానం.

ఉద్యమ స్ఫూర్తితో నవభారతం



ప్రధాని అధ్యక్షతన భాజపా పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్, సుష్మాస్వరాజ్ తదితరులు

ఈనాడు, దిల్లీ: 2022 నాటికి నవభారతాన్ని తీర్చిదిద్దాలనే లక్ష్యాన్ని సాకారం చేసేందుకు భాజపా పాలిత రాష్ట్రాలన్నీ ఉద్యమ స్ఫూర్తితో పనిచేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. పేదల అనుకూల పథకాలను వేగంగా అమలు చేయాలనీ, ప్రభుత్వ పనుల్లో పారదర్శకతను పెంచాలనీ సూచించారు. సోమవారం సాయంత్రం భాజపా కేంద్ర కార్యాలయంలో పార్టీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో జరిగిన సమావేశంలో ప్రధాని ప్రసంగించారు. భాజపా జాతీయాధ్యక్షుడు అమిత్‌షాతో కలిసి ఆయా రాష్ట్రాల్లో సాగుతున్న పనుల్ని, కేంద్ర పథకాల అమలు తీరును సవివరంగా సమీక్షించారు. అయిదేళ్ల కార్యాచరణ ప్రణాళికను వారికి అందజేశారు. ఇకపై పార్టీ పాలిత రాష్ట్రాల పనులపై మోదీ, షా ప్రతీ మూడు నెలలకోసారి సమీక్ష నిర్వహించనున్నారని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి రమణ్‌సింగ్ ఈ సమావేశానంతరం విలేకరులకు వెల్లడించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం, పేదల అనుకూల పథకాల అమలు, డిజిటల్ లావాదేవీలకు సహకరించడం వంటి అంశాలూ చర్చకు వచ్చాయని యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ చెప్పారు. నవభారతాన్ని చేరుకోవడంపై ప్రధాని, పార్టీ అధ్యక్షుడు విలువైన మార్గదర్శనం చేశారని తెలిపారు.

12 మంది సీఎంలు హాజరు

2019 సార్వత్రిక ఎన్నికలతో పాటు కొన్ని శాసనసభలకు జరగనున్న ఎన్నికలపై మోదీ, షా సమాలోచనలు జరిపారు. సమావేశానికి 12 మంది ముఖ్యమంత్రులతో పాటు ఆరుగురు ఉప ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు- రాజ్‌నాథ్‌సింగ్, సుష్మా స్వరాజ్ హాజరయ్యారు. ప్రధానంగా రాజకీయ వ్యూహంపై చర్చించడంతో పాటు క్షేత్ర స్థాయిలో కేంద్ర పథకాల అమలు తీరునూ సమీక్షించారు. ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగ బద్ధత కల్పించే బిల్లుకు రాజ్యసభలో కాంగ్రెస్ అడ్డుపడిన తీరును ఈ సమావేశంలో మోదీ, షా గుర్తు చేశారు. ఓబీసీలకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకమనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నిర్ణయించినట్లు ఆదిత్యనాథ్ చెప్పారు. కేంద్ర మంత్రివర్గాన్ని విస్తరించాలన్న ప్రయత్నాలు, ఇటీవల జేడీ(యు) పార్టీ కూడా ఎన్డీఏ కూటమిలో చేరిన నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకొంది. 2019 ఎన్నికల్లో 350కి పైగా లోక్‌సభ స్థానాలను దక్కించుకోవాలన్న లక్ష్యాన్ని చేరుకొనేందుకు అనుసరించాల్సిన వ్యూహాన్ని సమావేశంలో చర్చించారు. 2014 ఎన్నికల్లో విజయం సాధించిన స్థానాల్లో 80 చోట్ల ఆ గెలుపును నిలబెట్టుకోవడం కష్టం కావచ్చనే అంచనాతో దానిని భర్తీ చేసుకునేలా 80 నుంచి 120 కొత్త స్థానాలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. భాజపా ముఖ్యమంత్రులతో మోదీ, షా భేటీ కావడం ఇది మూడోసారి. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ, పార్టీపరమైన మార్పులకు రంగం సిద్ధమైన తరుణంలో ఈ భేటీపై పార్టీ వర్గాలన్నీ దృష్టి సారించాయి. సమావేశానికి కొద్దిసేపటి ముందు కేంద్ర మంత్రులు రాజీవ్ ప్రతాప్ రూడీ, ఉపేంద్ర కుశ్వాహా, చౌధరి బీరేంద్రసింగ్‌లతో అమిత్‌షా సమావేశమయ్యారు. విస్తరణలో రూడీకి కేబినెట్ పదవి ఇచ్చి, బీరేంద్రసింగ్‌కు శాఖను మార్చి, కుశ్వాహాకు ఉద్వాసన పలకవచ్చని తెలుస్తోంది. వచ్చే నెల 6-7 తేదీల్లో మయాన్మార్ పర్యటనకు ప్రధాని వెళ్లనున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ లోగానే విస్తరణ పూర్తికావచ్చని భావిస్తున్నారు.

పీఎస్‌ఎల్‌వీ కోసం కన్సార్టియం

- **ఇస్రో యోచన**

దిల్లీ: అంతర్జాతీయ అంతరిక్ష విపణిలో గణనీయ వాటాను దక్కించుకునేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) వ్యూహరచన చేస్తోంది. ఈ దిశగా తన సామర్థ్యాన్ని పెంచుకోవడంపై దృష్టి సారించింది. ప్రైవేటు భాగస్వామ్యంతో కన్సార్టియంను ఏర్పాటు చేసి, పీఎస్‌ఎల్‌వీలను నిర్మించాలని యోచిస్తున్నట్లు ఇస్రో అధిపతి ఎ.ఎస్.కిరణ్ కుమార్ తెలిపారు. "వాహకనౌక ప్రయోగాల సంఖ్యను పెంచేందుకు ప్రయత్నిస్తున్నాం. రాకెట్ల నిర్మాణానికి సంయుక్త వెంచర్‌తో కూడిన ఒక కన్సార్షియంను ఏర్పాటు చేసే ఆలోచనను చేస్తున్నాం" అని ఆయన చెప్పారు. వార్షిక ప్రయోగాల సంఖ్యను 24కు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కిరణ్ కుమార్ వివరించారు. ఉపగ్రహాల సంఖ్యనూ పెంచాలనుకుంటున్నట్లు తెలిపారు. దీనివల్ల మన అవసరాలకు సరిపడా కమ్యూనికేషన్, రిమోట్ సెన్సింగ్, భూ పరిశీలన, దిక్సూచి సేవల కోసం మౌలిక వసతులు ఏర్పడతాయని వివరించారు. చంద్రయాన్-2 ప్రయోగానికి ఇస్రో సన్నద్ధమవుతోందని తెలిపారు. శుక్రుడు, అంగారకుడు వద్దకు వ్యోమనౌకలను పంపేందుకు ప్రతిపాదనలను ఆహ్వానించినట్లు చెప్పారు.

ఇజ్రాయెల్ నుంచి సహకారం: ఆప్టికల్ కమ్యూనికేషన్ పరిజ్ఞానం, విద్యుత్ చోదక వ్యవస్థ అంశాల్లో ఇజ్రాయెల్‌తో సహకారం తీసుకోవాలని యోచిస్తున్నట్లు కిరణ్‌కుమార్ వివరించారు. భారీ ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టడానికి విద్యుత్ చోదక వ్యవస్థ ఉపయోగపడుతుంది. ఆప్టికల్ కమ్యూనికేషన్ పరిజ్ఞానం ద్వారా కాంతి సాయంతో ఉపగ్రహం నుంచి భూకేంద్రానికి డేటాను బట్వాడా చేయవచ్చు.

'డిజిటల్ పోలీస్' సేవలు ప్రారంభం

దిల్లీ: దేశ వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో ఫిర్యాదుల నమోదు, వివరాల ధ్రువీకరణ అభ్యర్థనలు తదితర సేవలకు వీలుకల్పించే "డిజిటల్ పోలీస్ పోర్టల్ (డీపీపీ)"ను కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సోమవారం ప్రారంభించారు. నేరాలు, నేరస్థులపై నిఘా నెట్‌వర్క్, వ్యవస్థలు (సీసీటీఎన్ఎస్) ప్రాజెక్టులో భాగంగా డీపీపీని సిద్ధంచేశారు. నేరాలు, నేరస్థుల వివరాలతో జాతీయ సమాచార నిధిని ఏర్పాటుచేయడమే లక్ష్యంగా సీసీటీఎన్ఎస్ ప్రాజెక్టును కేంద్రం తెరపైకి తెచ్చిన సంగతి తెలిసిందే. 'పోర్టల్ ద్వారా 11 శోధన సదుపాయాలు, 46 నివేదికలను రాష్ట్ర పోలీసు విభాగాలు, కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు, పరిశోధన సంస్థలు పొందొచ్చు. సమాచార నిధి, నేర గణాంకాల కోసం వారికి ప్రత్యేక లాగిన్లు కేటాయించాం'అని రాజ్‌నాథ్ చెప్పారు.

సత్వరం శాంతి చర్చలు ప్రారంభించాలి

- **తొలిసారిగా జీజేఎం విజ్ఞప్తి**

డార్జిలింగ్(పశ్చిమబెంగాల్): సాధ్యమైనంత సత్వరం చర్చలు మొదలుపెట్టాల్సిందిగా కేంద్రం, పశ్చిమబెంగాల్ ప్రభుత్వాలను గూర్ఖా జన్‌ముక్తి మోర్చా(జీజేఎం) సోమవారం అభ్యర్థించింది. నిరవధిక సమ్మె, నిరసనలు కొనసాగుతున్న డార్జిలింగ్‌లో శాంతి పునరుద్ధరణ కోసం ఈ చర్య చేపట్టాలని కోరింది. ప్రత్యేక గూర్ఖా రాష్ట్రం కోసం ఉద్యమిస్తున్న జీజేఎం ఇలా కేంద్రం, రాష్ట్రప్రభుత్వాలతో పాటు చర్చల్లో పాల్గొనడానికి సుముఖత వ్యక్తం చేస్తూ ముందుకు రావడం ఇదే ప్రథమం.



మాల్డా జిల్లాలో వరద ఉద్ధృతిని తెలుసుకోవడానికి క్షేత్రస్థాయి పర్యటన చేస్తున్న పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ

బిహార్‌లో 304కి చేరిన వరద మృతులు

పట్నా/లఖ్‌నవూ: వరదల ధాటికి బిహార్‌లో ప్రాణాలు కోల్పోయినవారి సంఖ్య 300 దాటింది. వీరిలో 51 మంది ఆది, సోమవారాల్లోనే మృత్యువాత పడ్డారు. 18 జిల్లాలపై వరదల ప్రభావం ఎక్కువగా ఉంది. బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్ ఉన్నతస్థాయిలో పరిస్థితిని సమీక్షించారు. మంగళవారం కూడా 11 రైళ్లు రద్దయ్యాయి.

★ ఉత్తర్‌ప్రదేశ్‌లో వరద మృతుల సంఖ్య 72కి పెరిగింది. నేపాల్ నుంచి వస్తున్న వరదనీటితో యూపీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది.

స్థానిక భాషలోనే భూసార కార్డులు

- **అధికారులకు ప్రధానమంత్రి ఆదేశం**
- **కార్డుల పంపిణీలో తెలుగు రాష్ట్రాల ఘనత**
- **ఫసల్ బీమా యోజనపై మోదీ సమీక్ష**

ఈనాడు, దిల్లీ: భూసార పరీక్ష కార్డులను స్థానిక భాష, మాండలిక(యాస)ల్లోనే ముద్రించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారులకు సూచించారు. భూసార పరీక్ష కార్డుల పంపిణీ, ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన అమలు తీరును ప్రధాని సోమవారం సమీక్షించారు. గత రెండేళ్లలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా 16 రాష్ట్రాలు 100 శాతం భూసార పరీక్ష కార్డులను పంపిణీ చేసినట్లు అధికారులు ప్రధానికి నివేదించారు. మిగిలిన రాష్ట్రాలు మరికొన్ని వారాల్లో ఆ పని పూర్తిచేయనున్నట్లు వివరించారు. నాణ్యతలో తేడా రాకుండా అన్నివిధాలా పూర్తిస్థాయిలో జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా ప్రధాని ఆదేశించారు. రైతులకు అర్థమయ్యే భాషల్లో కార్డులు ముద్రించినప్పుడే వారు అందులోని విషయాన్ని చదివి అర్థం చేసుకోగలుగుతారన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని సూచించారు. చేతిలో ఇమిడిపోయే యంత్రం ద్వారా భూసార పరీక్షలు జరిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కసరత్తులో స్టార్టప్‌లు, ఇతర పారిశ్రామికవేత్తలను భాగస్వాములను చేయడానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. పంటల బీమా క్లెయిమ్‌లను వేగవంతంగా పరిష్కరించేందుకు వీలుగా సమాచార సేకరణ కోసం స్మార్ట్ ఫోన్లు, రిమోట్ సెన్సింగ్, శాటిలైట్ డేటా, డ్రోన్లు ఉపయోగిస్తున్నట్లు అధికారులు ప్రధానికి నివేదించారు. వ్యవసాయ శాఖ, నీతి ఆయోగ్, ప్రధాన మంత్రి కార్యాలయ సీనియర్ అధికారులు పాల్గొన్న ఈ సమీక్ష సమావేశంలో వివిధ కీలకాంశాలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు.

90 లక్షల మంది రైతులకు లబ్ధి

- ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద 2016 ఖరీఫ్, 2016-17 రబీ సీజన్లలో రూ. 7,700 కోట్ల క్లెయిమ్‌లు రైతులకు ఇప్పటికే చెల్లించారు. దీంతో 90 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరింది.
- సైకిల్-1 కింద 2015-16, 2016-17ల్లో ఆంధ్రప్రదేశ్‌లో 74,55,204, తెలంగాణలో 57,20,737 భూసార పరీక్ష కార్డులు పంపిణీ చేసి 100 శాతం లక్ష్యం సాధించిన 16 రాష్ట్రాల జాబితాలో నిలిచాయి.
- 2017-18 సంవత్సరంలో ఇంతవరకూ 71.28% కార్డుల పంపిణీతో హిమాచల్‌ప్రదేశ్ దేశంలో తొలిస్థానంలో నిలవగా ఆంధ్రప్రదేశ్ రెండోస్థానంలో ఉంది. ఏపీలో 39,52,530 కార్డులు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ఆగస్టు 14 నాటికి 10,11,119 (25.58 శాతం) పంపిణీ చేశారు.

యువ సీఈవోలతో నేడు ప్రధాని భేటీ

దిల్లీ: దేశంలోని దాదాపు 200 మంది యువ సీఈవో (ముఖ్య కార్యనిర్వహణాధికారి)లతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంగళవారం భేటీ కానున్నారు. 'ఛాంపియన్స్ ఆఫ్ ఛేంజ్' పేరుతో గత వారం నీతిఆయోగ్ నిర్వహించిన కార్యక్రమంలో 212 మంది యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో ప్రధాని సమావేశమయ్యారు. దేశంలో వృద్ధిరేటును పెంపొందించడం, ఉద్యోగాల సృష్టిని పెంపొందించడం వంటి అంశాలపై యువ సీఈవోల అభిప్రాయాలు తెలుసుకోవడానికి మంగళవారం నాటి భేటీని ఆయన ఉపయోగించుకోనున్నారు. దీనికి రాజీవ్ బజాజ్ (బజాజ్ ఆటో), అవనీ బియానీ (ఫ్యూచర్ రిటైల్), నిఖిల్ నందా (ఎస్కార్ట్స్), ప్రియా పంత్ (పార్క్ హోటల్) సహా అనేక సంస్థల సీఈవోలు హాజరుకానున్నారు. 2022నాటికి నవభారతం, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం, రేపటి నగరాలను సృష్టించడం, భారత్‌లో తయారీ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లడం, ఆర్థిక రంగాన్ని సంస్కరించడం, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు కల్పించడం... ఈ ఆరు ఇతివృత్తాలపై యువ సీఈవోలు సోమవారం నుంచే సమాలోచనలు ప్రారంభించారు. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సహా పలువురు మంత్రులతో, ప్రభుత్వ అధికారులతో వారు సమావేశమయ్యారు. 15 ఏళ్ల దార్శనిక పత్రంలో చేర్చాల్సిన కార్యాచరణ అంశాలపై వీరు ప్రధానికి మంగళవారం నివేదించనున్నారు. కీలకాంశాల్లో మార్గదర్శకులుగా వ్యవహరించడానికి సీఈవోలను ఆరు బృందాలుగా విభజించి, ఆయా మంత్రిత్వ శాఖలతో వాటికి అనుసంధానత కల్పించనున్నట్లు నీతిఆయోగ్ అధికారి ఒకరు తెలిపారు.



రుణమాఫీ చేయాలని, కరవు ప్యాకేజీ ప్రకటించాలని డిమాండు చేస్తూ దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద హవనం సమర్పిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న తమిళనాడు రైతులు

దివ్యాంగుల పరికరాలపై జీఎస్టీయా?

- సుప్రీంలో వ్యాజ్యం దాఖలు

దిల్లీ: దివ్యాంగులు ఉపయోగించే అత్యవసర పరికరాలపై వస్తు-సేవల పన్ను (జీఎస్టీ) విధించడంపై సమాధానం చెప్పాలని సోమవారం సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తొలుత ఈ వ్యాజ్యాన్ని స్వీకరించడానికి విముఖత చూపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జె.ఎస్.ఖేహర్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం.. ఫిర్యాదుదారైన నిపుణ్ మల్హోత్రా చక్రాల కుర్చీలో రావడం చూసి అంగీకరించింది. చక్రాల కుర్చీలు, బ్రెయిలీ పేపర్ తదితరాలపై పన్నువేయడం దివ్యాంగుల ప్రాథమిక హక్కులను హరించడమేనని పిటిషన్‌దారు తరఫు న్యాయవాది పేర్కొన్నారు.

పిల్లల అశ్లీల చిత్రాలపై చర్యలు తీసుకుంటున్నాం: కేంద్రం

పిల్లల అశ్లీల చిత్రాలను ఆన్‌లైన్‌లో ప్రసారం చేయకుండా పలు చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఇంటర్‌పోల్ అందజేసే జాబితా ప్రకారం 3,522 వెబ్‌సైట్లను నిలుపుదల చేసినట్లు జస్టిస్ దీపక్ మిశ్ర, జస్టిస్ ఎ.ఎం.ఖన్విల్కర్‌లతో కూడిన ధర్మాసనానికి వివరించింది. దీనిపై నివేదిక సిద్ధం చేశామని, త్వరలో అందజేస్తామని అటార్నీ జనరల్ కె.కె.వేణుగోపాల్ చెప్పారు.

పోలీసు ఖాళీలను ఎలా భర్తీ చేస్తారో చెప్పండి

పోలీసు శాఖలో ఉన్న ఖాళీలను ఎంత కాలపరిమితి లోపు ఏ విధంగా భర్తీ చేయబోయేదీ ప్రమాణ పత్రం రూపంలో సమర్పించాల్సిందిగా అన్ని రాష్ట్రాలూ, కేంద్రపాలిత ప్రాంతాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. దీనికోసం నాలుగు వారాల గడువు ఇస్తున్నట్లు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జె.ఎస్.ఖేహర్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం తెలిపింది. పోలీసు శాఖలో 4.3 లక్షల ఖాళీలను నిర్ణీత కాల పరిమితిలోగా భర్తీ చేయాల్సిందిగా 14 రాష్ట్రాలను సుప్రీంకోర్టు ఇదివరకే ఆదేశించింది. మిగిలిన రాష్ట్రాల నుంచి ఇప్పుడు మార్గసూచీలు అడిగింది.

మధ్యాహ్న భోజనం పర్యవేక్షణకు ఏం చేస్తారు?

పాఠశాలల్లో పరిశుభ్ర వాతావరణంలో మధ్యాహ్న భోజనం పథకం అమలయ్యేలా ఏవిధంగా పర్యవేక్షిస్తారో చెప్పాలని సోమవారం సుప్రీంకోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించింది. పర్యవేక్షణ ప్రక్రియను స్పష్టంగా వివరించాలని, దానికి అనుగుణంగా ఆదేశాలు ఇస్తామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జె.ఎస్.ఖేహర్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో రెండు పర్యవేక్షక కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించింది. తదుపరి విచారణను ఈ నెల 24కు వాయిదా వేసింది.

బొగ్గుపై దర్యాప్తు కొలిక్కి రాదా?: సీబీఐపై సుప్రీం ఆగ్రహం

బొగ్గు క్షేత్రాల కేటాయింపునకు సంబంధించిన కుంభకోణంలో దర్యాప్తును 'కేంద్ర దర్యాప్తు సంస్థ' (సీబీఐ) ఒక పట్టాన కొలిక్కి తీసుకురాకపోవడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ దర్యాప్తు ఇక ఎప్పటికీ ముగిసేలా లేదని ఘాటుగా వ్యాఖ్యానించింది. పనిని వేగవంతం చేయాలని ఎప్పటికప్పుడు తాము కోరుతున్నా సీబీఐ మాత్రం ఇంకా దర్యాప్తు ముగించడం లేదని అసంతృప్తి వెలిబుచ్చింది. పెండింగులో ఉన్న కేసుల తాజా పరిస్థితి ఏమిటి, విచారణ ఎందుకు ఆలస్యమవుతోందో నివేదిక రూపంలో తెలియజేయాల్సిందిగా సీబీఐని ఆదేశిస్తూ, తదుపరి విచారణను అక్టోబరు 9వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ మదన్ బి లోకుర్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం సోమవారం ప్రకటించింది.

దళిత క్రైస్తవుల కోటాపై సమాధానమివ్వండి

దళిత క్రైస్తవులకు తోటి హిందూ, సిక్కు, బౌద్ధులతో సమానంగా రిజర్వేషన్ కోటాను కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై సమాధానం ఇవ్వాలని సుప్రీంకోర్టు సోమవారం కేంద్రాన్ని ఆదేశించింది. దళిత క్రైస్తవులను ఎస్సీల్లో చేర్చాలని కోరుతూ ఆల్ ఇండియా కేథలిక్ యూనియన్ వ్యాజ్యం దాఖలు చేసింది. దీనిపై సమాధానం ఇవ్వాల్సిందిగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ ఖేహర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం కేంద్రానికి నోటీసు జారీ చేసింది.

బార్సిలోనా నిందితుడి కాల్చివేత?

బార్సిలోనా: బార్సిలోనాలో పాదచారులపైకి వాహనంతో దూసుకెళ్లి, పలువురి ప్రాణాలు బలి తీసుకుని పరారైన వ్యాను డ్రైవర్‌గా అనుమానిస్తున్న యూనెస్ అబూయాకూబ్‌ను పోలీసులు కాల్చి చంపినట్లు తెలుస్తోంది. సోమవారం పోలీసులు ఓ అనుమానితుడిని కాల్చివేశారనీ, అతను దాడులకు సూత్రధారిగా భావిస్తున్నట్లు దర్యాప్తు వర్గాలు పేర్కొన్నాయి. బార్సిలోనాకు 60 కి.మీ. దూరంలోని సుబిరాట్స్ గ్రామంలో ఆత్మహత్య బెల్టును ధరించిన వ్యక్తిని హతమార్చినట్లు ప్రాంతీయ పోలీసులు తెలిపారు. బాంబు నిర్వీర్య దళాలు ఘటనా స్థలానికి చేరాయి. మరోవైపు.. స్పెయిన్ ఉగ్రదాడుల్లో మృతుల సంఖ్య 15కు పెరిగింది. బార్సిలోనా వెలుపల సాంట్ జస్ట్‌లో ఓ కారులో వ్యక్తి మరణించిన ఘటనకూ ఈ కేసుతో సంబంధం ఉందని ప్రాంతీయ మంత్రి జోయాక్విమ్ ఫోర్న్ తెలిపారు. కత్తిపోట్లతో మరణించిన ఆ వ్యక్తిని పా పెరేజ్‌గా గుర్తించారు. దాడులకు సూత్రధారిగా భావిస్తున్న వ్యాను డ్రైవర్ యూనెస్ పారిపోయే క్రమంలో అతడిని పొడిచి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. యూనెస్ నివసించినట్లుగా భావిస్తున్న రిపోల్ పట్టణంలో దర్యాప్తు అధికారులు సోమవారం మరిన్ని ఇళ్లపై దాడులు చేపట్టారు.

200 మంది ఐ.ఎస్. ఉగ్రవాదుల హతం

- సిరియాలో వైమానిక దాడులు జరిపిన రష్యా

మాస్కో, బీరుట్, వాషింగ్టన్: సిరియాలో రష్యా వైమానిక దళాలు జరిపిన దాడుల్లో 200 మందికిపైగా ఇస్లామిక్ స్టేట్ (ఐ.ఎస్.) ఉగ్రవాదులు హతమయ్యారు. డెయిర్ అల్-జోర్ నగరంలోని ఉగ్రవాదుల దళంపై కాల్పులు జరిపినట్లు రష్యా సమాచార మాధ్యమాలు సోమవారం వెల్లడించాయి. రక్కా ప్రావిన్స్‌లోని దక్షిణ ప్రాంతం, హోమ్స్ ప్రావిన్స్‌లోని పశ్చిమ ప్రాంతంపై పట్టుకోల్పోయిన ఉగ్రవాదులు ఇప్పుడు డెయిర్ అల్-జోర్ నగరంలో స్థావరం ఏర్పాటు చేసుకున్నాయి.

ఐ.ఎస్. ప్రపంచంలోనే ప్రమాదకర ఉగ్రవాద సంస్థ

సిరియా, ఇరాక్‌ల్లో క్రమేణా ఉనికి కోల్పోతున్నప్పటికీ ఐ.ఎస్... ఇప్పటికీ ప్రపంచంలోనే ప్రమాదకరమైన ఉగ్రవాద సంస్థగా గుర్తింపుపొందింది. 2106లో 1400కుపైగా దాడులు జరిపి ఏడువేల మందికి పైగా మరణానికి కారణమయింది. 2015తో పోల్చితే ఇది 20 శాతం అధికం. అమెరికాలోని మేరీలాండ్ విశ్వవిద్యాలయం అధ్యయనంలో ఈ విషయం వెల్లడయింది. గత ఏడాది ఈ సంస్థకు అనుబంధంగా ఉన్న ఉగ్రవాద ముఠాలు 950 దాడులు జరిపి 3000 మందిని హతమార్చాయి. బంగ్లాదేశ్, యెమెన్, లిబియా, అఫ్గానిస్థాన్-పాకిస్థాన్, ఫిలిప్పీన్స్‌లో ఉన్న ముఠాలు తాము ఐ.ఎస్.కు అనుబంధంగా ఉన్నట్లు ప్రకటించాయి.

శిక్షణ పొందుతున్న ఇద్దరు జవాన్ల మృతి

డెహ్రాడూన్: భారత సైనిక అకాడమికి చెందిన ఇద్దరు జవాన్లు అస్వస్థతకు గురై చనిపోయారు. శిక్షణలో భాగంగా నిర్వహించిన పదికిలోమీటర్ల పరుగులో ఈ సంఘటన చోటుచేసుకుంది. శిక్షణకు వచ్చిన జవాన్లకు పహ్లా కదమ్ పేరిట పరుగు నిర్వహిస్తామని సైనిక అధికారి పేర్కొన్నారు. ఈ పరుగులో ఏడుగురు జవాన్లు అలసటతో డీహైడ్రేషన్‌కు గురయ్యారని, వెంటనే వారిని ఆసుపత్రికు తరలించామన్నారు. వీరిలో చికిత్స పొందుతూ దీపక్ శర్మ(22), నవీన్ కుమార్ ఛత్రి(23) మృతి చెందారు.

లద్దాఖ్ స్కౌట్స్ త్యాగాలు అనన్యం

- **లేహ్‌లో రాంనాథ్ కోవింద్ తొలి పర్యటన**

జమ్ము: దేశ సార్వభౌమత్వాన్ని పరిరక్షించటంలో లద్దాఖ్ స్కౌట్స్ రెజిమెంట్ నిరుపమానమైన సేవలు అందిస్తోందని రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ ప్రశంసించారు. అత్యంత ప్రతికూల వాతావరణ పరిస్థితులుండే సియాచిన్‌లో వీరి త్యాగాలు చిరస్మరణీయమైనవని పేర్కొన్నారు. సోమవారం ఆయన జమ్మూకశ్మీర్‌లోని లేహ్‌ను సందర్శించారు. రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం రాంనాథ్ కోవింద్ తొలి పర్యటన ఇది. ఈ సందర్భంగా ఆయన 605 సాహస, విశిష్ట సేవా పురస్కారాలను, రాష్ట్రపతి గౌరవ పతాకాలను లద్దాఖ్ స్కౌట్స్ కేంద్రానికి, ఆ రెజిమెంట్‌లోని అయిదు బెటాలియన్లకు చెందిన సైనికులకు అందజేశారు. ఈ సందర్భంగా సైనిక సంప్రదాయాల ప్రకారం ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి ప్రసంగించారు. కల్నల్ సోనమ్ వాంగ్‌చుక్‌పై రూపొందించిన లఘుచిత్రాన్ని (డాక్యుమెంటరీ)విడుదల చేశారు. సైన్యాధిపతితో పాటు పలువురు సైనిక, పౌర విభాగ అధికారులు, మాజీ సైనికులు, వీరనారులు కార్యక్రమానికి హాజరయ్యారు.



లేహ్‌లోని మహాబోధి అంతర్జాతీయ ధ్యానకేంద్రం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రాష్ట్రపతి

రామమందిరం మాకు సమ్మతమే

- **యూపీ షియా సెంట్రల్ వక్ఫ్ బోర్డు ఛైర్మన్ వసీం రిజ్వీ వెల్లడి**

లఖ్‌నవూ: అయోధ్యలో దశాబ్దాలుగా కొనసాగుతున్న మందిరం-మసీదు వివాదం సాధ్యమైనంత త్వరగా పరిష్కారంకావాలని కోరుకుంటున్నట్లు యూపీలోని షియా సెంట్రల్ వక్ఫ్ బోర్డు మండలి తెలిపింది. వివాదాస్పద ప్రాంతంలో రామమందిరం నిర్మాణానికి తమకు అభ్యంతరం లేదని బోర్డు ఛైర్మన్ వసీం రిజ్వీ సోమవారం లఖ్‌నవూలో వెల్లడించారు. దీనికి ప్రతిగా వివాదాస్పద ప్రాంతానికి దూరంగా, ముస్లింలు అత్యధికంగా ఉండే ప్రాంతంలో 'మజీద్ ఎ అమన్' పేరుతో మసీదును నిర్మించాలని కోరారు. "1992లో బాబ్రీ మసీదు కూల్చివేసిన ప్రాంతంలో హిందువులు తాత్కాలిక ఆలయంలో దేవుని ప్రతిమను ఉంచి నిత్యం పూజలు చేస్తున్నారు. అలాంటి ప్రదేశంలో మసీదు నిర్మించాలని ఏ ముస్లిం అయినా ఎలా కోరగలడు?" అని విలేకరుల సమావేశంలో రిజ్వీ అన్నారు. భారత పురావస్తు విభాగం (ఏఎస్ఐ) కూడా బాబ్రీ మసీదు నిర్మాణానికి ముందు ఆ ప్రాంతంలో ఆలయం ఉండేదని నిర్ధరించినందున ముస్లింలు అయోధ్య వివాదంపై పునరాలోచించాలని కోరారు.

శ్రీరాముని జన్మస్థలంలో నిర్మించిన ఆలయాన్ని బాబర్ సేనాని మిర్ బకి కూల్చి మసీదును నిర్మించారని తులసీదాస్ తన 'రామచరిత మానస్'లో పేర్కొన్నారని తెలిపారు. ఇరాన్, ఇరాక్‌లకు చెందిన షియా మత పెద్దలూ వివాదాస్పద ప్రాంతాన్ని రామమందిరం నిర్మాణానికి అప్పగించి మసీదును మరోచోట నిర్మించుకోవాలని సూచించారని వెల్లడించారు. బాబర్ సేనాని మిర్ బకి షియా వర్గానికి చెందిన వాడని, ఆయన నిర్మించిన మసీదుపై షియాలకే సర్వహక్కులుంటాయని రిజ్వీ అన్నారు.

సాంకేతికతతో 24 గంటల నీటి సరఫరా

- గుంటూరు, కాకినాడలో అమలుకు చర్యలు
- ప్రైవేటు ఏజెన్సీకి నిర్వహణ బాధ్యతలు?
- నిర్వహణ ఛార్జీలు తగ్గింపే లక్ష్యంగా అడుగులు
- ఆపై అనంతపురం, విజయనగరం పట్టణాల్లో అమలు

ఈనాడు - గుంటూరు

నగర, పురపాలక సంఘాల్లో తాగు నీటి సరఫరా వ్యవస్థలో సంస్కరణలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతోంది. దీనికి సంబంధించిన ప్రణాళికలు యుద్ధప్రాతిపదికన రూపుదిద్దుకుంటున్నాయి. నగర, పురపాలక సంఘాల్లో అత్యధిక వ్యయాలు వీధి దీపాలు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం పనుల నిర్వహణకే అవుతాయి. ఈ మూడు విభాగాల్లో సాధ్యమైనంత వరకు వ్యయాలు తగ్గించి పురపాలికలకు ఆదా అయ్యే మార్గాలను చూపాలని కన్సల్టెన్సీలు, ప్రైవేటు సంస్థలను ప్రభుత్వం కోరుతోంది. ఇందులో భాగంగా ఇప్పటికే ఎలక్ట్రిసిటీ ఎఫిషియన్సీ సర్వీస్ లిమిటెడ్(ఈఈఎస్ఎల్) కంపెనీ ముందుకొచ్చి.. ఎల్ఈడీ బల్బులను ప్రవేశపెట్టి.. చాలావరకు వీధి దీపాల నిర్వహణ వ్యయాలను నగర, పురపాలక సంఘాలు తగ్గించుకునేలా చేసింది. ఇది సత్ఫలితాలను ఇవ్వటంతో ప్రస్తుతం గుంటూరు, కాకినాడ, అనంతపురం, విజయనగరం నగర, పురపాలక సంఘాల్లో తాగునీటి సరఫరా నిర్వహణ బాధ్యతలను ప్రైవేటు సంస్థకు అప్పగించేలా కసరత్తు జరుగుతోంది. అదీ సాంకేతిక పరిజ్ఞానంతో సరికొత్తగా తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని సూచిస్తోంది. 8 లక్షల జనాభా, 90వేల నీటి కనెక్షన్లు కలిగిన గుంటూరు నగరపాలక సంస్థలో మంచినీటి సరఫరాకు సగటున ఏడాదికి రూ.23 కోట్లు వెచ్చిస్తోంది. అదే కాకినాడలో ఈ వ్యయం రూ.15 కోట్లు ఉండగా విజయనగరం మున్సిపాల్టీలో రూ.8 కోట్లు దాకా ఉంది. ఒక్క తాగునీటి నిర్వహణకే ఏడాదికి ఇంత పెద్దమొత్తంలో వెచ్చిస్తున్నా ప్రజల నుంచి మాత్రం సంతృప్తి వ్యక్తం కావటం లేదు. తమకు ఉదయం ఒక గంట సాయంత్రం ఒక గంట మొక్కుబడిగా నీళ్లు వదులుతున్నారని అసంతృప్తి చెందుతున్నారు. నిర్వహణ వ్యవస్థను మెరుగుపర్చుకుంటే ఈ వ్యయాలతోనే 24గంటల పాటు నీటి సరఫరాకు చర్యలు తీసుకోవచ్చనే ప్రతిపాదన ఇటీవల ప్రభుత్వానికి వచ్చింది. మరోవైపు ఈ నాలుగు పట్టణాల్లో ప్రపంచ బ్యాంకు నిధులతో 24 గంటలు నీటి సరఫరా చేసేలా ఏపీఎండీపీ ప్రాజెక్టు ఆధ్వర్యంలో చేపట్టిన పనులు కొలిక్కి వచ్చాయి. శివారు కాలనీలకు సైతం నీళ్లు సరఫరా చేసేలా ఎక్కడికక్కడ పంపిణీ లైన్లు, జలాశయాలు(రిజర్వాయర్లు), వడబోత కేంద్రాలు(ఫిల్టరేషన్ పాయింట్లు), కవాట నిర్వహణ (వాల్ ఆపరేటింగ్) పరికరాల పనులను పూర్తి చేశారు. ఇక ప్రభుత్వం నుంచి రోజంతా నీటి సరఫరాకు అనుమతి రావటమే తరువాయిగా చెబుతున్నారు. అయితే ఈ నాలుగు పట్టణాల్లో ఒకేసారి కాకుండా తొలుత గుంటూరు, కాకినాడ నగరపాలక సంస్థల్లో ఒక నెల రోజుల్లోపు సాంకేతిక పరిజ్ఞానంతో నీటి సరఫరాను చేయటానికి ప్రైవేటు ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించాలని పురపాలకశాఖ నిర్ణయించింది. మిగిలిన రెండు పట్టణాల్లో కూడా ఇదే విధానాన్ని అనుసరించి, ఆ తర్వాత ప్రారంభించాలనేది పురపాలకశాఖ యోచనగా ఉంది.



గుంటూరుకు తాగునీరు అందించే ప్రధాన రిజర్వాయర్

అమలవుతున్న వ్యవస్థపై అధ్యయనం

ప్రస్తుతం ఈ నాలుగు పట్టణాల్లో అమల్లో ఉన్న తాగునీటి సరఫరా వ్యవస్థను అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం యూఐజీ అనే ప్రైవేటు కన్సల్టెన్సీకి బాధ్యతలు అప్పగించింది. ఈ సంస్థ ప్రతినిధులు ఈ నాలుగు చోట్ల వార్డుల వారీగా పరిశీలించి ఎక్కడ లీకులు ఉన్నాయి.. ఎక్కడ పైపులు పాడయ్యాయి.. ఎక్కడెక్కడ మోటార్లు మార్చాలి వంటివి గుర్తించి ప్రతిపాదనా అభ్యర్థన(రిక్వెస్టు ఫర్ ప్రపోజల్/ఆర్ఎఫ్‌పీ) తయారు చేసి ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది.

ప్రైవేటు ఏజెన్సీకి విధించనున్న షరతులు

★ 24 గంటల తాగునీటి సరఫరాను సాంకేతిక విధానంతో పర్యవేక్షించాలి.
★ ప్రతి ఇంటికి 24గంటలు నీళ్లు వచ్చేలా ఏమైనా కనెక్షన్లు ఇవ్వాల్సి ఉన్నా ఈ సంస్థ చూసుకోవాలి.
★ అమృత పథకంలో భాగంగా అవసరమైనవారికి నూతన కుళాయి కనెక్షన్లు బిగించాలి.
★ సాధ్యమైనంత వరకు మానవ వనరులను, విద్యుత్తు బిల్లులను తగ్గించాలి.
★ పదేళ్ల పాటు నిర్వహణ బాధ్యతలు చూసేలా అవగాహన ఒప్పందం కుదుర్చుకోవాలి.

బిహార్‌ను కుదిపేస్తున్న రూ.900 కోట్ల కుంభకోణం

- ప్రభుత్వ ఖాతాల నుంచి సేవా సంస్థకు మళ్లింపు
- 11 కేసుల నమోదు
- 18 మంది అరెస్టు

పట్నా, భాగల్పూర్: బిహార్ రాజకీయాలను ఓ భారీ కుంభకోణం కుదిపేస్తోంది. భాగల్పూర్‌లోని శ్రీజన్ మహిళా వికాస్ సహయోగ్ సమితి అనే స్వచ్ఛంద సంస్థకు దాదాపు రూ.900 కోట్ల నిధులు మళ్లించడం సంచలనంగా మారింది. 2013 నుంచి జరుగుతున్న ఈ వ్యవహారం ఇటీవలే వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వేతర సంస్థ కుంభకోణం (నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్ - ఎన్‌జీవో స్కాం)గా ఇప్పుడు జనం నోట్లో నానుతోంది.

తొలుత ప్రస్తావించింది నీతీశే: పట్నాలో ఈ నెల ఎనిమిదో తేదీన ప్రపంచ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ నిధుల దుర్వినియోగాన్ని ప్రస్తావించారు. అదే రోజు మధ్యాహ్నం ఆర్థిక నేరాల విభాగం (ఎకనామిక్ అఫెన్స్ యూనిట్) అధికారులు భాగల్పూర్‌కు విమానంలో వెళ్లారు. సాయంత్రానికి అవకతవకలు వెలుగు చూశాయి. తాజా సమాచారం ప్రకారం భాగల్పూర్‌లోని ప్రభుత్వ ఖాతాల నుంచి రూ.624.86 కోట్లు, సహర్సా ఖాతాల నుంచి రూ.162.92 కోట్లు, బంకా జిల్లా నుంచి రూ.83.10 కోట్లు.. మొత్తం రూ.870.88 కోట్లు ఆ సేవా సంస్థకు మళ్లినట్టు డీజీపీ పి.కె.ఠాకుర్ చెప్పారు. 11 కేసులు నమోదు చేసి, 18 మందిని అరెస్టు చేసినట్టు తెలిపారు.

ఎలా వెలుగులోకి వచ్చింది?: 'శ్రీజన్' వ్యవస్థాపకురాలు మనోరమా దేవి ఫిబ్రవరిలో మరణించినప్పటి నుంచి ఈ అవకతవకలపై గుసగుసలు వ్యాపించాయి. ఈ నెల నాలుగో తేదీన బహిర్గతమయింది. విద్యుత్కేంద్రానికి భూములు ఇచ్చిన రైతులకు పరిహారం చెల్లించడం కోసం భాగల్పూర్ జిల్లా కలెక్టర్ ఆదేశ్ తితిర్‌మారే ఇచ్చిన రూ.270 కోట్ల చెక్కు బౌన్స్ అయి, చెల్లకపోవడంతో అనుమానం వచ్చింది. వెంటనే ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అంజనీ కుమార్ సింగ్ దృష్టికి తీసుకువచ్చారు. అంజనీ కుమార్ ముఖ్యమంత్రిని అప్రమత్తం చేశారు.

ఎలా సాధ్యమయింది?: 1992లో హర్షద్ మెహతా బ్యాంకులను మోసగించిన తీరును మనోరమా దేవి ఆదర్శంగా తీసుకున్నారు. హర్షద్ మెహతా అనధికారికంగా బ్యాంకుల నుంచి సొమ్ము తీసుకొని షేరు మార్కెట్లో పెట్టారు. లాభాలు వచ్చిన తరువాత తిరిగి చెల్లించేవారు. మనోరమా దేవి కూడా ప్రభుత్వ నిధులను తన స్వచ్ఛంద సంస్థ ఖాతాల్లోకి మళ్లించేవారు. వాటిని విత్ డ్రా చేయడానికి కలెక్టర్ నుంచి చెక్కులు వస్తాయని తెలియగానే వాటిని తిరిగి ప్రభుత్వ ఖాతాలో జమ చేసేవారు. దీంతో ఎవరికీ అనుమానం వచ్చేది కాదు. ఇందుకు కలెక్టర్ వ్యక్తిగత సహాయకుడు, సంక్షేమశాఖ అధికారుల సహాయం తీసుకునేవారు. ప్రభుత్వ ఖాతాలన్నీ ఇండియన్ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖల్లో ఉండడంతో ఆమె కూడా అక్కడే ఖాతాలు తెరిచారు. ప్రభుత్వ ఖాతాల్లో సొమ్ము జమ అవుతుందని కొందరు ప్రభుత్వ ఉద్యోగులు ఆమెకు చెప్పేవారు. వెంటనే జిల్లా కలెక్టర్ నకిలీ సంతకాలతో ఉన్న చెక్కులు ఇచ్చి తమ ఖాతాకు మార్పించుకునేవారు. ఇందుకు ఒక ప్రయివేటు ప్రింటర్ ఆమెకు సహకరించారు. ఆమె మరణించిన తరువాత కుమారుడు అమిత్ కుమార్, కోడలు రంజని ప్రియ ఈ వ్యవహారం నడపలేకపోవడంతో కుంభకోణం వెలుగు చూసింది. ప్రస్తుతం వారిద్దరిపై లుక్అవుట్ నోటీసు జారీ అయ్యింది. జిల్లా సంక్షేమ అధికారి, సహకార అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ బ్యాంకు మేనేజర్లు, ఎనిమిది మంది బ్యాంకు ఉద్యోగులపై కేసులు నమోదయ్యాయి. అప్పటి భూ సేకరణ అధికారి రాజీవ్ రంజన్ సింగ్‌పైనా కేసు పెట్టినట్టు డీజీపీ తెలిపారు.

వడ్డీ లేని రుణాలుగా ప్రభుత్వ సొమ్ము: 1996లో ఒక్క కుట్టు మిషన్‌తో ఈ సంస్థను ప్రారంభించారు. ఇప్పుడు సహకార సంఘం స్థాయికి ఎదిగింది. ఈ సొమ్మును ఆమె ఉద్యోగులు, రాజకీయ నాయకులకు రుణాలుగా ఇచ్చారు.

హెచ్చరించిన ఉద్యోగికి శిక్ష: ఈ స్వచ్ఛంద సంస్థ గురించి ప్రత్యక్షంగా చెప్పకపోయినా సహకార శాఖలో అక్రమాలు జరుగుతున్నట్టు 2002లో ఓ ఉద్యోగి ప్రభుత్వానికి లేఖ రాశారు. అయితే దీనిపై చర్యలు తీసుకోవాల్సింది పోయి ఆయనను మందలించి రెండు ఇంక్రిమెంట్లు కోత విధించారు. ఆ లేఖ సోమవారం వెలుగులోకి వచ్చింది. ఆ సమయంలో రబ్రీ దేవి ముఖ్యమంత్రిగా ఉన్నారు.

అనారోగ్యంతో నిందితుని మృతి: ఈ కేసులో ఆదివారం అరెస్టయిన నిందితుడు మహేష్ మండల్ (57) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆయన సంక్షేమ శాఖలో ఖజానా వ్యవహారాలు చూసే నజీర్‌గా పనిచేస్తున్నారు. రెండు మూత్ర పిండాలు పాడయిన ఆయనకు చికిత్స జరుగుతుండగా మరణించారు.

ప్రతిపక్షాల విమర్శ: నిజాలను పాతిపెట్టాలన్న ఉద్దేశంతోనే కొందరు ఆయనను చంపేశారని ప్రతిపక్ష నాయకుడు తేజస్వీ యాదవ్ ఆరోపించారు.

తపాలా సేవలు బంద్

- సమ్మె బాటలో గ్రామీణ సేవకులు
- ఈనెల 23న పోస్టల్ ఉద్యోగుల మద్దతు

ఈనాడు, హైదరాబాద్: దేశవ్యాప్తంగా గ్రామీణ తపాలా సేవకులు (జీడీఎస్) సమ్మెకు దిగడంతో తెలుగు రాష్ట్రాల్లో ఉత్తరాల బట్వాడాపైనా ఆ ప్రభావం పడింది. హైదరాబాద్, విజయవాడ వంటి నగరాల్లో ప్రభావం పాక్షికంగానే ఉన్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో 25,000వరకు జీడీఎస్‌లు ఉన్నారు. పెంచిన వేతనాలు అమలు చేయాలని, తపాలా రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తిస్తూ సదుపాయాలు వర్తింప చేయాలని, పింఛను ఇవ్వాలని కోరుతున్నారు. డిమాండ్ల సాధనకోసం ఈనెల 16 నుంచి నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చారు. జీడీఎస్ ఉద్యోగులకు మద్దతుగా తాముకూడా ఈనెల 23న సమ్మె చేయనున్నట్లు తపాలా ఉద్యోగుల సంఘం (గ్రూప్-సీ) నాయకులు ప్రసాద్ తెలిపారు.

ఐటీఐలకు నిధులివ్వండి

కేంద్రానికి మంత్రి పితాని విజ్ఞప్తి

ఈనాడు, దిల్లీ: రాష్ట్రంలో ఐటీఐల అభివృద్ధికి నిధులివ్వాలని కేంద్ర నైపుణ్యాభివృద్ధిశాఖకు ఏపీ కార్మికమంత్రి పితాని సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. సోమవారమిక్కడ రాష్ట్ర ప్రభుత్వాధికారులు నీరబ్‌కుమార్ ప్రసాద్, వరప్రసాద్‌లతో కలిసి కేంద్ర నైపుణ్యాభివృద్ధిశాఖ కార్యదర్శి కేపీకృష్ణన్‌తో భేటీ అయ్యారు. స్కిల్స్ పారిశ్రామిక విలువ పెంపునకు బలపరిచే నైపుణ్యం(స్త్రైవ్)లో భాగంగా రాష్ట్రంలోని 29 ఐటీఐల అభివృద్ధికి రూ.2 కోట్లు నిధులు మంజూరు చేయాలన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు

- సెప్టెంబరు 23 నుంచి ఉత్సవాలు ప్రారంభం
- ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి పట్టువస్త్రాల సమర్పణ
- తితిదే ఈవో సింఘాల్ వెల్లడి



శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల గోడపత్రికను ఆవిష్కరిస్తున్న తితిదే ఈవో సింఘాల్. చిత్రంలో కలెక్టరు ప్రద్యుమ్న, జేఈవోలు తదితరులు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు బ్రహ్మాండంగా చేపట్టామని తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. చిత్తూరు జిల్లా కలెక్టరు ప్రద్యుమ్న, పోలీసు, తితిదే అధికారులతో కలిసి ఏర్పాట్లపై తిరుమలలో సోమవారం సమావేశం నిర్వహించారు. తిరుమల, తిరుపతి జేఈవోలు శ్రీనివాసరాజు, పోలా భాస్కర్, సీవీఎస్‌వో రవికృష్ణ పాల్గొన్నారు. ఈవో అధికారుల సమావేశంలో, అనంతరం మీడియాతో ప్రత్యేకంగా మాట్లాడారు.

★ సెప్టెంబరు 22న అంకురార్పణతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టి 23 నుంచి అక్టోబరు 1 వరకు వైభవోపేతంగా నిర్వహిస్తాం. 23న ధ్వజారోహణానికి ముందు రాష్ట్రప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, భువనేశ్వరి దంపతులు సమర్పిస్తారు.
★ శ్రీవారికి ఆర్జిత సేవలన్నీ రద్దు చేస్తున్నాం. వీఐపీ బ్రేక్ దర్శనం టిక్కెట్లను ప్రొటోకాల్ పరిధిలోని ప్రముఖులకు మాత్రమే కేటాయిస్తాం. గదుల కేటాయింపునకు సిఫార్సులు అనుమతించం. ముందువచ్చిన వారికి ముందు ప్రాతిపదికన కేటాయిస్తాం.
★ శ్రీవారి మూలవిరాట్టు దర్శనంతో పాటు తిరువీధుల్లో వాహనసేవలను సంతృప్తికరంగా తిలకించడానికి వీలుగా ఏర్పాట్లు చేస్తున్నాం.
★ రూ.8 కోట్ల నిధులతో ఉత్సవాల పనులకు అనుమతులిచ్చాం. దశల వారీగా నిర్దేశించిన గడువులోపు పనులు పూర్తి చేయడానికి ఆదేశాలిచ్చాం.
★ శ్రీవారి వాహనసేవలు ప్రతిరోజు ఉదయం 9 నుంచి 11 గంటలు, రాత్రి 9 నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తాం. సర్వభూపాల వాహనాన్ని నూతనంగా తయారుచేశాం. ఉత్సవాల్లో స్వామివారి ఊరేగింపునకు దీన్ని వినియోగిస్తాం.
★ గరుడసేవకు లక్షలాదిగా యాత్రికులు తరలి వచ్చే అవకాశం ఉన్నందున ఆ రోజు తిరుమలకు ద్విచక్రవాహనాల రాకపోకలు నిషేధిస్తున్నాం. తిరుమల, తిరుపతిలో ప్రత్యేకంగా పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేస్తున్నాం. గరుడసేవ రోజున 550 ఆర్టీసీ బస్సులతో 4 వేల ట్రిప్పులు తిరుగుతాయి. ఆ రోజు రాత్రి 7.30 గంటలకే వాహనసేవలను ప్రారంభిస్తాం.
★ తిరువీధుల వెంట గ్యాలరీల్లోకి సులభంగా ప్రవేశ, నిష్క్రమణకు ద్వారాలు ఏర్పాటు చేస్తున్నాం. అన్నప్రసాదం, జలప్రసాదం భక్తులకు కొరత లేకుండా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వైద్య సౌకర్యాలు ప్రత్యేకంగా కల్పిస్తున్నాం.
★ భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టిపెట్టాం. 600 సీసీ కెమెరాలు అమర్చుతున్నాం. సెంట్రల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఫింగర్ ప్రింట్ సాఫ్ట్‌వేర్, వీడియోవాల్స్ తదితర ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. భద్రత, సౌకర్యాల లోపాలను గుర్తించి చర్యలు తీసుకుంటాం. ఉత్సవాలకు 3 వేల మంది శ్రీవారి సేవకులను నియమించుకుంటున్నాం.

బ్రహ్మోత్సవ వాహనసేవల వివరాలు

తేదీ	ఉదయం	రాత్రి
23.9.2017	ధ్వజారోహణం(సా.6గం)	పెద్దశేష వాహనం
24.9.2017	చిన్నశేష వాహనం	హంస వాహనం
25.9.2017	సింహ వాహనం	ముత్యపుపందిరి వాహనం
26.9.2017	కల్పవృక్ష వాహనం	సర్వభూపాల వాహనం
27.9.2017	మోహినీ అవతారం	గరుడవాహనం
28.9.2017	హనుమంత వాహనం	గజవాహనం
29.9.2017	సూర్యప్రభ వాహనం	చంద్రప్రభ వాహనం
30.9.2017	రథోత్సవం	అశ్వవాహనం
1.10.2017	చక్రస్నానం	ధ్వజావరోహణం



పట్టుబడిన గంజాయి వద్ద నిందితులు, పోలీసులు

అంబులెన్స్‌లో గంజాయి రవాణా

రూ.40 లక్షల విలువైన సరకు పట్టివేత

చింతూరు, న్యూస్‌టుడే: ఒడిశా నుంచి తెలంగాణ రాష్ట్రానికి అంబులెన్స్‌లో తరలిస్తున్న గంజాయిని పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా చింతూరు మండలం గొర్రెలగూడెం కూడలి వద్ద స్థానిక పోలీసులు, సీఆర్పీఎఫ్ జవాన్లు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ నుంచి చట్టీ మీదుగా భద్రాచలం రహదారిలో అంబులెన్సు, జీపు వెళుతుండగా వాటిని ఆపి తనిఖీ చేశారు. గోనె సంచుల్లో ప్యాకింగ్ చేసిన సరుకు అంబులెన్స్‌లో 600 కేజీలు, జీపులో 10 కేజీలు బయటపడింది. వీటి విలువ రూ.40 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. గంజాయి రవాణా చేస్తున్న తెలంగాణలోని వరంగల్‌కు చెందిన పోలుసాని శ్రీనివాసు, చిన్నబోయిన రమేష్, అహ్మద్‌పాషా, మొహ్మద్ అక్రార్, చెరుకుపల్లి సాయికుమార్, దండిబోయిన సుమన్‌లను అరెస్టు చేసినట్లు చింతూరు సీఐ దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ సరుకును ఒడిశాలోని మల్కనగిరికి చెందిన దినేష్ నుంచి కొనుగోలు చేసి వరంగల్‌కు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

శ్రీకాకుళం జిల్లాలో రూ.కోటి విలువైన గంజాయి పట్టివేత

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లాలో అక్రమంగా తరలిస్తున్న రూ.కోటి విలువైన గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పలాస మండలంలోని లక్ష్మీపురం జాతీయ రహదారి టోల్‌ప్లాజా వద్ద వ్యానులో తరలిస్తుండగా.. కాశీబుగ్గ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. విశాఖపట్నం జిల్లా అనకాపల్లి నుంచి ఇచ్ఛాపురానికి వస్తున్న ఓ వ్యానులో ఉల్లి, బంగాళదుంపల బస్తాల కింద గంజాయి బస్తాలు ఉంచి తరలిస్తున్నారు. పోలీసులు తనిఖీల్లో భాగంగా బస్తాలను ఎత్తిచూడగా వాటి కింద గంజాయి బస్తాలు కనిపించాయి. దీంతో వ్యాన్ డ్రైవర్ నిర్మల్ కుమార్ బెహరను అరెస్టు చేసినట్లు కాశీబుగ్గ సీఐ అశోక్‌కుమార్ పేర్కొన్నారు.

పురపాలక ఉపాధ్యాయులకు పదోన్నతులు: ఎంటీఎఫ్

ఈనాడు, అమరావతి: పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య (ఎంటీఎఫ్)కు ఇచ్చిన హామీ మేరకు ఈనెలాఖరులోపు పురపాలక ఉపాధ్యాయుల పదోన్నతులు నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని ఎంటీఎఫ్ అధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు. డీఎస్సీ ద్వారా నియమకాలు పొందిన ఉపాధ్యాయులు తమ మెరిట్ ర్యాంకు వివరాలు పురపాలక కార్యాలయాల్లో సమర్పించాలన్నారు.

సిరియాలో పలువురిని హతమార్చిన భారతీయ ఆత్మాహుతి దళ సభ్యుడు

దిల్లీ: సిరియాలోని రక్కాలో ఓ భారతీయ ఆత్మాహుతి దళ సభ్యుడు ఎంతో మందిని హతమార్చినట్లు ఉగ్రసంస్థ ఇస్లామిక్ స్టేట్ సోమవారం వెల్లడించింది. సదరు ఆత్మాహుతి దళ సభ్యుడి పేరును అబూ యూసుఫ్ అల్-హిందిగా ఐఎస్ ప్రచార సంస్థ అమక్ అరబిక్‌లో పేర్కొంది. ఈ వివరాల్ని అమెరికాకు చెందిన పర్యవేక్షక సంస్థ 'సైట్' వెల్లడించింది. అబూ కుర్దిస్థాన్ వర్కర్స్ పార్టీ(పీకేకే) సభ్యులను పెద్ద సంఖ్యలో హతమార్చి, గాయపరిచినట్లు తెలిపింది. ఐఎస్ ప్రకటనను భారతీయ సంస్థలు ధ్రువీకరించలేదు. అబూ యూసుఫ్ భారత ఉపఖండంలో ప్రధాన నియామకుడిగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. ఇతనికే మొహమ్మద్ షఫీ అర్మర్ అనే పేరుంది. ఛోటే మౌలా, అంజాన్ భాయ్ అనే పేర్లతోనూ పిలుస్తారు. 30 ఏళ్ల అబూను అమెరికా జూన్‌లో ప్రపంచ ఉగ్రవాదిగా పేర్కొంది. అబూ స్వస్థలం కర్ణాటకలోని భత్కల్. ఇండియన్ ముజాహిదీన్ శ్రేణులపై వేట మొదలవడంతో తన అన్నతో కలిసి పాకిస్థాన్ పారిపోయినట్లు సమాచారం. సాంకేతిక పరిజ్ఞానంలో నిష్ణాతుడైన అబూ ఫేస్‌బుక్ వంటి మాధ్యమాల ద్వారా భారత్, బంగ్లాదేశ్, శ్రీలంకలకు చెందిన యువతను ఆకర్షించి ఉగ్రనియామకాలు చేపట్టినట్లు తెలుస్తోంది.

పండగంటే పర్యావరణ పరిరక్షణే

- మట్టి విగ్రహాల తయారీ, వినియోగంపై కృషి చేస్తున్న సేవ్ సంస్థ
- 16 ఏళ్లలో 80 వేల మట్టి వినాయకులను తయారు చేయించిన విజయ్‌రామ్

ఈనాడు - అమరావతి

పండగంటే సహజ వనరులు విధ్వంసం కాదు...పరిరక్షణ కోసం పాటుపడాల్సిన వేడుక అని నినదిస్తూ ఆ దిశగా... మట్టి వినాయక విగ్రహాలనే పూజిద్దామని పిలుపునిస్తూ ప్రకృతి పరిరక్షణ కోసం విశేష కృషి చేస్తున్నారు విజయ్‌రామ్. సొసైటీ ఫర్ అవేర్‌నెస్ అండ్ విజన్ ఆన్ ఎన్విరాన్‌మెంట్(సేవ్) పేరిట స్వచ్ఛంద సంస్థను నెలకొల్పి మట్టి వినాయక విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఇలా గత పదహారేళ్లలో 80 వేల మట్టి విగ్రహాలు తయారీ చేయించిన ఆయన ఈ ఏడాది కూడా వినాయక చవితి కోసం రెండు తెలుగు రాష్ట్రాల్లోని మొత్తం ఆరు ప్రాంతాల్లో అయిదు వేలకు పైగా విగ్రహాలను సిద్ధం చేయించారు.

పర్యావరణహిత ముడిపదార్థాలతోనే తయారీ

పర్యావరణహిత ముడిపదార్థాలైన వెదురు, చెక్క, గోగునార, గడ్డి, గోనెసంచిలను మాత్రమే ఈ మట్టి విగ్రహాల తయారీలో వినియోగిస్తారు. పశ్చిమబంగ రాష్ట్రం నుంచి కళాకారులను తీసుకొచ్చి వీటిని తయారు చేయిస్తున్నారు. ఒకప్పుడు కేవలం హైదరాబాద్‌కు మాత్రమే పరిమితమైన ఈ తయారీ కేంద్రాలు ఇప్పుడు వరంగల్, విజయవాడ, తిరుపతి, ఒంగోలు, అనంతపురంల్లో విస్తరించాయి. సంవత్సరంలో ఎనిమిది నెలల పాటు శ్రమించి ఈ విగ్రహాలను తయారు చేస్తారు. తద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 500 మందికి ఉపాధి కల్పిస్తోంది సేవ్ సంస్థ. 2018లో జరిగే వినాయక చవితి నాటికి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి మండలంలోనూ మట్టి విగ్రహాలను తయారీ చేయించాలన్న లక్ష్యంతో విజయ్‌రామ్ ప్రణాళిక సిద్ధం చేశారు.



పెనమలూరులో తయారు చేయించిన వినాయక మట్టి విగ్రహాలు ★ ఉచితంగా అందించే పంచె, కండువాను చూపిస్తున్న విజయ్‌రామ్

చెరువును పరిరక్షించి...ప్రకృతిని కాపాడుకుందాం

ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారీ చేసే విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేయడం వల్ల అవి పూర్తి కాలుష్య కాసారాలుగా మారిపోతున్నాయి. అదే మట్టి విగ్రహాలను పూజించి చెరువుల్లో నిమజ్జనం చేస్తే జలవనరులకు ఎంతో మేలు చేస్తుందని, ప్రకృతిని, వ్యక్తిగత ఆరోగ్యాల్ని కాపాడుకోవచ్చని చెబుతూ ప్రజల్లో చైతన్యం తీసుకొస్తోంది ఆ సంస్థ.

జౌళి సంచి...చేనేత పంచె

సేవ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రధానంగా అయిదు అడుగుల విగ్రహాలను మాత్రమే తయారు చేస్తారు. ఒక్కోటి రూ.6,200కు విక్రయిస్తారు. ఈ విగ్రహంతో పాటు జౌళితో తయారుచేసిన సంచి, విగ్రహానికితొడిగేందుకు పంచె, కండువా, తిరిగి ప్రకృతి వైపు అనే అంశానికి సంబంధించిన గీతాలు, బోధనలతో కూడిన రెండు సీడీలను ఉచితంగా అందిస్తారు.

విగ్రహ తయారీలో ఉచిత శిక్షణ ఇస్తాం

ప్రతి గ్రామంలోనూ మట్టి విగ్రహాల వాడకాన్ని పెంచాలన్నది నా లక్ష్యం. తద్వారా చెరువులను, ప్రకృతిని సంరక్షించుకోవచ్చు. ఓ వ్యక్తిగా నేను కొంతే చేయగలను. ప్రభుత్వాలు కూడా ఈ తరహా బాధ్యత తీసుకోవాలి. ఏదో నెల రోజుల ముందు హడావుడి కాకుండా...వచ్చే ఏడాదికి సంబంధించి అవసరమైన మట్టి విగ్రహాల తయారీకి ఇప్పటి నుంచే కార్యాచరణ సిద్ధం చేయాలి. రాబోయే రోజుల్లో మట్టి విగ్రహాల వాడకాన్ని మరింత పెంచేందుకు కృషిచేస్తా. ఆసక్తికలిగిన వారికి వీటి తయారీలో ఉచిత శిక్షణ కూడా అందిస్తాం. అలాంటి వారు విజయవాడ శివారు పెనమలూరులోని మన గ్రామం మిఠాయిల దుకాణంలో లేదా హైదరాబాద్ రామకృష్ణమఠం రోడ్డులోని ఎమరాల్డ్ మిఠాయి దుకాణంలో సంప్రదించొచ్చు.

–విజయ్‌రామ్, సేవ్ సంస్థ ప్రతినిధి

గోనెసంచిలో మూటగట్టి... బావిలో పడేసి...

తూ.గో.జిల్లాలో యువతి దారుణ హత్య



హత్యకు గురైన యువతి

రాజానగరం, న్యూస్‌టుడే: ఓ యువతి మెడకు చున్నీ బిగించి, కాళ్లు, చేతులు కట్టేసి హత్యచేసి గోనెసంచిలో మూటగట్టి బావిలో పడేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీసుస్టేషన్ పరిధిలోని కోలమూరులో ఈ దారుణం వెలుగుచూసింది. స్థానికుల సమాచారంతో రాజానగరం సీఐ కె.వరప్రసాద్, ఎస్సైలు రాజేష్, జగన్మోహనరావు సిబ్బందితో కలిసి సోమవారం సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతదేహం ఉబ్బిపోయి గుర్తుపట్టలేనంతగా మారిపోయింది. మృతదేహం ఉన్న తీరును బట్టి హత్యకు గురై నాలుగు రోజులు అయి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతురాలి వయసు 25-30 సంవత్సరాల మధ్య ఉంటుందని, ఒంటిపై నలుపు రంగు జీన్ ఫ్యాంటు, నీలం రంగు టీషర్టు కలిగి ఎడమ చేయిపై పద్మ అని రాసి ఉందని పోలీసులు తెలిపారు. హత్యకేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వరప్రసాద్ తెలిపారు.

ఐకానిక్ వంతెనకు త్వరలో టెండర్లు

- రాజధాని రహదారుల్లో సదుపాయాల కల్పనకు రూ.1,520 కోట్లు

ఈనాడు, అమరావతి: రాజధాని ప్రాంతంలో ప్రస్తుతం నిర్మిస్తున్న పది రహదారుల వెంట సదుపాయాల కల్పనకు అధికారులు చర్యలు ప్రారంభించారు. మూడు ప్యాకేజీల్లో నిర్మించే వీటి కోసం రూ.1,520.28 కోట్లతో టెండర్లు పిలిచారు. ఈ నిధులతో రహదారుల వెంట మురుగునీటి పారుదల, విద్యుత్తు, తాగునీటి సరఫరా వ్యవస్థలతోపాటు పాదచారుల నడక మార్గాలు, సైకిల్‌దారులు, పచ్చదనం పెంపు చేపడతారు. పురపాలక మంత్రి పి.నారాయణ అధ్యక్షతన అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీ), రాజధాని ప్రాంత ప్రాధికార సంస్థ(సీఆర్‌డీఏ) అధికారులతో సోమవారం విజయవాడలో సమావేశం జరిగింది. అమరావతిలో నిర్మిస్తున్న వివిధ ప్రాజెక్టుల పురోగతిని ఈ సందర్భంగా సమీక్షించారు.

సీఎం ఆమోదిస్తే టెండర్లే: ఇబ్రహీంపట్నం నుంచి రాజధాని స్టార్టప్ ప్రాంతం దాకా ఐకానిక్ వంతెన నిర్మాణానికి విధివిధానాలు తయారయ్యాయి. ముఖ్యమంత్రి ఆకృతులను ఖరారుచేసిన వెంటనే టెండర్లు పిలిచేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎన్టీఆర్ కాంస్య విగ్రహంపై చర్చ: అమరావతిలో ఎన్‌టీ రామారావు కాంస్య విగ్రహ ఏర్పాటుపైనా సమావేశంలో చర్చించారు. నిపుణులను నియమించాలని మంత్రి అధికారులకు సూచించారు.

నాలుగేళ్లపాటు మూగబోయే బిగ్‌బెన్

రూ.240 కోట్లతో మరమ్మతులు, ఆధునికీకరణ

లండన్: దాదాపు రూ.240 కోట్లతో చేపడుతున్న మరమ్మతులు, ఆధునికీకరణ పనుల కారణంగా సోమవారం మధ్యాహ్నం నుంచి ప్రఖ్యాత బిగ్‌బెన్ మూగబోయింది. వ్యావహారికంగా బిగ్‌బెన్, ది గ్రేట్ బెల్‌గా పిలుస్తున్నప్పటికీ అధికారికంగా దీన్ని ఎలిజబెత్ టవర్‌గా పేర్కొంటారు. 13 టన్నుల బరువు ఉన్న బిగ్‌బెన్ మళ్లీ 2021లో మోగనుంది. బిగ్‌బెన్ రోజూ ప్రతి గంటకు ఒక్కసారి చొప్పున మోగుతుంది. దాని చుట్టూ ఉండే నాలుగు గంటలు ప్రతి 15 నిముషాలకు ఒకసారి మోగుతాయి. పనుల్లో భాగంగా పైకప్పును పూర్తిగా తొలగించి కొత్తది నిర్మిస్తారు. బెల్‌ఫ్రేమ్‌ను మరమ్మతు ఇంతకుముందు 2007లో, అనంతరం 1983 నుంచి 1985లో మరమ్మతుల కారణంగా బిగ్‌బెన్ మూగబోయింది.

సూపర్ స్పెషాలిటీ సీట్ల భర్తీలో తెలుగు విద్యార్థులకు నష్టం

ఈనాడు, అమరావతి: దేశవ్యాప్తంగా నీట్ ద్వారా వైద్య విద్యలో సూపర్ స్పెషాలిటీ సీట్ల భర్తీని చేపట్టడం వల్ల ఏపీ, తెలంగాణల్లోని విద్యార్థులకు జరిగిన నష్టాన్ని నివారించేందుకు ఏపీ ప్రభుత్వం, అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌లో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి సోమవారం విచ్చేస్తున్న కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి నడ్డా దృష్టికి ఈ విషయం తీసుకెళ్లే యోచనలో ఉన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న కళాశాలల్లో ఇప్పటికే తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు కేటాయించిన 62 సీట్లను మళ్లీ వెనక్కు తీసుకోవాలనే యోచనను విరమించుకోవాలని కోరనున్నారు. ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ టి.రవిరాజు నేతృత్వంలో సోమవారం ఈ విషయంపై చర్చించారు.

దూసుకొచ్చిన మృత్యువు

- లారీ డ్రైవర్ నిర్లక్ష్యం.. బస్సులోకి చొచ్చుకెళ్లిన ఇనుపరాడ్
- ఒకరి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు



ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ల లోడుతో ఉన్న లారీ ★ బస్సులోనే మృతి చెందిన బ్రహ్మేశ్వరప్రసాద్

దామరచర్ల, న్యూస్‌టుడే: మృత్యువు ఎప్పుడు ఏ రూపంలో వస్తుందో తెలియదు అనడానికి నిదర్శనమే నార్కట్‌పల్లి - అద్దంకి రహదారిపై నల్గొండ జిల్లా దామరచర్ల వద్ద సోమవారం జరిగిన ప్రమాద ఘటన. ఏపీఎస్ ఆర్టీసీ ఒంగోలు డిపోకు చెందిన బస్సు హైదరాబాద్ నుంచి ఒంగోలు వైపు వెళ్తూ తెల్లవారుజామున దామరచర్లకు చేరుకుంది. ఒక్క ఉదుటున డ్రైవర్ బ్రేక్ వేయడంతో ప్రయాణికులంతా ఉలిక్కిపడి లేచారు. కొద్దిసేపట్లో తేరుకొని చూడగా బస్సుకు ఎడమవైపున సీట్లలో కూర్చున్న ఒక వ్యక్తి సీటులోనే మృతి చెందగా, మరో యువకుడు చావు, బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. అసలేం జరిగిందో అర్థం కాక ప్రయాణికులు హడలిపోయారు. అందరూ బస్సు దిగి చూడగా లారీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ప్రమాదం జరిగినట్లు గుర్తించారు. గుంటూరు వైపు ట్రాక్టర్ల లోడుతో వెళ్తున్న లారీని డ్రైవర్ రహదారిపైనే ఉంచి ఏటీఎం వద్దకు వెళ్లాడు. లారీపై ఉన్న ట్రాక్టర్ వెనుక భాగంలోని ఇనుప రాడ్ ఊడి వాహనానికి మించి సుమారు 3 అడుగులమేర బయటకు వచ్చింది. అటుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సును డ్రైవర్ తప్పించే ప్రయత్నం చేస్తుండగా రాడ్ బస్సులోకి దూసుకెళ్లడంతో ఈ ప్రమాదం జరిగింది. కిటికీ పక్క సీట్లో నిద్రిస్తున్న ప్రకాశం జిల్లా అర్ధవీడుకు చెందిన తాళ్లపల్లి బ్రహ్మేశ్వరప్రసాద్(55)కు ఇనుపరాడ్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందగా, పక్కనే ఉన్న మరో ప్రయాణికుడు ఒంగోలుకు చెందిన ఉదయగిరి గోవర్ధన్ (21) పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. వాడపల్లి ఎస్సై రామన్‌గౌడ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఛాంపియన్

పతకం రంగు మారుస్తా



గ్లాస్గో: ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో రెండుసార్లు పతకం గెలిచిన ఏకైక భారత షట్లర్ పీవీ సింధు. ఐతే ఆమె రెండు సార్లూ కాంస్యాలే గెలిచింది. కానీ మంచి ఫామ్‌లో ఉన్న తాను ఈసారి పతకం రంగు మారుస్తానని పట్టుదలతో చెబుతోంది సింధు. "ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆడి రెండు నెలలైంది. కాబట్టి సాధనకు నాకు చాలా సమయమే దొరికింది. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శిస్తానని ఆశిస్తున్నా. పతకంపైనే నా గురి. ఐతే ఈసారి నేను పతకం రంగు మార్చాలనుకుంటున్నా. కాంస్యం కన్నా మెరుగైన పతకం సాధించాలనుకుంటున్నా' అని సింధు వివరించింది. టోర్నీలో తొలి రౌండ్లో బై అందుకున్న ఆమె.. కిమ్ యో మిన్ (కొరియా)తో రెండో రౌండ్ ఆడుతుంది.

నమ్మలేకపోతున్నా...



పారిస్: అనుకున్నట్లే స్పెయిన్ టెన్నిస్ యోధుడు రఫెల్ నాదల్.. ఏటీపీ కొత్త ర్యాంకింగ్స్‌లో పురుషుల సింగిల్స్ ప్రపంచ నంబర్‌వన్ అయ్యాడు. గతంలోనూ 140 వారాలకు పైగా నాదల్ నం.1గా ఉన్నాడు. ఐతే అప్పటితో పోలిస్తే ఇప్పుడు అగ్రస్థానం సాధించడం ప్రత్యేకం అంటున్నాడు రఫా. "గత రెండేళ్లలో నాకు ఎదురైన అనుభవాల ప్రకారం చూస్తే నేను మళ్లీ నంబర్‌వన్ కావడం నమ్మశక్యంగా అనిపించట్లేదు" అని నాదల్ అన్నాడు. తాజా ర్యాంకింగ్స్‌లో నాదల్.. ఆండీ ముర్రేను వెనక్కి నెట్టి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ఫెదరర్, వావ్రింకా, జకోవిచ్ వరుసగా 3, 4, 5 ర్యాంకుల్లో ఉన్నారు.

ఆడకుంటే చోటు లాగేసుకుంటారు



వైఫల్యాలే మనకు చాలా పాఠాలు నేర్పిస్తాయి. వాటి నుంచి నేను పాఠాలు నేర్చుకున్నందుకు అదృష్టవంతుడిని. ఇప్పుడు నాకు వైఫల్యాలంటే భయం లేదు. నాకు అది అనుభవమైంది. వైఫల్యాల్లో ఉన్నపుడైనా, ఇప్పుడైనా ఆటగాడిగా మెరుగవడం మీదే దృష్టిపెడుతున్నా. వైఫల్యం ఎప్పుడైనా ఎదురుకావచ్చు. దాని గురించి ఆలోచించను. మనం ఎప్పుడూ నిలకడగా ఆడుతూనే ఉండాలి. అదే నా లక్ష్యం. ఎందుకంటే ప్రస్తుత జట్టులో గొప్ప బ్యాట్స్‌మెన్ ఉన్నారు. సరిగా ఆడకపోతే ఎవరో ఒకరు చోటు లాగేసుకుంటారు.

– శిఖర్ ధావన్

చెస్ ప్రపంచకప్ బరిలో ఏడుగురు భారతీయులు





చెన్నై: ఇంకో పది రోజుల్లో ఆరంభమయ్యే చెస్ ప్రపంచకప్‌లో ఏడుగురు భారతీయులు పోటీ పడబోతున్నారు. ఐదుసార్లు ప్రపంచ ఛాంపియన్ విశ్వనాథన్ ఆనంద్‌తో పాటు హరికృష్ణ రేటింగ్ ఆధారంగా ఈ టోర్నీకి అర్హత సాధించగా.. సేతురామన్, దీప్ సేన్ గుప్తా గత ఏడాది కాంటినెంటల్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో ప్రదర్శన ఆధారంగా ఎంపికయ్యారు. కార్తికేయన్ మురళి, విదిత్ గుజరాతి వివిధ టోర్నీల్లో మెరుగైన ప్రదర్శన చేయడంతో ప్రపంచకప్ అవకాశం దక్కించుకున్నారు. భాస్కరన్ అదిబన్ ఫిడె నామినీగా టోర్నీలో పాల్గొనబోతున్నాడు. ప్రపంచ ఛాంపియన్ కార్ల్‌సన్, అతడి ఛాలెంజర్ కర్జాకిన్ కూడా ఈ టోర్నీలో ఆడతారు. సెప్టెంబరు 2 నుంచి 27 వరకు జార్జియాలోని టిబిలిసిలో చెస్ ప్రపంచకప్ జరుగుతుంది.

పేరు మార్చుకుంటాం.. ఊరు మారతాం!

బీసీసీఐకి ఐపీఎల్ జట్ల విన్నపం

పదేళ్లుగా ఐపీఎల్‌లో ఉన్న రెండు జట్లు.. తమ పేరు, ఊరూ రెండూ మార్చుకోవాలనుకుంటున్నాయి. అందుకోసం బీసీసీఐ అనుమతి కోరుతున్నాయి. బోర్డు అంగీకరిస్తే ఆ రెండు జట్లను వచ్చే ఏడాది కొత్త పేర్లతో చూడొచ్చు! ఆ ఫ్రాంచైజీలు నడిచే కేంద్రాలు కూడా మారిపోవచ్చు! కొత్త అవతారం ఎత్తే అవకాశమున్న ఆ రెండు జట్లు.. రాజస్థాన్ రాయల్స్, కింగ్స్ ఎలెవన్ పంజాబ్! ఇంతకీ ఈ రెండు జట్లూ ఎందుకు పేర్లు మార్చుకోవాలనుకుంటున్నాయి? కొత్త చోటికి ఎందుకు వెళ్లాలనుకుంటున్నాయి?



ముంబయి

2013 స్పాట్ ఫిక్సింగ్, బెట్టింగ్ కుంభకోణానికి సంబంధించి రాయల్స్‌తో పాటు చెన్నైపై రెండేళ్ల నిషేధం పడిన సంగతి తెలిసిందే. నిషేధం పూర్తవడంతో ఈ రెండు జట్లూ వచ్చే ఏడాది లీగ్‌లోకి పునరాగమనం చేయబోతున్నాయి. ఐతే రాయల్స్ తమకు పట్టిన మకిలినంతటినీ వదిలించుకుని తిరిగి లీగ్‌లోకి రావాలనుకుంటోంది. ఇందుకోసం పేరుతో పాటు ఫ్రాంఛైజీ కేంద్రం కూడా మారాలని కోరుకుంటోంది. తమ ఫ్రాంఛైజీని నడిపించే 'జైపూర్ ఐపీఎల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ' పేరును, అలాగే 'రాజస్థాన్ రాయల్స్' అనే జట్టు పేరును మార్చుకోవడానికి తమకు అనుమతి ఇవ్వాలని బీసీసీఐని కోరింది. రాజస్థాన్ క్రికెట్ సంఘంలో కొన్నేళ్లుగా వివాదాలు నడుస్తుండటంతో ఐపీఎల్ మ్యాచ్‌ల నిర్వహణకు ఇబ్బందులు ఎదుర్కొన్న నేపథ్యంలో జైపూర్ నుంచి ఫ్రాంఛైజీ కేంద్రాన్ని తరలించి మరో చోటికి వెళ్లాలని.. మొత్తంగా ఓ కొత్త ఫ్రాంఛైజీ లాగా లీగ్‌లోకి అడుగుపెట్టాలని యాజమాన్యం భావిస్తోంది. బెట్టింగ్‌కు పాల్పడి ఫ్రాంఛైజీపై వేటుకు కారకుడైన రాజ్ కుంద్రా యాజమాన్యం నుంచి తప్పుకున్న నేపథ్యంలో ప్రధానంగా అతడి ప్రోద్బలంతో మొదలైన ఫ్రాంఛైజీ ఛాయల నుంచి బయటపడి కొత్తగా ఐపీఎల్ ప్రస్థానం ఆరంభించాలని ప్రస్తుత యజమానులు భావిస్తున్నారు.

అక్కడ డబ్బులు రావట్లేదని..: కింగ్స్ ఎలెవన్ పంజాబ్ కథ మరోలా ఉంది. ఆ జట్టుకు మొహాలిలో ఫ్రాంఛైజీని నడపడం ఎంతమాత్రం ఇష్టం లేదని తెలుస్తోంది. పంజాబ్ క్రికెట్ సంఘం నుంచి మ్యాచ్‌ల సమయంలో తమకు సహకారం అందడం లేదని, మొహాలిలో జట్టుకు ఆశించిన స్థాయిలో అభిమాన గణం లేదని, మ్యాచ్‌ల సమయంలో టికెట్ల అమ్మకాల ద్వారా పెద్దగా ఆదాయం సమకూరడం లేదని ఆ జట్టు యాజమాన్యం అంటోంది. గత సీజన్లో కొన్ని మ్యాచ్‌ల కోసం ఇండోర్‌ను సొంత వేదికగా ఎంచుకోగా.. మొహాలిలో జరిగిన మ్యాచ్‌లతో పోలిస్తే వాటికే ఎక్కువ ఆదాయం వచ్చిందట. అక్కడి క్రికెట్ సంఘం నుంచి కూడా చక్కటి సహకారం అందడం, అభిమానుల స్పందన కూడా బాగుండటంతో ఫ్రాంఛైజీ కేంద్రాన్ని మార్చుకోవాలని భావిస్తోందట యాజమాన్యం. మొహాలిని వీడి ఇండోర్‌కు చేరితే ఫ్రాంఛైజీ పేరు కూడా మారడం ఖాయం. అటు రాయల్స్‌తో పాటు ఇటు కింగ్స్ ఎలెవన్ యాజమాన్యాలు పేరు, ఫ్రాంఛైజీ కేంద్రాల మార్పు కోసం బీసీసీఐకి విన్నపాలు పెట్టుకోగా.. వాటిని పరిశీలించిన పాలకుల కమిటీ (సీఓఏ) తర్వాతి ఐపీఎల్ పాలక మండలి సమావేశంలో సభ్యుల ముందు ఈ అంశాన్ని పెట్టనున్నట్లు తెలిసిందే. ఐతే ఫ్రాంఛైజీ పేరు, కేంద్రాల మార్పు కోసం బీసీసీఐకి ఈ రెండు ఫ్రాంఛైజీలు అదనంగా ఫీజు కట్టాల్సి ఉంటుందని సమాచారం. లీగ్ ఆరంభమైనప్పటి ఒప్పందం ప్రకారం లావాదేవీలన్నీ పూర్తి చేశాకే ఈ మార్పులు చోటు చేసుకుంటాయి. ఐతే ఐపీఎల్ పాలక మండలి ఏమంటుందో చూసుకుని, సంప్రదింపుల అనంతరం లాభ నష్టాలు బేరీజు వేసుకున్నాక ఈ ఫ్రాంఛైజీలు తుది నిర్ణయం తీసుకునే అవకాశముంది.


ఇదేం ఆట

లంక క్రికెట్ జట్టుపై అభిమానుల ఆగ్రహం

దంబుల్లా: తమ జట్టు వరుస పరాజయాలు ఎదుర్కోవటాన్ని లంక అభిమానులు తట్టుకోలేకపోతున్నారు. లంక ఆటగాళ్ల వైఫల్యం, బోర్డు వ్యవహారాల్లో రాజకీయాలతో అభిమానులు విరక్తి చెందుతున్నారు. భారత్‌తో తొలి వన్డేలో లంక తొమ్మిది వికెట్ల తేడాతో చిత్తవడంతో అభిమానుల్లో ఆగ్రహం పెల్లుబికింది. పార్కింగ్ స్థలంలో ఆగి ఉన్న లంక ఆటగాళ్ల బస్సును 50 మంది అభిమానుల గుంపు ముట్టడించింది. "ఒకప్పటి క్రికెట్ మాకు కావాలి", 'క్రికెట్‌లో రాజకీయాలు వద్దు" లాంటి నినాదాలు చేశారు. పోలీసులు రంగప్రవేశం చేసి అభిమానులను అక్కడి నుంచి వెళ్లగొట్టారు. గత కొన్ని నెలలుగా లంక జట్టు దారుణ ప్రదర్శన నేపథ్యంలో సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకొని ఆటగాళ్లతో సహా సెలక్టర్లు, బోర్డు పరిపాలకులపై అభిమానులు కోపం ప్రదర్శిస్తున్నారు. జింబాబ్వేతో వన్డే సిరీస్ కోల్పోవడం, భారత్‌తో టెస్టు సిరీస్‌లో వైట్‌వాష్ అవ్వడాన్ని అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు.

తొలిరోజు నిరాశే

పారిస్: ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో తొలిరోజు భారత్‌కు నిరాశ ఎదురైంది. సోమవారం గ్రీకో-రోమన్ విభాగంలో పోటీపడ్డ నలుగురు భారత రెజ్లర్లు తొలి రౌండుతోనే పోరు ముగించారు. యోగేష్ (71కిలోలు) 1-3తో టకేశి (జపాన్), గురుప్రీత్ సింగ్ (75కిలోలు) 1-5తో మిండియా (జార్జియా), రవీంధర్ క్షత్రి (85కిలోలు) 0-8తో విక్టర్ (హంగేరి), హర్‌దీప్ (98 కిలోలు) 5-2తో విలియస్ (లుధియానా) చేతిలో పరాజయం పాలయ్యారు.



మధ్యాహ్నం 3.30 నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో

సాత్విక్- మనీషా ముందంజ

ప్రపంచ ఛాంపియన్‌షిప్

శ్రీకాంత్ శుభారంభం

గ్లాస్గో

భారత స్టార్ ఆటగాడు కిదాంబి శ్రీకాంత్ ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో శుభారంభం చేశాడు. అతను పెద్దగా శ్రమించకుండానే రెండో రౌండ్లో అడుగుపెట్టాడు. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో ఎనిమిదో సీడ్ శ్రీకాంత్ 21-13, 21-12తో సెర్గీ సిరాంత్ (రష్యా)పై సునాయాసంగా విజయం సాధించాడు. ఇండోనేసియా ఓపెన్, ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్ సిరీస్ విజయాలతో సూపర్ ఫామ్‌లో ఉన్న శ్రీకాంత్ ముందు సిరాంత్ తేలిపోయాడు. కేవలం 29 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించాడు శ్రీకాంత్. నెట్ దగ్గర అద్భుతంగా ఆడిన శ్రీకాంత్.. కళ్లు చెదిరే స్మాష్‌లతో ప్రత్యర్థిపై విరుచుకుపడ్డాడు. తొలి గేమ్ ఆరంభంలో కాస్త తడబడిన శ్రీకాంత్.. ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. 11-6తో ఆధిక్యం సంపాదించిన శ్రీకాంత్ 15-7తో ముందంజ వేశాడు. శ్రీకాంత్ మరింత జోరు పెంచడంతో 21-13తో తొలి గేమ్ అతని సొంతమైంది. రెండో గేమ్‌లోనూ శ్రీకాంత్ చెలరేగాడు. ప్రత్యర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా పాయింట్లు రాబట్టాడు. 11-5తో ఆధిక్యంలోకి వెళ్లిన శ్రీకాంత్.. చూస్తుండగానే 21-12తో రెండో గేమ్‌ను, మ్యాచ్‌ను గెల్చుకున్నాడు. రెండో రౌండ్లో లూకాస్ కార్వీ (ఫ్రాన్స్)తో శ్రీకాంత్ తలపడతాడు.

పురుషుల సింగిల్స్‌లో సమీర్ వర్మ సైతం ముందంజ వేశాడు. పాబ్లో అబియన్ (స్పెయిన్)తో మ్యాచ్‌లో తొలి గేమ్‌ను 21-8తో గెలుచుకున్న సమీర్.. రెండో గేమ్‌లో 17-4తో ఆధిక్యంలో ఉన్న దశలో ప్రత్యర్థి గాయంతో మ్యాచ్ నుంచి తప్పుకున్నాడు. పురుషుల డబుల్స్‌లో సుమీత్ రెడ్డి-మను అత్రి జోడీ 20-22, 11-21తో చంగ్ సెవోక్-కిమ్ డక్ యంగ్ (కొరియా)ల చేతుల్లో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్లో సాత్విక్ సాయిరాజు- మనీషా 24-22, 21-17తో టామ్ హీ- జు యౌ (హాంకాంగ్)పై స్ఫూర్తిమంతమైన విజయంతో ముందంజ వేశారు. సుమీత్‌రెడ్డి-అశ్విని పొన్నప్ప జోడీకి తొలి రౌండ్లో వాకోవర్ లభించింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో తన్వి లాడ్ 17-21, 21-17, 21-19తో క్లో బిర్చ్ (ఇంగ్లాండ్)పై విజయం సాధించింది. మహిళల డబుల్స్ తొలి రౌండ్లో సంజన సంతోష్-ఆర్తి సారా 21-15, 21-18తో నటాల్యా-ఝూర్కా (ఉక్రెయిన్)లపై నెగ్గారు. పి.వి.సింధు, సైనా నెహ్వాల్‌లకు తొలి రౌండ్లో బై లభించిన సంగతి తెలిసిందే. మంగళవారం రెండో రౌండ్లో సింధు.. కిమ్ హ్యో మిన్ (కొరియా)ను ఢీకొంటుంది. సైనాకు రెండో రౌండ్లో సబ్రినా (స్విట్జర్లాండ్) ఎదురవుతుంది.



● సాయి రేవతికి స్వర్ణం



తెనాలి (మారీస్ పేట), న్యూస్‌టుడే: జాతీయ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో తెనాలి క్రీడాకారిణి ఘట్టమనేని సాయి రేవతి స్వర్ణం సాధించింది. కేరళలో జరిగిన టోర్నీలో సాయి రేవతి మహిళల 63 కిలోల డెడ్ లిఫ్ట్ విభాగంలో బరిలోకి దిగి అగ్రస్థానంలో నిలిచింది. ఇప్పటికే కామన్వెల్త్ క్రీడలకు ఎంపికైన సాయి రేవతి కోచ్ నల్లక శేషగిరిరావు ఆధ్వర్యంలో శిక్షణ పొందుతోంది.

● మొయినుద్దౌలాలో రైనా




ఈనాడు, హైదరాబాద్: అఖిల భారత మొయినుద్దౌలా గోల్డ్‌కప్ హైదరాబాద్‌లో మంగళవారమే ఆరంభం కాబోతోంది. ఫామ్ కోల్పోయి భారత జట్టుకు దూరమైన సీనియర్ ఆటగాడు సురేశ్ రైనా ఎయిర్ ఇండియా తరఫున ఈ టోర్నీలో బరిలోకి దిగుతుండటం విశేషం. 1931లో ప్రారంభమైన మొయినుద్దౌలా గోల్డ్ కప్‌కు దేశంలో అత్యంత పురాతన క్రికెట్ టోర్నీగా పేరుంది. సునీల్ గావస్కర్‌తో సహా భారత అగ్రశ్రేణి క్రికెటర్లు బరిలో దిగిన చరిత్ర మొయినుద్దౌలా కప్ సొంతం.

కోహ్లి విశ్రాంతి తీసుకోవాలి

వీవీఎస్ లక్ష్మణ్



తొలి వన్డేలో శ్రీలంకపై భారత్ సాధించిన 9 వికెట్ల విజయం రెండు జట్ల మధ్య ఎంత అంతరముందో చెబుతోంది. శ్రీలంక రెండు గంటల పాటు చాలా బలంగా కనిపించింది. కానీ నాటకీయంగా కుప్పకూలి, 216తో సరిపెట్టుకుంది. ఆ తర్వాత ఏ భారత బ్యాట్స్‌మన్ చెలరేగుతాడన్నదే ప్రశ్న. కొత్త వైస్ కెప్టెన్ రోహిత్ బ్యాట్ ఝుళిపించే అవకాశాన్ని చేజార్చుకున్నాడు. శిఖర్ ధావన్ అద్భుత ఫామ్‌ను కొనసాగించగా.. ఛేదనలో తనకు సాటి లేదని ముచ్చటైన ఇన్నింగ్స్‌తో కోహ్లి మరోసారి నిరూపించాడు. సిరీస్ ఆరంభానికి ముందు ఆశ్చర్యాల గురించి, ప్రయోగాల గురించి కెప్టెన్ విరాట్ కోహ్లి మాట్లాడాడు. ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని భారత్ మిగతా సిరీస్‌లో ప్రయోగాలు చేస్తుందని ఆశిస్తున్నా. అంతగా నిలదొక్కుకోని ఆటగాళ్లకు అవకాశాలివ్వడమే కాదు.. పేరు తెచ్చుకునేలా బాధ్యతలు అప్పగించడమూ ముఖ్యమే. ఓ ఆటగాడు తుది జట్టులో ఉంటేనే సరిపోదు. అర్థవంతమైన పాత్ర పోషించే స్థితిలో ఉండాలి. ప్రత్యర్థి జట్టులో నాణ్యత ఎలా ఉన్నా.. అంతర్జాతీయ క్రికెట్లో పరుగులు తీయడం, వికెట్లు పడగొట్టడం ఆటగాడికి అచంచల విశ్వాసాన్నిస్తాయి. సిరీస్‌లో ఏదో ఒక సమయంలో విరాట్ విశ్రాంతి తీసుకుంటే మంచిది. దాని వల్ల రోహిత్‌కు తన నాయకత్వ సామర్థ్యాన్ని చాటుకునే అవకాశం లభిస్తుంది. అంతే కాదు..అతడి గైర్హాజరీలో మిగతా బ్యాట్స్‌మెన్ మరింతగా శ్రమించాల్సివస్తుంది. మరింత బాధ్యతగా ఆడాల్సివస్తుంది. భారత్‌కు ఇది మంచిదే. ఎందుకంటే భారత్.. కోహ్లిపై మరీ ఎక్కువగా ఆధారపడరాదు. ఒకవేళ విరాట్ స్థానంలో తుది ఎలెవన్‌లోకి కుల్‌దీప్ వస్తే.. అప్పుడు ధోని, హార్దిక్ సహా ఆరుగురు స్పెషలిస్ట్ బ్యాట్స్‌మెన్ మాత్రమే జట్టులో ఉంటారు. జట్టును గెలిపించాల్సిన బాధ్యత వాళ్లదే అవుతుంది. రెండు మ్యాచ్‌ల్లో అలా గెలిపించగలిగితే వాళ్ల ఆత్మవిశ్వాసం రెట్టింపవుతుంది. ఇలాంటి స్థితిలో బౌలర్లు కూడా మిడిల్ ఓవర్లలో పరుగులకు అడ్డుకట్ట వేయడం కంటే వికెట్లు తీయడంపై దృష్టి పెడతారు. కరీబియన్ పర్యటనలో భారత్ ప్రయోగాలు చేసే అద్భుత అవకాశాన్ని చేజార్చుకుంది. కానీ 2019 ప్రపంచకప్ కోసం తగిన ఆటగాళ్లను గుర్తించి, లఘు జాబితాను సిద్ధం చేసే ప్రక్రియను ఆరంభించిన నేపథ్యంలో శ్రీలంకలో మాత్రం వివిధ ప్రత్యామ్నాయాలను పరీక్షించే అవకాశాన్ని భారత్ వదిలేయరాదు. ప్రయోగాలు చేసినప్పుడు ఒకటి రెండు ఎదురుదెబ్బలు తగిలినా నష్టం లేదు. దీర్ఘ కాలంలో కలిగే ప్రయోజనాలు ముఖ్యం.



ప్రదర్శనకు ఉంచిన స్ఫటిక నమూనా

'ఉప్పు'రూపం..అపురూపం..!

ఈ చిత్రంలోనిది ప్రపంచంలోనే అతి పెద్ద క్రిస్టల్ మోడల్(స్ఫటిక నమూనా). సోడియం క్లోరైడ్(ఎన్ఏసీఎల్, ఉప్పు) లో ఉండే పరమాణువుల అమరికకు ప్రతిబింబం ఇది. ఆస్ట్రియా దేశానికి చెందిన క్రిస్టలోగ్రాఫర్, జియోసైంటిస్ట్ రాబర్ట్ క్రికెలి.. 42,875 చిన్నపాటి బంతులతో దీన్ని రూపొందించారు. అరుదైన ఈ నమూనా గిన్నిస్‌బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకీ ఎక్కింది. ప్రపంచంలో అతి పెద్దదిగా పేరొందిన ఈ స్ఫటిక నమూనాను దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్ నగరంలో ప్రదర్శనకు ఉంచారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో జరుగుతున్న ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ క్రిస్టలోగ్రఫీ 24వ సదస్సు సందర్భంగా దీన్ని ప్రదర్శిస్తున్నారు. –న్యూస్‌టుడే, మాదాపూర్



మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి సుజనాచౌదరి, చిత్రంలో సభాపతి కోడెల శివప్రసాదరావు, ప్రజాప్రతినిధులు

రైతుల ఆదాయం రెట్టింపే లక్ష్యం: సుజనా

గుంటూరు, న్యూస్‌టుడే: దేశంలో రైతుల ఆదాయాన్ని రానున్న ఐదేళ్లలో రెట్టింపు చేయడమే లక్ష్యంగా ప్రధాని మోదీ 'సంకల్పంతో సిద్ధి' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని కేంద్ర సహాయ మంత్రి సుజనాచౌదరి తెలిపారు. శ్రీ వెంకటేశ్వర పశువిశ్వవిద్యాలయం(తిరుపతి)- గుంటూరు కృషి విజ్ఞానకేంద్రాల ఆధ్వర్యంలో గుంటూరు శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సంకల్పంతో సిద్ధి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథి సుజనాచౌదరి మాట్లాడుతూ.. దేశంలో 99 నీటిపారుదల ప్రాజెక్టులను చేపడితే రాష్ట్రం నుంచి పోలవరం ప్రాజెక్టును కేంద్రం చేపట్టి నిధులు మంజూరు చేసిందన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులకు ఆర్డినెన్స్ జారీచేస్తేనే సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తానని చంద్రబాబు స్పష్టం చేయటం, మిత్రపక్షంగా ఉండటంతోనే పోలవరం ప్రాజెక్టు సాధ్యమైందని వివరించారు. పంట ఉత్పత్తుల నిల్వకు గోదాములను నిర్మించటంతో పాటు ఆహార పదార్థాల తయారీ సంస్థలను 100-150 కిలోమీటర్ల దూరంలో ఏర్పాటుచేస్తామని ప్రకటించారు. శాసనసభ సభాపతి కోడెల శివప్రసాదరావు మాట్లాడుతూ కల్తీ ఎరువులు, పురుగు మందులు తయారవకుండా చూడాలన్నారు. కల్తీ వ్యాపారులపై చర్యలు తీసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేకపోవటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ప్రధానితో మాట్లాడి ఆచార్య ఎన్.జి.రంగా వర్సిటీకి నిధులు సాధించాలని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి కేంద్ర మంత్రిని కోరారు. ప్రధాని మోదీ వీడియో సందేశాన్ని సభలో చూపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, సభికులతో కేంద్ర మంత్రి ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో ఆచార్య ఎన్.జి.రంగా వర్సిటీ ఉపకులపతి వి.దామోదరనాయుడు, జడ్పీ ఛైర్‌పర్సన్ షేక్ జానీమూన్, ఎమ్మెల్యేలు రావెల కిశోర్‌బాబు, ధూళిపాళ్ల నరేంద్రకుమార్, జీవీ ఆంజనేయులు, మోదుగుల వేణుగోపాలరెడ్డి, ఎమ్మెల్సీ ఎ.ఎస్.రామకృష్ణ, కేవీకే సీనియరు శాస్త్రవేత్త డాక్టరు యుగంధర్‌కుమార్, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మేఘాలపై రసాయనాలు వెదజల్లే తూటాలను విమానానికి అమర్చుతున్న నిపుణుడు

కర్ణాటకలో మేఘ మథనం

బెంగళూరు, న్యూస్‌టుడే: కర్ణాటకలోని మధ్య- ఉత్తర ప్రాంతాలలో తీవ్ర వర్షాభావం నెలకొనడంతో ప్రభుత్వం సోమవారం నుంచి మేఘమథనానికి శ్రీకారం చుట్టింది. ఇందుకోసం మూడు చిన్నతరహా విమానాల్ని రంగంలోకి దించింది. బెంగళూరు శివార్లలోని జక్కూరు విమానాశ్రయంలో సోమవారం రాష్ట్ర గ్రామీణాభివృద్ధి పంచాయతీ రాజ్ శాఖ మంత్రి హెచ్.కె.పాటిల్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వాతావరణం అనుకూలించక పోవడంతో సాయంత్రం ఐదు గంటల వరకు విమానం రన్‌వేపైనే ఉండిపోయింది. అనంతరం గంటన్నరపాటు ఆకాశంలో విహరించింది. అనుకూల ప్రాంతాల్లో మేఘాలను కరిగించేందుకు నిపుణులు శ్రమించారు. రామనగర, మాగడి ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశాలున్నట్లు మంత్రి పాటిల్ తెలిపారు.



ఘటనాస్థలిలో వ్యానులో చిక్కుకున్న మృతదేహాలు

ఒడిశాలో ఘోర రోడ్డు ప్రమాదం

బాలిక, ఆరుగురు మహిళలు సహా పది మంది మృతి

బరగఢ్, న్యూస్‌టుడే: ఒడిశాలోని సంబల్‌పూర్ జిల్లాలో సోమవారం ఘోర రోడ్డు ప్రమాదంలో వ్యానులో ప్రయాణిస్తున్న ఓ బాలిక, ఆరుగురు మహిళలు సహా 10 మంది మృతిచెందారు. నలుగురు గాయాలపాలయ్యారు. జిదిముర్ ఠాణా పరిధి భవానీపల్లె సమీప 55వ నెంబరు జాతీయ రహదారిపై వ్యాన్ టైరుపేలి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొనడంతో ఈ ఘటన జరిగింది. జిల్లాలోని పరమానపూర్, బురిపురలకు చెందిన 14 మంది శ్రావణ సోమవారం సందర్భంగా హర్తిసార్ కపిలేశ్వర్ గుడికి వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతిచెందారు. ఆసుపత్రికి తరలిస్తుండగా ముగ్గురు, చికిత్స పొందుతూ మరో ముగ్గురు మృతి చెందారు.

మొండి బకాయి.. వచ్చే దారేదోయి!

- రాష్ట్రంలో నిరర్థక రుణాలు రూ.15,320 కోట్లు
- వసూళ్లపై బ్యాంకర్ల దృష్టి
- నోటీసులకు పలకని రుణగ్రహీతలు
- ఆస్తుల జప్తునకు బ్యాంకర్ల ప్రయత్నం

ఈనాడు – అమరావతి



రాష్ట్రంలోని మొండి బకాయిలు బ్యాంకర్లకు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇలా వసూలు కాకుండా నిలిచిపోయిన మొండి బకాయిలు విలువ రూ.15,320 కోట్లుంటుందని బ్యాంకులు లెక్కగట్టాయి. రుణగ్రహీతల నుంచి వాటిని ఎలా వసూలు చేయాలో తెలియక మల్లగుల్లాలు పడుతున్నాయి.

వ్యవసాయం, అనుబంధ రంగాలు, పరిశ్రమలు, సేవల రంగాల్లో రైతులు, పరిశ్రమలు, వ్యాపారులకు బ్యాంకులు రుణాలు ఇస్తుంటాయి. రుణం తీసుకున్నవారు వాటిని సకాలంలో చెల్లించకపోవడంతో మొండి బకాయిలు పేరుకుపోతున్నాయి. బ్యాంకులకు వివిధ రంగాల నుంచీ ఇలా మొత్తం రూ.2,73,372కోట్ల బకాయిలు వసూలు కావాల్సి ఉంది. రుణం తీసుకున్న తరువాత ఖాతాదారుడు ప్రతి నెలా బ్యాంకుకు తీసుకున్న రుణాన్ని కొంత అసలు, వడ్డీతో కలిసి వాయిదాల రూపంలో చెల్లిస్తుంటారు. నిర్ణీత వాయిదాలోపు చెల్లించని అప్పును బ్యాంకర్లు ఓవర్ డ్యూగా పరిగణిస్తుంటారు. ఇలాంటి బకాయిలు మొత్తం రూ.54,630 కోట్లు వసూలు కావాల్సి ఉంది. అసలు, వడ్డీ ఏవీ చెల్లించకుండా వదిలేయడంతో రూ.15,320 కోట్ల బకాయిలను నిరర్థక రుణాలు(నాన్ పెర్ఫార్మింగ్ అస్సెట్స్‌గా)గా లెక్కగట్టారు. 90 రోజుల్లోపూ అసలు, వడ్డీ ఏవీ కూడా కట్టకుండా మిగిలిపోయిన రుణాన్ని ఎన్‌పీఏగా పరిగణిస్తారు. ఇప్పుడు ఈ మొండి బకాయిలను వసూలు చేయడానికి బ్యాంకర్లు సమాయాత్తమవుతున్నాయి. రిజర్వు బ్యాంకు నుంచీ కూడా మొండి బకాయిలను వసూలు చేయాలనే ఒత్తిళ్లు బ్యాంకర్లకు పెరుగుతున్న నేపథ్యంలో వాటిని వసూలు చేయడానికి ప్రయత్నాలు ముమ్మరం చేయనున్నాయి.

రైతుల విషయంలో ఆచితూచి

రుణాల వసూళ్ల విషయంలో బ్యాంకులకు క్షేత్రస్థాయిలో కొన్ని సవాళ్లు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా వ్యవసాయ రంగం నుంచీ వసూలు కావాల్సిన రుణాల విషయంలో బ్యాంకర్లు ఆచితూచి ముందుకెళ్లాలని భావిస్తున్నారు. రైతుల నుంచీ రుణాల వసూళ్ల విషయంలో వారిపై ఒత్తిడి పెడితే రాజకీయంగా విమర్శలకు దారితీయడంతో పాటు బ్యాంకర్లపైనా తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు వచ్చే ప్రమాదముందని బ్యాంకర్లు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతుల రుణాల వసూళ్లకు సంబంధించి కొంత సంయమనం పాటిస్తూ ఆచితూచి అడుగేయాలని బ్యాంకర్లు భావిస్తున్నట్లు సమాచారం. 2013 డిసెంబరు లోపు రుణాలు తీసుకున్నవారికి ప్రభుత్వం రైతు రుణ మాఫీ పథకం అమలు చేస్తోంది.

2013 తరువాత రాష్ట్రంలో రుణాలు తీసుకున్న రైతులు కూడా చాలా మందే ఉన్నారు. ఇలాంటి రుణాల్లోనూ వసూలు కాకుండా నిలిచిపోయిన మొండి బకాయిలు ఎక్కువగానే ఉన్నాయి. వ్యవసాయ రంగం నుంచీ ఇలా వసూలు కాకుండా నిలిచిపోయిన మొండి బకాయిలు రూ.6,492 కోట్లున్నాయి. ఇందులో ఒక్క స్వల్పకాలిక పంట రుణాల వాటానే రూ.3,661కోట్లుంది. ఇక తరువాత స్థానం పరిశ్రమల రంగానిదే. రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ)లకు బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయి. ఈ ఎంఎస్ఎంఈల నుంచి రూ.43,982 కోట్లు రుణ బకాయిలుండగా, రూ.3,415కోట్లు మొండి బకాయిలుగా మిగిలిపోయాయి. ఒక్క ప్రాథమిక రంగం నుంచే బ్యాంకర్లకు 10,805 కోట్లు బకాయిలు పేరుకుపోయాయి. ప్రాధాన్యేతర రంగాల నుంచీ రూ.4,515 కోట్లు మొండి బకాయిలు పేరుకుపోయాయి. మొండి బకాయిలను ఎలా వసూలు చేయాలనే దానిపై బ్యాంకర్లు తర్జనభర్జనలు పడుతున్నారు. ఇప్పటికే ఖాతాదారులకు పలుమార్లు నోటీసులు పంపారు. కొంతమంది నుంచీ అయితే కనీస స్పందన లేదు. దాంతో ఈ మొండి బకాయిదారులకు సంబంధించిన ఆస్తులను జప్తు చేసుకునే దిశగానూ బ్యాంకర్లు ముందుకు సాగుతున్నారు.

అడవికి రక్షకులు కరవు!

- అటవీ శాఖను వేధిస్తున్న సిబ్బంది కొరత
- 2,771 క్షేత్రస్థాయి పోస్టులు ఏళ్లుగా ఖాళీ!
- 37 శాతం ఐఎఫ్ఎస్ అధికారులు ఇతర శాఖల్లోనే
- అడవుల రక్షణ, పర్యవేక్షణపై ప్రభావం

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ అటవీశాఖను సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. ప్రధానంగా క్షేత్రస్థాయి సిబ్బంది కంటే ఖాళీగా ఉన్న పోస్టుల సంఖ్యే అధికంగా ఉంది. సెక్షన్ అధికారులు, బీటు/సహాయ బీటు అధికారుల పోస్టులు చాన్నాళ్లుగా భర్తీ కాక.. ఉన్నవారిపైనే పనిభారం పెరుగుతోంది. ఇద్దరు ముగ్గురి విధుల్ని ఒక్కరే నిర్వర్తించాల్సి వస్తోంది. ఆ ప్రభావం అడవుల రక్షణ, పర్యవేక్షణపై పడుతోంది.

రాష్ట్రంలో అటవీ రేంజి అధికారులు నుంచి సహాయ బీటు అధికారుల స్థాయి వరకూ 2,771 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మొత్తంగా 5,107 మంది క్షేత్రస్థాయి సిబ్బంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 2336 మందే ఉన్నారు. అదనంగా 2,000 పోస్టులను మంజూరు చేస్తూ గతంలోనే ఉత్తర్వులిచ్చినా ఇప్పటికీ మోక్షం లేదు. మిగతా రాష్ట్రాలతో పోలిస్తే ఇక్కడ అటవీ బీట్ల విస్తీర్ణం అధికం. సిబ్బంది కొరతతో ఒకే అధికారి రెండు, మూడు బీట్లను చూడటం సమస్యగా మారుతోంది.

★ డిప్యూటీ/అసిస్టెంట్ కన్జర్వేటర్ స్థాయుల్లో 94 పోస్టులకు 15 ఖాళీలున్నాయి. పది మంది ఇతర శాఖల్లో డెప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. 82 మంది ఐఎఫ్ఎస్ అధికారులకు 57 మందే ఉన్నారు. అందులోనూ 36 మంది మాత్రమే అటవీ శాఖలో పనిచేస్తున్నారు. మిగిలినవారంతా ఇతర విభాగాల్లో డెప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. రాబోయే మూడేళ్లలో రాష్ట్ర క్యాడర్‌కు చెందిన 20మంది(ఈ ఏడాదే 12 మంది) ఐఎఫ్ఎస్ అధికారులు పదవీ విరమణ చేయనున్నారు. దీంతో ఉన్నతస్థాయి అధికారుల కొరత, పర్యవేక్షణ లేమి సమస్య తలెత్తుతోంది.

క్షేత్రస్థాయి పోస్టులు.. ఖాళీల వివరాలు

పోస్టు	ఉండాల్సిన వారు	ఉన్నవారు	ఖాళీలు
ఎఫ్ఆర్‌వో	295	168	127
డిప్యూటీ ఎఫ్ఆర్‌వో	192	177	15
ఎఫ్ఎస్‌వో	972	454	518
ఎఫ్‌బీవో	2,258	915	1,343
ఏబీవో	1,390	622	768

పరువు హత్యల నివారణకు సలహాలివ్వండి: సుప్రీం

దిల్లీ: కుటుంబ పరువు పేరుతో యువ దంపతులను హత్య చేయడాన్ని నిరోధించేందుకు సలహాలు ఇవ్వాలని సుప్రీంకోర్టు కోరింది. ఈ మేరకు స్వచ్ఛంద సంస్థ, అమికస్ క్యూరీ (న్యాయస్థానం మిత్రుడు), ఖాప్ పంచాయత్ (సామాజిక వర్గ, కుల పంచాయతీలు)లకు నోటీసులు ఇచ్చింది. ఈ కేసులో సీనియర్ న్యాయవాది రాజు రామచంద్రన్ న్యాయస్థానం మిత్రునిగా సహాయం అందిస్తున్నారు. ఈ విషయమై 2010లో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన శక్తివాహిని అనే స్వచ్ఛంద సంస్థకు కూడా నోటీసు ఇచ్చింది.

కారెం శివాజీ నియామకంపై వ్యాజ్యం

ఈనాడు, హైదరాబాద్: ఏపీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌గా కారెం శివాజీ నియామకాన్ని సవాలుచేస్తూ దాఖలైన పిటీషన్‌పై సోమవారం హైకోర్టు విచారణ జరిపింది. విశాఖ జిల్లాకు చెందిన కె.రాజారావు దాఖలుచేసిన ఈ వ్యాజ్యాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా కోదండరామ్ విచారించారు. ప్రతివాదులుగా ఉన్న సాంఘిక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి, కమిషన్ ఛైర్మన్, శివాజీకి నోటీసులు జారీచేశారు.

నేడు తుది విడత హజ్ బృందం ప్రయాణం

ఈనాడు, అమరావతి: రాష్ట్రానికి చెందిన హజ్ యాత్రికులు మక్కాకు బయల్దేరి వెళ్లడం దాదాపు పూర్తికావచ్చింది. సోమవారం వరకు హైదరాబాద్ నుంచి 1999, బెంగళూరు నుంచి 696, ముంబయి నుంచి 17 మంది మక్కాకు బయల్దేరి వెళ్లారు. మంగళవారం హైదరాబాద్ నుంచి చివరగా బయల్దేరనున్న విమానంలో 101 మంది మక్కాకు వెళ్లనున్నారు. ఈ నెల 31ని అర్ఫాత్ రోజుగా సౌదీ సుప్రీంకోర్టు ప్రకటించిందని రాష్ట్ర హజ్ కమిటీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది.

చక్కెర కర్మాగారాలపై జీఎస్టీ ప్రభావం!

మొలాసిస్‌పై 28% పన్నుతో ఆదాయం తగ్గుతుందని ఆందోళన

చోడవరం, న్యూస్‌టుడే: చక్కెర కర్మాగారాలపై జీఎస్టీ ప్రభావం పడనుంది. ఈ కర్మాగారాల్లో ఉత్పత్తి అయ్యే మొలాసిస్‌పై వస్తు సేవల పన్నును 28 శాతంగా కేంద్రం నిర్ణయించింది. ఫలితంగా తమ ఆదాయం తగ్గుతుందని సహకార చక్కెర కర్మాగారాల యాజమాన్యాలు ఆందోళన చెందుతున్నాయి. విశాఖ జిల్లాలోని గోవాడ, తాండవ, ఏటికొప్పాక, విజయనగరం జిల్లా భీమసింగి సహకార చక్కెర కర్మాగారాలు గానుగాట చేస్తున్నాయి. ఈ నాలుగు కర్మాగారాల్లో ఏటా 39 వేల టన్నుల మేర మొలాసిస్ ఉత్పత్తి అవుతుంది.

ఇతర రాష్ట్రాల కొనుగోలుదారులకు కొంత మేలు: రాష్ట్రంలోని మొలాసిస్ కొనుగోలుదారులు ఇప్పటివరకూ ఎక్సైజ్ సుంకం కింద టన్నుకు రూ.750 చెల్లిస్తున్నారు. పొరుగు రాష్ట్రాల కొనుగోలుదారులు రూ.2,500 చెల్లిస్తున్నారు. ఇకపై సొంత, ఇతర రాష్ట్రాలనే తేడా లేకుండా కొనుగోలుదారులందరూ 28 శాతం జీఎస్టీని చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం టన్ను మొలాసిస్ ధర రూ.8 వేలు ఉంది. దీనిపై 28 శాతం పన్ను అంటే రూ.2240 చెల్లించాలి. ఫలితంగా రాష్ట్రంలోని కొనుగోలుదారులు రూ.1490 అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. రూ.2,500 సుంకం చెల్లిస్తున్న పొరుగు రాష్ట్రాల కొనుగోలుదారులకు రూ.260 వరకూ పన్ను తగ్గనుంది.

కొనుగోలుదారులు మొలాసిస్‌పై జీఎస్టీని మినహాయించుకుని కర్మాగారాలకు చెల్లిస్తారని ఈ పరిశ్రమకు చెందిన ఓ ఉన్నతాధికారి చెప్పారు. ఫలితంగా కర్మాగారాలకు నష్టం వాటిల్లుతుందన్నారు. 2017-18 గానుగాట కాలం దగ్గర పడుతున్న నేపథ్యంలో ఆదాయం, రాబడులు ఏవిధంగా ఉంటాయోనని యాజమాన్యాలు తర్జనభర్జన పడుతున్నాయి.

కేశవదాసుపాలెంలో గ్యాస్ పైపులైను లీకేజీ

- రెండు నెలల్లో ఆరుసార్లు లీకయిన వైనం
- శాశ్వత చర్యలు చేపట్టాలంటున్న రైతులు



కేశవదాసుపాలెం పంట చేలో ఓఎన్జీసీ పైపులైన్ నుంచి లీకవుతున్న చమురు, సహజవాయువు

అంతర్వేది, న్యూస్‌టుడే: తూర్పు గోదావరి జిల్లా సఖినేటిపల్లి మండలంలోని కేశవదాసుపాలెంలో ఓఎన్జీసీ గ్యాస్ పైపులైను నుంచి సోమవారం సహజవాయువు లీకైంది. స్థానిక బెల్లంకొండవారి పంటచేల్లో కె.వి-4 పైపునుంచి లీకవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. చేలో ముంపునీరు ఎక్కువగా ఉండడంతో అధిక పీడనంతో బయటకు వస్తున్న గ్యాస్‌కు నీరు తోడై మరింతగా ఎగసిపడింది. స్థానిక రైతులు వెంటనే మోరి జీసీఎస్ (గ్యాస్ కలెక్షన్ సెంటర్) అధికారులకు సమాచారం అందించారు. ఓఎన్జీసీ, రెవెన్యూ సిబ్బంది, ఎస్సై పవన్‌కుమార్, రాజోలు అగ్నిమాపక దళం సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. మోరి జీసీఎస్ పరిధిలో పల్లిపాలెం, అంతర్వేది దేవస్థానం, అంతర్వేదికర, కేశవదాసుపాలెంలలో 32 బావులున్నాయి. వీటిలో లీకైన పైపు ఏ బావి నుంచి వస్తుందో తెలియక తికమకపడ్డారు. ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు వెతికారు. లీకైన ప్రదేశంలో 9 బావులకు చెందిన పైపులు వెళ్తున్నట్లు గుర్తించారు. లీకైన బావి అంతర్వేది దేవస్థానం గ్రామంలో ఉన్న కె.వి.4 నుంచి వస్తున్నదిగా గుర్తించి ఉత్పత్తిని నిలిపివేయడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. గత రెండు నెలల్లోనే ఆరుసార్లు ఇక్కడ పైపులైను లీకైందని, శాశ్వత పరిష్కారానికి ఓఎన్జీసీ చర్యలు చేపట్టడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తుప్పుపట్టిన పైపులను మార్చి కొత్తవి ఏర్పాటు చేయాలని పదేళ్లుగా కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు.

రాష్ట్ర పండగగా.. టంగుటూరి జయంతి

ఈనాడు, అమరావతి: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని రాష్ట్ర పండగగా (స్టేట్ ఫంక్షన్)గా జరపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 23న ప్రకాశం జయంతిని పురస్కరించుకుని అన్ని శాఖల కార్యదర్శులు, విభాగాధిపతులు, కలెక్టర్లు జయంత్యుత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించాలని సూచించింది. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి ఎన్.శ్రీకాంత్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

లిడ్‌క్యాప్ ఛైర్మన్‌గా ఎరిక్సన్ బాబు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర తోళ్ల పరిశ్రమాభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన గూడూరి ఎరిక్సన్ బాబును నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఈ పదవిలో రెండేళ్ల పాటు కొనసాగుతారని అందులో పేర్కొన్నారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2015-17 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00